www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



కారుణ్య నియామకానికి.. వివాహమైన కుమార్తె అర్హురాలే

మృతి చెందిన ఓ ఏఎస్సై కుమార్తె పిటిషన్‌పై హైకోర్టు స్పష్టీకరణ

నిబంధనలకు అనుగుణంగా అర్హతలు ఉంటే ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ఆదేశం

13

శుక్రవారం | 11-4-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 12 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్ల పక్షం, తిథి: చతుర్దశి తె. 3.22 తదుపరి పౌర్ణమి; నక్షత్రం: ఉత్తర మ.3.10 తదుపరి హస్త; వర్జ్యం: రా.12.36-2.24, దుర్ముహూర్తం: ఉ.8.33-9.23, మ.12.41-1.30, అమృతఘడియలు: ఉ.7.08-8.55, రాహుకాలం: ఉ.10.30-12.00, సూర్యోదయం: 6.05, సూర్యాస్తమయం: 6.26 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



'మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ'లో విద్యార్థులతో కేంద్ర సాధికార కమిటీ సమావేశం

రక్షిత అటవీ భూమి అనొచ్చా?

కంచ గచ్చిబౌలి 400 ఎకరాలకు ఆ అర్హత ఉందా?

- ఎన్ని చెట్లున్నాయి? ఏయే రకాలున్నాయి?
- వాటిని ఏ పద్ధతుల్లో తొలగించారు?
- వన్యప్రాణుల పునరావాసానికి ఏం చేస్తున్నారు?
- అధికారుల్ని ప్రశ్నించిన కేంద్ర సాధికార కమిటీ
- పది అంశాలపై సమాచార సేకరణ
- అధికారులు, విద్యార్థులతో విడివిడిగా భేటీ
- అటవీ భూమి కాదని స్పష్టం చేసిన ప్రభుత్వం
- 'కాంచ అస్తబల్ పోరంబోకు సర్కారీ' అని రెవెన్యూ రికార్డుల్లో స్పష్టంగా ఉందని వెల్లడి
- వివరాలతో సాధికార కమిటీకి నివేదిక
- 3 జింకల చావుకు రేవంతే కారణం
- సల్మాన్‌లా ఈయననూ శిక్షించాలి: హరీశ్
- 2185 ఎకరాలు వర్సిటీకి రిజిస్టర్ చేయండి
- సాధికార కమిటీకి బీజేపీ ఎంపీల విజ్ఞప్తి

హైదరాబాద్, ఏప్రిల్, 10(ఆంధ్రజ్యోతి): కంచగచ్చిబౌలి భూముల వ్యవహారంపై అధ్యయనానికి వచ్చిన పర్యావరణ, అటవీ శాఖల కేంద్ర సాధికార కమిటీ గురువారం ఉదయం వివాదాస్పద 400 ఎకరాలను సందర్శించింది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులతో విడివిడిగా సమావేశమైంది. మొదట తాజ్ కృష్ణ హోటల్లో అధికారులతో సుదీర్ఘంగా మూడు గంటలపాటు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, పరిశ్రమల శాఖ కార్యదర్శి, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, డీజీపీ జితేందర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, న్యాయ శాఖ కార్యదర్శి తిరుపతి, రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశం అనంతరం సాధికార కమిటీ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ప్రాంగణంలో విశ్వవిద్యాలయ ఉద్యోగులు, విద్యార్థులతో భేటీ జరిపింది. విద్యార్థుల నుంచి వ్యక్తమవుతున్న అభ్యంతరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ భూములకు రక్షిత అటవీ ప్రాంతం అనేందుకు అర్హత ఉందా? అనే అంశంపైనే సాధికార కమిటీ ప్రధానంగా దృష్టి సారించింది. ముందే సిద్ధం చేసుకున్న పది అంశాలపై కమిటీ సమాచారం సేకరించింది. ఉదయాన్నే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సహా రాష్ట్ర ప్రభుత్వ అధికారులంతా

మిగతా 12వ పేజీలో...

టాప్-10 వర్సిటీల్లో సగం 500 ఎకరాల్లోపే!

- ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలకూ తక్కువ భూములే..
- 379 ఎకరాల్లో సింగపూర్ నేషనల్ వర్సిటీ
- అమెరికాలోని ఎంఐటీకి 168 ఎకరాలు
- 703 ఎకరాల్లో వాషింగ్టన్ యూనివర్సిటీ
- ఆక్స్‌ఫర్డ్ విస్తీర్ణం 1327 ఎకరాలు
- నోబెల్ గ్రహీతల్ని, వ్యాపార దిగ్గజాలను అందించిన విద్యా సంస్థలివి..
- 16వ శతాబ్దంలో ఏర్పాటైన వర్సిటీలకు కూడా భారీగా భూముల్లేవ్



అమెరికాలో ఎంఐటీ యూనివర్సిటీ

హైదరాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు.. పలువురు ప్రముఖులు చదివిన వర్సిటీలు ఎంత విస్తీర్ణంలో ఉన్నాయి? పలు ప్రముఖ వర్సిటీలకు ఎన్ని ఎకరాల భూములు ఉన్నాయి? వాటిలో ఎంత మంది విద్యార్థులు చదువుకుంటున్నారు? అమెరికా, బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా, సింగపూర్, చైనా తదితర దేశాల్లో ప్రసిద్ధి చెందిన వర్సిటీలకు ఎన్ని ఎకరాలు కేటాయించారు? అన్న విషయం కూడా

మిగతా 12వ పేజీలో...



విద్యార్థులతో సీఎం సరదాగా ఫుట్‌బాల్..

నార్సింగ్: మంచిరేవులలో పోలీసు స్కూల్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన సీఎం రేవంత్‌రెడ్డి.. అక్కడి చిన్నారులతో కలిసి సరదాగా ఫుట్‌బాల్ ఆడారు. స్వయంగా ముఖ్యమంత్రే తమతో ఫుట్‌బాల్ ఆడడంతో పిల్లలు ఉబ్బితబ్బిబ్బయ్యారు. అంతకుముందు స్కూల్ పరిధిలోని తాత్కాలిక తరగతి గదులను రేవంత్ పరిశీలించి, విద్యార్థులతో ముచ్చటించారు.

నా బ్రాండ్.. యంగ్ ఇండియా

- ఎన్టీఆర్ బ్రాండ్ 2 కిలోల బియ్యం, చంద్రబాబుకు ఐటీ, రైతు బాంధవుడిగా వైఎస్సార్, వాలాగే నాకూ ఓ బ్రాండ్
- మహాత్ముడి స్ఫూర్తితో రూపకల్పన
- దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే ఉంది
- అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రభుత్వ బడుల్లోనూ ప్రీస్కూల్ విధానం తీసుకొస్తాం
- పోలీసు స్కూల్‌కు 100కోట్ల కార్పస్ ఫండ్
- పోలీసుల కష్టాలు నాకు తెలుసు: సీఎం
- మంచిరేవులలో యంగ్ ఇండియా పోలీసు స్కూల్ ప్రారంభోత్సవం

హైదరాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే ఉందని, వాటిని మరింతగా బలోపేతం చేసినప్పుడే విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. యంగ్ ఇండియా అనేది తన బ్రాండ్ అని, విద్య-ఉపాధే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. మహాత్ముడి స్ఫూర్తితో రాష్ట్రంలో యంగ్ ఇండియా బ్రాండ్‌కు రూపకల్పన చేసినట్లు తెలిపారు. రంగారెడ్డి జిల్లాలోని మంచిరేవులలో పోలీసుల పిల్లల కోసం ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా పోలీసు స్కూల్‌ను సీఎం రేవంత్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎంతో మంది ప్రధాన మంత్రులు, ముఖ్యమంత్రులు అయ్యారని, వారిలో కొద్ది మంది తీసుకున్న నిర్ణయాలు మాత్రం చరిత్రను మలుపు తిప్పాయని గుర్తు చేశారు. "రూ.2కే కిలో బియ్యంతో ఎన్టీఆర్ ప్రతి పేదవాడి మనసులో స్థానం సంపాదించుకున్నారు. హైదరాబాద్‌లో ఐటీ అభివృద్ధికి చంద్రబాబు బాటలు వేశారు. రైతు బాంధవుడిగా

మిగతా 13వ పేజీలో...



ఢిల్లీలోని ఎయిర్‌పోర్టులో తహవ్వుర్ రాణాతో ఎన్ఐఏ అధికారులు



తహవ్వుర్ రాణా (ఫైల్)

తిహాడ్‌కు రాణా

- ముంబై మారణహోమం సూత్రధారి అమెరికా నుంచి భారత్‌కు తరలింపు
- బుల్లెట్ ప్రూఫ్ వాహనంలో ఎన్ఐఏ కోర్టుకు.. అనంతరం తిహాడ్‌కు
- ఎన్ఐఏ ఆఫీసులో విచారించనున్న సైకాలజిస్టులతో కూడిన ప్రత్యేక బృందం
- మోదీ ప్రభుత్వ దౌత్యనీతి విజయమిది: షా
- అది మేం మొదలుపెట్టిన పని
- మోదీ గొప్పతనమేమీ లేదు: చిదంబరం
- తహవ్వుర్ రాణా కెనడా పౌరుడు..
- మాకు సంబంధం లేదు: పాకిస్థాన్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: అమెరికా కోర్టుల్లో న్యాయ పోరాటాలు.. దౌత్యపరమైన ఒత్తిళ్లు.. ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్నట్టుగా జరిగిన 15 ఏళ్లపాటు జరిగిన విచారణలు.. అన్నీ ముగిసి ముంబై మారణహోమం సూత్రధారి తహవ్వుర్ రాణాను భారత్‌కు తీసుకువచ్చే ప్రక్రియ పూర్తయింది. అమెరికాలోని లాస్‌ఏంజిలిస్‌లో అక్కడి అధికారుల నుంచి రాణాను అదుపులోకి తీసుకున్న ఎన్ఐఏ అధికారులు ప్రత్యేక విమానంలో ఢిల్లీకి తరలించారు. గురువారం

మిగతా 2వ పేజీలో...

గాలివాన బీభత్సం

- తడిసిన ధాన్యం రాశులు.. దెబ్బతిన్న వరి, మొక్కజొన్న
- పలుచోట్ల వడగండ్ల వాన.. పిడుగుపాటుకు ఇద్దరి మృతి
- విద్యుత్తుకు అంతరాయం.. మరో రెండు రోజులు వర్షాలు!
- అధికారులూ అప్రమత్తంగా ఉండండి.. సీఎం ఆదేశం
- ములుగు జిల్లాలో ఇద్దరు రైతుల ఆత్మహత్యాయత్నం
- పంట నష్టపోయి ఒకరు.. అప్పుల ఒత్తిడికి మరొకరు..



యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మార్కెట్లో వానకు తడిసిన ధాన్యం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో గురువారం గాలివాన బీభత్సం సృష్టించింది. పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయారు. ఆరబెట్టిన ధాన్యం, ఇతర పంటలు తడిసిపోయాయి. మంగళవారం కూడా గాలివానతో పంటలకు నష్టం వాటిల్లింది. పగబట్టినట్లు గురువారం మరోసారి విరుచుకుపడింది. జనగామ, నల్లగొండ జిల్లాల్లో ఓ రైతు, గొర్రెల కాపరి పిడుగుపాటుకు మృతిచెందారు. హైదరాబాద్‌లో ఈదురుగాలుల ధాటికి చెట్లు

మిగతా 14వ పేజీలో...



ఏఐ బేబీ

కృత్రిమ మేధ ఆధారిత ఐవీఎఫ్ విధానంలో తొలి శిశువు.. మెక్సికోలో జననం

- పండంటి మగబిడ్డకు జన్మనిచ్చిన 40 ఏళ్ల మహిళ
- ఐవీఎఫ్ 23 దశలూ మానవ ప్రమేయం లేకుండా నిర్వహణ
- వీర్యకణం ఎంపిక నుంచి.. అండంలోకి చొప్పించేదాకా..
- అంతా కృత్రిమ మేధ, రోబోటిక్స్ సాయంతోనే!
- అమెరికా, మెక్సికో వైద్య నిపుణులు సాధించిన అద్భుతం

న్యూయార్క్, ఏప్రిల్ 10: ప్రపంచంలోనే తొలిసారిగా.. మానవ ప్రమేయం ఏమాత్రం లేకుండా ఏఐ ఆధారిత కృత్రిమ సంతానసాఫల్య విధానంలో ఒక బాలుడు మెక్సికోలోని వాదులహారా నగరంలో జన్మించాడు. న్యూయార్క్, వాదులహారాకు చెందిన వైద్యనిపుణులు సాధించిన ఘనత ఇది. ప్రముఖ ఎంబ్రియాలజిస్టు డాక్టర్ జాక్వెస్ కోహెన్ నేతృత్వంలో.. మెక్సికోలోని 'కన్సీవబుల్ లైఫ్‌సైన్సెస్' అనే బయోటెక్నాలజీ సంస్థ

మిగతా 2వ పేజీలో...

బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ అరెస్టు

- దుబాయ్ నుంచి రాగానే ఎయిర్‌పోర్టులో అదుపులోకి
- తల్లి అంత్యక్రియలకు హాజరు కావడానికి అనుమతి
- మళ్లీ విచారణకు పిలిస్తే రావాలని.. లేదంటే అరెస్టు తప్పదని హెచ్చరిక
- కుమారుడి రాష్ డ్రైవింగ్ కేసుల్లో నిందితుడిగా షకీల్

14

అప్పుడు మూడు గంటలు.. ఇప్పుడు అరగంటే!

- స్లాట్ విధానంతో సులభంగా రిజిస్ట్రేషన్లు
- ప్రయోగాత్మకంగా 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు
- తొలి రోజు 626 రిజిస్ట్రేషన్లు
- అవినీతికి తావు లేకుండా విధానం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- కొత్త విధానంపై వినియోగదారుల హర్షం
- తమ ఉపాధికి దెబ్బపడుతోందంటూ డాక్యుమెంట్ రైటర్ల ఆందోళన

13

పేదలకు మూడు రంగుల కార్డులు

- ఆపై వర్గాలకు ఆకుపచ్చ కార్డులు
- త్వరలోనే కొత్త రేషన్ కార్డుల జారీ
- కేంద్రం ఇచ్చేది దొడ్డు బియ్యమే
- మేం సన్న బియ్యం ఇస్తున్నాం: మంత్రి ఉత్తమ్

13

మార్కుల కోసం మాతృభాషకు మంట!



- అన్ని ప్రభుత్వ కాలేజీల్లోనూ 'సంస్కృతం'?
- వివరాలు కోరిన ఇంటర్ విద్య సంచాలకులు
- వచ్చే ఏడాదే అమలు చేయాలని యోచన?
- మూడేళ్ల ప్రతిపాదన తెరపైకి.. అమలైతే ఇంటర్‌లో తెలుగు కనుమరుగే
- ఆలోచన విరమించుకోవాలి.. తెలుగు సంఘాల డిమాండ్

హైదరాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనూ తెలుగుకు గండికొట్టే ప్రయత్నాలు మళ్లీ మొదలయ్యాయి. అన్ని కళాశాలల్లో ద్వితీయ భాషగా సంస్కృతాన్ని ప్రవేశపెట్టేందుకు అవసరమైన పోస్టులకు సంబంధించి సవివర నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు సమాచారం అందించాలని ఇంటర్ విద్య ప్రాంతీయ సంచాలకులు అన్ని కాలేజీల ప్రిన్సిపాళ్లకు ఈనెల 8న ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ కాలేజీల్లో ఇప్పటికే ఉన్న సంస్కృత అధ్యాపకుల పోస్టులు, చదువుతున్న విద్యార్థుల సంఖ్యనూ తెలపాలని, కొత్తగా ఎన్ని పోస్టులు అవసరమవుతాయో పేర్కొనాలని ఆదేశించారు. కాలేజీల నుంచి సమాచారం వచ్చిన తర్వాత దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. ఇదే జరిగితే ఇంటర్‌లో తెలుగు పూర్తిగా కనుమరుగవుతుందని విద్యావేత్తలు ఆందోళన వ్యక్త చేస్తున్నారు. మార్కులు ఎక్కువగా వస్తాయన్న ఉద్దేశంతో ద్వితీయ భాషగా సంస్కృతంను ఎంచుకునే జాఢ్యం కార్పొరేట్, ప్రైవేటు కాలేజీల్లోనే ఎక్కువగా ఉంది. దీన్ని ప్రభుత్వ కాలేజీలకూ వర్తింపజేయాలని

మిగతా 3వ పేజీలో...

ట్రంప్ ఇన్‌సైడర్ ట్రేడింగ్?

- కొనడానికి ఇదే సమయమంటూ.. సుంకాల అమలు వాయిదాకు ముందు పోస్ట్
- రూ.3,570 కోట్ల మేర పెరిగిన ట్రంప్ సంపద
- దీనిపై విచారణ జరపాలని డెమొక్రాట్ల డిమాండ్
- బెదిరింపులకు లొంగం.. చర్చలకు సిద్ధం: చైనా
- అమెరికాకు వ్యతిరేకంగా కూటమి కట్టే దిశగా.. యూరప్, దక్షిణాసియా నేతలతో సంప్రదింపులు
- జిన్‌పింగ్ చాలా తెలివైన వ్యక్తి అని ట్రంప్ ప్రశంస
- తొలుత విధించిన 20 శాతం సుంకాలు కలిపితే చైనాపై సుంకాలు 145 శాతానికి: వైట్‌హౌస్



న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: ప్రతీకార సుంకాల అమలును 90 రోజులపాటు వాయిదా వేస్తున్నట్టు ప్రకటించడానికి మూడు గంటల ముందు.. ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమమైన ట్రూత్ సోషల్‌లో ఒక ఏక వాక్య పోస్టు పెట్టారు. "కొనడానికి ఇది గొప్ప సమయం!!! డీజేటీ" అని ఆ పోస్టులో ఆయన రాశారు. ఏం కొనడానికి అది గొప్ప సమయంలో ఆయన నిర్దిష్టంగా చెప్పలేదుగానీ.. ఆయన పోస్టులోని 'డీజేటీ' అనే పొడి అక్షరాలను మాత్రం స్టాక్‌మార్కెట్లో ట్రంప్ మీడియా అండ్ టెక్నాలజీ గ్రూప్‌ను ఉద్దేశించి

మిగతా 2వ పేజీలో...

విద్యార్థి వీసా రద్దయితే ఇంటికేనా?

- 15 రోజుల్లో వెళ్లిపోవాలని నిబంధన
- అయోమయంలో భారత విద్యార్థులు
- వర్సిటీలు, న్యాయవాదుల మద్దతుతో కొంతమేర ఉపశమనం

10

యూదు వ్యతిరేక పోస్టులు పెడితే.. వీసా రద్దు!

యూఎస్‌సీఐఎస్ ప్రకటన

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

కందిపప్పు కాంట్రాక్టులు రద్దు

- టెండర్లు పిలవకుండా కట్టబెట్టడంపై 'ఆంధ్రజ్యోతి' కథనాలతో సర్కారు చర్యలు
- అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా కోసం నామినేషన్ పద్ధతిలో ఇచ్చిన అధికారులు
- ఈ వ్యవహారంపై మంత్రి సీతక్క ఆగ్రహం

13

లారీ సీజ్ చేయొద్దంటే.. రూ.20 వేల లంచం

ఏసీబీకి చిక్కిన భద్రాచలం సీఐ రమేశ్, సీఐ గన్‌మెన్, మధ్యవర్తి కూడా అరెస్ట్

14

తిహాడ్‌కు రాణా



పటియాలా హౌస్ ఎన్ఐఏ కోర్టు ముందు పోలీసు బలగాలు; ఇన్‌సెట్‌లో రాణా

(మొదటిపేజీ తరువాయి)

సాయంత్రం ఢిల్లీలోని పాలం ఎయిర్‌బేస్‌లో విమానం ల్యాండ్ అయింది. అక్కడే రాణాను లాంఛనంగా అరెస్టు చేసిన ఎన్ఐఏ అధికారులు.. వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం బుల్లెట్ ప్రూఫ్ వాహనంలో పటియాలా హౌస్ ఎన్ఐఏ కోర్టుకు తరలించి న్యాయమూర్తి చందర్‌జిత్ సింగ్ ఎదుట హాజరుపర్చారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు తీహాడ్ జైలుకు తరలించారు. ఈ సందర్భంగా రాణాను తరలించే మార్గాల్లో, కోర్టు పరిసరాల్లో అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. రాణా వయసు ప్రస్తుతం 64 ఏళ్లు.

166 మందిని బలిగొన్న మారణ హోమం..

కసబ్ సహా పది మంది లష్కరే తాయిబా ఉగ్రవాదులు 2008 నవంబరు 26న పాకిస్థాన్ నుంచి సముద్ర మార్గంలో ముంబైకి చేరుకుని దారుణ మారణహోమానికి పాల్పడిన విషయం తెలిసిందే. 166 మంది ప్రాణాలను బలిగొన్న ఆ ఉగ్రదాడికి పాల్పడినవారిలో కసబ్ ఒక్కడు ప్రాణాలతో పట్టుబడ్డాడు. దీనిపై దర్యాప్తు చేపట్టిన ఎన్ఐఏ (జాతీయ దర్యాప్తు సంస్థ).. అమెరికా జాతీయుడు డేవిడ్ హెడ్లీ, పాకిస్థాన్ సంతతికి చెందిన కెనడా పౌరుడు తహవ్వుర్ రాణా కీలక సూత్రధారులుగా తేల్చింది.

పాక్‌లో పుట్టి.. కెనడా పౌరుడిగా మారి..

పాకిస్థాన్‌కు చెందిన రాణా.. ఆ దేశ సైన్యంలో వైద్యుడిగా పనిచేశాడు. అప్పుడే పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐతో సంబంధాలు ఏర్పడ్డాయి. అదే సమయంలో లష్కరేతాయిబా ఉగ్రవాది, అమెరికన్ పౌరుడు డేవిడ్ హెడ్లీ అలియాస్ దావూద్ గిలానీతో పరిచయం ఏర్పడింది. 1997లో రాణా కెనడాకు వలసవెళ్లాడు. ఇమిగ్రేషన్‌కు సంబంధించి పలు వ్యాపారాలు చేశాడు. 2001లో కెనడా పౌరసత్వం పొందాడు. ఆ తర్వాత అమెరికాలోని చికాగోకు చేరుకుని ఇమిగ్రేషన్ ఏజెన్సీని ఏర్పాటు చేశాడు. నిజానికి లష్కరేతాయిబా సంస్థ ఉగ్రదాడులు, ఉగ్రవాదులు వివిధ దేశాలకు ప్రయాణించేందుకు ఈ సంస్థను అడ్డుపెట్టుకున్నారన్న విషయం తర్వాత బయటపడింది. మరోవైపు డేవిడ్ హెడ్లీ లష్కరేతాయిబాలో భారీ ఉగ్రదాడులపై ప్రత్యేకంగా శిక్షణ పొందాడు. ఆ సమయంలో రాణా, హెడ్లీ తరచూ సంప్రదింపుల్లో ఉండేవారు. ఈ క్రమంలోనే భారత్‌లో భారీ దాడులకు ప్లాన్ వేశారు. రాణా సాయంతో హెడ్లీ ముంబైలో 'ఫస్ట్ వరల్డ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్' పేరిట ఏజెన్సీని ఏర్పాటు చేశాడు. లష్కరేతాయిబా, ఐఎస్ఐల సూచనల మేరకు.. ముంబైలో తాజ్ హోటల్, ఒబెరాయ్ హోటల్, నారీమన్ పాయింట్ వద్ద రెక్కీ చేసి, మ్యాపులు రూపొందించాడు. అమెరికా మీదుగా పాక్ వెళ్లి వివరాలన్నీ లష్కరేతాయిబా, ఐఎస్ఐ బాసులకు అందజేసి.. ఉగ్రదాడులకు రూపకల్పన చేశారు. ఈ క్రమంలో రాణా, హెడ్లీ 231 సార్లు మాట్లాడుకున్నట్టు ఎన్ఐఏ గుర్తించింది. మరోవైపు రాణా కూడా దాడులకు ముందు సెప్టెంబర్ 13 నుంచి 21 వరకు వైద్యురాలైన తన భార్యతో కలిసి భారత్‌లో పర్యటించాడు. తాజ్‌మహల్ వద్ద, ముంబైలో, కేరళలోని కోచిలో రెక్కీ చేసి వెళ్లాడు. తర్వాత ఐదు రోజులకే ముంబైలో ఉగ్రదాడి జరిగింది. కుంభమేళాలో ఉగ్రదాడికి కూడా రాణా ప్రణాళిక వేసినట్టు గుర్తించారు.

చట్టపరంగా... దౌత్యపరంగా..

భారత్ చట్టపరంగా, దౌత్యపరంగా చాకచక్యంగా వ్యవహరించడంతోనే రాణా అప్పగింత సాధ్యమైందని నిపుణులు చెబుతున్నారు. ముంబై పేలుళ్లతోపాటు డెన్మార్క్‌లోని ఓ వార్తాపత్రిక కార్యాలయంపై ఉగ్రదాడికి సంబంధించిన కేసులలో 2009లో రాణాను అమెరికా పోలీసులు అరెస్టు చేశారు. విచారణ జరిపిన అక్కడి కోర్టు ముంబై పేలుళ్ల వ్యవహారంలో నేరుగా సంబంధం లేదని కొట్టివేసింది. కానీ డెన్మార్క్ కేసులో 2013 జనవరిలో అతడికి 14 ఏళ్ల జైలుశిక్ష విధించింది. అప్పటి నుంచి జైల్లో ఉన్న రాణాను ముంబై ఉగ్రదాడి కేసు విచారణ కోసం అప్పగించాలని భారత్ అమెరికాపై ఒత్తిడి తెచ్చింది. దీనిపై అమెరికా కోర్టుల్లో పిటిషన్లు వేసి పోరాడింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో రాణా అప్పగింతకు అమెరికా విదేశాంగశాఖ అనుమతి ఇచ్చింది. అప్పగింత నిర్ణయానికి వ్యతిరేకంగా రాణా అమెరికన్ కోర్టుల్లో వరుసగా పిటిషన్లు వేశాడు. పలుమార్లు గుండెపోటు వచ్చిందని, తీవ్రమైన కిడ్నీల వ్యాధి ఉందని.. తాను పాక్ ఆర్మీ మాజీ అధికారి కావడం, ముస్లిం కావడం వల్ల హింసించే అవకాశం ఉందని అతని తరఫు న్యాయవాదులు వాదించారు. భారత్‌కు అప్పగిస్తే తన ప్రాణాలకు ప్రమాదమని పేర్కొన్నారు. ముంబై పేలుళ్ల కేసులో అమెరికా కోర్టు తనను అప్పటికే విచారించిందని, అదే కేసులో భారత్‌కు అప్పగించడం 'డబుల్ జియోపార్డీ (ఒకే కేసులో రెండు సార్లు విచారించడాన్ని నిరోధించే) చట్టం'ను ఉల్లంఘించడమేనని వాదించారు. అయితే ముంబై మారణహోమానికి అతను సూత్రధారి అని, విచారించాల్సి ఉందని భారత న్యాయ నిపుణులు వాదించారు. ఈ కేసులో 'డబుల్ జియోపార్డీ' వర్తించదని అమెరికా కోర్టులకు వివరించి ఒప్పించారు. రాణా భద్రతకు, న్యాయపరమైన హక్కుల కల్పనకు హామీ ఇస్తున్నట్టు వివరించారు. మరోవైపు దౌత్యపరంగానూ అమెరికాపై ఒత్తిడి తెచ్చి రాణా అప్పగింతకు అంగీకరించేలా చేయడంలో భారత్ సఫలమైందని నిపుణులు చెబుతున్నారు.

ఎన్ఐఏ తరఫున దయాన్ కృష్ణన్, నరేందర్ మన్..

ముంబై ఉగ్రదాడి కేసు చాలా కీలకమైనది కావడంతో ఎన్ఐఏ తరఫున కోర్టుల్లో వాదించడానికి సీనియర్ న్యాయవాది నరేందర్ మన్‌ను స్పెషల్ ప్రాసిక్యూటర్‌గా కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఎన్ఐఏ తరఫున అమెరికా కోర్టుల్లో వాదించిన సీనియర్ న్యాయవాది దయాన్ కృష్ణన్‌తో కలిసి నరేందర్ మన్ వాదనలు వినిపించనున్నారు. ఇక తహవ్వుర్ రాణాకు న్యాయ సహాయంలో భాగంగా ఢిల్లీ లీగల్ సర్వీసెస్ అథారిటీ నుంచి పీయూష్ సచ్‌దేవ వాదనలు వినిపించనున్నారు.

అధికారులు, సైకాలజిస్టులతో విచారణ!

లష్కరేతాయిబా ఉగ్రవాద సంస్థలో కఠిన శిక్షణ పొందిన తహవ్వుర్ రాణా నుంచి సమాచారం రాబట్టడం అంత తేలిక కాదని నిఘా వర్గాలు చెబుతున్నాయి. "అమెరికాలో అతడిని ఇప్పటికే తీవ్రస్థాయిలో విచారణ చేశారు. ఎలా తప్పుదోవ పట్టించాలో అతడికి తెలుసు. ఎన్ఐఏ అధికారులతోపాటు నిఘా ఏజెంట్లు, నేర ప్రవర్తన-ఉగ్రవాద నిరోధక అంశాలపై ప్రత్యేకంగా శిక్షణ పొందిన సైకాలజిస్టులతో కూడిన బృందం రాణాను విచారించి సమాధానాలు రాబడుతుంది. ఇందుకు కొంత ఎక్కువ సమయమే పట్టొచ్చు.." అని పేర్కొంటున్నాయి. కాగా ఢిల్లీలోని ఎన్ఐఏ ప్రధాన కార్యాలయంలో ఉన్న ప్రత్యేకమైన సెల్‌లో రాణాను విచారిస్తారని నిఘా వర్గాలు తెలిపాయి. ఎన్ఐఏ డీజీ సదానంద్ దతే, ఐజీ ఆశీశ్ బాత్రా, డీఐజీ జయరాయ్ సహా 12 మంది అధికారులకు మాత్రమే అందులోకి ప్రవేశించే అనుమతి ఉంటుందని వెల్లడించాయి.

నాటి దాడిలో గాయపడి.. నేడు ఎన్ఐఏ చీఫ్‌గా..

ప్రస్తుతం ఎన్ఐఏ డైరెక్టర్ జనరల్‌గా ఉన్న సదానంద్ దాతే.. నాడు ముంబై ఉగ్రదాడిలో ప్రాణాలకు తెగించి పోరాడటం విశేషం. అప్పట్లో ముంబై అదనపు పోలీస్ కమిషనర్‌గా ఉన్న సదానంద్ దాతే.. ఉగ్రవాద దాడుల విషయం తెలిసి స్వయంగా రంగంలోకి దిగారు. ఈ క్రమంలో ఉగ్రవాది కసబ్ విసిరిన గ్రనేడ్ పేలి తీవ్రంగా గాయపడ్డారు. నాడు చూపిన తెగువకు రాష్ట్రపతి పోలీస్ మెడల్ కూడా అందుకున్నారు.

మోదీ ప్రభుత్వ దౌత్యనీతి విజయమిది: అమిత్ షా

ఉగ్రవాది తహవ్వుర్ రాణాను భారత్‌కు తీసుకురావడం మోదీ ప్రభుత్వ దౌత్యనీతి విజయమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అభివర్ణించారు. గతంలోని యూపీఏ ప్రభుత్వం ఈ పనిచేయలేకపోయిందని పరోక్షంగా విమర్శించారు. "మన గడ్డమీద, మన ప్రజల మీద దాడి చేసినవారిని రప్పించి శిక్షించడం భారత ప్రభుత్వ విధి. కానీ ముంబై ఉగ్రదాడి జరిగినప్పుడున్న ప్రభుత్వం రాణాను రప్పించలేకపోయింది. ఇప్పుడు మోదీ ప్రభుత్వ దౌత్యనీతితో విజయం సాధించింది" అని అమిత్ షా కార్యాలయం ప్రకటించింది. ఇక కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయాలతో ఉగ్రవాదం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా విమర్శించారు. మోదీ ప్రభుత్వం రాణాను రప్పించి నాటి మృతుల కుటుంబాలకు న్యాయం చేసిందని పేర్కొన్నారు.

మేం మొదలుపెట్టిందే పూర్తిచేశారు: చిదంబరం

రాణా అప్పగింత విషయంలో మోదీ ప్రభుత్వం చేసినదేమీ లేదని కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. "రాణా అప్పగింతను మోదీ ప్రభుత్వం తమ గొప్పగా చెప్పుకునేందుకు ఆరాటపడుతోంది. కానీ రాణాను రప్పించేందుకు యూపీఏ ప్రభుత్వమే ప్రక్రియ మొదలుపెట్టింది. ఒకటిన్నర దశాబ్దాల పాటు చట్ట, దౌత్య, నిఘా పరమైన పోరాటంతోనే ఇది సాధ్యమైంది" అని పేర్కొన్నారు.

రాణాతో మాకు సంబంధం లేదు: పాకిస్థాన్

ఉగ్రవాది రాణా విషయంలో పాకిస్థాన్ కప్పగంతులు వేస్తోంది. అమెరికా రాణాను భారత్‌కు అప్పగించిన నేపథ్యంలో పాక్ విదేశాంగ శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. రాణా ప్రస్తుతం తమ దేశ పౌరుడు కాదని, గత 20 ఏళ్లలో ఎప్పుడూ అతను పాకిస్థాన్‌కు చెందిన ఎలాంటి ధ్రువపత్రాలను పునరుద్ధరించుకోలేదని తెలిపింది. రాణా కెనడా పౌరుడని పేర్కొంది. అయితే రాణాకు పాక్ సైన్యం, ఐఎస్ఐలోని కీలక వ్యక్తులతో సంబంధాలున్నాయని.. ఎన్ఐఏ విచారణలో కీలకఅంశాలు, రహస్యాలను బయటపెట్టవచ్చనే ఆందోళన పాక్‌లో వ్యక్తమవుతోందని విశ్లేషకులు చెబుతున్నారు.

హెడ్లీని మాత్రం రప్పించలేం!

ముంబై ఉగ్రదాడి సూత్రధారుల్లో ఒకరైన డేవిడ్ హెడ్లీని మాత్రం భారత్‌కు రప్పించలేమని నిఘా వర్గాలు చెబుతున్నాయి. హెడ్లీ అమెరికా పౌరుడు కావడం, అమెరికా దర్యాప్తు సంస్థలకు ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరించడంతోపాటు 2010లో అమెరికా దర్యాప్తు అధికారులతో కుదుర్చుకున్న ఒప్పందం దీనికి కారణమని వివరిస్తున్నాయి. "ఉగ్రవాద కేసుల్లో అరెస్టైన హెడ్లీ.. 2010లో అమెరికా అధికారులతో చట్టపరమైన ఒప్పందం కుదుర్చుకున్నాడు. ముంబై దాడులు, లష్కరేతాయిబాతో, పాక్ ఐఎస్ఐతో సంబంధాలు, కార్యకలాపాల సమాచారమంతా వెల్లడించాడు. బదులుగా తనను భారత్, పాకిస్థాన్, డెన్మార్క్ దేశాలకు అప్పగించవద్దని ఒప్పందం చేసుకున్నాడు.." అని నిఘా వర్గాలు తెలిపాయి. అంతేగాకుండా అమెరికా నిఘా, దర్యాప్తు సంస్థలకు హెడ్లీ ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరించిన నేపథ్యంలో.. సంబంధిత కీలక సమాచారం బయటపడకుండా ఉండేందుకు కూడా అతడిని ఇతర దేశాలకు అప్పగించే అవకాశం లేదని వెల్లడించాయి.

లోకం తీరు



'డిజిటల్ డేటా' సెక్షన్‌తో ఆర్‌టీఐ చట్టం నాశనం

- 44(3)ని రద్దుచేయాలి: విపక్షాలు
- మెమోరాండంపై రాహుల్, అఖిలేశ్ సహా 120 మంది ఎంపీల సంతకాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: సమాచార హక్కు (ఆర్‌టీఐ) చట్టాన్ని మోదీ ప్రభుత్వం నాశనం చేయాలని చూస్తోందని ప్రతిపక్షాలు ఆరోపించాయి. డిజిటల్ వ్యక్తిగత డేటా పరిరక్షణ (డీపీడీపీ) చట్టంలోని సెక్షన్ 44 (3).. ఆర్‌టీఐ ఉసురు తీసేలా ఉందని పౌర హక్కుల గ్రూపులు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో.. సదరు సెక్షన్‌ను తక్షణమే రద్దు చేయాలని ఇండీ కూటమి డిమాండ్ చేసింది. ఈ మేరకు ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు సమర్పించేందుకు సంయుక్తంగా మెమోరాండంను ఈ కూటమి పార్టీలు రూపొందించాయి. దానిపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, సమాజ్‌వాదీ అధినేత అఖిలేశ్ యాదవ్, సీపీఎం ఎంపీ జాన్ బ్రిటాస్, డీఎంకే నేత టీఆర్ బాలు సహా 120 మంది ఎంపీలు సంతకాలు చేశారని లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష ఉపనేత గౌరవ్ గొగోయ్ వెల్లడించారు. గురువారం ఢిల్లీలో ఇండీ కూటమి పార్టీల నేతలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. వ్యక్తుల వ్యక్తిగత సమాచారాన్ని ఇవ్వకుండా 44(3) సెక్షన్ నిరోధిస్తోందని.. ఇది ఆర్‌టీఐ చట్టాన్ని తీవ్ర ప్రభావితం చేస్తోందని అన్నారు. 2023 ఆగస్టు 11న రాష్ట్రపతి ఆమోదించిన ఈ చట్టాన్ని కొంతకాలంగా తమ కూటమి అధ్యయనం చేస్తోందని తెలిపారు. ఇటీవలి పార్లమెంటు సమావేశాల్లో పౌర సమాజాలు, హక్కుల గ్రూపులు తమను సంప్రదించాయని.. 8(1)(జే) సెక్షన్‌ను నీరుగారుస్తూ సెక్షన్ 44(3)ని తెచ్చినట్లు తెలిపాయని వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే దానిని రద్దుచేయాలని ఐటీ మంత్రికి మెమోరాండం సమర్పించాలని నిర్ణయించామన్నారు.

బాలికకు గది 'బయట' పరీక్ష!

- 'రుతుక్రమం'లో ఉందని ఎండలో మెట్లపై కూర్చోపెట్టి రాయించిన ఉపాధ్యాయులు

చెన్నై, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఆ ఉపాధ్యాయులు ఓ బాలికను మానసిక క్షోభకు గురిచేశారు. రుతుక్రమంలో ఉందని తరగతి గది బయట, ఎండలో కూర్చోపెట్టి పరీక్ష రాయించారు. తమిళనాడులో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. ఆ పాఠశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేసింది. కోయంబత్తూరు జిల్లా సెంగోట్టుపాళయంలోని స్వామి చిద్భవానంద మెట్రిక్యులేషన్ హయ్యర్ సెకండరీ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఓ దళిత బాలిక ఈనెల 5న పుష్పవతి అయింది. వార్షిక పరీక్షలు ఉండడంతో బాలిక 7న పరీక్ష రాసేందుకు పాఠశాలకు వెళ్లగా ఉపాధ్యాయ బృందం ఆమెను తరగతి గది బయటే కూర్చోబెట్టి పరీక్ష రాయించింది. పరీక్ష తర్వాత విద్యార్థిని ఇంటికెళ్లి రోదిస్తూ తల్లిదండ్రులకు విషయం చెప్పింది. వారు ఆమెకు సర్దిచెప్పి 9న మళ్లీ పాఠశాలకు పంపారు. కొద్దిసేపటి తర్వాత బాలిక తల్లి పాఠశాలకు వెళ్లి చూడగా, ఆ బాలిక తరగతి గది మెట్లపై, ఎండలో కూర్చుని పరీక్ష రాస్తోంది. దీన్ని ఆమె తల్లి వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టింది. దాంతో దేశవ్యాప్తంగా ఈ వ్యవహారం చర్చనీయాంశమైంది. గురువారం సాయంత్రం ఈ ఘటనపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ స్పందించారు. బాధ్యులైన పాఠశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేసినట్టు ప్రకటించారు.

16న వక్ఫ్ పిటిషన్లపై సుప్రీం విచారణ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన వక్ఫ్ చట్టం-2025ను వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లను ఈనెల 16న విచారించాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. పార్లమెంటు ఆమోదించిన వక్ఫ్ సవరణ చట్టం అమలును నిలుపుదల (స్టే) చేయాలంటూ పలు పిటిషన్లు దాఖలు కాగా, వాటిని వెంటనే విచారణకు స్వీకరించేందుకు ఇటీవల సుప్రీంకోర్టు అంగీకరించింది. ఆ ప్రకారమే ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలో త్రిసభ్య బెంచ్‌ను ఏర్పాటుచేశారు. ఈ బెంచ్‌లో జస్టిస్ సంజ య్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథన్ సభ్యులుగా ఉన్నారు. కాగా వక్ఫ్ సవరణ చట్టానికి అనుకూలంగా హిందూసేన అధ్యక్షుడు పిటిషన్ దాఖలుచేశారు. నూతన చట్టాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై నిర్ణయం తీసుకునే ముందు తమ వాదననూ ఆలకించాలంటూ కేంద్రప్రభుత్వం తాజాగా కేవియట్ పిటిషన్ దాఖలుచేసింది. మరోవైపు, నూతన వక్ఫ్ చట్టంపై అవగాహన కల్పిస్తూ దేశవ్యాప్త ప్రచారానికి బీజేపీ సిద్ధమవుతోంది. ఈ నెల 20 నుంచి మొదలయ్యే ఈ కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు ప్రధానంగా ముస్లింలను కలిసి తాజా చట్టం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తారు.

మతమార్పిడి చట్టాలపై 16న సుప్రీంలో విచారణ

మతమార్పిడి సమస్యపై దాఖలైన పలు వ్యాజ్యాలపై సుప్రీంకోర్టు ఈ నెల 16న విచారణ జరపనుంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌ల ధర్మాసనం విచారణ చేపట్టనుంది. బలవంతపు మతమార్పిడికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కొన్ని పిటిషన్లు, మతాంతర వివాహాలు చేసుకున్నవారికి రక్షణ కల్పించాలని కోరుతూ మరికొన్ని వ్యాజ్యాలు దాఖలయ్యాయి. భయపెట్టడం, ఆర్థికంగా ప్రలోభపెట్టడం వంటి మోసపూరిత చర్యల ద్వారా జరిగే మతమార్పిడిలను అరికట్టాలని పిటిషనర్లు కోరారు.

వృద్ధులకు రాయితీ ఎత్తివేతతో రైల్వేకు రూ.8,913 కోట్ల అదనపు ఆదాయం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: వృద్ధులకు టికెట్లలో రాయితీ ఎత్తివేతతో గత ఐదేళ్లలో రైల్వే శాఖకు అదనంగా రూ.8,913 కోట్ల ఆదాయం వచ్చింది. సమాచార హక్కు కార్యకర్త చంద్రశేఖర్ గౌర్ దరఖాస్తుకు సమాధానంగా సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ఈ వివరాలు వెల్లడించింది. గతంలో 60ఏళ్లదాటిన పురుషులు, ట్రాన్స్‌జెండర్లకు టికెట్లలో40%, 58ఏళ్ల దాటిన మహిళలకు 50% కన్సెషన్ ఉండేది. కరోనా కారణంగా 2020 మార్చి 20 నుంచి రైల్వే శాఖ ఆ రాయితీలను రద్దు చేసింది.

సమస్యను కొనితెచ్చుకుంది!

- ఇది అత్యాచారం కేసు కాదు
- పరస్పర సమ్మతితో జరిగినట్లుంది
- కేసులో నిందితుడికి బెయిల్ ఇస్తూ అలహాబాద్ హైకోర్టు జడ్జి వ్యాఖ్యలు

అలహాబాద్, ఏప్రిల్ 10: అత్యాచార ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్‌కుమార్ సింగ్ బెయిలు మంజూరు చేస్తూ.. సంచలన వ్యాఖ్యలు చేశారు. "బాధితురాలు సమస్యను కోరి తెచ్చుకుంది. దానికి ఆమె కూడా బాధ్యత వహించాల్సి ఉంటుంది" అని పేర్కొన్నారు. కేసులో వాస్తవాలను పరిశీలిస్తే.. 'ఇది అత్యాచారం కేసు కాదు. పరస్పర సమ్మతితో జరిగినట్లుగా ఉంది' అని వ్యాఖ్యానించారు. గత ఏడాది సెప్టెంబరులో నమోదైన ఈ కేసులో బాధితురాలు పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థిని. ఆమె ఢిల్లీలో పేయింగ్ గెస్ట్‌గా నివసించేది. సెప్టెంబరు 21న ఆమె స్నేహితులతో కలిసి ఓ రెస్టారెంట్‌కు వెళ్లారు. అక్కడ తెల్లవారుజామున 3 గంటల వరకు మద్యం సేవించారు. బాగా మత్తెక్కిపోవడంతో ఆమె స్వయంగా పిటిషనర్ (అత్యాచార నిందితుడు) ఇంటికి వెళ్లి విశ్రాంతి తీసుకోవడానికి అంగీకరించారని జస్టిస్ సింగ్ ఉత్తర్వుల్లో తెలిపారు. "పిటిషనర్ తన ఇంటికి బదులుగా అతని బంధువుల ఫ్లాట్‌కు తీసుకెళ్లి రెండుసార్లు అత్యాచారం చేశాడన్న బాధితురాలి ఆరోపణ అబద్ధం. రికార్డుల్లో ఉన్న సాక్ష్యాలకు విరుద్ధం. బాధితురాలు వెల్లడించిన కేసు వాస్తవాలను పరిగణనలోకి తీసుకుంటే, ఇది అత్యాచారం కేసు కాదు. వారిద్దరి మధ్య ఏకాభిప్రాయంతో కుదిరిన రిలేషన్‌కు సంబంధించిన కేసు కావచ్చు" అని పేర్కొన్నారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న నిశ్చల్ డిసెంబరు 11 నుంచి జైల్లోనే ఉన్నాడని, అతనికి ఎలాంటి నేర చరిత్ర లేదన్న వాదనలను జస్టిస్ సింగ్ పరిగణనలోకి తీసుకున్నారు. దర్యాప్తుకు సహకరించాలని ఆదేశిస్తూ నిశ్చల్‌కు బెయిల్ మంజూరు చేశారు.

మధ్యాహ్న భోజనం ధరల పెంపు

- మే 1 నుంచి అమల్లోకి కొత్త ధరలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకాన్ని అందించడానికి ఉద్దేశించిన ప్రధాన మంత్రి పోషణ్ శక్తి నిర్మాణ్(పీఎం పోషణ్) పథకం ధరలను పెంచుతున్నట్టు కేంద్రం గురువారం ప్రకటించింది. దేశవ్యాప్తంగా 10.36 లక్షల ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాల్లో 11.20 కోట్ల మంది విద్యార్థులు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందుతున్నారు. బాల్‌వాటిక, ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కో విద్యార్థికి అదనంగా 0.59 పైసలు పెంచింది. కేవలం ఆహార పదార్థాల ఖర్చు రూ.6.19 నుంచి రూ.6.78కి పెరిగింది. అన్ని ఖర్చులను కలుపుకొని ఇక్కడ ఒక్కో భోజనం వ్యయం రూ.12.13 కానుంది. ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు రూ.0.88 వంతున పెంచగా అక్కడ ఒక్కో భోజనం ఖర్చు రూ.17.26 కానుంది. ఇందులో ఆహార పదార్థాల ఖర్చు రూ.9.29 నుంచి రూ.10.17కి పెరిగింది. పెరిగిన ధరలకు అనుగుణంగా కేంద్రం ఈ నిర్ణయం తీసుకొంది. ఇకపై బాల వాటిక, ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కో విద్యార్థికి భోజనంలో 20 గ్రాముల పప్పులు, 50 గ్రాముల కూరగాయలు, 5 గ్రాముల నూనె వినియోగించాల్సి ఉంటుంది.

ట్రంప్ ఇన్‌సైడర్ ట్రేడింగ్?

(మొదటిపేజీ తరువాయి)

వాడతారు. సుంకాల అమలు వాయిదా ప్రకటనతో మార్కెట్లు మళ్లీ దూసుకుపోతాయన్న విషయం తెలిసి.. కావాలనే ట్రంప్ ఆ పోస్టు పెట్టారని, దీనివల్ల ట్రంప్ మీడియా షేర్ల విలువ భారీగా పెరిగి 22.67 శాతం మేర లాభాల్లో ముగిసిందని, ఆ గ్రూపులో 53 శాతం వాటా ఉన్న ట్రంప్ వ్యక్తిగత సంపద ఒక్కరోజులోనే 415 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.3,570 కోట్ల) మేర పెరిగిందని.. డెమొక్రాట్లు మండిపడుతున్నారు. ట్రంప్ ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడ్డారని... దీనిపై దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు. ట్రంప్ పోస్టుతో.. ఏదో జరగబోతోందని నమ్మిన ఆయన అభిమానులు, మదుపరులు పెద్దఎత్తున ట్రంప్ మీడియా షేర్లు కొనుగోలు చేశారు. భారీగా లాభపడ్డారు. ఈ క్రమంలోనే.. తన మాట విని షేర్లు కొన్న ఒక సన్నిహితుడికి 2.5 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.21 కోట్లు), మరొకరికి 900 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.7,743 కోట్లు) వచ్చాయని ట్రంప్ చెబుతున్న వీడియో ఒకటి వైరల్ అయింది. అయితే.. ఆయన ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడలేదని, అమెరికా ప్రజలకు, మార్కెట్లకు దేశ ఆర్థిక భద్రతపై నమ్మకం కల్పించడం అధ్యక్షుడిగా ఆయన బాధ్యత అని వైట్‌హౌస్ వర్గాలు ఆయన్ను వెనకేసుకొచ్చాయి. అలాగే.. భారత్‌పై విధించిన 26 శాతం అదనపు సుంకాల అమలును జూలై 9 అర్ధరాత్రి 12.01 గంటల దాకా వాయిదా వేస్తూ వైట్‌హౌస్ వర్గాలు కార్యనిర్వాహక ఉత్తర్వును విడుదల చేశాయి. ఫెంటనిల్ అక్రమ రవాణాను నిరసిస్తూ చైనాపై తొలుత విధించిన 20 శాతం సుంకాలను, తాజాగా విధించిన 125 శాతం సుంకాలను కలిపితే ఆ దేశంపై మొత్తం సుంకాల భారం 145 శాతానికి చేరుతుందని ఆ వర్గాలు వివరణ ఇచ్చాయి.

తలుపులు తెరిచే..

ట్రంప్ సుంకాల బాదుడుపై చైనా గురువారం సూటిగా, ఘాటుగా స్పందించింది. "అమెరికాతో ఘర్షణను మేము కోరుకోం. ఆ దేశం మాతో చర్చలు జరపడానికి సిద్ధమైతే.. అందుకు తలుపులు తెరిచే ఉంచుతాం. అయితే, చర్చలు పరస్పర గౌరవంతో, సమానత్వంతో సాగాలి. అలా కాకుండా ట్రంప్ మాపై ఒత్తిడి తెస్తే మాత్రం దృఢంగా నిలబడతాం" అని చైనా వాణిజ్య శాఖ అధికార ప్రతినిధి హీయాంగ్బియాన్ స్పష్టం చేశారు. ఒత్తిడి తేవడం, బెదిరించడం, బ్లాక్‌మెయిల్ చెయ్యడం వంటివి.. చైనాతో వ్యవహరించడానికి సరైన మార్గాలు కావని ఆమె తేల్చిచెప్పారు. వాషింగ్టన్ తన ధోరణిలోనే ముందుకెళ్లాలని భావిస్తే తాము తుదికంటా పోరాడతామని హెచ్చరించారు. చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ సైతం.. కవ్వింపు చర్యలకు తాము భయపడబోమని, సుంకాలపై వెనక్కి తగ్గబోమని తేల్చిచెప్పారు. అంతేకాదు.. సుంకాల బాదుడుతో ప్రపంచ దేశాలను అతలాకుతలం చేస్తున్న అమెరికాకు వ్యతిరేకంగా కూటమిని నిర్మించేందుకు.. యూరప్, దక్షిణాసియా దేశాలతో చైనా సంప్రదింపులు జరుపుతోంది. అందులో భాగంగానే.. చైనా ప్రీమియర్ లీ చాంగ్ యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులాకు ఫోన్ చేసి మాట్లాడారు. చైనా వాణిజ్య మంత్రి వాంగ్.. ఈయూ వాణిజ్య, ఆర్థిక భద్రత కమిషనర్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆసియాన్ దేశాల నేతలతోనూ మాట్లాడారు. అయితే, అమెరికాకు వ్యతిరేకంగా చైనాతో చేతులు కలిపేందుకు ఆ దేశాలు ముందుకు రావట్లేదని సమాచారం. తాము అమెరికాతో సంప్రదింపులకే ప్రాధాన్యమిస్తామని ఆస్ట్రేలియా, తైవాన్ తేల్చిచెప్పేశాయి. కంబోడియా, వియత్నాం కూడా అదే బాటలో నడుస్తున్నాయి. భారత్ కూడా చైనా విజ్ఞప్తిని తోసిపుచ్చినట్టు తెలుస్తోంది.



చైనా కూడా రెడీనే..

ప్రతీకార సుంకాల విధింపుతో.. చైనా సహా చాలా దేశాలు తమతో చర్చలకు ముందుకు వచ్చాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అన్నారు! చైనా కూడా తమతో ఒప్పందానికి తహతహలాడుతోందిగానీ.. ఎప్పుడు చేసుకోవాలనే విషయంలోనే ఒక నిర్ణయానికి రాలేకపోతోందని వ్యాఖ్యానించారు. "(చైనా) అధ్యక్షుడు షి జిన్‌పింగ్.. నాకు బాగా తెలుసు. ప్రపంచంలోనే అత్యంత తెలివైన వ్యక్తుల్లో ఆయన ఒకరు. జిన్‌పింగ్ దీనిపై ఒక నిర్ణయం తీసుకుంటారు" అని ట్రంప్ పేర్కొన్నారు. త్వరలోనే చైనాతోపాటు ఇతరదేశాలతోనూ మంచి ఒప్పందాలు కుదురుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా.. అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్.. ట్రంప్ సుంకాల ప్రకటనను 'బేరసారాల వ్యూహం'గా పేర్కొన్నారు. ఆ వ్యూహం విజయవంతమైందని, దానివల్లే గడిచిన వారం రోజులుగా తమతో సంప్రదింపులకు 75కు పైగా దేశాలు ముందుకొచ్చాయని పేర్కొన్నారు.. సమస్యంతా చైనా వంటి దేశాలతోనేనని.. అవి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అసమతౌల్యాలకు కారణమవుతాయని ఆయన అసహనం వ్యక్తం చేశారు. డ్రాగన్ దేశానికి ఇరుగు పొరుగు దేశాలైన జపాన్, దక్షిణ కొరియా, వియత్నాం, ఇండియా వంటి దేశాలు తమతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడానికి ముందుకొస్తున్నాయని వెల్లడించారు.

మేమూ నిలిపివేస్తాం..

సుంకాల అమలును 90రోజులపాటు వాయిదా వేస్తున్నట్టు ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో.. అమెరికాపై 25% సుంకాలను విధిస్తూ తాము తీసుకున్న నిర్ణయాన్ని కూడా 90 రోజులపాటు నిలిపివేస్తున్నట్టు యూరోపియన్ యూనియన్ ప్రకటించింది. "మేం చర్చలకు కూడా ఒక అవకాశాన్ని ఇద్దామనుకుంటున్నాం" అని యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా స్పష్టం చేశారు. కాగా.. అమెరికాపై 25% సుంకాలను విధించాలని ఈయూ తీసుకున్న నిర్ణయం గురించి ఒక విలేకరి ప్రశ్నించే దాకా ట్రంప్‌కు తెలియకపోవడం గమనార్హం. విలేకరులు దీని గురించి ప్రస్తావించినప్పుడు ఆయన.. 'బ్యాడ్ టైమింగ్' అని సమాధానమిచ్చారు. అయినప్పటికీ.. యూరప్ దేశాలు తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవడం తనకు ఆనందం కలిగించిందన్నారు.

ఏఐ బేబీ

(మొదటిపేజీ తరువాయి)

రూపొందించిన ఈ విధానం గురించి 'రీ-ప్రొడక్టివ్ బయోమెడిసిన్ ఆన్‌లైన్' జర్నల్‌లో ప్రచురితమైంది. సహజంగా సంతాన భాగ్యం పొందలేని దంపతులకు వరంలా.. 1990ల్లో 'ఇంట్రాసైటోప్లాస్మిక్ స్పెర్మ్ ఇంజెక్షన్ (ఐసీఎస్ఐ)' విధానం అందుబాటులోకి వచ్చిన సంగతి తెలిసిందే. నాటి నుంచి ప్రపంచవ్యాప్తంగా కొన్ని కోట్ల మంది.. ఆ విధానం ద్వారా పిల్లలను పొందారు. మహిళ అండంలోకి మాన్యువల్‌గా వీర్యకణాన్ని ఇంజెక్షన్ ద్వారా పంపే ప్రక్రియ ఇది. ఇందులో మొత్తం 23 దశలు ఉంటాయి. అవన్నీ అత్యంత సంక్లిష్టమైనవి. ఏ దశలో చిన్న తప్పిదం జరిగినా ప్రయత్నం మొత్తం వృథా అయిపోతుంది. అందుకే అత్యంత నిపుణులైన ఎంబ్రియాలజిస్టులను మాత్రమే ఇందుకు నియోగిస్తారు. ఆ 23 దశలనూ మానవ ప్రమేయం లేకుండానే కృత్రిమ మేధ సాయంతో, డిజిటల్ కంట్రోల్ ద్వారా రోబోటిక్స్‌తోనే నిర్వహించే విధానాన్ని కన్సీవబుల్ లైఫ్ సైన్సెస్ నిపుణులు అభివృద్ధి చేశారు. ఇందులో భాగంగా నాణ్యమైన వీర్యకణాన్ని ఏఐ సాయంతో ఎంపిక చేస్తారు. లేజర్ సాయంతో దాన్ని కదలకుండా చేసి.. రిమోట్ డిజిటల్ కంట్రోల్ ద్వారా అండంలోకి చొప్పిస్తారు. మొత్తం 23 దశలనూ మనుషుల కన్నా కచ్చితంగా యంత్రాల ద్వారా నిర్వహించడానికి ఏఐ ఉపకరిస్తోంది. మెక్సికోకు చెందిన 40 ఏళ్ల మహిళ.. దాత అండాలతో ఈ విధానంలో గర్భం దాల్చి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈ కొత్త విధానం.. సంప్రదాయ కృత్రిమ సంతాన సాఫల్యా విధానం తీరుతెన్నులనే మార్చేస్తుందని డాక్టర్ కోహెన్ అభిప్రాయపడ్డారు. కాగా.. ఈ ఏఐ ఆధారిత ఐసీఎస్ఐ నిర్వహణకు యంత్రాలకు పడుతున్న సమయం 9.56 నిమిషాలు. నిపుణులైన ఎంబ్రియాలజిస్టులకు ఇంతకన్నా తక్కువ సమయమే పడుతుందని వైద్యనిపుణులు పేర్కొంటున్నారు.

మార్కుల కోసం మాతృభాషకు మంట!

(మొదటి పేజీ తరువాయి)

ఇంటర్ బోర్డు భావిస్తోంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి అన్ని ప్రభుత్వ కాలేజీల్లో సంస్కృతాన్ని ద్వితీయ భాషగా అమలుచేయాలన్న నిర్ణయంపై ఉపాధ్యాయ సంఘాలు, తెలుగు భాషా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఎందుకూ అక్కరకు రాని సంస్కృతం భాషతో విద్యార్థులకు మార్కులు పెరుగుతాయని ఇంటర్ విద్య అధికారులు చెప్పడం.. వారి అవివేకానికి నిదర్శనమని మండిపడుతున్నాయి

గతంలోనూ ఓ సారి ప్రతిపాదన

అన్ని ప్రభుత్వ కాలేజీల్లో సంస్కృతం ప్రవేశపెట్టాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే ప్రతిపాదన వచ్చింది. 2022లో ఎమ్మెల్సీ కవిత చేసిన విజ్ఞప్తి మేరకు సర్కారు ఆ దిశగా చర్యలు చేపట్టింది. కనీసం 150 ప్రభుత్వ కాలేజీల్లో సంస్కృతాన్ని ప్రవేశపెట్టాలని భావించగా, కొత్త పోస్టులపైనా చర్చలు జరిగాయి. కానీ, అప్పట్లో దీనిపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమయ్యాయి. దీంతో ఆ తర్వాత అది ముందుకు వెళ్లలేదు. ఇదే అంశం ఇప్పుడు మళ్లీ తెరపైకి వచ్చింది. వాస్తవానికి గత ఏడాది అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. మాతృభాషలో బోధనకు ప్రాధాన్యం ఇస్తామని ప్రకటించింది. ఈ దిశగా రెండు నెలల క్రితం పాఠశాల విద్యలో తెలుగును తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పదోతరగతి వరకు రాష్ట్రంలోని అన్ని కార్పొరేట్, ఇంటర్నేషనల్ స్కూళ్లలోనూ తెలుగును ఓ భాషగా అమలుచేయాలని ఆదేశించింది. ఈ నిర్ణయంపై తెలుగు భాషాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. కానీ, ఇప్పుడు మార్కుల కోసం ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో సంస్కృతాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించడాన్ని భాషావేత్తలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. గతంలో ఆగిన ప్రతిపాదనను తాజాగా ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తుండడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

సంస్కృతంతో సాధించిందేమిటి?

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మూడు దశాబ్దాల క్రితమే ఇంటర్‌లో ద్వితీయ భాషగా సంస్కృతాన్ని ప్రవేశపెట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 436 ప్రభుత్వ జూనియర్ కాలేజీలుండగా.. 20 కాలేజీల్లోనే ద్వితీయ భాష సంస్కృతం బోధించే అధ్యాపకులున్నారు. మిగతా 416లో 90శాతం కాలేజీల్లో తెలుగు అధ్యాపకులు, మిగతా 10శాతం కాలేజీలో హిందీ, ఉర్దూ, అరబిక్ బోధకులు ఉన్నారు. పదో తరగతి వరకు మాతృభాషలో చదువుకున్న విద్యార్థులందరూ ఇంటర్‌లోనూ ద్వితీయ భాషగా తెలుగునే ఎక్కువగా తీసుకుంటున్నారు. డిగ్రీ, ఆపై ఉన్నత విద్య ఇంగ్లిషు మాధ్యమంలో అభ్యసించినా.. తెలుగు పునాదులు బలంగా ఉంటున్నాయి. మూడు దశాబ్దాల క్రితం ద్వితీయ భాషగా సంస్కృతాన్ని ప్రవేశపెట్టినప్పుడే తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. ప్రభుత్వంతో సన్నిహితంగా మెలిగే కొందరు బడా స్వాముల విజ్ఞప్తులతో



ఇంటర్‌లో వచ్చి చేరిన సంస్కృతాన్ని ఇంటర్ బోర్డు అధికారులు ప్రోత్సహిస్తూ వచ్చారు. వాస్తవానికి దేవనాగరి లిపిలో ఉండే సంస్కృతాన్ని ఆ లిపిలో ఏ ఒక్క విద్యార్థి కూడా పరీక్ష రాయరు. ప్రస్తుతం కార్పొరేట్, ప్రైవేటు కాలేజీల్లో ద్వితీయ భాషగా సంస్కృతాన్ని ఎంచుకున్న విద్యార్థులందరూ ఇంగ్లిషు లేదా తెలుగులోనే రాస్తారు. అయినా.. వీరికి 100 మార్కులకు అత్యధికంగా 99 వరకు వస్తున్నాయి. మరోవైపు తెలుగు, హిందీకి గరిష్ఠంగా 70కి మించి మార్కులు రావడం లేదు. దీంతో మార్కుల కోసమే విద్యార్థులు సంస్కృతాన్ని తీసుకుంటున్నారన్న వాదనలున్నాయి.

విరమించుకోవాలి: సంఘాలు

ప్రభుత్వ ఆలోచన అమల్లోకి వస్తే రాష్ట్రంలో మాతృభాష పరిస్థితి మరింత దిగజారుతుందని తెలుగు భాష, సాహితీ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. మాతృ భాషను బతికించుకోవడానికి తమిళనాడు వంటి రాష్ట్రాలు కేంద్రంతో పోట్లాడుతుంటే తెలంగాణలో భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయని ప్రముఖ సాహితీవేత్త తూమాటి సంజీవరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత విద్యలో తెలుగు తప్పనిసరి చేయాల్సిన ప్రభుత్వం.. కీలకమైన ఇంటర్‌లో నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ఉద్యమిస్తామని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల సంఘం పేర్కొంది. పదోతరగతి వరకు సంస్కృతం చదవని విద్యార్థులకు ఇంటర్‌లో ప్రవేశపెడితే కలిగే ప్రయోజనం ఏంటని సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వి.శ్రీనివాస్, కొపిశెట్టి సురేష్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

సంస్కృత పోస్టుల కోసమేనా..?

వేద పాఠశాలల్లో సంస్కృతం చదివిన తమకు ఉద్యోగ అవకాశాల్లేవని గతంలో సంస్కృత పండితులు మాజీ సీఎం కేసీఆర్‌కు సన్నిహితంగా ఉన్న ఓ స్వామిని ఆశ్రయించారు. ఆయన సూచనల మేరకు గత ప్రభుత్వం అమలు చేయాలని మూడేళ్ల క్రితమే అనుకున్నా సాధ్యపడలేదు. రాష్ట్రంలోని చాలా కాలేజీల్లో శాశ్వత తెలుగు అధ్యాపకులే లేరు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ విధానంలోనే ఏటా నియమిస్తున్నారు. అలాంటిది ఏకంగా సంస్కృత అధ్యాపకుల కోసం కొత్త పోస్టులు క్రియేట్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంపై విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వ తాజా నిర్ణయంతో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ద్వితీయ భాషగా తెలుగును ఎంచుకునే వారి సంఖ్య గణనీయంగా తగ్గనుంది. వచ్చే ఏడాది నుంచి సంస్కృతం అందుబాటులోకి వస్తే చాలా మంది సంస్కృతాన్ని ఎంచుకునే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. దీంతో ఇంటర్‌లో తెలుగుతో పాటు తెలుగు అధ్యాపకులూ కనుమరుగు కానున్నారు.



ముత్రా(కె)లో జరిగిన పెళ్లిలో ప్లకార్డులతో నూతన దంపతులు

తులం బంగారం ఏమైంది..!?

» ఆదిలాబాద్ జిల్లాలో వధూవరుల వినూత్న నిరసన

ఇచ్చోడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముత్రా(కె) గ్రామంలో గురువారం జరిగిన పెళ్లిలో ప్రభుత్వ పథకాలు అమలు కావడం లేదంటూ నూతన వధూవరులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. కల్యాణలక్ష్మి పథకంలో భాగంగా ప్రభుత్వం అందిస్తామన్న తులం బంగారం ఏమైందంటూ ప్లకార్డులతో నిరసన తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ఏడాదికి పైగా గడిచిపోయినా ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన తులం బంగారం ఇంకెప్పుడు ఇస్తారంటూ ప్లకార్డులు ప్రదర్శించారు.

జగన్ పత్రికవి తప్పుడు రాతలు

» చర్యలు తీసుకోవాలంటూ ఏపీ డీజీపీకి టీడీపీ ఫిర్యాదు

అమరావతి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జగన్ పత్రిక తప్పుడు కథనాలపై చర్యలు తీసుకోవాలంటూ డీజీపీకి తెలుగుదేశం నేతలు ఫిర్యాదు చేశారు. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు, మాజీ ఎమ్మెల్సీ అశోక్ బాబు, బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ బుచ్చిరాం ప్రసాద్, చిట్టిబాబు డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాను ఆయన కార్యాలయంలో కలిశారు. జగన్ మీడియా ఎడిటర్లు, డైరెక్టర్లపై ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 'అవినీతి సొమ్ముతో పుట్టిన జగన్ పత్రిక నాటి నుంచి నేటి వరకు అబద్ధపు రాతలతో అసత్యాలతో సమాజంలో విషాన్ని నింపడమే పనిగా పెట్టుకుంది. సొంత బాబాయిని గొడ్డలి వేటుకు బలి చేసి, జగన్ పత్రికలో మాత్రం నారాసుర రక్త చరిత్ర అంటూ అసత్యాలు రాశారు. ఇటీవల పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం పశువేములకి చెందిన హరిశ్చంద్ర తెలంగాణలో ఉంటూ పింఛన్ కోసం ఊరికి వచ్చారు. అతనిని టీడీపీ గూండాలు కిడ్నాప్ చేసి దారుణంగా హతమార్చారంటూ జగన్ పత్రికలో అసత్య వార్తలు రాశారు. తెలంగాణలో మాత్రం అదే జగన్ పత్రికలో... అల్లుడికి, హరిశ్చంద్రకు భూతగాదాల ఉన్నాయని, ఆ నేపథ్యంలో హత్య జరిగిందని రాశారు. రాజకీయ లబ్ధి కోసం జగన్ తన పత్రికను అడ్డం పెట్టుకుని రాష్ట్రానికో తీరున అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. ఇలాంటి తప్పుడు కథనాలతో సమాజంలో విద్వేషాలను రెచ్చగొట్టేలా రాతలు రాస్తున్న జగన్ మీడియాపై తగిన చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరాం' అని టీడీపీ నేతలు తెలిపారు.

పోలీసులపై గోరంట్ల మాధవ్ దౌర్జన్యం

» వారి అదుపులోని చేబ్రోలు కిరణ్‌పై దాడి యత్నం.. మాధవ్ అరెస్ట్

గుంటూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ గుంటూరులో పోలీసులపై రెచ్చిపోయారు. మాజీ సీఎం జగన్ సతీమణి భారతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో పోలీసుల అదుపులో ఉన్న చేబ్రోలు కిరణ్‌పై దాడి చేయడానికి తీవ్రంగా ప్రయత్నించారు. ఇబ్రహీంపట్నం శివారులో కిరణ్‌ను అరెస్టుచేసి తీసుకొస్తున్న పోలీసులను గుంటూరు ఎస్పీ కార్యాలయం సమీపంలో అడ్డగించబోయారు. ఈ సందర్భంగా ఎస్పీ కార్యాలయం వద్ద మాధవ్ హల్‌చల్ సృష్టించారు. కిరణ్‌ను అరెస్టు చేసిన పోలీసుల విధులకు మాజీ ఎంపీ మాధవ్ అడ్డుతగలడమే కాకుండా, వారిపైనా దౌర్జన్యానికి పాల్పడ్డారు. అంతకుముందు, తన అనుచరులతో కారులో పోలీసుల వాహనాన్ని వెంబడించారు. పోలీసుల అదుపులో ఉన్న కిరణ్‌పై దాడికి ప్రయత్నించారు. ప్రతిఘటించిన పోలీసులపైనా విరుచుకుపడ్డారు. ఈ క్రమంలో పోలీసుల వాహనం ఎస్పీ కార్యాలయంలోకి వెళ్లింది. అయినా, వదలకుండా ఆ వాహనాన్ని మాధవ్ వెంబడించారు. ఎస్పీ కార్యాలయం ప్రాంగణంలోనూ కిరణ్‌పై దాడికి మరోసారి ప్రయత్నించారు. దీంతో గోరంట్ల మాధవ్‌తో పాటు ఆయన అనుచరులు ముగ్గురిని పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేశారు.

ప్రాణం తీసిన ఈత సరదా

» కుంటలో మునిగి ఇద్దరు బాలుర మృతి

» కామారెడ్డి జిల్లా క్యాసంపల్లి తండాలో విషాదం



సాయికుమార్, సురేశ్ (ఫైల్)

కామారెడ్డిటౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఈత సరదా ఇద్దరు బాలుర నిండు ప్రాణాలను తీసింది. వారి తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగిల్చింది. ఈ విషాద ఘటన కామారెడ్డి జిల్లాలో జరిగింది. కామారెడ్డి మండలం క్యాసంపల్లి తండాకు చెందిన తేజావత్ సాయికుమార్ (16), భూక్య సురేశ్ (14) గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. ఈ నెల 8వ తేదీన మంగళవారం బడికెళ్లొచ్చిన తర్వాత వీరిద్దరూ.. ఎవరికీ చెప్పకుండా గ్రామ శివారులోని రాఘపూర్ వద్ద గల కుంటలోకి ఈతకు వెళ్లారు. అయితే ఈత రాక ప్రమాదవశాత్తు అందులో మునిగి మృతి చెందారు. బయటకు వెళ్లిన తమ పిల్లలు ఎంతకీ తిరిగి రాకపోవడంతో కంగారు పడిన తల్లిదండ్రులు వారి కోసం గాలించడం ప్రారంభించారు. రెండు రోజులుగా వెతుకుతున్నా వారి ఆచూకీ లభించలేదు. గురువారం కుంటలో రెండు మృతదేహాలు పైకి తేలడంతో అటుగా వెళ్తున్న రైతులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాలను బయటకు తీసి సాయికుమార్, భూక్య సురేశ్‌గా నిర్ధారించారు. ఈత రాక వీరిద్దరూ కుంటలో పడి మృతి చెంది ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. కాగా, తమ పిల్లలు విగతజీవులుగా కనిపించడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

వరకట్న వేధింపులతో భార్య ఆత్మహత్య

» భర్త ఆత్మహత్యాయత్నం.. పరిస్థితి విషమం

» యాదాద్రి భువనగిరి జిల్లా నిదానపల్లిలో ఘటన



కావ్య (ఫైల్)

రామన్నపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వరకట్న వేధింపులతో ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడగా, అది చూసి ఆమె భర్త ఆత్మహత్యాయత్నం చేశాడు. గురువారం యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండలం నిదానపల్లి గ్రామంలో ఈ ఘటన జరిగింది. నిదానపల్లి గ్రామానికి చెందిన జినుకుల ఆంజనేయులుకు నల్లగొండ జిల్లా చిట్యాలకు చెందిన కావ్య (25)తో 2018లో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అదనపు కట్నం తేవాలంటూ భార్య కావ్యను ఆంజనేయులు వారం రోజులుగా వేధిస్తున్నాడు. ఇదే విషయమై ఈ నెల 8వ తేదీన భార్యను కొట్టి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. మనస్తాపానికి గురైన కావ్య గురువారం తమ వ్యవసాయ బావి వద్ద పశువుల కొట్టంలో ఉరేసుకుంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారమివ్వడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, భార్య ఆత్మహత్య చేసుకుందని తెలియడంతో మృతదేహాన్ని చూసేందుకు పశువుల కొట్టం వద్దకు వచ్చిన జినుకుల ఆంజనేయులు (30) గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబసభ్యులు వెంటనే అతడ్ని రామన్నపేట ప్రభుత్వాస్పత్రికి తీసుకురాగా ప్రథమ చికిత్స నిర్వహించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు.

రాజకీయ శరణార్థిగా గుర్తించండి

అమెరికాలో ప్రభాకర్‌రావు పిటిషన్ దాఖలు.. భారత అధికారులు వేధిస్తున్నారని ఆరోపణలు

» రాజకీయ కారణాలతో తనపై కేసులు నమోదు చేశారని వెల్లడి

» రెడ్ కార్నర్ నోటీసు తప్పించుకునే యత్నం

» పారిపోయే ముందు ఆధారాల ధ్వంసం: సిట్



హైదరాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నిందితుడైన ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు అమెరికాలో రాజకీయ శరణార్థిగా తనను గుర్తించాలని కోరుతూ.. పిటిషన్ దాఖలు చేసినట్లు సమాచారం. "నేను ఐపీఎస్ అధికారిగా పని చేశాను. అందరు అధికారుల మాదిరిగానే విధులు నిర్వర్తించాను. కొత్త ప్రభుత్వం వచ్చాక.. నాపై కక్షగట్టింది" అని ఆ పిటిషన్‌లో పేర్కొన్నట్లు తెలిసింది. భారత అధికారులు, ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం రాజకీయ కారణాలతో తనపై అక్రమ కేసు నమోదు చేసి, వేధిస్తున్నట్లు వివరించారని తెలుస్తోంది. ప్రభాకర్‌రావు పాస్‌పోర్టు రద్దు కావడం, ఆయనపై ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీసు జారీ అవ్వడం.. అమెరికాలో వలస విధానాలను కఠినంగా అమలు చేస్తున్న నేపథ్యంలో.. తప్పనిసరిగా తనను భారత్‌కు తిప్పిపంపిస్తారని భావించిన ప్రభాకర్‌రావు.. ఈ పిటిషన్ దాఖలు చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ప్రభాకర్‌రావు ఫ్లోరిడాలో తన కుమారుడి వద్ద ఉంటూ.. కాన్సర్‌కు చికిత్స తీసుకుంటున్నారు. ఆయన పాస్‌పోర్టు రద్దయినప్పటికీ.. అది భారత్‌కు మాత్రమే సంబంధించిన విషయం. దాంతో ఆయన తన వద్ద ఉన్న పాస్‌పోర్టుతో ఏ దేశానికైనా వెళ్లొచ్చు. పాస్‌పోర్టులో అన్ని పేజీల్లో స్టాంపింగ్ పూర్తయ్యే వరకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. అయితే.. ఇంటర్‌పోల్ సభ్యదేశాల విమానాశ్రయాలకు రెడ్‌కార్నర్ నోటీసులను పంపితే.. ప్రభాకర్‌రావుకు ఇబ్బందులు తప్పవు. అదే సమయంలో.. అమెరికాలో రాజకీయ శరణార్థిగా గుర్తించాలనే పిటిషన్ వేస్తే.. కేసు తేలే వరకు తనపై ఎలాంటి చర్యలు ఉండబోవనే ఉద్దేశంతోనే ప్రభాకర్‌రావు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే.. ఈ పిటిషన్‌పై తమకు సమాచారం లేదని సిట్ అధికారులు చెబుతున్నారు. కాగా.. ప్రభాకర్‌రావు బెయిల్ పిటిషన్‌పై ఇటీవల హైకోర్టులో కౌంటర్ దాఖలు చేసిన సిట్ పోలీసులు.. ఓ కీలక విషయాన్ని కోర్టు ముందుకు తీసుకుని వెళ్లారు. ప్రభాకర్‌రావు గత ఏడాది మార్చి 10న దేశం విడిచి పారిపోయారని, అదే రోజు ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి ఎఫ్ఐఆర్ నమోదయిందని వివరించారు. ఈ కేసులో తనను ప్రశ్నిస్తారనే అనుమానాలతో ప్రభాకర్‌రావు పారిపోయారని, ఇంటి నుంచి వెళ్లే ముందు ఎలాంటి ఆధారాలు దొరకకుండా శుభ్రం చేయించినట్లు తమ విచారణలో వెల్లడైందని కోర్టుకు తెలిపారు.

వైఎస్ భారతిపై అనుచిత వ్యాఖ్యలు టీడీపీ కార్యకర్త కిరణ్ అరెస్టు

» గతంలో విడదల రజినిపైనా పోస్టులు

» పార్టీ నుంచి సస్పెండ్ చేసిన టీడీపీ

గుంటూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): యూట్యూబ్ చానల్ ఇంటర్వ్యూలో వైఎస్ జగన్ సతీమణి భారతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్‌ను మంగళగిరి రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం ఆత్మకూరుకు చెందిన వైసీపీ కార్యకర్త బంగు వెంకట కృష్ణారెడ్డి, సంగేవ వెంకట శివరామకృష్ణలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదుచేశారు. చేబ్రోలు కిరణ్‌ను కృష్ణాజిల్లా ఇబ్రహీంపట్నం శివారులో గురువారం అదుపులోకి తీసుకున్నారు అక్కడి నుంచి గుంటూరులోని జిల్లా ఎస్పీ కార్యాలయానికి తీసుకొచ్చి..మీడియా ఎదుట హాజరుపరిచారు. మాజీ సీఎం జగన్ పోలీసులను బట్టలూడదీస్తామని రెండు రోజుల క్రితం హెచ్చరించిన విషయం తెలిసిందే. దీనిపై యూట్యూబ్ చానల్ ఇంటర్వ్యూలో కిరణ్ స్పందిస్తూ, వైఎస్ భారతి పట్ల అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఈ వ్యాఖ్యలను ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించిందని ఎస్పీ సతీశ్‌కుమార్ తెలిపారు. సెల్ టవర్ లొకేషన్ ఆధారంగా ట్రాక్ చేసి హైదరాబాద్ మార్గంలో ఇబ్రహీంపట్నం వద్ద కిరణ్‌ను అరెస్టు చేశామని చెప్పారు. గతంలో మాజీ మంత్రి విడదల రజిని పట్ల అనుచితంగా మాట్లాడిన ఘటనపై పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో కిరణ్‌పై కేసు నమోదైందన్నారు. నగరంపాలెం, గన్నవరం, తాడేపల్లి, చేబ్రోలు పోలీస్‌స్టేషన్‌లోనూ సోషల్ మీడియా పోస్టులపై కేసులు, ముందు జాగ్రత్త చర్యగా అరెస్టు చేసిన కేసులు ఆయనపై ఉన్నాయని చెప్పారు. కాగా, చేబ్రోలు కిరణ్‌పై చర్య తీసుకోవాలంటూ వైసీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కె.శామ్యూల్, పట్టణ పార్టీ అధ్యక్షుడు పటెం మనోహర్, ఉపాధ్యక్షుడు దివ్వెల రామారావు, గంగోలు వినోద్ గురువారం జగ్గయ్యపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పవన్ తనయుడిపై అనుచిత పోస్టులు.. కేసుల నమోదు

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తనయుడిపై 'ఎక్స్'లో అనుచిత పోస్టులు పెట్టిన వారిపై గుంటూరు జిల్లా ప్రత్తిపాడు, విజయవాడలో రెండు కేసులు నమోదయినట్టు గుంటూరు ఎస్పీ సతీశ్‌కుమార్ తెలిపారు. వారు ఎవరన్నది తెలుసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని, ఎక్స్ సంస్థకు లేఖ రాశామని తెలిపారు. త్వరలోనే వారిని అరెస్టు చేస్తామని పేర్కొన్నారు.

పొగాకు రైతు దిగాలు

దిగుబడి పెరగడంతో ధరలు పతనం.. గత ఏడాది క్వింటాకు రూ.15వేల పైనే.. ఈసారి రూ.4 వేల నుంచి రూ.5 వేలు

» కొనుగోళ్లకు ఆసక్తి చూపని వ్యాపారులు

» ఏపీలో రూ.29-30 వేలు పలుకుతున్న ధర



పొలంలో ఆరబెట్టిన పొగాకు

జనగామ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మంచి ధర వస్తుందన్న ఆశతో పెద్ద మొత్తంలో పొగాకు సాగు చేసిన అన్నదాతకు ఊహించని షాక్ తగిలింది. అంతర్జాతీయంగా పొగాకు దిగుబడులు భారీగా పెరగడంతో తెలంగాణలో కొనుగోళ్లపై కంపెనీలు, వ్యాపారులు ఆసక్తి చూపడం లేదు. దీంతో గత ఏడాదితో పోలిస్తే ధరలు దారుణంగా పడిపోయాయి. కంపెనీలు ముందస్తు ఒప్పందాలు చేసుకున్న రైతుల నుంచే పొగాకు కొంటుండటంతో.. సొంతంగా సాగు చేసిన అన్నదాతలు ఇతర వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఈసారి పొగాకు దిగుబడి పెరిగింది. జనగామ జిల్లాలో గత ఏడాది కేవలం 500 ఎకరాల్లో సాగు చేయగా ఈ ఏడాది 2,560 పంట వేశారు. రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల ఎకరాల్లో పొగాకు సాగయింది. మన దగ్గర ఎక్కువగా వైట్ బర్లీ, బ్లాక్ బర్లీ రకాలను సాగు చేస్తుంటారు. వీటికి విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. గత ఏడాది పొగాకుకు మంచి ధర రావడంతో చాలా మంది రైతులు దీని సాగుకు ముందుకొచ్చారు. పంటకు కోతుల బెడద లేకపోవడం, గిట్టుబాటు ధర ఉండటంతో ఆసక్తి చూపారు. ఈ క్రమంలో రాష్ట్రంలో పొగాకు సాగు విస్తీర్ణం, దిగుబడి భారీగా పెరిగాయి. పొగాకు సాగుపై రైతులతో కంపెనీలు ఒప్పందాలు చేసుకుంటాయి. ఆసక్తి ఉన్న వారికి విత్తనాలు ఇచ్చి సాగు చేయిస్తుంటాయి. ఈసారి కూడా కంపెనీలు రైతులతో అగ్రిమెంట్లు చేసుకున్నాయి. రాష్ట్రంలో ప్రధానంగా వీఎస్‌టీ(వర్జీనియా టొబాకో) ఇండస్ట్రీస్ లిమిటెడ్ కంపెనీ ఎక్కువగా పొగాకు సాగును ప్రోత్సహిస్తోంది. జనగామ జిల్లాకు సంబంధించి రఘునాథపల్లిలో వీఎస్‌టీ కొనుగోలు కేంద్రం ఉంది. ఈ కేంద్రం ద్వారా ముందస్తుగా అగ్రిమెంట్లు చేసుకున్న రైతుల నుంచి పొగాకును కొంటుంటారు. కాగా, ప్రస్తుతం కంపెనీలతో అగ్రిమెంట్ చేసుకున్న రైతులే కాకుండా ఇతర రైతులు కూడా పెద్ద ఎత్తున పొగాకు సాగు చేశారు. దీంతో ఉత్పత్తి పెరిగి ధర తగ్గింది.

నష్టానికే పొగాకు అమ్మకాలు..

గత ఏడాది 'ఏ' గ్రేడ్ పొగాకు క్వింటాకు రూ.15,500 నుంచి రూ.16 వేలు వరకు ధర పలకగా ఈసారి రూ.4వేల నుంచి రూ.5వేలకు మించడం లేదు. కంపెనీలతో అగ్రిమెంట్లు చేసుకున్న రైతులకు సగటున రూ.9వేల వరకు ధర వస్తుండగా సొంతంగా సాగు చేసిన రైతులకు నిరాశే మిగులుతోంది. తమతో అగ్రిమెంట్ లేకపోవడంతో కంపెనీలు పంట కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదు. ఈపాటికే తమ కొనుగోలు లక్ష్యం మించిపోవడం కూడా కంపెనీలు ఇతర రైతుల పొగాకు కొనకపోవడానికి ఓ కారణంగా తెలుస్తోంది. కంపెనీలు ముందుకురాకపోవడంతో రైతులు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. దీంతో ఇదే అవకాశంగా వారు రూ.4వేలు, రూ.5వేల కంటే ఎక్కువ ధర పెట్టడం లేదు. కొందరు వ్యాపారులు మరీ రూ.3వేలే చెబుతున్నారని, పంట నాణ్యత లేదని సాకు చూపుతున్నారని రైతులు చెబుతున్నారు. ధర వచ్చేదాకా ఆగుదామన్నా.. పొగాకు చెడిపోయే ప్రమాదం ఉంది. దీంతో రైతులు చేసేదేమీ లేక వ్యాపారులు చెప్పిన ధరకే పంటను అమ్ముతున్నారు.

ఏపీలో మంచి ధరలు

మన దగ్గర పొగాకు ధరలు పాతాళానికి పడిపోగా పక్క రాష్ట్రం ఏపీలో మాత్రం నింగిని అంటుతున్నాయి. ఏపీలో పొగాకు పంట ప్రధానంగా సాగవుతోంది. పొగాకు బోర్డు ద్వారా అక్కడ కొనుగోళ్లు జరుగుతుంటాయి. ఏపీలో ప్రస్తుతం క్వింటా రూ.29 వేల నుంచి రూ.30 వేల వరకు పలుకుతోంది. తెలంగాణలో పొగాకు కొనుగోళ్లపై ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడంతో కంపెనీలు, వ్యాపారులు చెప్పిందే నడుస్తోంది. దీంతో మన దగ్గర కూడా ప్రభుత్వం చొరవ తీసుకుంటే మంచి ధరలు వస్తాయని రైతులు అంటున్నారు.

గతంలో తుక్కుకే రూ.9వేలు ఇచ్చారు



- తోకల అశోక్, కుర్చపల్లి, రఘునాథపల్లి

రెండు ఎకరాల్లో పొగాకు వేస్తే 8 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. అమ్మకానికి వ్యాపారుల వద్దకు తీసుకెళితే నాణ్యత లేదని క్వింటాకు రూ.3వేలు ఇస్తామంటున్నారు. ఆ ధరకు అమ్మితే పెట్టుబడి కూడా రాదు. గతంలో పొగాకు తుక్కుకే క్వింటాకు రూ.9 వేల

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

యుద్ధ విరామం!

కూల్, చిల్ అంటూ తన ప్రజలకు ధైర్యం చెప్పిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కొద్దిగంటల్లోనే వెనకడుగు వేశారు. మిగతాదేశాలను మొత్తడానికి మొదలుపెట్టిన తన వాణిజ్య యుద్ధం అమెరికన్‌మార్కెట్‌ను చిన్నాభిన్నం చేయడంతో ప్రతీకార సుంకాల అమలును 90రోజులు నిలిపివేశారు. ధిక్కారము సైతునా అంటూ చైనా ఒక్కదానిమీదే తన కక్షసాధింపు కొనసాగిస్తూ, మిగతా వాటిని పదిశాతంతో వదిలేశారు. ఏప్రిల్ ఫూల్స్ డే మర్నాడు, లిబరేషన్ డే పేరిట ప్రపంచదేశాలమీద ప్రతీకార సుంకాలు ప్రయోగించిన ఆయన వారం తిరిగేసరికి వెనకడుగువేశారు. మస్క్ మాటే విన్నారో, తెరవెనుక నుంచి కార్పొరేట్ మాంత్రికుల ఒత్తిళ్ళే పనిచేశాయో తెలియదు కానీ తన యుద్ధానికి విరామం ప్రకటించారు. ట్రంప్ ప్రతీకారాస్త్రాల దెబ్బకు కుప్ప కూలిన ప్రపంచ మార్కెట్లు ఇప్పుడు కాస్తంత ఒడ్డునపడుతున్నాయి. లక్ష లకోట్ల సంపద ఆవిరైన గాయాలనుంచి క్రమంగా కోలుకుంటున్నాయి.

ట్రంప్ మనసు ఇంతలోనే ఎందుకలా మారిందో తెలియదు. ప్రతీకార సుంకాలు ప్రయోగిస్తున్నప్పుడు ఆయన ఎంత విశ్వాసంతో మాట్లాడారో చూశాం. అమెరికా సమస్త సమస్యలనుంచి, దారిద్ర్యంనుంచి, దాస్యం నుంచి ఎలా విముక్తి కాబోతున్నదో ఆయన అద్భుతంగా చెప్పారు. గ్రేట్ ఎగైన్ కావడం ఎంతో దూరంలో లేదన్నారు. తన, పర తేడాలేకుండా, పేద ధనికభేదం లేకుండా ప్రతీదేశానికీ ఓ రేటు కట్టారు. గతకాలపు కుట్ర లతో గాయపడిన దేశాన్ని ఉద్ధరించానన్నారు. దెబ్బకు దేశం పరుగులు పెడుతుందనీ, వెలుగులీనుతుందనీ చెప్పారు. భజనబృందం చప్పట్ల మధ్యన కార్యక్రమాన్ని ముగించిన తరువాత కూడా ఆపరేషన్ సక్సెస్, పేషంట్ మోర్ ఫిట్ అని ట్వీట్ చేశారు. ట్రంప్ బృందం ఈ సుంకాల శాతాన్ని ఏ ప్రాతిపదికన నిర్ణయించిందన్న సందేహాలు కూడా అప్పట్లో వచ్చాయి. ప్రతీ రేటుకూ ఓ లెక్క ఉందని, అడుగడుగూ ఆచితూచివేస్తున్నదేనని ట్రంప్ బృందం గొప్పగా చెప్పుకుంది. అంత ఆలోచించి, భవిష్యత్తు అంచనాలతో తీసుకున్న నిర్ణయమే అయితే, ఈ విధ్వంసానికి ముందే సిద్ధపడి ఉండాలి. ఈక్విటీలు ఈడ్చుకుపోతాయని, బాండ్లు బద్ద లవుతాయని, వాల్‌స్ట్రీట్ కూలుతుందని, అంతిమంగా కొంపకొల్లేరవుతుందన్న అవగాహన ఎంతో ఉండాలి. అంతా సర్దుకుంటుందని, తన నిర్ణయం దేశానికి మేలుచేస్తుందని నమ్మకం ఉన్నపక్షంలో వారంలోనే ఇలా వెనకడుగువేయకూడదు. ఆర్థికమాంద్యం ఆరంభమైందనో, అడుగు దూరంలో ఉన్నదనో, సగం మునిగామనో ఆర్థికసంస్థలు వరుసపెట్టి హెచ్చరికలు చేస్తూంటే, లక్షలాదిమంది అమెరికన్లు హ్యాండ్సాఫ్ అంటూ రోడ్లమీదకు వచ్చేయడంతో ట్రంప్ వెనక్కుతగ్గినట్లు ఉంది. మీకు బెదరను, నిర్ణయాన్ని మార్చను అని అంత ఘాటుగా స్పందించిన ట్రంప్ ఇంతలోనే బెదిరిపోవడం స్పష్టంగా కనిపిస్తోంది. స్వల్పకాలంలోనే అమెరికన్లకు తత్వం బోధపడిందని, తిరుగుబాటు ఆరంభమైందని ఆయనకు అనిపించివుండవచ్చు.

వారంలో సుంకాలు వేయడం, తీయడం ట్రంప్‌కు సులువే. కానీ, దశాబ్దాలుగా నిర్మించుకున్న సరఫరా వ్యవస్థలను కూల్చడానికి పిచ్చోడి చేతిలో చిన్న రాయిచాలు. ఈ పరిణామాలన్నీ ఊహించినవే, మా నిర్ణయాలమీద మాకు నమ్మకం ఉంది, కానీ జనమే భయపడిపోతున్నారు అని ట్రంప్ బృందం సమర్థించుకోవడం విచిత్రం. మిగతా ప్రపంచంతో ఒప్పందాలు చేసుకోవడం, చైనాను ఒంటరిచేయడం లక్ష్యంగా తమ ఎత్తులు సాగుతున్నాయని అమెరికా చెప్పుకుంటోంది. కానీ, ప్రపంచ వాణిజ్యంలో ఈ రెండు అగ్రదేశాల వాటా 40శాతం పైనే ఉన్నందున, అది సృష్టించబోయే విధ్వంసం అంచనాలకు అందనిది. ఏ యుద్ధానికైనా సిద్ధమే, చైనీయులు దేనికీ భయపడరని చైనా ప్రకటించింది. తన భౌగోళికార్థిక ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికీ, విస్తరించడానికీ వాణిజ్య యుద్ధాన్ని వాడుకోవాలని అది అనుకుంటోంది. ఆప్తమిత్రదేశాలు అమెరికాకు దూరమవుతున్న స్థితిలో చైనాకు సన్నిహితమవుతున్నవారి సంఖ్య సహజంగానే హెచ్చుతుంది. ఈ యుద్ధం ఎంతకాలం కొనసాగినా మేము ఎప్పటికీ లొంగం... విజయం సాధించేవరకూ పోరాడతాం అంటూ 1953లో మావో చేసిన ప్రసంగాన్ని ఇప్పుడు ప్రచారంలో పెడుతూ చైనా తన పోరాటాన్ని ఏ స్థాయికైనా తీసుకుపోవడానికి సిద్ధపడుతోంది. అధ్యక్షుడికి ఉండే విశేషాధికారాలను దుర్వినియోగం చేస్తూ ప్రపంచవాణిజ్యాన్ని ప్రమాదంలోకి నెట్టేస్తున్న ట్రంప్ మీద ఇప్పటికైనా నియంత్రణలు ఉండాలి. స్వపక్ష, ప్రతిపక్షాలు, చట్టసభలు, న్యాయస్థానాలు అమెరికా సంక్షేమం దృష్ట్యా రంగంలోకి దిగాలి.

అధికారమే భావజాల బాంధవ్యం!



> నీతీశ్, చంద్రబాబు రాజకీయ ఎంపికలు సమకాలీన రాజకీయాలకు ఆధారంగా ఉన్న లౌకిక–మతతత్వ విభజనపై ఒక ఇబ్బందికరమైన ప్రశ్నార్థకాన్ని ఉంచుతున్నాయి. దృఢ విశ్వాసాలకు అనుగుణంగా వ్యవహరించడం కాకుండా స్వప్రయోజనాలు సాధించుకోవడమే ప్రధానమైపోయిన మన రాజకీయ వ్యవస్థలో నిబిడీకృతంగా ఉన్న కాపట్యాలనూ అవి బహిర్గతం చేస్తున్నాయి.



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

రాజకీయ కసరత్తులకు పురస్కారాలు ఉన్న పక్షంలో స్వర్ణ పతకాన్ని అందుకునేందుకు నితీశ్ కుమార్ నిస్సందేహంగా అందరికంటే ముందంజలో ఉంటారు; మొదటి మూడు స్థానాల్లో ఏదో ఒక దానిలో ఉండేందుకు చంద్రబాబు నాయుడు పోటీ పడతారు. నరేంద్ర మోదీకి నిన్న, మొన్న గట్టి ప్రత్యర్థులుగా ఉన్న ఈ నాయకద్వయం నేడు ఆయన నమ్మకమైన మిత్రులుగా మారిపోయారు. ఇదొక సమూల మార్పు. పార్లమెంటులో వక్ఫ్ బిల్లు ఆమోదం పొందేందుకు జనతాదళ్ (యునైటెడ్), తెలుగుదేశం పార్టీలు సంపూర్ణ మద్దతునివ్వడమే అందుకొక తిరుగులేని నిదర్శనం. గత పది నెలల్లో పరిస్థితులు ఎంతగా మారిపోయాయి! జూన్ 2024 నాటి పరిస్థితులను గుర్తు చేసుకోండి. సార్వత్రిక ఎన్నికలు ముగిసాయి. నరేంద్ర మోదీకి మెజారిటీ లభించలేదు. నితీశ్ కుమార్, చంద్రబాబు నాయుడు బీజేపీకి అవసరమైన సంఖ్యాధికృతను సమకూర్చేందుకు సమ్మతించారు–షరతులతోనే సుమా! మరి వారే ఇప్పుడు నరేంద్ర మోదీ ఆధిపత్యాన్ని ఎటువంటి మినహాయింపులు లేకుండా అంగీకరిస్తున్నారు.

అధికార రాజకీయాలలో మనుగడను కాపాడుకునేందుకు సైద్ధాంతిక నిబద్ధతలకు ఎంత సులువుగా తిలోదకాలు ఇవ్వడం జరుగుతుందనేదానికి నితీశ్ కుమార్ రాజకీయమే ఒక తిరుగులేని ఉదాహరణ. నరేంద్ర మోదీ 2013లో భారతీయ జనతా పార్టీ ప్రధాన మంత్రి అభ్యర్థిగా జాతీయ రాజకీయాలలోకి ప్రవేశించినప్పుడు ఆయనపై మొట్టమొదట తిరుగుబాటు చేసింది బిహార్ ముఖ్యమంత్రే కాదూ? మోదీ ఉన్నతిని ప్రతిఘటించిన నితీశ్ కుమార్ ఎన్డీఏ నుంచి వైదొలిగారు. ఒక 'మతతత్వ' శక్తికి వ్యతిరేకంగా, దానిని సమర్థంగా అడ్డుకోగల ఒక లౌకికశక్తిగా తనను తాను ఆయన నిలుపుకున్నారు. అయితే 2002 గుజరాత్ మారణ కాండ నాటి నుంచి రగులుతున్న సైద్ధాంతిక ఘర్షణతో పాటు, పెరుగుతున్న వైయక్తిక పోటీ కారణంగానే ఆనాడు ఎన్డీఏ నుంచి నితీశ్ నిష్క్రమించారని చెప్పక తప్పదు. 2013లో 'సద్భావన యాత్ర' సందర్భంగా టోపీ పెట్టుకునేందుకు మోదీ నిరాకరించడంపై నితీశ్ ఇలా ప్రతిస్పందించారు: 'దేశాన్ని పరిపాలించేందుకు ప్రతి ఒక్కరినీ మీతో కలుపుకోవాలి.. అందుకు కొన్ని సందర్భాలలో టోపీ ధరించాల్సి ఉంటుంది... మరికొన్ని సమయాలలో నుదుట తిలకం పెట్టుకోవాల్సి ఉంటుంది.' నితీశ్ అలా తన 'మృదు' రాజకీయ లౌకికవాదాన్ని నిర్వచించారు. మోదీ బ్రాండ్ హిందూత్వ, తన లౌకికవాదం మధ్య వ్యత్యాసాన్ని ఆయన ఆ విధంగా చాటి చెప్పారు.

నితీశ్, మోదీ నాయకత్వ శైలులు పరస్పర విరుద్ధమైనవి. పన్నెండు సంవత్సరాల అనంతరం, ఈ పరస్పర విరుద్ధాల ఘర్షణలో విజేతగా మోదీ వెలుగొందుతున్నారు. రెండు సంవత్సరాల క్రితం బీజేపీకి వ్యతిరేకంగా ఇండియా కూటమిని నిర్మించి, దాని నాయకుడుగా ప్రధానమంత్రి నాయకత్వాన్ని సవాల్ చేసిన నితీశ్ కుమార్ ఇప్పుడు మోదీ దర్బార్‌లో ఒక సామంతుడుగా ఉన్నారు! క్షీణిస్తున్న ఆరోగ్యంతో నిస్సహాయుడైపోయిన నితీశ్ మోదీ మహాశక్తిని కనీసమాత్రంగానైనా ఎదుర్కోలేకపోతున్నారు. అందుకే మోదీకి పూర్తి మద్దతుదారుగా మారిపోయారు. అయితే ముస్లింల సంక్షేమం పట్ల తమ నాయకుడి నిబద్ధతలో ఎటువంటి మార్పులేదని నితీశ్ అనుయాయులు వాదిస్తున్నారు. అయితే ఇవన్నీ పసలేని మాటలే. జనతాదళ్(యు) రాజకీయ వ్యూహాలు, ఎత్తుగడల్లో ఆ సంక్షేమ సంకల్పాలకు అంతకంతకూ ప్రాధాన్యం తగ్గిపోతోంది. ఇది వాస్తవం. భారతీయ జనతా పార్టీకి నితీశ్ కుమార్ ఒక ఆవశ్యక మిత్రుడు. ఒక ఉపయోగకరమైన రాజకీయ చిహ్నం. వచ్చే నవంబర్‌లో బిహార్ అసెంబ్లీ ఎన్నికలలో తమ బలాన్ని పెంపొందించుకునేందుకు నితీశ్ మద్దతు అవసరం చాలా ఉంది.

చంద్రబాబు నాయుడి రాజకీయ పరిణామం భిన్నమైనది. అదొక క్లిష్టమైన అధ్యయన అంశం. బీజేపీకి చెప్పుకోదగిన ప్రజాబలం లేని రాష్ట్రానికి చంద్రబాబు ముఖ్యమంత్రి. పరిపాలనా ప్రజ్ఞ ఉన్న నాయకుడు. రాజకీయ అనుభవమూ అపారంగా ఉన్న నేత. బీజేపీపై ఏ మాత్రం ఆధారపడవలసిన అవసరం లేకుండానే ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో కొనసాగగల సామర్థ్యం చంద్రబాబుకు ఉన్నది. మరి ఇదే నాయకుడు 2019లో నరేంద్ర మోదీపై ధ్వజమెత్తారు. మోదీ నాయకత్వాన్ని వ్యతిరేకించారు. ఎన్నికల ప్రచారంలో ప్రధానమంత్రిని ఒక 'ఉగ్రవాది' అని కూడా ఆ చంద్రబాబు ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాజకీయాలు మొదటి నుంచీ కేంద్రంతో 'ఒప్పందాల ఆధారితమైనవిగానే ఉన్నాయి. 1990ల నాటి సంకీర్ణ రాజకీయాల యుగంలో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వానికి, వాజపేయి ఆధ్వర్యంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి ప్రధాన మద్దతుదారు, ఆ ప్రభుత్వాలను నిలబెట్టిందీ చంద్రబాబే. ఇప్పుడు అవశేష ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా కూడా కేంద్రంతో ఇప్పుడూ గతంలో వలే ఒక 'ఒప్పందం' కుదుర్చుకున్నారు. ఆర్థిక వనరులు కొరవడిన ఆంధ్రప్రదేశ్‌కు గరిష్ఠ స్థాయిలో ఆర్థిక సహాయమందించాలన్నదే చంద్రబాబు షరతు. ఆ ఆర్థిక తోడ్పాటు కోసమే వివాదాస్పద చట్టం విషయంలోనూ ఆయన కేంద్ర ప్రభుత్వానికి గట్టి దన్నుగా నిలిచారు.

నితీశ్, నాయుడు ఇరువురూ ఒక విధంగా రాజకీయ మనుగడను ఒక కళగా రూపొందించారు, సాధన చేస్తున్నారు. సమయానుకూలంగా, రాజకీయ అవసరాలకు తగ్గట్టు అభిప్రాయాలు మార్చుకుని పట్టువిడుపులతో వ్యవహరించడం వల్ల అధికారంలో సుదీర్ఘకాలం కొనసాగడం సుసాధ్యమవుతుందనేది ఇరువురి అనుభవ పాఠం. అయితే నితీశ్, నాయుడి రాజకీయ ఎంపికలు సమకాలీన రాజకీయాలకు ఆధారంగా ఉన్న లౌకిక–మతతత్వ విభజనపై ఒక ఇబ్బందికరమైన ప్రశ్నార్థకాన్ని ఉంచుతున్నాయి. దృఢ విశ్వాసాలకు అనుగుణంగా వ్యవహరించడం కాకుండా స్వప్రయోజనాలు సాధించుకోవడమే ప్రధానమైపోయిన మన రాజకీయ వ్యవస్థలో నిబిడీకృతంగా ఉన్న కాపట్యాలను అవి బహిర్గతం చేస్తున్నాయి. నిర్వివాదమైన ఒక రాజకీయ సత్యాన్ని ఆ ఇరువురి దృక్పథాలు పునరుద్ఘాటిస్తున్నాయి: 'నిర్దిష్ట అంశాలపై మీ వైఖరి ఏమిటి అనే దానిపై మీ అధికార భవితవ్యం అనేది ఆధారపడి ఉన్నది'. ఈ రాజకీయ ప్రక్రియలో లౌకిక రాజ్యాంగ విలువలు క్రమంగా నిరర్థకమైపోయాయి. ఇండియా కూటమితో ఉన్నప్పుడు 'లౌకికవాది' అయిన నితీశ్ కుమార్ బీజేపీతో చేతులు కలిపిన తరువాత మతతత్వవాది ఎలా అయ్యారు? చంద్రబాబుకూ ఈ ప్రశ్న వర్తిస్తుంది.

ఈ నేపథ్యంలో మనకు మిగిలింది అవకాశవాద 'లౌకిక' రాజకీయాలే. సూక్ష్మ తేడాలతో అందరూ ఈ సంకుచిత రాజకీయాలనే అనుసరిస్తున్నారు. అయినా రాజకీయాలలో మత ప్రమేయాన్ని వ్యతిరేకిస్తుంటారు. స్వీయ ప్రయోజనాలకు మతతత్వవాదులతో రాజీ పడేందుకు వెనుకాడరు. అధికార లబ్ధే కదా అందరి పరమ ధ్యేయం! మత ప్రమేయం లేని, మతతత్వ రాజకీయాలను సమయానుకూలంగా సమరీతిలో ఆచరించడాన్ని ఒక కళగా తీర్చిదిద్దడంలో కాంగ్రెస్ పరిపూర్ణత సాధించింది. షాబానో కేసు సందర్భంలో ఇస్లామిక్ ఛాందసవాదుల ఒత్తిళ్లకు లొంగిపోయి, వారు అభిలషించిన విధంగా నిర్ణయం తీసుకున్న కాంగ్రెస్ ఆ తరువాత హిందూత్వ వాదులను సానుకూలం చేసుకునేందుకు బాబ్రీ మసీదు గేట్లు తెరిపించింది. పర్యవసానంగా జరిగిందేమిటో మనకు తెలిసిన చరిత్రే. ఇక సోషలిస్టులు, విస్తృత జనతా పరివార్‌కు కాంగ్రెస్ వ్యతిరేకతే ఊపిరి. ఆ జాతీయ రాజకీయ పక్షాన్ని అంత తీవ్రంగా వ్యతిరేకించే ఈ సోషలిస్టులు లౌకిక రాజకీయాలకు నిష్ఠగా నిబద్ధమయ్యారా? కాంగ్రెస్ అధికారంలో లేకుండా చేయడమే వారి లక్ష్యం. అందుకు బీజేపీతో జట్టు కట్టేందుకు సోషలిస్టులు, ఇతర జనతా పరివార్ ఎప్పుడూ వెనుకాడలేదు. ఇక ముందూ వెనుకాడబోరని నిశ్చితంగా చెప్పవచ్చు. ప్రాంతీయ పార్టీలు తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే మొదలైనవి గతంలో బీజేపీ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వాలలో భాగస్వాములుగా ఉన్నాయి. ఎందుకు? కేంద్రంలో అధికారం చెలాయించేందుకే సుమా! వామపక్షాలు మాత్రమే మతోన్మాద రాజకీయాలను స్థిరవైఖరితో వ్యతిరేకిస్తూ వస్తున్నాయి. అయితే అవి ఇప్పుడు ఇంచుమించు దేశవ్యాప్తంగా రాజకీయ ప్రాధాన్యాన్ని కోల్పోయాయి ప్రజాదరణ కోల్పోతున్నాయి. జాతీయ పాలకపక్షాన్ని, దాని ఆధిపత్య కథనాలను ఎంతమాత్రం సవాల్ చేయగల పరిస్థితిలో లేవు.

ఈ శోచనీయ పరిస్థితుల్లో, అవును, ఈ శోచనీయ పరిస్థితుల్లో నరేంద్ర మోదీ నేతృత్వంలో భారతీయ జనతా పార్టీ ఒక అజేయశక్తిగా ఆవిర్భవించింది. లోక్‌సభలో ఒక్క ముస్లిం ఎంపీ కూడా లేని బీజేపీ ఇప్పుడు ఇస్లామిక్ మతాచరణలను 'సంస్కరించే' కర్తవ్య పాలనకు పూనుకున్నది. ఇతర మతాలు అన్నిటినీ నిరాదరించే, తరచు వాటి పట్ల విద్వేషాన్ని వెళ్లగక్కే హిందూత్వ మెజారిటేరియన్ ప్రపంచ దృక్పథాన్ని సంఘటితం చేస్తూనే 'పేద' ముస్లింల ప్రయోజనాల పరిరక్షణ గురించి ఆరాటపడుతోంది. బీజేపీ సర్వాధికారాన్ని సమర్థంగా ఎదుర్కోగల వారు బలహీనపడ్డారు. లేదా తమ ప్రత్యర్థితో పూర్తిగా రాజీపడ్డారు. ఏ విధంగానూ ప్రతిఘటించలేకపోతున్నారు. భారత రాజ్యాంగం హామీ ఇచ్చిన మత స్వేచ్ఛకు తీవ్ర నష్టం వాటిల్లే విధంగా రూపొందించిన కొత్త వక్ఫ్ చట్టంలో కీలక సవరణలు తెచ్చేందుకు తమ నాయకులు చొరవ తీసుకున్నారని నితీశ్ కుమార్, చంద్రబాబు నాయుడు మద్దతుదారులు వాదిస్తున్నారు. అవునా? భారత లౌకిక ప్రజాస్వామ్య దర్పణం పూర్తిగా పగిలిపోయింది. నితీశ్, నాయుడు ఇరువురూ చెల్లాచెదురుగా పడిపోయిన గాజు ముక్కలలో అప్పుడప్పుడూ తమను తాము క్షణకాలం పాటు చూసుకోవలసిన అవసరమున్నది. విరూపమైన ప్రతిబింబాలు వారికొక వాస్తవాన్ని గుర్తుచేస్తాయి. సకల మతాల సమానత్వాన్ని సూత్రబద్ధంగా సమర్థించిన తామిరువురూ మత వివక్షా రాజకీయాలు రాజ్యమేలేందుకు ఎంతగా దోహదం చేస్తోందీ పగిలిన లౌకిక ప్రజాస్వామ్య అద్దం ముక్కలు వారికి స్పష్టంగా ఎరుకపరుస్తాయి.

తాజా కలం: 2013లో నితీశ్ కుమార్ ఎన్డీఏ నుంచి నిష్క్రమించినప్పుడు ఆయనను తొట్ట తొలుత ఇంటర్వ్యూ చేసిన అవకాశం నాకు లభించింది. ఎన్డీఏ నుంచి ఎందుకు వైదొలిగారు అన్న ప్రశ్నకు ఆయన వెన్వెంటనే ఇలా ప్రతిస్పందించారు: "ఒక 'నియంత'తో కలిసి పని చేయలేను." మరి ఇప్పుడు తన దయనీయ పరిస్థితి గురించి నితీశ్ ఎటువంటి వివరణ ఇస్తారో?!

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

సామాజిక విప్లవ ప్రవక్త

> జ్యోతిబా పూలే ఆలోచనలు ఈ రోజుకు అణగారిన వర్గాలలో స్ఫూర్తిని రగిలిస్తున్నాయి. వర్తమాన సమాజంలో జ్యోతిబా పూలే ఆలోచనలకు చాలా ప్రాధాన్యం ఉంది. చాలాకాలంగా వెనకబడిన వర్గాలను కేవలం ఓటు బ్యాంకులుగా చూసే అలవాటు ప్రబలంగా ఉంది. ఈ దృష్టి కోణాన్ని మార్చుకొని వారికి కూడా ప్రభుత్వ ఫలాలు అందేలా చేయాలి.



'దేశమనే దేహానికి శూద్రులే ప్రాణం.. వారే రక్తనాళాలు' ఈ మాటలు అనేక సందర్భాలలో నాకు గుర్తుకు వస్తూ ఉంటాయి. ఈ మాటలు అన్నది ఎవరో కాదు.. మహాత్మా జ్యోతిబా పూలే. ప్రజాస్వామ్యం పరిణతి చెంది.. పరిఢవిల్లుతున్న వర్తమాన సమాజంలో ఇలాంటి వ్యాఖ్యలను ఎవరూ పెద్దగా పట్టించుకోకపోవచ్చు. కుల వ్యవస్థ ప్రాతిపదిక సమాజ గమనం ఉన్న సమయంలో.. అంటరానితనం కొన్ని కోట్ల మంది జీవితాల్లో అతి సామాన్యమైన విషయంగా ఉన్నప్పుడు, ఒక వ్యక్తి అణగారిన జీవితాల గురించి ఈ తరహా వ్యాఖ్యలు చేయటం.. దానివల్ల ఎదురయిన కష్టనష్టాలను ఓర్చుకొని ముందుకు సాగటం అంత సులభం కాదు. అందుకే ఈనాటికీ మనకు జ్యోతిబా పూలే ఆరాధ్యుడయ్యాడు. కొన్ని కోట్ల మంది గుండెల్లో నిలిచి ఉన్నాడు. 'మహాత్మా' అనే బిరుదు మన దేశంలో ఇద్దరికి మాత్రమే ఉంది. ఒకటి మనకు స్వాతంత్ర్యాన్ని తేవటంలో కీలక భూమిక పోషించిన గాంధీకి. రెండోది మన సమాజానికి పునాదిరాళ్లుగా నిలిచిన నిమ్న వర్గాల ఉన్నతి కోసం పాటుపడిన పూలేకి.

19వ శతాబ్దంలో దళితుల పరిస్థితి కడు దీనంగా ఉండేది. జీవితాలు చాలా దుర్భరంగా ఉండేవి. అడుగడుగునా అవమానాలు ఎదురవుతూ ఉండేవి. ఇలాంటి సామాజిక నేపథ్యంలో పూలే 1827, ఏప్రిల్ 11న ప్రస్తుత మహారాష్ట్రలోని సతారా జిల్లాలో జన్మించారు. చిన్నతనంలోనే తల్లిని కోల్పోవటం ఆయన జీవితంలో ఒక విషాదం. ఆ రోజుల్లో పాఠశాల విద్య అతి కొద్ది మందికి మాత్రమే అందుబాటులో ఉండేది. అణగారిన వర్గాల కోసం కొన్ని ప్రాంతాల్లో క్రైస్తవ మిషనరీలు పాఠశాలలను ప్రారంభించాయి. పూలే అలాంటి ఒక పాఠశాలలో విద్యను అభ్యసించాడు. ఆ సమయంలో ఒక రోజు తన స్నేహితుడి పెళ్లికి వెళ్లాడు. ఆ స్నేహితుడు బ్రాహ్మణుడు. పెళ్లి ఊరేగింపులో స్నేహితుడి కుటుంబ సభ్యులు కొందరు పూలేను తీవ్రంగా అవమానించారు. అది పూలే జీవితాన్ని మలుపు తిప్పింది. సమాజంలోని శూద్రులు, అతి శూద్రులకు ప్రతి రోజూ ఎదురవుతున్న కుల వివక్షపై స్పష్టత రావటానికి ఈ వ్యక్తిగత అనుభవం ఆయనకు ఒక పునాది. 1840లో 13వ ఏట పూలేకు సావిత్రి బాయితో వివాహం జరిగింది. ఈ వివాహం ఆయన జీవితాన్ని మరో మలుపు తిప్పింది. శూద్ర, అతిశూద్రుల పరిస్థితులు బాగుపడాలంటే విద్యను ఒక ఆయుధంగా మలుచుకోవాలని పూలే భావించాడు. విద్య వల్ల సామాజిక పరిస్థితుల పట్ల అవగాహన కలగటమే కాకుండా.. కలిసి చేయాల్సిన పోరాటానికి నేపథ్యం ఏర్పడుతుందనేది ఆయన భావన. ఈ దిశగా ఆయన 1848లో అంటరాని బాలికల కోసం ఒక పాఠశాలను స్థాపించాడు. ఆ సమయంలో అది ఒక విప్లవం. ఈ పాఠశాల విజయం సాధించటంతో రెండో పాఠశాలను కూడా మొదలుపెట్టాడు. పగటిపూట పనికి వెళ్లే బాలికలు చదువుకోవటం కుదరదు కాబట్టి 1855లో రాత్రి బడులు ప్రారంభించాడు. తన చుట్టూ ఉన్న పరిస్థితులను ఎప్పటికప్పుడు మదింపు చేసుకుంటూ దానికి తగినట్లు వ్యూహాలను రచించటంలో పూలే విజయం సాధించాడు.

అణగారిన వర్గాల అభివృద్ధిలో స్త్రీ పురుషుల వివక్ష కూడా కారణమని ఆయన భావించాడు. మహిళలకు సాధికారత లభిస్తే వారు మంచి విలువలు కలిగిన సమాజానికి ఆలంబనగా నిలుస్తారని నమ్మాడు. 19వ శతాబ్దంలో మన దేశంలో బాల్య వివాహాలు ఎక్కువగా ఉండేవి. భార్యాభర్తల మధ్య వయస్సు వ్యత్యాసం ఎక్కువ ఉండటం వల్ల భర్తలు త్వరగా మరణించేవారు. మహిళలు వితంతువులుగా మారేవారు. వీరి పట్ల సమాజంలో చాలా చులకన భావం ఉండేది. వీరికి రెండో వివాహం చేయటానికి పూలే పూనుకున్నాడు. వితంతు పునర్వివాహాల వల్ల అనేక మంది మహిళల జీవితాలు బాగుపడ్డాయి. అలాంటి మరో సున్నితమైన సమస్య వితంతువులు గర్భిణులు కావటం. చాలా మంది వితంతువులు గర్భస్రావం చేయించుకోవటానికి ప్రయత్నించేవారు. వీరిలో చాలా మంది మరణించేవారు కూడా! పూలే వీరికి అండగా నిలవటంతో పాటు వితంతు గర్భస్రావ వ్యతిరేక కేంద్రాన్ని స్థాపించాడు. ఈ సమస్యపై పోరాడిన తొలి వ్యక్తి పూలే.

మానవ ప్రస్థానంలో 'సత్యం.. సమానత్వం' అనేవి రెండు ప్రాథమిక సూత్రాలని.. అణగారిన ప్రజలు అభివృద్ధి చెందటానికి ఇవే ప్రాతిపదికలని భావించి 'సత్యశోధక్ సమాజ్' అనే సంస్థను పూలే ప్రారంభించాడు. వర్ణ వ్యవస్థలో అనేక అవమానాలకు గురయినవారు, అగ్రకులాల ఆధిపత్యం వల్ల బానిసలుగా మారినవారు, బానిసత్వమే తమ జీవనమనే అమాయక భావనలలో ఉన్నవారిలో చైతన్యాన్ని తీసుకురావటమే ఈ సంస్థ ఉద్దేశం. కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పూలే రాసిన 'గులాంగిరి'లోని భావనలు కొన్ని కోట్ల మందిలో ఆలోచనలు రేకెత్తించాయి. వర్ణ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడేలా చేశాయి. తన జీవితం మొత్తం నిమ్న కులాల ఆత్మగౌరవం కోసం పోరాడిన పూలే 1890, నవంబర్ 28న కన్నుమూశారు. పూలే మరణించి 130 ఏళ్ల దాటినా ఆయన ఆలోచనలు ఈ రోజుకు అణగారిన వర్గాలలో స్ఫూర్తిని రగిలిస్తున్నాయి. కోట్లాది ప్రజలు ఆయనను మహాత్ముడిగా కొలుస్తున్నారు.

వర్తమాన సమాజంలో జ్యోతిబా పూలే ఆలోచనలకు చాలా ప్రాధాన్యం ఉంది. చాలాకాలంగా వెనకబడిన వర్గాలను కేవలం ఓటు బ్యాంకులుగా చూసే అలవాటు ప్రబలంగా ఉంది. ఈ దృష్టి కోణాన్ని మార్చుకొని వారికి కూడా ప్రభుత్వ ఫలాలు అందేలా చేయాలి. నిరుపేద బీసీలకు మోడల్ స్కూల్స్ ప్రారంభించటం, ఉన్నత విద్యా సంస్థల్లో చదువుకొనేలా స్కాలర్‌షిప్‌లు ఇవ్వటం, సంప్రదాయ వృత్తులలో ఉన్నవారికి అత్యాధునిక సాంకేతిక విజ్ఞానాన్ని అందించి వారి ఉత్పత్తులు అంతర్జాతీయ స్థాయికి చేరేలా చేయటం, బ్యాంకుల నుంచి రుణాలు అందించటం... మొదలైన కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా అందిస్తున్నాం. ఇవన్నీ వెనకబడిన వర్గాల వారికి ఉపకరమవుతాయి. వీటితో పాటు సమానత్వం అనేది అన్ని వర్గాల వారిలో ఒక కుటుంబ విలువగా మార్చేందుకు కృషి చేయాలి. సత్యశోధక్ సమాజ్ వంటి సంస్థలు దీనికి మరింత చేయూత నివ్వాలి. అప్పుడే పూలే కలలు కన్న సత్యం, సమానత్వం సాధించగలుగుతాం.



■ పొన్నం ప్రభాకర్
తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి
(నేడు జ్యోతిబా పూలే జయంతి)

జైహింద్ నినాద స్రష్ట

అధికారిక, అనధికారిక సభలు, సమావేశాలు, కార్యక్రమాలు, ప్రసంగాలు ఏవైనా సరే ముగింపులో మనకు వినిపించే ఏకైక పదం 'జై హింద్'. దీని అర్థం ఏమిటి? దీన్ని ఎవరు సృష్టించారు? ఎలా వాడుకలోకొచ్చింది? ఎవరు ప్రాచుర్యంలోకి తెచ్చారు? దీని పుట్టుపూర్వోత్తరాలు ఏమిటి? అలవోకగా పలికేస్తున్న ఈ పదం గొప్పతనం గురించి నేటి తరంలో ఎంతమందికి తెలుసు? ఇవి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన ముఖ్యమైన విషయం.

జై హింద్– అనే పదం దేశభక్తిని చాటుకునే ఓ మహత్తర నినాదం. భారత దేశానికి జయం కలుగుగాక! అని దీని అర్థం. స్వాతంత్ర్యోద్యమ కాలంలో ఈ పదాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చింది నేతాజీ సుభాస్ చంద్రబోస్ కాగా, దీని సృష్టికర్త మాత్రం ఆబిద్ హసన్ సఫ్రానీ. బోసు సహచరులైన ముస్లిం సమరయోధుల్లో, ఆజాద్ హింద్ ఫౌజ్ సాయుధ పోరాట వీరుల్లో సఫ్రానీ ప్రముఖుడు. ఈయన తెలంగాణ ముద్దుబిడ్డ. 1911 ఏప్రిల్ 11న హైదరాబాద్‌లో జన్మించారు. అసలు పేరు జైనుల్ ఆబిదీన్ హసన్. ఐఎఫ్ఎస్ అధికారి. పలు దేశాల్లో భారత రాయబారిగా పని చేశారు. ఉర్దూ, పర్షియన్, అరబిక్, సంస్కృతం, ఫ్రెంచ్, లాటిన్ వంటి అనేక భాషల్లో గొప్ప పండితుడు. అద్భుతమైన కవిత్వం రాశారు. శుభ్ సుఖ్ చైన్ సృష్టికర్త. ఆబిడ్స్‌లోని సెయింట్ జార్జ్ గ్రామర్ స్కూల్‌లో చదువుకున్నారు. ఆయన తల్లి ఫఖ్రుల్ హాజియా బేగం. హైదరాబాద్‌లో ఆంక్షలు ఉన్నప్పటికీ స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న ధీర వనిత, గొప్ప దేశభక్తురాలు. సరోజినీనాయుడు స్నేహితురాలు. ఆబిద్ హసన్ ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లాలనుకున్నారు. కాని తల్లి ఫఖ్రుల్ హాజియా బ్రిటిషు వ్యతిరేకత ఆయనపై గట్టి ప్రభావం చూపించింది. శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొన్నారు. చదువు ఆగిపోయింది. తరువాత ఇంజనీరింగ్ విద్య కోసం జర్మనీ వెళ్లాడు. అక్కడే నేతాజీ సుభాస్ చంద్రబోస్‌ను కలుసుకున్నారు.



స్వాతంత్ర్య పోరాటానికి మద్దతు కూడగట్టేందుకు బోసు చేస్తున్న ప్రసంగాలు ఆబిద్ హసన్‌ను మరింత ప్రభావితం చేశాయి. దీంతో ఇంజనీరింగ్ చదువును మధ్యలోనే విడిచిపెట్టి, బోస్‌కి వ్యక్తిగత కార్యదర్శిగా, జర్మన్ భాష అనువాదకుడిగా చేరారు. బోస్ పునర్వ్యవస్థీకరించిన ఇండియన్ నేషనల్ ఆర్మీలో ఆబిద్ మేజర్‌గా పనిచేశారు. బోసుకు తోడుగా ఉండి, భవిష్యత్ కార్యక్రమాల రూపకల్పనలో ఆయనకు తోడ్పాటు అందించారు. ఆ కాలంలో ఆసేతు హిమాచలం ఆబాలగోపాలాన్ని ఉర్రూతలూగించిన జైహింద్ నినాద స్రష్ట ఆబిద్ హసన్ సఫ్రానీయే కావడం తెలంగాణ వాసులకు గర్వకారణం. అనతికాలంలోనే ఈ నినాదం స్వాతంత్ర్య సమరయోధుల అధికారిక నినాదంగా మారిపోయింది. ఇప్పటికీ రాజకీయ నాయకులు, దేశభక్తులు తరచూ ఈ నినాదాన్ని ఉపయోగిస్తూ ఉంటారు. అనుపమానమైన దేశభక్తికి తార్కాణంగా చేసే నినాదంగా నేటికీ ప్రజల హృదయాల్లో బలంగా ముద్రించుకుపోయిందీ నినాదం.

బ్రిటన్‌తో జర్మనీ యుద్ధం చేస్తున్న సమయంలో ఇండియన్ నేషనల్ ఆర్మీలో భిన్న వర్గాలకు చెందిన ప్రజలు ఉండేవారు. అందులో కొంతమంది 'నమస్కార్' అని సంబోధిస్తే, మరికొంత మంది 'రామ్ రామ్' అంటూ పలకరించుకునేవారు. 'సత్ శ్రీ అకాల్', 'అస్సలాము అలైకుం' అంటూ అభివాదం చేసుకునేవారు కూడా ఉండేవారు. సెక్యులర్ భావాలు కలిగిన బోస్‌కు ఇన్ని రకాల అభివాదాలు ఉండటం సబబుగా అనిపించలేదు. అందరికీ ఆమోదయోగ్యమైన ఓ అభివాద నినాదాన్ని రూపొందించాలని ఆయన తన సన్నిహితులకు చెప్పారు. ఆబిద్ హసన్ ముందుగా 'హలో' అని ప్రతిపాదించారు. కాని బోస్‌కు అది నచ్చలేదు. తరువాత 'జై హిందుస్తాన్', 'జై హింద్' అని ప్రతిపాదించారు ఆబిద్. జై హిందుస్తాన్ కాస్త పెద్దగా ఉండడం వల్ల 'జై హింద్'కే బోసు జై కొట్టారు. ఈ నినాదం బోస్‌కు ఎంతగానో నచ్చింది. వెంటనే ఆయన దాన్ని ఆమోదించి, ప్రాచుర్యంలోకి తీసుకువచ్చారు. అప్పటి నుంచి 'జై హింద్' అనే పదం దేశభక్తిని చాటుకునే ఒక మహత్తర నినాదంగా మారిపోయింది. 1984 ఏప్రిల్ 5న ఆబిద్ హసన్ సఫ్రానీ హైదరాబాద్‌లో కన్ను మూశారు.

● యండి. ఉస్మాన్ ఖాన్
జర్నలిస్ట్
(నేడు ఆబిద్ హసన్ సఫ్రానీ జయంతి)

స్థానిక భాషల్లో ఇంటర్న్‌షిప్

తెలంగాణలోని స్థానిక భాషలను డిజిటల్ ప్రపంచంలో నిలిపేలా ఇంటర్న్‌షిప్ అవకాశాన్ని ఇండిక్ వికీ ప్రాజెక్ట్ (ట్రిపుల్ ఐటీ, హైదరాబాద్) అందిస్తోంది. ఈ కార్యక్రమం ప్రధానంగా వనరులు తక్కువగా ఉన్న తెగల భాషల డిజిటల్ పరిరక్షణ, అభివృద్ధి, వికీపీడియా వంటి వేదికలపై కంటెంట్ సృష్టింపు మీద దృష్టి సారిస్తుంది. ఈ ఇంటర్న్‌షిప్‌లో పాల్గొన్నవారు గొండి, కోయ, కోలామి, నాయక్, చెంచు, కైకాడి (యెరుకల), లంబాడి, నక్కల, కొండ కమ్మర వంటి భాషలకు సంబంధించిన డిజిటల్ కంటెంట్‌ను రూపొందిస్తారు. ప్రస్తుత అండర్ గ్రాడ్యుయేట్/పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు లేదా ఇటీవలి గ్రాడ్యుయేట్లు దరఖాస్తు చేయవచ్చు. పై దేశీయ భాషలలో కనీసం ఒక దానిలో అనర్గళంగా మాట్లాడటం, రాయడం (తెలుగు లిపిలో) తప్పనిసరి. మే 12 నుంచి జూన్ 30, 2025 వరకు జరిగే ఈ ఇంటర్న్‌షిప్ కోసం దరఖాస్తులను ఏప్రిల్ 30 లోగా https://indicwiki.iiit.ac.in/internship2025కు పంపాలి. మరిన్ని వివరాలకు: pm.indicwiki@iiit.ac.in.

– డా. రాధిక మామిడి, ఇండిక్ వికీ ప్రాజెక్ట్

రిజర్వేషన్లకు రాజకీయ రంగు ఎందుకు?

తెలంగాణలో బీసీలకు స్థానిక సంస్థలలో 42శాతం రిజర్వేషన్ల కల్పన ఒక గొప్ప సామాజిక లక్ష్యానికి దారిచూపే చర్య. ఇది ఆకస్మికంగా తీసుకున్న నిర్ణయం కాదు. రాష్ట్ర శాసనసభ, మండలిలో ఏకగ్రీవంగా ఆమోదించిన బిల్లు. అయినప్పటికీ, ఈ బిల్లు గవర్నర్ ఆమోదం పొందకముందే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై విమర్శలతో ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేయడం తగదు.

ఒకవైపు చట్టం తయారు చేస్తూ, మరోవైపు దాని అమలుపై తటస్థంగా ఉండటం... తరువాత దానికి విరుద్ధంగా కేంద్రాన్ని నిందించటం... ప్రజాస్వామ్య ధర్మానికి విరుద్ధం. గవర్నర్ ఆమోదం తీసుకునే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. బిల్లును అమలులోకి తీసుకురావాల్సిన కర్తవ్యాన్ని వదిలేసి, రాజకీయ ఆరోపణల వైపు మళ్ళడం బాధాకరం. ఈ వ్యవహారంలో బాధ్యతను కేంద్రం మీదకు నెట్టడం రాష్ట్ర ప్రభుత్వం తన రాజ్యాంగ బాధ్యత నుంచి తప్పించుకోవడమే. అంతేకాకుండా, ఇది ప్రజల మధ్య అపోహలు పెంచే ప్రమాదం కలిగిస్తుంది. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్పు వంటి అంశాలు చట్టం అమలులోకి వచ్చిన తరువాత మాత్రమే కేంద్ర ప్రభుత్వంతో చర్చించవలసినవి. చట్టానికి బలమైన న్యాయాధారాలు, సమగ్ర డేటా, నివేదికలు అవసరం. అవి లేకుండా ఏ ఇతర చర్యలకైనా వెళ్లడం సాంకేతికంగా ఇబ్బందికరం.

తెలంగాణలో బీసీల జనాభా సుమారుగా 56 శాతం పైనే. కానీ విద్యా ఉద్యోగాల్లో వారికి రిజర్వేషన్ 29 శాతం లోపే. అలాగే స్థానిక సంస్థలలో 21 శాతమే. ఈ అసమానతలకు నివారణగా 42 శాతం రిజర్వేషన్ల బిల్లు తేవడమేగాక, వాటిని చట్టబద్ధంగా అమలుచేయడమే లక్ష్యం కావాలి. కానీ రాజ్యాంగ ప్రక్రియను పూర్తి చేయకుండా, ప్రజలలో కేంద్ర ప్రభుత్వమే అడ్డంకి అనే అపోహలు కలిగించడం సమంజసం కాదు. ప్రజల చైతన్యాన్ని రాజకీయ ప్రయోజనాలకు వక్రీకరించడం బీసీల చరిత్రలో జరిగిన అన్యాయాలకు మరో రూపమే అవుతుంది.

ఒక చట్టాన్ని న్యాయస్థానాల్లో నిలబెట్టాలంటే, శాస్త్రీయ డేటా, కమిషన్ నివేదికలు, సామాజిక పునర్వ్యాఖ్యలు తప్పనిసరి. ఈ విషయాన్ని ఇంద్రా సాహ్ని vs యూనియన్ ఆఫ్ ఇండియా (1992): 50శాతం గరిష్ఠ పరిమితి, మినహాయింపులకు మార్గం; కృష్ణమూర్తి vs యూనియన్ (2010): కమిషన్ నివేదికలు తప్పనిసరి; వికాస్ గవాళి (2021), రాహుల్ వాఘ్ (2023): డేటా లేకుంటే రిజర్వేషన్లు నిలవవు; IR కోయెలో vs తమిళనాడు (2007): 9వ షెడ్యూల్‌లో చట్టాలు కూడా కోర్టు పర్యవేక్షణలో ఉంటాయి; గౌరవ్ కుమార్ vs బిహార్ (2023): డేటా లేకుండా రిజర్వేషన్ చట్టం నిలవదు వంటి కీలక తీర్పుల ద్వారా స్పష్టమయింది.

తెలంగాణ ప్రభుత్వం గవర్నర్ ఆమోదం అనంతరం ఈ చట్టాన్ని తక్షణం అమలుచేయాలి. తరువాత డేటా ఆధారంగా పటిష్టంగా నిలబడేలా చేసి, ఆ పిమ్మట కేంద్రాన్ని ఆశ్రయించి 9వ షెడ్యూల్‌లో చేర్చే ప్రక్రియ ప్రారంభించాలి. గవర్నర్ ఆమోదం పొందకుండా అమలు ప్రకటనలు చేయడం రాజ్యాంగ విరుద్ధం. ఆర్టికల్ 243D ప్రకారం రాష్ట్రానికి స్థానిక రిజర్వేషన్లపై చట్టం చేసే అధికారం ఉంది. కానీ 9వ షెడ్యూల్‌లో చేర్పుపై ముందుగా చర్చించకూడదు.

బీసీలకు రిజర్వేషన్ అనేది దయకు పాత్రత కాదు. ఇది రాజ్యాంగ హక్కు. ప్రభుత్వాలు న్యాయబద్ధతను ప్రదర్శించాలి. బీసీ కమిషన్ నివేదికలు, కుల గణాంకాలు పబ్లిక్ డొమైన్‌లో పెడితే ప్రజల మద్దతు పెరుగుతుంది. అలాగే మహారాష్ట్ర, బిహార్‌లలో కోర్టులు డేటా లేకుండా తీసుకొచ్చిన రిజర్వేషన్లను కొట్టివేశాయి. తెలంగాణ ఈ తీర్పుల నుంచి పాఠాలు నేర్చుకోవాలి.

– వకుళాభరణం కృష్ణమోహన్‌రావు
మాజీ చైర్మన్, తెలంగాణ బీసీ కమిషన్



- వరంగల్ జిల్లాలో సేకరణకు సర్వం సిద్ధం
- 186 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు
- లక్ష్యం 2,20,000 మెట్రిక్ టన్నులు
- అధికారులకు దిశానిర్దేశం చేసిన కలెక్టర్ సత్యశారద

ధాన్యం కొనుగోలుకు వేళాయె..

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. జిల్లా వ్యాప్తంగా 13 మండలాల్లో ఏర్పాటు 186 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఈ సీజన్‌లో మొత్తం 2,20,000 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని రైతుల నుంచి సేకరించే లక్ష్యానికి ప్రణాళికలు రూపొందించారు. పౌర సరఫరాల సంస్థ, వ్యవసాయశాఖ, రైస్ మిల్లర్స్, మార్కెటింగ్ శాఖ, డీఆర్‌డీఏ, సహకార శాఖలు సమన్వయంతో నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా ధాన్యాన్ని సేకరించాలని నిర్ణయించారు. ఇప్పటికే సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి జిల్లాలో ధాన్యం సేకరణకు దిశా నిర్దేశం చేశారు. యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు, రైతు సంఘాల నాయకులు, రైస్ మిల్లర్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చే సమస్యలను పరిష్కరించి ధాన్యం కొనుగోలును పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సత్యశారద సంబంధిత అధికారులకు సమావేశంలో ఆదేశాలు జారీ చేశారు. బుధవారం రాయపర్తి మండలం కొలనుపల్లి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, జిల్లా కలెక్టర్ సత్యశారద ప్రారంభించారు.

186 కేంద్రాల ద్వారా యాసంగి ధాన్యం కొనుగోళ్లు

వరంగల్ జిల్లా పరిధిలోని 13 మండలాల్లో మొత్తం 186 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచారు. అన్ని మౌలిక వసతులను అధికారులు ఏర్పాటు చేశారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా మండల స్థాయి అధికారులను ఎప్పటికప్పుడు పరిశీలించే విధంగా ఏర్పాట్లు చేశారు. ధాన్యం కొనుగోలుకు 60 ఐకేపీ కేంద్రాలను ఏర్పాటు చేయగా, పీఏసీఎస్ కేంద్రాలు 107, మెప్మా 2, ఎఫ్‌పీవో 13 కేంద్రాలను ధాన్యం కొనుగోలుకు ఏర్పాటు చేశారు.

లక్ష్యం 2,20,000 మెట్రిక్ టన్నులు

జిల్లా వ్యాప్తంగా 13 మండలాల్లో ఏర్పాటు చేసిన 186 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సుమారు 2,20,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని జిల్లా యంత్రాంగం లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఏప్రిల్ మాసంలో కొనుగోలు ప్రారంభించి జూన్‌లోగా నిర్దేశిత ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. సన్నరకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 500 బోనస్ కూడా ప్రభుత్వం చెల్లిస్తోంది. ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నారు.

వాతావరణ మార్పులకు అనుగుణంగా ఏర్పాట్లు

గత సీజన్లతో పోలిస్తే ఈ సీజన్‌లో వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారుతుండటంతో కొనుగోలు కేంద్రాల్లో అదనంగా టార్పాలిన్లు నిలువ చేస్తున్నారు. కేంద్రాల్లో ఎక్కువగా ధాన్యం నిలువలు ఉండకుండా ఎప్పటికప్పుడు రవాణా చేసేందుకు వీలుగా సరిపడా వాహనాలను ఏర్పాటు చేశారు. రైతులకు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు నష్టం వాటిల్లకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకునేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు

సంధ్యారాణి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్



వరంగల్ జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలుకు 186 కేంద్రాలను ఏర్పాటు చేశాం. సన్న రకం, దొడ్డు రకం ధాన్యాన్ని వేర్వేరుగా సేకరించేందుకు కేంద్రాల్లోనే ఏర్పాట్లు పూర్తి చేశాం. వేసవి నేపథ్యంలో ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని కొనుగోలు కేంద్రాల్లో అన్ని తాగునీరు, టెంట్లు ఇతర మౌలిక వసతులు కల్పిస్తున్నారు. సరిపడా గన్నీబ్యాగులు, అకాల వర్షాల నుంచి ధాన్యాన్ని కాపాడుకునేందుకు టార్పాలిన్లు అందుబాటులో ఉంచాం. రైతులు తమ ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

కలెక్టర్ పి.ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లాలో పలుచోట్ల ప్రారంభంకాని ధాన్యం కొనుగోలు కేంద్రాలను రెండు, మూడు రోజుల్లోగా ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ చాంబర్‌లో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ గురువారం సమావేశమయ్యారు. ఇప్పటివరకు ప్రారంభమైన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు, కొనుగోలు కేంద్రాల వద్ద చేసిన ఏర్పాట్లు, తదితర అంశాలను గురించి కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. జిల్లాలో ఏర్పాటుచేసిన అన్ని కేంద్రాలలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాఫీగాసాగే విధంగా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు పర్యవేక్షించాలన్నారు. గన్నీ సంచుల కొరత, ధాన్యం తరలింపులో ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

గోడపత్రికలు ఆవిష్కరించిన కలెక్టర్ ప్రావీణ్య

వడదెబ్బకు సంబంధించిన గోడ పత్రికలను జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య గురువారం గురువారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. తీవ్రమైన ఎండల నుంచి ఎదురయ్యే ఆరోగ్య సమస్యల గురించి సంబంధిత అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎ.అప్పయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ కె.లలితాదేవి, డాక్టర్ హిమబిందు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.ప్రావీణ్య

'మాయలోడి' ప్రకంపనలు!

రంగంలోకి ఇంటెలిజెన్స్ వర్గాలు, పోలీసులు

- ఫామ్‌హౌస్ సెటిల్‌మెంట్లు, అధికారులతో సంబంధాలపై ఆరా
- ప్రభుత్వ కార్లున్నా అద్దెకార్లపై జనగామ జిల్లా అధికారుల మోజు
- ఉమ్మడి వరంగల్ జిల్లా వైద్యశాఖలో చర్చనీయాంశంగా 'ఆంధ్రజ్యోతి' కథనం



'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం

వరంగల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వైద్య శాఖలో పైరవీలు, దందాలతో అక్రమార్జనకు పాల్పడుతున్న జనగామ జిల్లాలోని సూపర్‌వైజర్ లీలలపై పోలీసులు, నిఘా వర్గాలు రంగంలోకి ఆరా తీస్తున్నాయి. గురు వారం 'ఆంధ్రజ్యోతి'లో 'మందులోడు.. మాయలోడు' శీర్షికన ప్రచురితమైన కథనం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వైద్య శాఖలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అతడి ఆగడాలపై సీఎంవో నుంచి ఆరా తీశారు.

మాయలోడితో చేతులు కలిపిన అధికారులు, ఫామ్‌హౌస్‌లో ఎంజాయ్ చేసిన ఉన్నతాధికారులు, వైద్యుల చిట్టాను ఇంటెలిజెన్స్ వర్గాలు సేకరిస్తున్నట్టు సమాచారం. జిల్లాలో ఓ ఉన్నతాధికారి అండతో సదరు మాయలోడు దందాలను సాగిస్తున్నాడని, ఓ అధికారికి ప్రభుత్వం కేటాయించిన కారు ఉన్నా.. అంతకంటే పెద్దకారును ఈ మాయలోడు బినామీ పేరుతో అద్దెకు పెట్టి ప్రభుత్వం ఖజానాకు కన్నం వేస్తున్నట్లుగా నిఘా వర్గాల విచారణలో తేలినట్టు తెలిసింది. ఇక సదరు మెడికల్ డాన్‌తో కలిసి విందులో పాల్గొన్న ఐఏఎస్ ఎవరు..? ఏ జిల్లా అధికారి అనే కోణంలో వివరాలు సేకరిస్తున్నారు. నకిలీ సర్టిఫికెట్లతో మెడికల్ కాలేజీ, వైద్యశాఖ, ఇతర శాఖల్లో పలువురికి ఔట్‌సోర్సింగ్‌లో ఉద్యోగాలు ఇప్పించినట్టు స్థానికంగా ప్ర చారం జరుగుతోంది. దీనిపై కూడా నిఘా వర్గాలు ఆరా తీస్తున్నట్టు సమాచారం. అంతేకాకుండా వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లో ఎవరెవరికి కార్లను అద్దెకు పెట్టారు? ఎవరి పేరుతో అద్దె కార్లు, మెడికల్ కాలేజీల్లో అద్దె బస్సులు న్నాయోనని ఆరా తీస్తున్నారు. మెడికల్ కాలేజీలోని ఓ ఉన్నతాధికారికి, ఈ మెడికల్ డాన్‌కు మధ్య ఉన్న సంబధాలపైన నిఘా వర్గాలు ఆరా తీశాయి. జనగామ, హనుమకొండలోని నలుగురైదుగురు వైద్యులతో మెడికల్ డాన్‌కు ఉన్న లావాదేవిలతో సహా సమగ్రంగా నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు నిఘా వర్గాలు పంపించినట్టు తెలిసింది. జనగామ పోలీసులు సైతం మాయలోడి లీలలపై దృష్టి పెట్టారు. బాధితులు డీజీపీకి ఫిర్యాదు చేయటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు.

మాయలోడి చిట్టా మొత్తం సేకరిస్తున్నట్లుగా సమాచారం. మొత్తానికి ఉద్యోగానికి వెళ్లకుం డా.. పైరవీలు, కాంట్రాక్టు పనులతో దందా సాగిస్తున్న వైద్య ఉద్యోగిపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందనే చర్చ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జరుగుతోంది.



పాకాల అడవిలో నిర్మించిన నీటికుంట

వన్యప్రాణులకు తీరనున్న దప్పిక

జంతువుల దాహార్తి తీర్చేందుకు అటవీశాఖ చర్యలు

- పాకాల అభయారణ్యంలో నీటి నిల్వకు ఏర్పాట్లు
- నీటి కుంటలు, చెక్‌డ్యామ్‌లు, చెలిమలు, సోలార్ పంపుసెట్ల నిర్మాణం

7

వేసవి క్రీడా శిక్షణకు సమాయత్తం

మే 1 నుంచి 31 వరకు శిబిరాల నిర్వహణ

ప్రారంభమైన దరఖాస్తుల ప్రక్రియ.. ఈనెల 25 గడువు

7

రాజ్యాంగం నిర్దేశించిన మార్గం అనుసరణీయం

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- భారత రాజ్యాంగం ఆడియో సీడీ ఆవిష్కరణ

హనుమకొండ కల్చరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మన దేశ రాజ్యాంగం నిర్దేశించిన మార్గం అనుసరణీయమని, ప్రతీ ఒక్కరు రాజ్యాంగ విలువలు కాపాడేందుకు కంకణబద్ధులై ఉండాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం తనక్యాంపు కార్యాలయంలో స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి ప్రముఖ కవి, రిటైర్డ్ జాతీయ ఉపాధ్యాయుడు వల్లంపట్ల నాగేశ్వర్‌రావు రచించి, స్వరపర్చిన 'దేశ ప్రజల ఆశయాల అంతరంగం, మన భారత రాజ్యాంగం' ఆడియో సీడీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం సమన్యాయం, సమైక్యతను ప్రతీఒక్కరు రాజ్యాంగంలోని అన్ని విషయాలను అవగాహన చేసుకొని దాన్ని కాపాడుతూ ఆచరణలో ఉంచాలని పిలుపునిచ్చారు.

ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. దేశంలో ప్రతీ ఒక్కరికి విద్యార్హతలతో నిమిత్తం లేకుండా ఓటు హక్కు కల్పించింది మన రాజ్యాంగమేనని గుర్తు చేశారు. గొప్ప రాజ్యాంగాన్ని మనకు వరంగా అందించిన డాక్టర్ అంబేద్కర్ సదాస్మరణీయుడని అన్నారు. వల్లంపట్ల రూపొందించిన సీడీ ప్రజలకు చేరువగా రాజ్యాంగ విలువలు తీసుకెళుతుందని ఆకాంక్షించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ప్రముఖ నవలాకారుడు అంపశయ్య నవీన్ మాట్లాడుతూ.. అతి పెద్ద ప్రజా స్వామ్య దేశంలో రాజ్యాంగ విలువలతోటే దేశం ఔన్నత్యం పెంపొందుతుందన్నా రు. ఆచార్య బన్న అయిలయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి, కాళోజీ ఫౌండేషన్ కార్యదర్శి వీఆర్.విద్యార్థి, ప్రొఫెసర్ రతన్‌సింగ్, జనగామ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవీందర్, జోలి రాజలింగం, మండల పరశురాములు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



సీడీ ఆవిష్కరిస్తున్న ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి తదితరులు

తెలంగాణ అభివృద్ధిపై కేసీఆర్‌కు విజన్

- ఉద్యమం ఎరుగని వ్యక్తి చేతిలో రాష్ట్రం
- గులాబీ జెండాను ప్రజలు తిరిగి కోరుకుంటున్నారు..
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

ఎల్కతుర్తి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ అభివృద్ధిపై బీఆర్‌ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు విజన్ ఉందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఈనెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభ నిర్వహణ పనులను ఎమ్మెల్సీలు ఎల్.రమణ, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీష్‌కుమార్, పెద్ది సుదర్శన్‌రెడ్డిలతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సభాస్థలం, వాహనాల పార్కింగ్ స్థలాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దయాకర్‌రావు మాట్లాడుతూ.. ఆంధ్ర పాలకులతో కొట్లాడి సాధించుకున్న తెలంగాణను తెలంగాణ వ్యతిరేకి చేతిలో పెట్టామని అన్నారు. ఎన్నికల్లో మాయమాటలు చెప్పి అధికారంలోకి రాగానే వాటిని నెరవేర్చని మోసగాడు, తెలంగాణ ఖజానాను ఢిల్లీకి చేరవేసే దొంగ సీఎం రేవంత్‌రెడ్డి అని విరుచుకుపడ్డారు. రేవంత్‌రెడ్డికి పద్ధతి, ప్లానింగ్ లేదని అన్నారు. ప్రశ్నించిన వ్యక్తులపై కేసులు పెట్టించడం, విలువైన భూములు అమ్ముకోవడమే సీఎంకు తెలుసని ఎద్దేవా చేశారు. తెలంగాణ రాక ముందు ఉన్న పరిస్థితులు మళ్లీ మొదలయ్యాయన్నారు. తెలంగాణ ప్రాంత పల్లెలన్నీ అంధకారంలోకి వెళ్లాయన్నారు. సాగునీరందక పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతోపాటు ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోసగాడికి రాష్ట్రాన్ని అప్పగించినందుకు ప్రజలు బాధపడుతున్నారన్నారు. తిరిగి కేసీఆర్ పాలన కావాలని ప్రజలు బలంగా కోరుకుంటున్నట్లు తెలిపారు. ఎల్కతుర్తిలో జరిగే సభ తెలంగాణ ఆత్మగౌరవ సభగా ఎర్రబెల్లి వర్ణించారు. రజతోత్సవ సభకు 10 లక్షలకు పైగా ప్రజలు తరలి రానున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎల్.రమణ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభ చరిత్ర పుటల్లో నిలిచిపోతుందని అన్నారు. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. మూడు జాతీయ రహదారుల నుంచి వచ్చే వాహనాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సభాస్థలికి దగ్గరలోనే పార్కింగ్ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 200 ఎకరాల విస్తీర్ణంలో సభ ఏర్పాటుచేయడంతో పాటు మహిళలకు, పురుషులకు ప్రత్యేక టాయిలెట్స్ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వారం రోజుల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తాం. బీఆర్‌ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. సభ కోసం నెల రోజులుగా శక్తి వంచన లేకుండా పనిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చింతం సదానందం, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పిట్టల మహేందర్, నాయకులు కడారి రాజు, శేషగిరి, కోరే రాజ్‌కుమార్, మహేందర్, వేముల శ్రీనివాస్, వీరలింగం, వినయ్, మధార్ పాల్గొన్నారు.



ఎల్కతుర్తిలో సభా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఇతర నేతలు

కేసీఆర్‌కు విడిది కానున్న దళితుడి ఇల్లు

ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభకు హాజరుకానున్న మాజీ సీఎం కేసీఆర్‌కు ఎల్కతుర్తి మండలంలోని చింతలపల్లిలోని ఓ దళితుడి ఇళ్లు విడిది కానుంది. ఈ నెల 27న సభకు చేరుకునే ముందుగా హెలికాప్టర్‌లో సభాస్థలికి సమీపంలో దిగిన అనంతరం కొద్దిసేపు గ్రామానికి చెందిన ఓ దళితుడి ఇంట్లో సేదతీరనున్నట్లు తెలిసింది. ఇందుకు కావాల్సిన ఏర్పాట్లపై నాయకులు దృష్టి సారించారు.

అదనపు కలెక్టర్ కుమారుడికి ఎంబీబీఎస్ పట్టా


కుమారుడితో అదనపు కలెక్టర్ సంపత్‌రావు

ములుగు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ములుగు అదనపు కలెక్టర్ ఎం.సంపత్‌రావు కుమారుడు సాహిత్ ఎంబీబీఎస్ పట్టా అందుకున్నారు. 2019 బ్యాచ్‌లో గాంధీ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు పొందిన ఆయన గురువారం జరిగిన కార్యక్రమంలో డిగ్రీ పట్టా పొందారు. సాహిత్‌ను అదనపు కలెక్టర్ సంపత్‌రావు సహోద్యోగులు, అధికారులు అభినందించారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు


తాడ్వాయిలో వెలసిన పోస్టర్లు

తాడ్వాయి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మావోయిస్టులకు వ్యతిరేకంగా ఆదివాసి యువజన సంఘం పేరిట ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో గురువారం పోస్టర్లు వెలిశాయి. మండల కేంద్రంతో పాటు మేడారంలో వనదేవతల దేవస్థానం ఎదుట వీటిని అతికించారు. కర్రెగుట్ట పైకి ఎవరూ రావద్దని మావోయిస్టు శాంత పేరిట ఇటీవల లేఖ విడుదలైన నేపథ్యంలో ఈ పోస్టర్లు వెలవడం చర్చనీయాంశమైంది. ఆదివాసీలపై నిత్యం ఆధారపడే మావోయిస్టులు ఇలా ఆంక్షలు విధించడం ఏమిటని పేర్కొన్నారు. అడవులే జీవనోపాధిగా బతికే ఆదివాసీలను అడవుల్లో తిరగొద్దనే అధికారం మావోయిస్టులకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. అడవుల్లో విచ్చలవిడిగా మందు పాతరలు పెడితే ఆదివాసీలు బతికేదెలా? అని పేర్కొన్నారు. 'మమ్మల్ని బతకనివ్వరా.. మా ప్రాంతంపై మీ పెత్తనం ఏమిటి' అని ప్రశ్నించారు. ఆదివాసీలు అడవులకు కాకుండా మరెక్కడికి వెళ్లాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మీరు తల దాచుకోవడానికి మా ప్రాంతాలే దొరికాయా?' అని ప్రశ్నించారు.

ఏనుమాముల మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు

వరంగల్ వ్యవసాయం, ఏప్రిల్ 10:(ఆంధ్రజ్యోతి) : ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు మూడు రోజుల పాటు సెలవులు ప్రకటించినట్లు ఆ మార్కెట్ కమిటీ కార్యదర్శి గుగులోతు రెడ్యా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం వారాంతపు యార్డు బందు, ఆదివారప వారాంతపు సెలవు, సోమవారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా సెలవు , తిరిగి మంగళవారం మార్కెట్లో యథావిధిగా క్రయ విక్రయాలు జరుగుతాయని రైతులు, వ్యాపారులు, కార్మికులు గమనించి మార్కెట్ కమిటీకి సహకరించాలని మార్కెట్ కార్యదర్శి ఆ ప్రకటనలో కోరారు.

ఎంజీఎం ఆపరేషన్ థియేటర్ దారి బంద్


దారి బంద్ చేసిన దృశ్యం

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎం ఆస్పత్రిలోని గ్రౌండ్ ఆపరేషన్ థియేటర్ (జీఓటీ) లోనికి వెళ్లే ఓ దారిని అధికారులు మూసివేశారు. ఈ థియేటర్‌కు వెళ్లేందుకు రెండు దారులు ఉంటాయి. ప్రధాన దారిగుండా వైద్యులు, పేషంట్లను మాత్రమే అనుమతించేవారు. ఈ పక్కనే స్టరయిల్ కాబడిన థియేటర్లు ఉంటాయి. మరో దారి గుండా నర్సింగ్ సిబ్బంది, ఇతర నాలుగో తరగతి ఉద్యోగులు రాకపోకలు కొనసాగించేవారు. శస్త్ర చికిత్స అనంతరం రోగులనుకూడా ఇదే దారి గుండా బయటకు పంపిస్తారు. ఇది ఎంజీఎంలో థియేటర్ ఏర్పాటు అయినప్పటి నుంచి కొనసాగుతున్నది. కానీ అనస్థీషియా విభాగం అధిపతి ఈ మధ్య రెండోదారిని మూసివేయించారు. తెరవడానికి వీలు లేకుండా మరి మేకులు దించారు. ప్రతీ ఒక్కరు ఒకే దారి గుండా రావడంవల్ల ఆ ప్రాంతమంతా అంటూ సోకే ప్రమాదం ఉందని సిబ్బంది వాపోతున్నారు. ఇప్పటికైనా రోగులకు ఇన్, అవుట్‌దారులు ఉండే విధంగా మూగపడిన దారిని తెరవాలని కోరుతున్నారు.

ఇటుకబట్టీలు.. నిబంధనలకు నీళ్లు..


ఇటుక బట్టీలో పనిచేస్తున్న బాలకార్మికురాలు

- మామునూరు ప్రాంతంలో ఇష్టారాజ్యంగా నిర్వహణ
- పరిసరాలను కాటేస్తున్న కాలుష్యం
- బాలకార్మికులతో పనులు చేయిస్తున్న వైనం
- పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు


ఇటుక లోడుతో విక్రయానికి సిద్ధంగా ఉన్న ట్రాక్టర్

మామునూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ఇటుకబట్టీలు నిర్వహించాలంటే ట్రేడ్ లైసెన్సులు, వ్యాపార పన్నులు కట్టాల్సి ఉంటుంది. ఆ తరువాత ఇటుకలను బట్టీలు పెట్టి కాల్చేందుకు పొల్యూషన్ అధికారి, అటవీ శాఖ అధికారి అనుమతులు పొందాల్సి ఉంటుంది. చెరువులు, కుంటల నుంచి తీసిన మట్టిని ఇటుకల తయారీకి తరలించాలంటే గనులశాఖ అనుమతి కూడా తప్పనిసరి. కానీ కొందరు ఇటుకబట్టీల వ్యాపారులు ఇవేమీ చేయకుండానే నిర్వహిస్తున్నారని, నిబంధనలకు నీళ్లొదిలి.. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా వరంగల్ మామునూరు ప్రాంతంలో ఇటుకబట్టీలవ్యాపారం వ్యాపారం జోరుగా సాగుతోంది. ఇటుకల తయారీకి అనుకూలమైన మట్టిని ప్రభుత్వ భూముల నుంచి యథేచ్ఛగా తరలిస్తున్నారు. నక్కలపల్లి, గుంటూరుపల్లి తదితర గ్రామాల్లో ధనార్జనే ధ్యేయంగా కొందరు రోజుకోరీతిన దందా నిర్వహిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకున్నా బట్టీలు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కాలుష్యం కాటేస్తున్నా..

ఇటుకల తయారీకి పెడుతున్న నిప్పు కారణంగా పొగ, బూడిద, దుమ్ము గాలిలో కలుస్తోంది. రసాయనాల వాసనతో చుట్టుపక్కల ప్రాంతాల వారు అనారోగ్యం బారిన పడుతున్నారు. పక్కన ఉండే పంటపొలాలు కూడా దెబ్బతింటున్నాయి. భూపరిరక్షణ చట్ట ప్రకారం నివాస స్థలాలు కాకుండా వ్యవసాయానికి పనికి రాని భూముల్లోనే ఇటుక బట్టీలు నిర్వహించాల్సి ఉంటుంది. కానీ అందుకు విరుద్ధంగా నక్కలపల్లి, గుంటూరుపల్లి గ్రామాల్లో పచ్చని పొలాల్లోనే ఇటుకబట్టీలు నిర్వహిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. దీంతో చుట్టూ ఉన్న పొలాలు దెబ్బతింటున్నాయని, నీటి పారుదల కూడా ఇబ్బందిగా ఉంటోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక పచ్చని పంట భూములను వెంచర్లకు, ఇటుక బట్టిలకు లీజుకు తీసుకుని రైతు బంధు పొందుతున్నారని అధికారుల పర్యవేక్షణ శూన్యమన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నక్కలపల్లి, గుంటూరుపల్లి రెండు గ్రామాల్లో దాదాపు 35 వరకు ఇటుకబట్టీలు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం వేసవి కాలం కావడంతో నిర్మాణాలు ఊపందుకున్నాయి. దాంతో ఇటుకల ఉత్పత్తి, రవాణా కూడా పెరిగింది. దీంతో నిరంతరం ఇటుకబట్టీల్లో పనులు జరుగుతున్నాయి. ఇది మరింత ఇబ్బందిగా మారిందని, పొగ, దుమ్ము, ధూళితో స్థానికులు పలువురు శ్వాసకోశ సంబంధిత వ్యాధుల బారిన పడ్డారని తెలుస్తోంది. ఇటీవల ఊపిరి తీసుకోవడం కష్టమై పలు సందర్భాల్లో 30మందికి పైగా చుట్టుపక్కల ప్రాంతాల వారు ఆసుపత్రుల్లో చేరినట్టు చెబుతున్నారు. అయితే ఈ విషయాలు బయటికి పొక్కకుండా అనారోగ్యబారిన పడినవారికి ఇటుకబట్టీల యజమానులు డబ్బులు ఇచ్చి సర్దిచెప్పినట్లు తెలిసింది.

బాల్య కార్మికులతో పనులు..

ఇటుక బట్టీల్లో చిన్నారులు పనిచేస్తూ బాల్య దశ నుంచి చదువుకు దూరమవుతున్నారు. చేతిలో పుస్తకాలు పట్టుకుని పాఠశాలకు వెళ్లాల్సిన చిన్నారులు ఇటుకలు మోస్తూ బట్టీల్లోనే మగ్గిపోతున్నారు. ఇటుకబట్టీల వ్యాపారులు విద్యాచట్టం కార్మికచట్టాలను తుంగలో తొక్కుతున్నారు. చాలీచాలని జీతాలిచ్చి కార్మికుల శ్రమను దోచుకుంటున్నారు. పన్ను రూపంలో ప్రభుత్వ ఆదాయాన్ని వసూలు చేయకుండా అధికారులు చోద్యం చూస్తున్నారు. ఇటుకబట్టీల వ్యాపారులతో ఇన్ని సమస్యలు ఎదుర్కొంటున్న అధికారులు మాత్రం వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు..

ఇటుకబట్టీల వ్యాపారులు మట్టి, ఇటుకల తరలింపునకు వాహనాలను వినియోగించే క్రమంలో ఆర్టీవో అధికారుల కళ్లు గప్పుతున్నట్టు తెలుస్తోంది. ఆయా వాహనాలకు నెంబరు ప్లేట్లు ఉండవు. అర్ధరాత్రి అధిక లోడుతో నగర ప్రాంతాల్లో డంపింగ్ చేస్తుంటారు. ఇటుక బట్టీలకు అవసరమయ్యే పూటిక మట్టిని అధిక లోడుతో తరలిస్తుంటారు. ఇక ఏటా రూ.కోట్లలో సంపాదిస్తూ.. ఎలాంటి రశీదులు ఇవ్వకుండా వాణిజ్య పన్నుల శాఖకు రెండు శాతం చెల్లించాల్సిన పన్ను ను చెల్లించకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఈక్రమంలో వ్యాపారులకు కొందరు అధికారులు కూడా సహకరిస్తున్నట్టు తెలుస్తోంది.


అడుగు మందం పేరుకుపోయిన దుమ్ము


ఇటుకలు తరలించే క్రమంలో ఎగిసిపడుతున్న దుమ్ము

20ఏళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం..

ఉసిల్ల ఆంజనేయులు, నక్కలపల్లి



ఇటుకబట్టీల దుమ్ము, పొగ వల్ల మా ఊర్లో చాలా మందికి శ్వాస కోశ సంబంధ సమస్యలు వచ్చాయి. ఇటీవల ఇద్దరు యువకులు ఆసుపత్రి పాలవగా.. వారిలో ఒకరికి ఇప్పటికీ నయం కాలేదు. చాలా మంది ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ డబ్బులు పోగొట్టుకుంటున్నారు. ఈ దుమ్ము, పొగతో చాలావరకు పశువులు మృత్యువాత పడ్డాయి. మేం అనేక సార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేస్తే మా వారిపై ఉల్టా కేసులు నమోదు చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారు.

వైద్యం కోసం రూ.లక్ష ఖర్చయ్యాయి..

రవి, నక్కలపల్లి

ఇటుక బట్టీల నుంచి వచ్చే కాలుష్యం, దుమ్మూధూళితో నా ఆరోగ్యం దెబ్బతిన్నది. శ్వాస తీసుకొవడం ఇబ్బందిగా మారడంతో ఆసుపత్రిలో చేర్చారు. దాదాపు రూ.లక్ష ఖర్చయినా ఇప్పటికీ దగ్గుతూ ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్నా. నాకున్న పశువులలో ఈ దుమ్ము కారణంగా నాలుగు పశువులు కూడా మరణించాయి. నా పంట భూమిలో వేసిన పంట మొత్తం ఎదుగుదల లేక మరిగిపోయింది.

చిన్న పిల్లలతో పని చేయిస్తున్నారు..

శివయ్య, నక్కలపల్లి

చిన్న చిన్న పిల్లలతో ఇటుకబట్టీల్లో పనులు చేయిస్తున్నారు. ఇటుకలను మోయిస్తూ వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారు. చదువుకోవాల్సిన పిల్లలను బడికి వెళ్లకుండా విద్యాచట్టాన్ని ఉల్లంఘిస్తున్నారు. ఈ ఇటుక బట్టీల వల్ల నాతో సహా చాలా మంది అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. గతంలో అనేక సార్లు పోలీస్ స్టేషన్‌లో ఇతర సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినా వాళ్ల పెద్ద మనుషులతో కలిసి నా పైనే కేసు పెట్టించారు. ఎంత మంది వాళ్లపై ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం.



జాతీయ ఎస్సీ కమిషన్‌కు కొండేటి శ్రీధర్ ఫిర్యాదు



ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్

వర్ధన్నపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 6న శ్రీరామనవమి పర్వదినం రోజున వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో నిర్వహించిన సీతారామ కల్యాణ వేడుకల్లో దళితడు అనే కారణంతో తనను వేదికపైకి ఆహ్వానించకుండా అవమాన పరిచిన వారిపై చర్యలు తీసుకోవాలని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ బుధవారం జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం రోజున బీజేపీ దళిత మోర్చ మండల అధ్యక్షుడు కొండేటి బాబు సైతం స్థానిక పోలీసు స్టేషన్‌లో పార్టీ నాయకులతో కలిసి ఫిర్యాదు చేశారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు సైతం మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్‌ను అవమానించిన సంఘటనపై విచారం వ్యక్తం చేయడంతో పాటు నిర్వాహకులపై చట్ట ప్రకారంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరడంతో పాటు ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ విషయంపై ఏమి జరగనుందోనని స్థానికంగా చర్చ జరుగుతోంది.

మహిళా సంఘాల సభ్యులకు ఐపీ నోటీసులు

- పొదుపు డబ్బులు వాడుకుని చేతులేత్తేసిన వీఏవో
- ఆందోళనకు గురవుతున్న మహిళలు
- న్యాయ సలహాలు ఇవ్వకుండా ముఖం చాటేస్తున్న అధికారులు


వడ్డిచర్లలో మహిళా సంఘం సభ్యులకు ఐపీ నోటీసులు ఇస్తున్న కోర్టు ఉద్యోగి

లింగాలఘణపురం, ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి): పొదుపు డబ్బులు బొక్కేసిన వీఏవోను తమ డబ్బులు తమకు ఇవ్వాల్సిందేనని నిలదీసిన పాపానికి ఒక్కరు కాదు ఇద్దరు కాదు ఏకంగా 113 మంది మహిళా సభ్యులకు ఐపీ నోటీసులు పంపాడు. పొద్దంతా రెక్కలు ముక్కలు చేసుకుని కూడబెట్టుకున్న సొమ్మును భద్రంగా దాచుకుందామని పొదుపు సంఘాల్లో జమచేస్తే బ్యాంకులో వేయకుండా నిలువెల్లా మోసం చేసిన వీవోఏ ఏకంగా న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. తన వద్ద నయాపైసా కూడా లేదని చేతులెత్తేసిన వైనం లింగాలఘణపురం మండలం వడ్డిచర్లలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే..

వడ్డిచర్ల మదర్‌థెరిస్సా, అంకిత గ్రామైక్య సంఘానికి చెందిన ఇద్దరు వీవోఏలు సుమారు రూ. 40 లక్షలదాకా చేతివాటంతో అవినీతిని ప్రదర్శించారు. ఈవిషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో గ్రామంలో నెలరోజుల పాటు ఆడిట్ నిర్వహించారు. ఆడిట్‌లో వీవోఏల అవినీతి బయటపడింది. దీంతో తాము వాడుకున్న డబ్బును సుమారు రూ.40 లక్షలను 15 రోజుల్లో చెల్లిస్తామని అధికారుల ఎదుటే అంగీకరించారు. కాగా అంగీకరించిన ఇద్దరు వీవోఏలో నజ్మా సుల్తానా డబ్బులను చెల్లించగా ప్రభాకర్ అనే వీవోఏ సుమారు రూ. 6లక్షలు చెల్లించి మిగతా రూ. 9 లక్షలు చెల్లించకుండా చేతులెత్తేశాడు. దీంతో తమ డబ్బులు తమకు ఇవ్వాలని ప్రభాకర్‌పై మహిళలు ఒత్తిడి చేయడంతో తనవద్ద నయాపైసా కూడా లేదని గురువారం గ్రామానికి చెందిన 113 మంది మహిళలకు కోర్టు ద్వారా ఐపీ నోటీసులను పంపించాడు. దీంతో ఆ మహిళలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

ముఖం చాటేస్తున్న అధికారులు

మహిళల పొదుపు డబ్బుల విషయంలో భరోసా ఇవ్వాల్సిన జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. వారం రోజులుగా కోర్టు నుంచి వచ్చిన నోటీసులను తాము తీసుకోవాలా వద్దా.. అని అడిగినా అడిగితెలుసుకుంటాం.. మళ్లీ చెబుతాం అంటూ దాటవేత ధోరణిని అవలంబించారు. తీరా బాధిత మహిళలు అంతా అధికారులకు ఫోన్లు చేసి ఒత్తిడి తీసుకురావడంతో నోటీసులు తీసుకోవాల్సిందేనని ఫోన్‌ద్వారా సెలవిచ్చారు. అయితే తాము ఏ రకంగా ముందుకు వెళ్లాలి.. ఏం చేయాలో ఏ ఒక్క అధికారి కూడా చెప్పకపోవడంపై మహిళలు అధికారుల తీరుపై ఆగ్రహంగా ఉన్నారు. న్యాయ సలహాలు ఇవ్వడంతో పాటు అందుకు అవసరమైన ఖర్చులను సైతం అధికారులే భరించాలని మహిళలు డిమాండ్ చేస్తుండటం గమనార్హం.

మతోన్మాదానికి వ్యతిరేకంగా కవులు ఉద్యమించాలి

అరసం జాతీయ కార్యదర్శి వేల్పుల నారాయణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

హనుమకొండ కల్చరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర అనంతర కాలంలో మన దేశంలో ప్రజల సామాజిక పరిస్థితులు ఏమాత్రం మారలేదని, ప్రతీఒక్కరు మతోన్మాదానికి, ఫాసిజానికి వ్యతిరేకంగా, ముఖ్యంగా కవులు తమ కలాలను సంధింపజేయాలని అరసం జాతీయ కార్యదర్శి వేల్పుల నారాయణ అన్నారు. అరసం ఏర్పడి 90 ఏళ్ల పూర్తయిన సందర్భంగా హనుమకొండలోని ఆదర్శ న్యాయ కళాశాల సెమినార్‌హాలులో బుధవారం రాత్రి వరకు జరిగిన మహాసభల్లో ఆయన విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. సమాజంలో అణచివేత విధానం కొనసాగుతుందని, భారత రాజ్యాంగాన్ని ఇంకా పటిష్టం చేయాల్సిందిపోయి పాలకులు తూట్లు పొడుస్తున్నారని ఆయన విమర్శిస్తూ సమాజంలో ప్రతీ మార్పునకు కవులు స్పందించి సమాజాన్ని చైతన్యవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

అరసం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పల్లేరు వీరస్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్ మాట్లాడుతూ.. స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో బ్రిటీష్‌వలసవాదదోపిడీకి అణచివేతకు వ్యతిరేకంగా తమ కలాలను ఎక్కు పెట్టడానికి, ప్రజలన చైతన్యవంతం చేయాలన్నారు. ఆచార్య బన్న అయిలయ్య, ప్రముఖ రచయిత్రి అనిశెట్టి రజిత, నిధి, భిక్షపతి, బూర విద్యాసాగర్, డాక్టర్ పాంచాలయ్ రాయ్, ప్రసాద్, చందనాల సుమిత్ర, వరంగల్ ఉమ్మడి జిల్లాప్రధాన కార్దయర్శి మార్క శంకర్ నారాయణ, తదితర అనేక మంది ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్లేరు వీరస్వామి రాసిన వీక్షణాలు, కామ్రేడ్ లింగమ్మ పుస్తకాలను అంపశయ్య నవీన్ ఆవిష్కరించారు.

సీపీని కలిసిన ఎక్సైజ్, అటవీ శాఖల అధికారులు


సీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అధికారులు

వరంగల్ క్రైం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్‌ను గురువారం జిల్లా అటవీశాఖాధికారి అనోజ్ అగర్వాల్, ఎక్సైజ్ శాఖ ఉమ్మడి జిల్లా డిప్యూటీ కమిషనర్ అంజన్‌రావు, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మర్యాదపూర్వకంగా కలిశారు.

పోలీసుల ఆధీనం ఉన్న వాహనాలను తీసుకెళ్లండి..

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను యజమానులు సంబంధిత పత్రాలను చూపించి తీసుకెళ్లాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ స్టేషన్‌ల వారీగా ఆయా వాహనాలను గుర్తించి ఇప్పటికే వాహనదారులకు నోటీసులు పంపించామన్నారు. వాహనాలన్నింటినీ భీమారంలోని సీఆర్‌పీఎఫ్ కేంద్రంలో భద్రపరిచామన్నారు. మిగతా వివరాలకు 8712685143, 8712685158 నెంబర్‌లలో సంప్రదించాలన్నారు.

అర్హత లేకున్నా కంటి వైద్యుడిగా మోసం

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్హతలు లేకుండా ప్రజలకు కంటి వైద్య సేవలు అందిస్తున్న డెక్కన్ ఆప్టికల్స్ యజమాని ఎం.జనార్దన్‌పై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రార్ డి.లాలయ్య కుమార్, చైర్మన్ కె.మహేశ్ కుమార్‌ల ఫిర్యాదు మేరకు మట్టెవాడ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసింది. వరంగల్ జేపీఎన్ రోడ్‌లో ఉన్న ఈ సంస్థలో జనార్దన్ కంటి వైద్యుడిగా ప్రజలను మోసం చేస్తున్నట్లు తనిఖీలలో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ అధికారులు గుర్తించారు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ప్రకారం అనధికారంగా వైద్యుడిగా పనిచేయడం ఎన్ఎంసీ చట్టం 34, 35, టీఎస్ఎంపీఆర్ చట్టం 22 నిబంధనల ప్రకారం శిక్షార్హమని పేర్కొన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కౌన్సిల్ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్ స్పష్టం చేశారు.

వేసవి క్రీడా శిక్షణకు సమాయత్తం

మే 1 నుంచి 31వరకు శిబిరాల నిర్వహణ

22 క్రీడాంశాల్లో తర్ఫీదు

హనుమకొండ అర్బన్ పరిధిలోని జేఎన్ఎస్‌లో 22 క్రీడాంశాల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహించడానికి జిల్లా క్రీడా అధికారులు కసరత్తు చేస్తున్నారు. అదే విధంగా జిల్లా లోని పలు మండల కేంద్రాల్లో సైతం శిబిరాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, సాఫ్ట్‌బాల్, త్రోబాల్, నెట్‌బాల్, బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, రెజ్లింగ్, కబడ్డీ, క్రికెట్, లాన్ టెన్నిస్, టేబుల్‌టెన్నిస్, టెన్నికాయిట్, తైక్వాండో, కరాటే, బాక్సింగ్, కిక్‌బాక్సింగ్, ఖోఖో, హాకీ, క్రీడాంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారు.



ప్రారంభమైన దరఖాస్తుల ప్రక్రియ.. ఈనెల 25 గడువు

4వ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థుల వరకు అవకాశం

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్‌ఏ) ఆధ్వర్యంలో మే 1నుంచి 31వరకు నెలరోజుల పాటు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహించేందుకు యంత్రాంగం సన్నద్ధమైంది. 4వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరంలో పాల్గొనేందుకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈనెల 9వతేదీ బుధవారం ఈ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం కాగా.. 25వ తేదీ వరకు గడువు ఉంది. ప్రతిభ కలిగిన బాలబాలికల ఉన్నత శిఖరాలకు చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా వేసవి

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్)ఆదేశాల మేరకు మే నెలలో హనుమకొండ అర్బన్‌తో పాటు వివిధ మండల కేంద్రాల్లో వేసవి క్రీడా శిక్షణ

పకడ్బందీ ఏర్పాట్లు

గుగులోత్ అశోక్‌కుమార్, జిల్లా యువజన, క్రీడల అధికారి



శిబిరాలను నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నాం. కలెక్టర్ ప్రావీణ్య ప్రత్యేక చొరవతో పలు మార్లు జిల్లాలోని వివిధ క్రీడా సంఘాల బాధ్యులు, సీనియర్ క్రీడాకారులు, జిల్లా స్పోర్ట్స్ అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించాం. 4వ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులు శిక్షణ శిబిరాల్లో పాల్గొనవచ్చు. అర్బన్ పరిధిలోని రెండు మండలాలు కాజీపేట, హనుమకొండకు చెందిన విద్యార్థులకు జేఎన్ క్రీడా మైదానంలో 22క్రీడాంశాల్లో శిక్షణ ఉంటుంది. ఇవే కాకుండా రూరల్ మండలాల్లోనూ విద్యార్థుల సంఖ్యను బట్టి పలు క్రీడాంశాల్లో శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తాం. వేసవి సెలవుల్లో విద్యార్థులు సెల్ ఫోన్‌లకు అతుక్కపోకుండా, క్రీడా మైదానాల వైపు వారి మనసు మళ్లించాల్సిన బాధ్యత ప్రతీ తల్లిదండ్రులపై ఉంది.

శిక్షణ శిబిరాలను నిర్వహిస్తోంది. వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణ ద్వారా మట్టిలోని మాణిక్యాలను వెలికి తీసి వారికి నచ్చిన క్రీడల్లో తీర్చిదిద్దడం శిక్షణ శిబిరాల ముఖ్య ఉద్దేశం. నెల రోజులు పాటు అర్బన్, రూరల్ మండలాల్లో సుమారు 22 క్రీడాంశాల్లో తర్ఫీదు ఇప్పించాడనికి ఇప్పటికే కసరత్తు ముమ్మరం చేశారు. అంతే కాకుండా 15మందికి మించి ఉండి వారికి నచ్చిన క్రీడల్లో శిక్షణ కావలనుకుంటే డీఎస్ అధికారులు కోచ్‌ను నియ విఎంచి తర్ఫీదు ఇస్తారు. వేసవి క్రీడా శిబిరాల్లో శిక్షణ అందించడానికి నెల రోజుల పాటు (తాత్కలిక) కోచ్‌లుగా విధులు నిర్వహించడానికి ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా డీఎస్ ఆధికారులు దరఖాస్తులను ఆహ్వానించారు. ఆసక్తి కలిగిన వ్యాయామ ఉపాధ్యాయులు, అధ్యాపకులు, జాతీయస్థాయి సీనియర్ క్రీడాకారులు శుక్రవారం వరకు దరఖాస్తు చేసుకున్నారు. త్వరలోనే వారి నియామక ప్రక్రియ పూర్తి కానుంది.

జిల్లా వ్యాప్తంగా శిక్షణ శిబిరాలు

జిల్లా వ్యాప్తంగా ఉన్న 14మండలాలు గాను అర్బన్ పరిధిలోని హనుమకొండ కాజీపేట మండలాలను మినహించి మిగితా రూరల్ పరిధిలోని ప్రతి మండలంలో విద్యార్థుల సంఖ్యను బట్టి వివిధ క్రీడల్లో శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేయడానికి స్పోర్ట్స్ అధికారులు ఏర్పాట్లను సవిఌక్షిస్తున్నారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ పర్యావేక్షణలో క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలకు కేటాయించనుంది నెల రోజుల పాటు శిక్షణ అందించనునన్న శిక్షణ శిబిరంలో పాల్గొనే తాత్కలిక కోచ్‌లుకు రూ. 4వేల గౌరవ వేతనంతో పాటు, క్రీడల నిర్వాహణ కోసం రూ. 1వెయ్యి చొప్పున నిధులను అందించనున్నారు. వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. క్రీడా శిక్షణ శిబిరాలను పర్యావేక్షణ బాధ్యతలను జిల్లా యువజన క్రీడల అధికారి పర్యావేక్షిస్తారు. వివిధ క్రీడాంశాల్లో శిక్షణ ఇవ్వనున్న కోచ్‌ల ఎంపిక విధానం దరఖాస్తుల ఆధారంగా నిర్ణయిస్తారు.

డీఎస్‌ఏ కార్యాలయంలో దరఖాస్తులు

వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో పాల్గొనే విద్యార్థుల కోసం హనుమకొండ బాలసముద్రంలోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలోని కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు వెల్లడించారు. ఈ నెల 9నుంచి 25వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు అర్హులైన విద్యార్థిని, విద్యార్థులు తమ దరఖాస్తు ఫారాలను డీఎస్‌ఏ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది. శిక్షణ శిబిరాల్లో పాల్గొనే విద్యార్థులు చదువుతున్న పాఠశాలకు చెందిన బోనఫైడ్ సర్టిఫికెట్ వెంట తీసుకొని వచ్చి దరఖాస్తు ఫారం పొందాలని అధికారులు సూచిస్తున్నారు.

షార్ట్‌ఫిల్మ్ నుంచి వెండితెరకు..

- సినిమాల్లో రాణిస్తున్న నెక్కొండ యువకుడు
- పేద కుటుంబంలో పుట్టి హీరోగా పరిచయమైన అనిల్


అనిల్

నెక్కొండ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : నేటి రోజుల్లో సినీ రంగంలో రాణించాలంటే కేవలం కళ ఉంటే సరిపోదు.. ఆర్థికంగా ఉండడంతో పాటు సినీ పరిశ్రమకు చెందిన ఎవరైనా పెద్దల ఆశీస్సులు ఉంటేనే.. చిన్న చిన్న పాత్రల్లో రాణించడం కష్టం.. కానీ ఇంజనీరింగ్ చదివిన వరంగల్ జిల్లా నెక్కొండకు చెందిన బురగాని అనిల్ మాత్రం స్వశక్తిని నమ్ముకున్నాడు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఇప్పుడిప్పుడే హీరోగా రాణిస్తున్నాడు. నెక్కొండకు చెందిన బురగాని కొమురయ్య- రమాదేవి దంపతుల ఏకైక కుమారుడు అనిల్. తండ్రి గీతకార్మికుడు కాగా.. తల్లి ఉపాధికూలి పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. అనిల్ పదో తరగతి వరకు స్థానిక విద్యోదయ హైస్కూల్‌లో చదివాడు. చిన్ననాటి నుండే పాటలు, నాటకరంగాల్లో రాణించి మండల ప్రజల మన్ననలు పొందారు. నల్లగొండలో పాలిటెక్నిక్ చేస్తున్న సమయంలో స్టేజీ ఆర్టిస్టుగా రాణించాడు. అనంతరం 2015లో హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ విద్యపూర్తి చేశాడు. అనిల్ ఉద్యోగం చేసి కుటుంబానికి ఆర్థికంగా అండగా ఉంటాడని తల్లిదండ్రులు భావించగా కళలపై మక్కువతో ఉద్యోగానికి వెళ్లకుండా సినిమారంగాన్ని ఎంచుకోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా కుమారుడి ఇష్టాన్ని తల్లిదండ్రులు ప్రోత్సహించారు. అనిల్ తాను అభిమానించే అక్కినేని నాగార్జున, రవి తేజలను ఆదర్శంగా తీసుకుని సినిమా రంగం వైపు అడుగులు వేశాడు. మొదటగా నీతోనే నేనుంటా షార్ట్ ఫిల్మ్‌తో ప్రేక్షకులను మెప్పించాడు. అనంతరం 2016లో శ్రీపాద ఎంటర్‌ప్రైజెస్ బ్యానర్‌పై నిర్మించిన 'వజ్రాలు కావలనాయనా' సినిమాలో నటించగా 2017లో విడుదలై ఆశించిన స్థాయిలో ప్రేక్షకాదరణ లభించలేదు. సినిమా మాత్రం అనుకున్న బడ్జెట్ వసూలు చేసింది. అనంతరం తనకు ఉన్న కళలతో వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపట్టిన ప్రజలకు ఉపయోగపడే వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న అనిల్ తన ప్రతిభతో వాటిని విజయవంతంగా చేశారు. ప్రస్తుతం ఈశ్వర పరమేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మించిన ప్రేమకుజై చిత్రంలో నటించగా.. ఈ సినిమా శుక్రవారం తెలుగురాష్ట్రాల్లో దాదాపు 200ప్రింట్లతో విడుదలవుతోంది. దీంతో పాటు ఐరావన, దునియా, ప్రేమతో అభిరామ్ చిత్రాలు విడుదలకు సిద్ధమవుతున్నాయి. అనిల్ సినిమాలతోనే కాకుండా ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల ద్వారాసేవా కార్యక్రమాలకు సంబంధించిన ప్రచారం చేయడంటోనూ ముందుంటున్నాడు. ఇక తాను తల్లిదండ్రుల పోత్సహం, ప్రేక్షకుల ఆదరణతో రాణిస్తున్నానని, కుటుంబ ఆర్థిక స్థితి సహకరించకపోయినా తల్లిదండ్రులు తాను ఎంచుకున్న రంగం గురించి ఏనాడూ అడ్డుచెప్పలేదని అనిల్ పేర్కొన్నాడు.


ఓ సినిమా సన్నివేశ చిత్రీకరణలో అనిల్

సామాజిక సేవ బాధ్యతగా

ఈసీఐఎల్ వితరణ

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రెండు ప్రాజెక్టులు

కుషాయిగూడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ఎలక్ట్రానిక్స్ రంగంలో అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించిన ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) మరోసారి తన సామాజిక సేవా బాధ్యతను చాటుకొంది. సంస్థ లాభాలలో కొంత శాతాన్ని వెచ్చించి ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, శాశ్వత ప్రాతిపదికన అదనపు తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్మాణాలు, కంప్యూటర్ శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేస్తూ అందరి మన్ననలు అందుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రొఫెసర్ జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో వైద్య సేవలందిస్తున్న ఐసీడీఎస్ అధికార సిబ్బందికి ఈ-బైక్‌లు, ప్రమాదకర రసాయనాల పిచికారీలో రైతుల సహాయం కోసం వ్యవసాయ అధికారులకు డ్రోన్లను అందజేసింది. ఈమేరకు ఈసీఐఎల్ హెచ్‌ఆర్ విభాగం సీనియర్ మేనేజర్ వి.డి.తివారీ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ కొత్తగా పూర్తి చేసిన రెండు ప్రాజెక్టుల వివరాలను వెల్లడించారు. సుదూర గ్రామీణ ప్రాంతాలలో వైద్య సేవలందించే ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ (ఐసీడీఎస్) అధికార సిబ్బంది రవాణా సౌకర్యం కోసం 20 ఈ-బైక్‌లతో పాటు జిల్లా వ్యవసాయ అధికార సిబ్బందికి ఉపయోగపడేలా 12 డ్రోన్లను జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మకు అందజేసినట్లు వివరించారు. శుక్రవారం భూపాలపల్లి జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులతో పాటు ఈసీఐఎల్ అధికారులు సిహెచ్. మురళీధర్, పి.వేణుబాబు, పి.రమేష్, రామకృష్ణ, ఈసీఐఎల్ మజ్దూర్ సంఘ్ కార్మిక నాయకుడు జి.శ్రీనివాసరావు, ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకుడు వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


సీఎస్ఆర్ పథకం ద్వారా ఈ-బైక్, డ్రోన్లను భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మకు అందజేస్తున్న ఈసీఐఎల్ అధికార ప్రతినిధులు

వన్యప్రాణులకు తీరనున్న దప్పిక

జంతువుల దాహార్తి తీర్చేందుకు అటవీశాఖ చర్యలు


పాకాల అడవిలో నిర్మించిన నీటికుంట

- పాకాల అభయారణ్యంలో నీటి నిల్వకు ఏర్పాట్లు
- నీటి కుంటలు, చెక్‌డ్యామ్‌లు, చెలిమలు, సోలార్ పంపుసెట్ల నిర్మాణం

ఖానాపురం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వేసవిలో అడవిలోని మూగజీవాల దప్పిక తీర్చేందుకు, వాటి సంరక్షణపై అటవీశాఖ అధికారులు దృష్టిసారించారు. వేసవిలో వన్యప్రాణుల సంరక్షణ పూర్తిస్థాయిలో లేకపోవడంతో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నాయి. తాగునీటి కోసం వన్యప్రాణులు అడవులు వీడి జనావాసాల్లోకి, పొలాల్లోకి రావడంతో వేటగాళ్లబారిన పడి మృత్యువాతపడుతున్నాయి. అదేవిధంగా వేసవిలో అటవీప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే కలిగే నష్టాలను నివారించేందుకు, తదితర సమస్యలను దృష్టిలో ఉంచుకొని అటవీశాఖ అధికారులు వన్యప్రాణుల సంరక్షణ కోసం అవసరమైన చర్యలను చేపడుతున్నారు.

నర్సంపేట రేంజ్ పరిధిలో అటవీ విస్తీర్ణం 32వేల ఎకరాలు కాగా, పాకాల అభయాణ్యం 25వేల ఎకరాల్లో విస్తరించి ఉంది. పాకాల అభయారణ్యంలో జింకలు, హైనాలు, అడవి పందులు, అడవి గేదెలు, నక్కలు, ముంగీసలు, కుందేళ్లు, పాములు తదితరాలు ఉన్నాయి. ఇటీవల పాకాల అభయారణ్యంలో పులి సంచారం సైతం కనిపించింది. అవి సంచరించే ప్రాంతాలను గుర్తించి వేసవిలో నీటి వసతి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. నర్సంపేట రేంజ్ పరిధిలోని పాకాల, కొండాపూర్, మేడెపల్లి అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణులకు అవసరమైన తాగునీటితో పాటు భూగర్భ జలాల పెంపునకు అధికారులు చర్యలు చేపట్టారు. అవసరైన చోట చెక్‌డ్యామ్‌లు, నీటికుంటలు, సాసర్‌పిట్స్, రాతికట్టడాలతో పాటు మినీ పర్క్‌లేషన్ ట్యాంకులు, కందకాల నిర్మాణం చేపట్టి నీటి వసతి కల్పించారు.

నిర్మాణాలు

అడవుల్లో నీటి నిల్వలకు చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేపట్టారు. నర్సంపేట రేంజ్ పరిధిలోని ఆయా బీట్లలో బుధరావుపేటలో 2, ఖానాపురంలో 1, మేడెపల్లి కొండాపూర్ బీట్ పరిధిలో 3 చొప్పున ఒక్కోదానికి రూ.5లక్షలు వెచ్చించి కంపా నిధులతో నిర్మాణం చేపట్టారు. అలాగే పాకాల, కొండాపూర్ అటవీ ప్రాంతాల్లో పాకాల, కొండాపూర్ అటవీ ప్రాంతాల్లో సోలార్ బోరు బావులు నిర్మాణం చేపట్టారు. ఒక్కోదానికి రూ.5లక్షల చొప్పున ఖర్చు చేశారు. వాగులు వంకలపై 6 చెలిమలు నిర్మాణం చేపట్టారు. కాగా, కొండాపూర్, అశోక్‌నగర్, మేడెపల్లి బీట్‌ల పరిధిలో 16 సాసర్‌పిట్‌ల నిర్మాణం చేపట్టారు. వేసవిలో అనునిత్యం వన్యప్రాణులకు తాగునీరు అందుబాటులోకి ఉంచడానికి సాసర్‌పిట్‌లో ట్యాంకర్ల ద్వారా నీటిని నింపుతున్నారు.

ఫైర్‌లైన్

అడవుల్లో వేసవిలో కార్చిచ్చు వ్యాపించి అడవుల్లో మంటలు చెలరేగి వన్యప్రాణులకు ముప్పువాటిల్లే ప్రమాదం ఉంది. ప్రమాదం సంభవించినా అగ్ని దూరప్రాంతాలకు విస్తరించకుండా ఉండేదుకు నిర్మించేవే ఫైర్‌లైన్స్ పాకాల అడవుల్లో 33కిలోమీటర్ల మేర ఏర్పాటు చేశారు.


తొట్లలోని నీటిని తాగుతున్న దుప్పులు


అడవిలో ఏర్పాటు చేసిన సోలార్ పంప్ సెట్

కెమెరా ట్రాప్స్

నీరున్న ప్రాంతాల్లో వన్యప్రాణుల సంచారం ఎక్కువగా ఉంటుంది. ఆయా చోట్ల వన్యప్రాణుల కదలికలు, వేటగాళ్ల జాడను గుర్తించేందుకు చెట్లకు కెమెరా ట్రాప్స్‌ను ఏర్పాటు చేస్తారు. అశోక్‌నగర్, మేడెపల్లి, కొండాపూర్ బీట్‌ల పరిధిలో 8 నిఘా కెమెరాలు(ట్రాప్స్) ఏర్పాటు చేశారు.

వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

రవికిరణ్, ఫారెస్ట్ రేంజర్, నర్సంపేట



వన్యప్రాణులకు వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా అడవిలో పలు చోట్ల నీటి కుంటలు ఏర్పాటు చేశాం. వేసవిలో అగ్ని ప్రమాదాలు జరుగకుండా ఫైర్ కంట్రోల్‌లైన్ ఏర్పాటు చేశాం. అటవీ ప్రాంతంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఎవరైనా సంచరిస్తే వన్యప్రాణుల చట్టం అమలు చేస్తాం. అటవీ శాతాన్ని పెంచేందుకు నిరంతరం కృషి చేస్తున్నాం. చెట్లు నరికినా, జంతువులను వేటాడినా చర్యలు తప్పవు. అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు ప్రజలందరూ సహకరించాలి.

పార్ట్‌టైమ్ టీచర్ల నియామకాల్లో మీనమేషాలు

- భారంగా మారిన వర్సిటీలో తరగతుల నిర్వహణ
- పాఠాలు జరుగక నష్టపోతున్న విద్యార్థులు
- నోటిఫికేషన్లు ఇచ్చినా.. గైడ్‌లైన్స్ ఇవ్వని వైనం
- తాత్కాలిక నియామకాల్లేక పదేళ్లుగా అవస్థలు
- అధికారుల తీరుతో ఆశావహుల ఆందోళనలు


ఆందోళన చేస్తున్న పార్ట్‌టైమ్ ఆశావహ అభ్యర్థులు (ఫైల్)

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీలో పార్టుటైం అధ్యాపకుల నియామకాల్లో వర్సిటీ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. పదేళ్లుగా ఈ నియామకాల్లేవు. రెగ్యులర్‌తో పాటు కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న పలువురు అధ్యాపకులు పదవీవిరమణ పొందుతున్నారు. అలా రిటైరైన వారి స్థానాల్లో తరగతులు బోధించేందుకు వర్సిటీ అధికారులు ఎప్పటికప్పుడు తాత్కాలిక పద్ధతిలో పార్టుటైం అధ్యాపకులను నియమిస్తారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మొదటి దఫా అధికారంలోకి వచ్చిన కొత్తలో వర్సిటీలో రాష్ట్ర ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ఎలాంటి నియమకాలు చేపట్టవద్దని ఆదేశాలివ్వడంతో వర్సిటీ ఉన్నతాధికారులు పార్టుటైం అధ్యాపకులను నియమించలేదు. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టుటైం అధ్యాపకులు కావాలని వర్సిటీ ఉన్నతాధికారులు రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ, ఇతర అధికారులకు నివేదించగా.. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతులు రాలేదని తెలుస్తోంది. ఇలా పదేళ్లుగా వర్సిటీలో పార్టుటైం అధ్యాపకుల నియామకాలు చేపట్టలేదు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్సిటీల్లో ఈ నియామకాలు జరుగుతుండగా.. కాకతీయ వర్సిటీలోనే అనుమతులంటూ దాటవేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో తరగతులు సక్రమంగా జరుగక విద్యార్థులు నష్టపోతున్నారు. ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీ ప్రొఫెషనల్స్ కోర్సులకు కనీసం ఐదు తరగతులు జరగాల్సి ఉండగా.. 1, 2 తరగతులే జరుగుతున్నాయని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. క్లాస్‌లు జరగడం లేదని ప్రిన్సిపాళ్లతో పాటు విభాగాధిపతులను అడిగితే లైబ్రరీలోకి వెళ్లి చదువుకొండంటూ సలహాలు ఇస్తున్నారని పెదవి విరుస్తున్నారు. రెగ్యులర్, కాంట్రాక్టు, పార్టుటైమ్ అధ్యాపకులకు కూడా పరిపాలన పదవులివ్వడంతో వారు పదవుల్లో బీజీగా ఉండి తరగతులు బోధించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నోటిఫికేషన్ సరే.. గైడ్‌లైన్స్ ఏవీ ?

కేయూలో పార్టుటైం అధ్యాపకుల నియామాకాల కోసం పీహెచ్‌డీ, పీడీఎఫ్‌తో పాటు సీఎస్ఐఆర్, యూజీసీ నెట్. సెట్ తదితర అర్హతలున్న అభ్యర్థులు ఆందోళనలకు దిగుతున్నారు. రాష్ట్రంలోని అన్ని వర్సిటీల్లో నియమిస్తుంటే.. కేయూలో ఎందుకు చేయడం లేదంటూ వీసీ, రిజిస్ట్రార్లను కలిసి నిరసన తెలుపుతున్నారు. ఈ ఆందోళనల నేపథ్యంలో వర్సిటీ రిజిస్ట్రార్ రెండు దఫాలుగా పార్టుటైమ్ అధ్యాపకుల నియామకాలకు నోటిఫికేషన్లు ఇచ్చారు. కానీ ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులకు మాత్రం నియామకాలపై ఎలాంటి గైడ్‌లైన్స్ జారీ చేయకపోవడం కొస మెరుపు. దీంతో వర్సిటీ ఉన్నతాధికారుల తమకు ఎలాంటి గైడ్‌లైన్స్ ఇవ్వలేదని చెబుతూ వారు నియామకాలను అటకెక్కించే ప్రయత్నాలు చేస్తున్నారు. గైడ్‌లైన్స్ ఇదిగో ఇస్తున్నాం.. అదిగో ఇస్తున్నాం అంటూ వర్సిటీ అధికారులు కాలం వెళ్లదీస్తున్నారు.

రిటైర్డ్ అధ్యాపకులతో తరగతులు..

పదేళ్లలగా పార్టుటైం నియామకాలు చేపట్టకపోవడంతో కొందరు ప్రిన్సిపాల్, విభాగాధిపతులు తమకు అనుకూలమైన రిటైరైన అధ్యాపకులతో తరగతులు మమ అన్పిస్తున్నారు. ఇందులో కొందరు ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులు తరగతులు చెప్పినట్టు తప్పుడు బిల్లులు చూపి వర్సిటీ సొమ్మును కొల్లగొడుతున్నారు. గత పదేళ్ల పార్టుటైమ్ అరెంజ్‌మెంట్ బిల్లులపై విచారణ జరిపిస్తే అసలు నిజం బయటపడే అవకాశాలున్నాయి. రెగ్యులర్‌తో పాటు కాంట్రాక్టు అధ్యాపకులు కొందరూ తమకున్న 16 పీరియడ్ల వర్క్‌లోడ్‌కు అదనంగా మరిన్ని పీరియడ్లు తీసుకున్నట్లు వర్సిటీకి సమర్పిస్తున్న టైమ్ టేబుల్‌లలో వివరాలను చూపుతున్నారు. అయితే వారికి కన్సలిడెట్ పే కావడంతో అధికంగా తరగతులు తీసుకున్నట్లుగా చూపే పీరియడ్లకు అధనపు జీతం ఇవ్వడం లేదని తెలుస్తోంది.

పార్ట్‌టైమ్ కమిటీ సిపార్సులు

పార్ట్‌టైమ్ అధ్యాపకుల నియామకాల కోసం కేయూ ఉన్నతాధికారులు అప్పటి ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ఇప్పటి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం నేతృత్వంలో ప్రొఫెసర్ బి. సురేశ్‌లాల్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ కట్ల, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సీహెచ్. ప్రణయ్‌కుమార్ కమిటీ నియమించారు. కమిటీ వర్సిటీలోని అన్ని విభాగాల్లో వర్క్‌లోడ్‌ను వర్సిటీ ప్రమాణాల మేరకు సేకరించింది. అత్యవసరంగా కావాల్సిన అవసరమైన పార్టుటైం అధ్యాపకుల వివరాలను వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డికి అందచేశారు. ఆ కమిటీ సిపార్సుల నేపథ్యంలోనైనా అత్యవసరంగా పార్టుటైం అధ్యాపకులను నియమిస్తారని ఆశావహులు భావించారు.

నచ్చిన వారిని నియవించుకున్నారు..


కాకతీయ యూనివర్సిటీలో పార్టుటైమ్ అధ్యాపకుల నియామకాలకు రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేదంటూనే గత వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ అక్రమాలకు తెరతీశారు. తమకు నచ్చిన కొందరిని పార్టుటైం అధ్యాపకులుగా తాను వీసీ పదవి నుంచి దిగిపోయే సమయంలో అప్పటి విభాగాధిపతుల కనుసన్నల్లో పార్టుటైం అధ్యాపకులుగా అక్రమంగా నియామించారు. వారికి లేని అనుమతి తమకే ఎందుకంటూ పార్టుటైం ఆశావహులు వర్సిటీ అధికారులను నిలదీస్తున్నారు. అయితే వారి నియామకాలు అక్రమం అని వాటిని రద్దు చేయాలని వీసీ రమేశ్‌పై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు ఫిర్యాదులు అందాయి. వాటిపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా వారిద్దరి అలాగే కొనసాగిస్తూ.. తమకు అవకాశం కల్పించకపోవడంతో ఆందోళనలు నెలకొన్నాయి. వీరిపై రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీతో పాటు కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలకు వేర్వేరుగా ఫిర్యాదులందాయి.

వర్సిటీలో పార్ట్‌టైమ్ ఆశావహుల నిరసనలు

ఉన్నత విద్యార్హతలు సాధించిన తమకు నిబంధనల మేరకు పార్టుటైం అధ్యాపకులుగా అవకాశం కల్పించాలని ఆశావహులు వర్సిటీ పరిపాలన భవనంలో ఎదుట నిరసన ఆందోళనలకు దిగుతున్నారు. వర్సిటీ ఉన్నతాధికారులను కలిసి పార్టుటైమ్ నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ అనుమతి కోసం చూస్తున్నమని రాగానే పార్టుటైమ్ నోటిఫికేషన్ ఇస్తామని కాలం వేళ్లదీస్తున్నారు. పార్టుటైమ్ నోటిఫికేషన్ స్థానంలో పీరియడ్ వైజ్‌గా ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ నియామకాల కోసం గైడ్‌లైన్స్ ప్రకటించలేదు. ఏప్రిల్ 22న వర్సిటీ అకాడమిక్ ఇయర్ ముగుస్తుండంతో అసలు నియామకాలు చేసే ఉద్దేశ్యం వర్సిటీ అధికారులకు ఉందా అనే సంశయం నెలకుంది.

వర్సిటీలో రిటైర్డ్ అధ్యాపకుల ఉద్వాసన

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రిటైర్డు ఉద్యోగుల సేవలు ఉపయోగించుకున్నట్లయితే వెంటనే వారిని విధుల్లోంచి తొలగించాలని నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని శాఖలకు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే కాకతీయ యూనివర్సిటీలో పనిచేస్తున్న రిటైర్డు అధ్యాపకులను తొలగిస్తే వెంటనే పాఠాలు బోధించేందుకు పార్టుటైమ్ అధ్యాపకుల అవసరం ఉంటుందనే వాదన విన్పిస్తుంది.



గ్రామాల్లో మెరుగైన వైద్యం అందించాలి

హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (ఆరోగ్య ఉప కేంద్రం)లో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్‌గా నియమించబడిన డాక్టర్లు గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఇటీవల చేపట్టిన ప్రక్రియలో ఎంపికైన 11 మంది మిడ్ లెవెల్ హెల్త్‌కేర్ ప్రొవైడర్లకు గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో నియామకపత్రాలు అందజేశారు.



నియామక పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య



హనుమకొండలో ఎంపీ కావ్య జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కాంగ్రెస్ నాయకులు

ఎంపీ కడియం కావ్య జన్మదిన వేడుకలు

శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఎంపీ కడియం కావ్య జన్మదిన వేడుకలను హనుమకొండ కనకదుర్గ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు కార్యకర్తలు, అభిమానులు, మహిళలు ఉదయం నుంచి సాయంత్రం వరకు పెద్ద సంఖ్యలో హాజరై కావ్యకు పుష్ప గుచ్ఛాలు, పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకల్లో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితో పాటు కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు. కాగా, ఎంపీ కడియం కావ్య జన్మదినం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

పెన్షనర్లకు ఏరియర్స్ వెంటనే చెల్లించాలి

వడ్డేపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సింగరేణి పెన్షనర్లకు 11వ వేతనంలో సవరించిన పెన్షన్ ఏరియర్స్‌ను వెంటనే చెల్లించాలని సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కడార్ల ప్రకాశ్‌చారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చిదురాల సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో పెన్షన్ పొందుతున్న రిటైర్డ్ కార్మికులకు కొత్త పీపీవోలు ఇవ్వాలని, కనీస పెన్షన్ నెలకు రూ.10 వేలు తగ్గకుండా ఇవ్వాలని అన్నారు. చట్టప్రకారం ప్రతీ మూడేళ్లకోసారి పెన్షన్ సవరణ చేయాలని, గుర్తింపు పొందిన ప్రైవేటు వైద్యశాలల్లో వైద్యం అందించాలని, తెల్లరేషన్ కార్డు, ఇంటి స్థలం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా నాయకులు వీరమనేని రవీందర్, శ్రీరామోజు రామ్మూర్తి, సీహెచ్. మాధవరావు, ఎస్. ప్రభాకర్, దామోదర్, డీ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుల ఆర్థిక చేయూత

మడికొండ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మడికొండకు చెందిన పసునూరి కుమారస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. 1997-98 విద్యాసంవత్సరం పదో తరగతి విద్యార్థులు రూ.82వేలు జమచేసి ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. డిపాజిట్ బాండ్‌ను గురువారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో తిరుపతి, రఘుచందర్, ఉపేంద్రాచారి, సురేష్, రామకృష్ణ, శ్రీహరి, సత్యనారాయణ, త్రివేణి పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

వడ్డేపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 57వ డివిజన్ వికాస్‌నగర్‌లోని మున్నూరుకాపు సంక్షేమ సంఘం సభ్యుడు జిల్లా సుఖేందర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మున్నూరు కాపు సంక్షేమ సంఘం నిధి నుంచి అతడి కుటుంబ సభ్యులకు రూ.5వేల ఆర్థిక సహాయాన్ని సంఘ అధ్యక్షుడు మల్లయ్య పటేల్, ప్రధాన కార్యదర్శి హరికిషన్, కోశాధికారి అల్లం మల్లికార్జున్‌రావు గురువారం అందజేశారు. సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే తల్లీబిడ్డలు సురక్షితం

హసన్‌పర్తి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకుంటేనే తల్లీబిడ్డలు సురక్షితంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష అన్నారు. మండలంలోని అర్వపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ్ పక్వాడాలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు రక్తహీనతపై అవగాహన కల్పించారు. పరిశుభ్రతతో పాటు ఎలాంటి పోషకవిలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలో వివరించారు. కిశోర బాలికలకు పోషకలోపం వల్ల జరిగే నష్టం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఎం సుజాత, అంగన్‌వాడీ టీచర్లు జమున, రాధిక, ఆశ కార్యకర్త కవిత తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించాలి

వడ్డేపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణం కోసం ఎన్‌సీసీ క్యాడెట్లు కృషిచేయాలని 8 (టీ)వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ రవీంద్రకుమార్ రవి అన్నారు. గురువారం హనుమకొండ వడ్డేపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణం అనే అంశంపై కళాశాల ఎన్‌సీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బత్తిని చంద్రమౌళిగౌడ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రవీంద్ర కుమార్ రవి మాట్లాడుతూ.. యువత కొత్త పోకడలను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. డ్రగ్స్ ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మేజర్ రేవతి ప్రభాకరన్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుహాసిని, ఎన్‌సీసీ ఆఫీసర్లు అవంతి, దివ్యశ్రీతో పాటు ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.



డ్రగ్స్ నివారణ ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

చెరువులో దూకి నిట్ విద్యార్థి ఆత్మహత్య

కాజీపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వడ్డేపల్లి చెరువులో దూకి నిట్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. కాజీపేట ఎస్సై నవీన్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన హృతిక్‌సాయి (23) వరంగల్ నిట్ కళాశాలలో బీటెక్ సెకండియర్ చదువుతున్నాడు. గురువారం అతడు వడ్డేపల్లి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు మృతుడి బంధువులు రాత్రి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. కాగా, హృతిక్‌సాయి ఆత్మహత్యకు గల కారణాలు విచారణ చేయాల్సి ఉందని ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.



మృతి చెందిన హృతిక్‌సాయి

ఉరివేసుకుని యువకుడు..

కాజీపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక సింగరేణి ఉద్యోగి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాజీపేట ఎస్సై నవీన్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట రహ్మత్‌నగర్‌కు చెందిన ఊరడి సంజయ్‌కుమార్ (26), అవివాహితుడు. కొత్తగూడెం వర్క్‌షాపులో పనిచేస్తున్నాడు. మూడునెలల కిందట కాజీపేట భవానినగర్‌లో రూ.76 లక్షలు పెట్టి ఇల్లు కొనుగోలు చేశారు. ఇందుకోసం అప్పుచేశాడు. అప్పులు ఎక్కువ కావడంతో మానసికంగా కుంగిపోయాడు. గురువారం బాపూజీనగర్‌లో అమ్మమ్మ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి సుభద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్ తెలిపారు.



ఊరటి సంజయ్ (ఫైల్)

నగరంలో బల్దియా చలివేంద్రాలు

8 చోట్ల ఏర్పాటు చేసిన ఇంజనీరింగ్ అధికారులు

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. బల్దియా ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగాల సంయుక్తాధ్వర్యంలో 8 చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్టు వరంగల్ ఈఈ శ్రీనివాస్‌తోపాటు ఇంజనీరింగ్ సిబ్బంది తెలిపారు. ఏప్రిల్ నుంచి జూన్ రెండోవారం వరకు ఈ చలివేంద్రాలు కొనసాగుతాయని, పూర్తి నిర్వహణ ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగాలు చూసుకుంటారని తెలిపారు. హనుమకొండ నయీంనగర్, ధర్మారం జంక్షన్, వెంకట్రామ జంక్షన్, గొర్రెకుంట క్రాస్, గోపాలస్వామిగుడి, రత్న హోటల్, గొర్రెకుంట గ్రామ జంక్షన్, 80 ఫీట్ల రోడ్డుకు చలివేంద్రాలను ఏర్పాటు చేశారు.



గోపాలస్వామి గుడి వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రం



గొర్రెకుంట, హనుమకొండలో వెలసిన చలివేంద్రాలు

ఇతర చోట్ల..

గ్రేటర్ వరంగల్ పరిధిలోని 66 డివిజన్‌లు ఉండగా 8 చలివేంద్రాలు మాత్రమే ఏర్పాటు చేయడంపై నగర ప్రజలు పెదవి విరుస్తున్నారు. అలాగే గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వివిధ పనుల కోసం ప్రజలు వస్తుంటారని, కానీ ఇక్కడ చలివేంద్ర ఏర్పాటు చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చచేస్తున్నారు. జనసంచారం లేని ప్రదేశాల్లో చలివేంద్రాలు చేర్పాటు చేసి నిత్యం పనుల కోసం వచ్చే బల్దియా ప్రధాన కార్యాలయంలో బల్దియా ఇంజనీరింగ్ అధికారులు ఏర్పాటు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కేయూ అంబేద్కర్ స్టడీ సెంటర్ డైరెక్టర్‌గా రాజ్‌కుమార్

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టడీ సెంటర్ కొత్త డైరెక్టర్‌గా డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. రాజ్‌కుమార్ ఏడాది పాటు డైరెక్టర్‌గా కొనసాగుతారు. డైరెక్టర్‌గా నియమితులైన రాజ్‌కుమార్‌ను పలువురు బోధన, బోధనేతర ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

ఆవు అపహరణ

వరంగల్ క్రైం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ఆలయం పరిసరాల్లోని షెడ్డులో ఉన్న ఆవును గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించినట్లు ఆవు యజమాని ఎల్కతుర్తి మండలం దండెపల్లికి చెందిన కొడిపాక మల్లేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. 54వ డివిజన్‌లోని హనుమాన్‌నగర్ టెంపుల్ పరిసరాల్లో భక్తుల కోసం ఆవును పెంచుతున్నాడు. 10 రోజుల క్రితం ఆవు అపహరణకు గురైంది. నగరం చుట్టుపక్కల ఉన్న సంతల్లో ఆవు కోసం ఆరా తీశాడు. ఎంతకీ ఆవు ఆచూకీ తెలియకపోవడంతో ముందుగా ఎల్కతుర్తి పీఎస్, కేయూ పీఎస్‌లలో ఫిర్యాదు చేయగా ఎల్కతుర్తి పోలీసులు స్పందించగా కేయూ పోలీసులు తమకు సంబంధం లేదన్నారన్నారు. ఆవుల మంద ల్లో ఉందనే అనుమానం ఉందని చెప్పినా పట్టించుకోలేదన్నారు. చివరికి హను మకొండ పోలీసులకు ఫిర్యాదు చేయగా వివరాలు తీసుకుని పంపించారని ఆవేదన వ్యక్తం చేశారు.

వైభవంగా సీతారాముల రథోత్సవం

మడికొండ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మడికొండలోని మెట్టుగుట్టపై వైభవంగా జరిగిన సీతారాముల కల్యాణ మహోత్సవాలలో భాగంగా గురువారం స్వామి వారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. సాయంత్రం సీతారాముల ఉత్సవ విగ్రహాలను అర్చకులు పరాశరం విష్ణువర్ధనాచార్యులు, రాగిచేడు అభిలాష్‌శర్మ, పారుపెల్లి సత్యనారాయణశర్మ అందంగా ముస్తాబు చేసి సుందరంగా అలంకరించిన రథంపైకి చేర్చారు. అనంతరం 46, 64 డివిజన్‌ల కార్పొరేటర్లు మునిగాల సరోజన, ఆవాల రాధికారెడ్డి, ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ సీతామచంద్రస్వామి వారి రథాన్ని లాగి ఊరేగింపు ఉత్సవాన్ని ప్రారంభించారు. కోలాటాలు, కళాకారుల ఆటపాటలతో సాగిన రథయాత్ర గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగి తిరిగి మెట్టుగుట్టపైకి చేరింది. ఈ సందర్భంగా మహిళలు మంగళ హారతులతో ఎదురేగి స్వామి వారికి స్వాగతం పలికి పూజలు చేశారు. ఇన్‌స్పెక్టర్ కిషన్ పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు నిర్వహించారు. దేవస్థాన ఈవో శేషుభారతి, రామాలయ చైర్మన్ పల్లపు అర్జున్ ఆధ్వర్యంలో జరిగిన రథోత్సవంలో మాజీ కార్పొరేటర్ తొట్ట రాజుయాదవ్, గుర్రం అమర్‌నాథ్, కుర్ల మోహన్, దువ్వ శ్రీకాంత్, ధర్మకర్తలు హనంకొండ మల్లికార్జున్, బిల్ల రాజ్‌కుమార్, మూగల రాము, మండల రఘు, జిట్ట హనుమంతరావు, దండిగం రమాదేవి, వలబోజు ఉపేందర్, గుగులోతు నాగేశ్వర్‌రావు, ముంజ రమేష్, నర్ర వెంకటేశ్, గంగారపు రమేష్, మండల సంపత్‌రెడ్డి, ఆలయసిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



రథం ఊరేగింపు ఉత్సవాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్లు మునిగాల సరోజన, ఆవాల రాధికారెడ్డి, ఇన్‌స్పెక్టర్ కిషన్



ఎమ్మెల్యే నాగరాజును సన్మానిస్తున్న నాయకులు

ఎమ్మెల్యే నాగరాజుకు జన్మదిన శుభాకాంక్షలు

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు పలువురు నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు గురువారం హనుమ కొండలోని ఎక్సైజ్‌కాలనీలో ఉన్న ఎమ్మెల్యే నివాసానికి నాయకులు వెళ్లారు. నాగరాజుకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కొక్కిరాల రవీందర్‌రావు, బెంబిరి వెంకటేశ్వర్‌రావు, పుట్ట భిక్షపతి, పీతాంబరం రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

హసన్‌పర్తి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): చింతగట్టు సబ్ స్టేషన్ పరిధి హసన్‌పర్తి, పెంబర్తి ఫీడర్‌లో శుక్రవారం, శనివారం రెండు రోజుల పాటు ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు హసన్‌పర్తి విద్యుత్ ఏఈ శిరీష్‌కుమార్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

పాలిటెక్నిక్ భవనానికి నేడు భూమి పూజ

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నూతన భవన నిర్మాణానికి శుక్రవారం వరంగల్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి భూమి పూజ చేయనున్నారు. పాలిటెక్నిక్ కళాశాల భవనం శిథిలావస్థకు చేరడంతో రాష్ట్రప్రభుత్వం ఇప్పటికే కళాశాల భవన నిర్మాణానికి రూ. 28 కోట్ల నిధులు మంజూరు చేసింది. దీంతో శుక్రవారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే నాయినితో పాటు జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య హాజరై నూతన భవన నిర్మాణానికి భూమి చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్ తెలిపారు.

ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ నాయకుడి హల్‌చల్

వరంగల్ క్రైం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ నాయకుడిగా చెలామణి అవుతున్న ఓ వ్యక్తి మరో వ్యక్తిపై విచక్షణారహితంగా దాడిచేసి రాజీకుదుర్చుకునేందుకు బెదిరింపులకు పాల్పడుతున్నట్లు విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. వరంగల్ పోలీస్ సబ్‌డివిజన్‌లోని విల్స్‌కాలనీ పీఎస్ పరిధిలోని ఓ కాలనీలో సుమారు వారం కిందట పుట్టినరోజు వేడుకలు జరిగాయి. ఆ సమయంలో కారులో వెళ్తున్న వ్యక్తి పక్కకు జరగండి అన్నందుకు ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ నాయకుడితో పాటు మరో ఆరుగురు వ్యక్తులు విచక్షణారహితంగా దాడి చేసి గాయాలు చేశారు. ఈ విషయం పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లకుండా బాధితుడిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోన్నట్లుగా తెలుస్తోంది. కాగా, ఈ అసోసియేషన్ నాయకుడు పలు వివాదాల్లో తలదూర్చుతాడనే పేరుంది.

కేయూలో విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కేయూలో విద్యార్థులకు గురువారం సెనెట్‌హాల్‌లో సాంస్కృతిక పోటీలు జరిగాయి. ఈనెల 17న కేయూక్యాంపస్ కళాశాల వార్షిక, స్పోర్ట్స్‌డేను పురస్కరించుకుని కళాశాలలోని విద్యార్థులకు సాంస్కృతిక పోటీలను నిర్వహించినట్లు క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్ తెలిపారు. సోలో, గ్రూపు, క్లాసికల్ డ్యాన్స్‌లలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రొఫెసర్ ఈసం నారాయణ, హన్మంతు, రాధికారాణి, కనీజ్ ఫాతిమా, డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్‌లతో కూడిన కమిటీ పర్యవేక్షించగా జడ్జిలుగా డాక్టర్ ప్రవీణ్‌కుమార్, చిరంజీవిలు వ్యవహరించారు. గెలుపొందిన జట్లకు బహుమతులను అందచేస్తామని ప్రిన్సిపాల్ తాళ్లపల్లి మనోహర్ వెల్లడించారు.



నృత్యం చేస్తున్న విద్యార్థులు

పూలే జయంతిని ఘనంగా నిర్వహించాలి

వడ్డేపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : సంఘ సంస్కర్త, సామాజికవేత్త, బీసీల పితామహుడు జ్యోతిరావు పూలే జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్ జవహర్‌కాలనీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జ్యోతిరావు పూలే విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఆ మహనీయుడు సమాజానికి చేసిన సేవలను కొనియాడాలని కోరారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా నేతలు దాడి మల్లయ్య యాదవ్, కాసగోని అశోక్, తమ్మల శోభారాణి, అరెగంటి నాగరాజు, పెరుమాండ్ల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి



విద్యార్థికి వైద్య పరీక్షలు చేస్తున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

మడికొండ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఎండలో బయటికి రావొద్దని, తప్పనిసరైతే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఆరోగ్యశాఖాధికారి అప్పయ్య అన్నారు. కడిపికొండలోని ఆయుష్మాన్ మందిరం 1, 2ను గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఆరోగ్య సేవల్లో అందుతున్న సేవలను పరిశీలించారు. 30 ఏళ్ల వయస్సు పైబడిన వారికి హైపర్ టెన్షన్, డయాబెటీస్ వంటి వ్యాధులతో బాధపడుతున్న వ్యక్తులకు అందుతున్న వైద్య సేవలను తెలుసుకున్నారు. స్వయంగా వైద్యపరీక్షలు చేసి మందులు రాశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. వేసవికాలంలో వచ్చే వ్యాధులు సన్‌స్ట్రోక్, హీట్ స్ట్రోక్, వడదెబ్బ నివారణ కోసం తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ సంతోష్, హెల్త్ అసిస్టెంట్ వెంకటస్వామి, సిస్టర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కేయూలో కాంట్రాక్ట్ అధ్యాపకుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిపాలన భవనం ఎదుట గురువారం కేయూ కాంట్రాక్టు అధ్యాపకులు నిరసన ఆందోళనలు చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా వర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని శాంతియుతంగా నిరసన చేపట్టినట్లు వెల్లడించారు. పోలీసులు తమకు బలవంతంగా అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. కాంట్రాక్టు అధ్యాపకుల జేఏసీ పిలుపు మేరకు గురువారం వర్సిటీలో నిరసన ప్రదర్శనలు చేపట్టినట్లు తెలిపారు. తమకు రెగ్యులర్ చేసేంత వరకు పోరుబాటను ఆపమని చెప్పారు. గురువారం వర్సిటీలో కాంట్రాక్టు అధ్యాపకులు బంద్ పాటించారు. ఈ కార్యక్రమంలో కేయూ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం నేతలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

భీమ్ దీక్షను విజయవంతం చేయాలి



భీమ్ దీక్షకు మద్దతుగా ప్రదర్శన చేస్తున్న స్వేరో నాయకులు


కేయూ క్యాంపస్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఈనెల 13న రంగారెడ్డి జిల్లా తలకొండపల్లిలో నిర్వహించనున్న భీమ్‌దీక్ష ముగింపు సభను విజయవంతం చేయాలని కోరుతూ స్వేరో స్టూడెంట్ యూనియన్ (ఎస్ఎస్‌యూ) జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్ స్వేరో నేతృత్వంలో కేయూలో ప్రదర్శనలు నిర్వహించారు. భయ విమోచన.. నిర్మూలన చేసి జ్ఞానాన్ని పెంచేందుకు రిటైర్డు ఐపీఎస్ డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో దీక్షలు నిర్వహిస్తున్నట్లు సాయికుమార్ తెలిపారు. 13న సాయంత్రం తలకొండపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద సాయంత్రం 6గంటలకు భీమ్ దీక్ష భయావిమోచన దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు, నిరుద్యోగులు, ప్రజలందరూ హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రత్నాకర్, సాత్విక్, తానేశ్, మహేశ్, విజయ్, గణేశ్, సురేశ్, వినయ్, మోజేష్, సతీశ్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

పార్ట్‌టైమ్ అధ్యాపకులకు న్యాయం చేయాలి

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వర్సిటీ రెగ్యులర్ రిక్రూట్‌మెంట్‌లో పార్టుటైమ్ అధ్యాపకులకు న్యాయం చేయాలని కోరుతూ గురువారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంకు తన చాంబర్‌లో కలిసి వినతి పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా పార్టుటైమ్ అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ వై.రాంబాబు, డాక్టర్ దేవోజీనాయక్‌లు మాట్లాడారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. జీవో నెంబరు 21లో మార్పులు చేయాలని కోరారు. ఎంఫిల్, పీహెచ్‌డీ, నెట్, స్లెట్‌లకు ప్రాధాన్యత కల్పించాలని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ రామచంద్రం వీసీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తామని హామీ ఇచ్చినట్లు పార్టుటైమ్ అధ్యాపకుల సంఘం నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ సురేందర్ నాయక్, దేవోజీ, సంజీవ్, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.



రిజిస్ట్రార్ రామచంద్రానికి వినతిపత్రం ఇస్తున్న పార్ట్‌టైమ్ అధ్యాపకులు



వందే అనిలాత్మజం

శ్రీరామదూత అయిన హనుమంతుడు అమేయ బలసంపన్నుడు. ఆయన నామ స్మరణతో భయాందోళనలు తొలగిపోతాయని, భూతప్రేతాదులు పారిపోతాయనీ ప్రతీతి. భక్తుల పాలిట కల్పవృక్షమైన ఆంజనేయుడు బలం, భక్తి, వినయం, విధేయతలకు ప్రతిరూపం. చైత్ర పౌర్ణమినాడు విజయప్రదాత అయిన హనుమద్విజయోత్సవాన్ని నిర్వహిస్తారు. ఇంతకీ ఈ రోజు ప్రత్యేకత ఏమిటి?

రావణ సంహారం అనే లక్ష్యం దిశగా రామాయణ గాథ నడవడంలో ప్రధాన పాత్ర హనుమంతుడిదే. అందుకే...

గోష్పదీకృత వారాశిం మశకీకృతరాక్షసం
రామాయణ మహామాలా రత్నం వందే అనిలాత్మజం... అన్నారు. "సముద్రాన్ని గోవు పాదంలా భావించి దాటినవాడు, రాక్షసులను దోమల్లా పరిగణించి మట్టుపెట్టినవాడు, 'రామాయణం' అనే మాలలో రత్నంగా భాసిల్లినవాడు అయిన వాయుపుత్రుడికి నమస్కారాలు" అని దీని భావం. అంతటి మహనీయుడైన హనుమంతుడి జయంతిని ఏ రోజు నిర్వహించాలనే విషయంలో సందిగ్ధత ఉంది. ఉత్తర భారతదేశ ప్రజలు హనుమజ్జయంతిని చైత్ర పౌర్ణమి నాడు జరుపుకొంటారు. తమిళనాడులో మార్గశిర అమావాస్య నాడు, ఒడిశాలో మేష సంక్రాంతి రోజున నిర్వహిస్తారు. తెలుగు ప్రాంతాల్లో చైత్ర పౌర్ణమిని హనుమద్విజయోత్సవంగా, వైశాఖ బహుళ దశమిని హనుమజ్జయంతిగా జరుపుకొనే ఆనవాయితీ కనిపిస్తుంది. వైశాఖ మాసం కృష్ణపక్షంలోని దశమి మంగళవారం నాడు... పూర్వాభాద్ర నక్షత్రంలో హనుమంతుడు జన్మించాడని పండితులు పేర్కొంటున్నారు.

"పరాశర సంహితలోని 'వైశాఖే మాసి కృష్ణాయాం దశమ్యాం మందవాసరే... పూర్వాభాద్ర ప్రభూతాయ మంగళం శ్రీ హనూమతే..' అనే శ్లోకాన్ని దీనికి ప్రమాణంగా తీసుకోవాలి" అని చెబుతున్నారు.

హనుమంతుడి జయంతిని ఏ రోజు నిర్వహించాలనే విషయంలో సందిగ్ధత ఉంది. ఉత్తర భారతదేశ ప్రజలు హనుమజ్జయంతిని చైత్ర పౌర్ణమి నాడు జరుపుకొంటారు. తమిళనాడులో మార్గశిర అమావాస్య నాడు, ఒడిశాలో మేష సంక్రాంతి రోజున నిర్వహిస్తారు. తెలుగు ప్రాంతాల్లో చైత్ర పౌర్ణమిని హనుమద్విజయోత్సవంగా, వైశాఖ బహుళ దశమిని హనుమజ్జయంతిగా జరుపుకొనే ఆనవాయితీ కనిపిస్తుంది.

లంకాదహనం... శ్రీరామ సత్కారం

హనుమద్విజయోత్సవానికి సంబంధించి పలు కథలు ప్రచారంలో ఉన్నాయి. సీతను అన్వేషిస్తున్న హనుమంతుడు... లంకలో ఆమెను కనుగొన్నాడు. ఆ సంతోషంలో అశోక వనాన్ని నాశనం చేశాడు. రావణుడి సైనికులు ఆయనను బంధించి, తోకకు నిప్పు అంటిస్తే... ఆ నిప్పుతో లంకాదహనం చేశాడు. ఆ రోజు చైత్ర పౌర్ణమి. రావణ సైన్యంపై హనుమంతుడు సాధించిన విజయానికి చిహ్నంగా ఈ వేడుకలను నిర్వహించుకోవడం సంప్రదాయంగా మారిందనేది ఒక కథ. కాగా, మరో కథ ప్రకారం.. రావణ సంహారం తరువాత అయోధ్యకు వచ్చి పట్టాభిషిక్తుడైన రాముడు... తన విజయానికి ఎంతగానో దోహదపడిన హనుమంతుణ్ణి ఆప్యాయంగా ఆలింగనం చేసుకొని, ఘనంగా సత్కరించాడు. చైత్ర పౌర్ణమి నాడు జరిగిన ఈ సత్కారానికి చిహ్నంగా... ఆ రోజును ప్రజలు హనుమద్విజయోత్సవంగా నాటి నుంచి జరుపుకొంటున్నారు.

ఏం చేయాలి?: హనుద్విజయోత్సవం నాడు హనుమాన్ చాలీసా, ఆంజనేయ స్తోత్రాలను పఠించడం, పండ్లను, వడమాలను, అప్పాల మాలను, తమలపాకుల దండను సమర్పించడం, సిందూరంతో పూజించడం ద్వారా అన్ని పనుల్లో విజయం కలుగుతుంది. అలాగే చైత్ర పౌర్ణమి నుంచి వైశాఖ బహుళ దశమి వరకూ... నలభై రోజుల పాటు హనుమాన్ చాలీసాను వీలైనన్నిసార్లు పఠిస్తే హనుమంతుడి అనుగ్రహం లభిస్తుందనేది పెద్దల మాట.

(రేపు హనుమద్విజయోత్సవం)

కర్మయోగం

భగవద్గీతలో అత్యంత ప్రాచుర్యం పొందిన శ్లోకాలలో 'కర్మణ్యే వాధికార స్తే మా ఫలేషు కదాచన...' అనేది ఒకటి. 'మనకు కర్మ చేసే అధికారం ఉంది కానీ, కర్మ ఫలం మీద అధికారం లేదు' అని చెబుతున్న ఈ శ్లోకాన్ని భగవద్గీత సారాశం అని చెప్పవచ్చు. మనకు ప్రియమైన వారికి శస్త్రచికిత్స అవసరమైనప్పుడు... నిజాయితీ కలిగిన, సమర్థుడైన సర్జన్ కోసం చూస్తాం. ఎందుకంటే అతని యోగ్యత... శస్త్రచికిత్స విజయాన్ని సూచిస్తుంది. అతని నిజాయితీ... అనవసరమైన శస్త్రచికిత్స చేయరనే భరోసా ఇస్తుంది. అంటే సంక్షిప్తంగా మనం కర్మయోగి అయిన సర్జన్ కోసం వెతుకుతున్నామని అనుకోవచ్చు. ఇలాంటి సందర్భంలో మనం కోరుకొనే రెండు ప్రత్యేకతలు ఈ శ్లోకాన్ని మనం బాగా అర్థం చేసుకోవడానికి ఎంతో సహాయపడతాయి.

కర్మ ఫలం గురించి చింతించకుండా కర్మలో లోతుగా నిమగ్నమైనప్పుడు... మనం కాలాతీతమైన (కాలాన్ని అధిగమించిన) స్థితికి చేరుకుంటాం. అంటే ఇక్కడ సమయంతో సంబంధం లేదు. పైన చెప్పిన శస్త్రచికిత్స ఉదాహరణనే తీసుకుందాం. మనం ఆపరేషన్ థియేటర్ వెలుపల ఉన్నప్పుడు.. సమయం చాలా నెమ్మదిగా గడుస్తున్నట్టు అనిపిస్తుంది. మరోవైపు కర్మయోగి అయిన సర్జన్.. శస్త్రచికిత్సలో నిమగ్నమై, సమయానికి సంబంధించిన స్పృహను కోల్పోతారు. ఇంకో విధంగా చూస్తే... అతని దృష్టిలో సమయం ఆగిపోయి ఉంటుంది.

మనకు సేవ చేసేవారందరూ కర్మయోగులుగా ఉండాలని, సర్వోత్తమ ఫలితాలు అందించాలని మనం ఆశిస్తూ ఉంటాం. అదే సూత్రాన్ని మనకు అన్వయించుకుంటే... మనం కూడా మన దైనందిన జీవితంలో ఇతరులకు సేవ చేస్తూ కర్మయోగులుగా ఉండాలి. పని చేసే చోట, కుటుంబ వ్యవహారాల్లో ఏ బాధ్యత నిర్వర్తించినా సర్వోత్తమమైన కృషి చేయాలి. కర్మయోగ సాధనలో వేసే చిన్న చిన్న అడుగులు... మనల్ని సమత్వానికి దగ్గరగా తీసుకువస్తాయని, అవి మనలో ఆనందాన్ని కలిగిస్తాయని శ్రీకృష్ణుడు చెబుతున్నాడు. మనం మళ్ళీ కలుసుకొనే అవకాశం లేనివారికి అత్యుత్తమ సేవలను అందించగలిగినప్పుడు... మనం కర్మయోగిగా మారే మార్గంలో దృఢంగా ఉన్నామని అర్థం.



కె.శివప్రసాద్



పునరుత్థానానికి నిరీక్షణ

దైవ కుమారుడైన ఏసు క్రీస్తు మరణం, పునరుత్థానం అద్వితీయమైన ఘట్టాలు. వాటిని స్మరించుకుంటూ... దైవ చింతనకు, సేవకు పునరంకితం కావడానికి ఉద్దేశించిన రోజులు... 'లెంట్ డేస్' లేదా 'శ్రమ దినాలు'. క్రీస్తు మరణానికి ముందు ఉండే నలభై రోజులను 'శ్రమదినాలు' అంటారు. ఏసు క్రీస్తు తనంతట తానుగా పట్టుబడి, రోమన్ సైనికుల ద్వారా శిలువ శిక్షకు గురి కాకవడానికి ముందు... నలభై రోజుల పాటు ఎడారిలో ఉన్నాడు. తన తండ్రి అయిన దేవుణ్ణి ధ్యానిస్తూ ఉపవాస దీక్ష పాటించాడు. దానికి గుర్తుగా... ఆ నలభై రోజుల్లో క్రైస్తవులు ఉపవాసాలు చేస్తారు. దాన ధర్మాలు చేయడం, ఇతరుల పట్ల ద్వేష భావాన్ని తొలగించుకొని, స్నేహంతో, ప్రేమపూర్వకంగా ఉండడం లాంటి నియమాలను అనుసరిస్తారు. కాగా, రోమన్ క్రైస్తవులు ప్రతి శుక్రవారం 'శిలువ మార్గం' అనే భక్తి ధ్యాన ప్రక్రియను పాటిస్తారు. క్రీస్తు మరణ సంబంధమైన ఘట్టాలను పునశ్చరణ చేసుకుంటారు.

జనోద్ధరణ కోసం ఏసు హింసకు గురయ్యాడు, శిలువపై మరణించాడు. అది గుడ్ ఫ్రైడే. ఆ తరువాత మూడో రోజున తిరిగి ప్రాణాలతో లేచాడు. అదే పునరుత్థాన పండుగ... ఈస్టర్. ఆ రోజును గమ్యంగా చేసుకొని ఈ దీక్షలు కొనసాగుతాయి. ఏసును ధ్యానిస్తూ... గతంలో చేసిన పొరపాట్లను గుర్తు చేసుకొని, పశ్చాత్తాపం చెందడానికి, మానసికంగా పరిశుద్ధులు కావడానికి, తమలోని దోషాలను సరిదిద్దుకోవడానికి అనువైన రోజులుగా వీటిని పరిగణిస్తారు. విలాసవంతమైన జీవన విధానానికి, విందులకు, వినోదాలకు, ఆర్భాటాలకు దూరంగా ఉంటారు. శుభ శుక్రవారం కోసం, ఆ తదుపరి ఆదివారం వచ్చే ఈస్టర్ కోసం సమాయత్తమయ్యే దినాలు. క్రీస్తు పునరుత్థానానికి నిరీక్షణ దినాలు.

• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్



ప్రతిదీ పాఠం చెబుతుంది!



ఒకప్పుడు చైనాలో అత్యంత ప్రాచుర్యం పొందిన గురువుల్లో లావోట్జూ ముఖ్యుడు. అతనికి ప్రధాన శిష్యుడు, చైనా తాత్త్వికుల్లో పేరుపొందినవాడు చువాంగ్ట్జూ. అతను ఎల్లప్పుడూ ఒక మానవ కపాలాన్ని (పుర్రెను) తన దగ్గరే ఉంచుకొనేవాడు. ఇది చాలాకాలం పాటు గమనించిన అతని శిష్యులు "గురువుగారూ! మీరు ఎప్పుడూ ఆ పుర్రెను మీ దగ్గరే పెట్టుకుంటారు. అది ఎందుకనేది మాకు అర్థం కావడం లేదు. దాన్ని చూసినప్పుడల్లా మాకు వెగటు కలుగుతోంది. దాన్ని మీతోనే ఎందుకు ఉంచుకుంటారు?" అని అడిగారు.

"దాన్ని ఎప్పుడూ, నా ఎదురుగా ఉంచుకోవడానికి కారణం ఏమిటంటే... ఇప్పుడు మీరు నన్ను ఎలా గౌరవిస్తున్నారో... ఈ పుర్రె ఉన్న వ్యక్తిని ఒకనాడు కొందరు గౌరవించి ఉంటారు. కానీ ఇప్పుడేమయింది? దాన్ని చూస్తేనే మీకు వెగటు కలుగుతోంది. రేపు నా పుర్రె గతీ అంతేకదా! ఆ సంగతి నిరంతరం గుర్తుంచుకోవడానికే ఈ పుర్రెను ఎల్లప్పుడూ నా ముందు ఉంచుకుంటాను. ఇది ఒక రకంగా నన్ను మెళకువతో ఉంచే గురువు. దానికి నేను కృతజ్ఞుణ్ణి. నిజానికి అది ఒకప్పుడు నన్ను కాపాడింది. ఒక వ్యక్తి నా మీద విపరీతమైన కోపంతో... నా తలమీద పాదరక్షతో కొట్టడానికి వచ్చాడు. ఆ వ్యక్తి మాటలకు, చేతలకు నాకు విపరీతమైన కోపం వచ్చింది. నా సహనాన్ని కోల్పోయి ఏం చేసేవాణ్ణో? ఆ తరువాత ఎంత ఘోరమైన నరకాన్ని అనుభవించేవాణ్ణో? ఆ సమయంలో నా ఎదురుగా ఉన్న పుర్రె... 'ఇప్పుడు నాకు పట్టిన గతే నీకు రేపోమాపో పడుతుంది. అటు పోయేవారు, ఇటు వచ్చేవారు నిన్ను కాలితో తంతారు. ఆ వ్యక్తి ఏదో తెలీక నీ మీద కోపగించాడు. ఆ మాత్రం దానికే నువ్వు రెచ్చిపోతే ఎలా? రేపటి సంగతి ఆలోచించు' అనే ఆలోచనను నాలో రేకెత్తించింది. అది నూరుపాళ్ళూ సత్యమే అని తెలుసుకొన్నాను. "సోదరా! ఇలారా! నీకు ఇష్టం వచ్చినంత సేపు నన్ను కొట్టు, తృప్తిగా తిరిగి వెళ్ళు" అని ఆ వ్యక్తిని ఆహ్వానించాను. అతను వెంటనే తన పాదరక్షలను దూరంగా విసిరేసి, నా కాళ్ళు పట్టుకొని నన్ను క్షమించండి" అని వేడుకున్నాడు. నాకు ఆ గౌరవాన్ని, ఆ వ్యక్తిలో మార్పును తీసుకువచ్చింది ఈ పుర్రే కదా!" అన్నాడు చువాంగ్.

నేర్చుకోవడానికి సిద్ధపడితే రాయి, రప్ప, చెట్టు, గుట్ట... చివరకు పుర్రె కూడా మనకు విలువైన పాఠాలు నేర్పిస్తాయి, మనల్ని ఉద్ధరిస్తాయి. ఈ సంగతి చువాంగ్‌కు బాగా తెలుసు. కాబట్టే ఒక రోజు రాత్రి శ్మశానంలోంచీ వెళుతూ ఉండగా... చీకట్లో తన కాలికి తగిలిన పుర్రెకు క్షమాపణ చెప్పి, తన నివాసానికి దాన్ని తీసుకువచ్చాడు. దాన్ని గురువులా గౌరవించాడు.

• రాచమడుగు శ్రీనివాసులు

హనుమంతుడు ఎవరు?

హిందూ సంస్కృతిలో ఇష్టదేవతారాధన ఒక ముఖ్యమైన తాత్త్విక భావన. ఒకరిని పూజిస్తూనే ఇతర దేవతలను ద్వేషించకుండా.. వారిని కూడా గౌరవిస్తారు. బహుశా ప్రపంచంలో మరే మతంలోను ఈ తరహా సంప్రదాయం కనిపించదు. హనుమంతుడు కూడా ఈ తరహా దేవుడే! హనుమంతుడిని మనం రాముడి పరివారంలో భాగంగా చూడవచ్చు. లేదా శివుడు, విష్ణువు మొదలైన వారిని చేరుకోవటానికి ఒక మార్గంలా కూడా భావించవచ్చు. మన పూర్వ గ్రంథాలలో హనుమంతుడిని భక్తితత్వానికి ప్రతిరూపంగా చిత్రీకరిస్తారు. హనుమంతుడు ఆడగలడు. పాడగలడు. తప్పు చేసిన వారిని శిక్షించగలడు. దుర్గా దేవిలోని శక్తి, సరస్వతి దేవిలోని విజ్ఞానం, లక్ష్మీదేవిలోని సంపదలను తన భక్తులకు ఇవ్వగలిగినవాడు హనుమంతుడే! అందువల్లనే మన దేశంలో అనేక ప్రాంతాల్లో హనుమంతుడికి గుడులు కనిపిస్తాయి.

అనేక రూపాలలో...

భగవంతుడు కేవలం పురుషుడే కాదని.. అర్ధనారీశ్వరుడని కొందరు నమ్ముతారు. ఇది మన స్థానిక సంస్కృతులలో ఒక కీలకమైన అంశం. అందుకే హనుమంతుడు చత్తీస్‌గఢ్‌లోని రత్నపూర్ జిల్లాలోని ఒక గుడిలో చీరకట్టుకొని, ముక్కుపుడక పెట్టుకొని కనిపిస్తాడు. మనకు అందుబాటులో ఉన్న గ్రంథాలను పరిశీలిస్తే - దేవుళ్లకు ఉన్న సమస్యలను కూడా తీర్చే వ్యక్తిగా హనుమంతుడు మనకు దర్శనమిస్తాడు. రామాయణంలో లక్ష్మణుడు స్పృహ తప్పిపడిపోయినప్పుడు సంజీవినిని తెచ్చి కాపాడతాడు. సీతను కనుగొనటంలో సముద్రాన్ని దాటి లంకకు చేరుకుంటాడు. ఇలా దేవుళ్లకే సాయం చేయగలిగిన వ్యక్తి మానవులకు ఎందుకు సాయం చేయలేడు? బహుశా అందుకే భారతదేశంలో కొండల్లో.. గుట్టల్లో హనుమంతుడి ఆలయాలు మనకు కనిపిస్తూ ఉంటాయి. తమకున్న సమస్యలను పరిష్కరించమని హనుమంతుడిని అందరూ కోరుకుంటూ ఉంటారు.

అనేక గ్రామాల శివార్లలో హనుమంతుడి విగ్రహం కనిపిస్తూ ఉంటుంది. ఈ విగ్రహమే తమను దుష్టశక్తుల నుంచి రక్షిస్తుందని ప్రజలు నమ్ముతూ ఉంటారు.



మన దేశంలో ఆదివాసీ ప్రాంతాల్లో ప్రచారంలో ఉన్న రామాయణంలో హనుమంతుడు లంకకు వెళ్లినప్పుడు ... అక్కడ ఒక పెద్ద భవనం కనిపిస్తుంది. అది రావణుడు రాజభవనం. దానిలోని రావణుడు కూర్చునే ఒక సింహాసనం ఉంటుంది. ఆ సింహనం కింద రావణుడు- శనిని, యముణ్ణి బంధించి ఉంచుతాడు. హనుమంతుడు వారిద్దరిని విడుదల చేస్తాడు. తమకు స్వేచ్ఛను కలగజేశాడు కాబట్టి వీరిద్దరూ హనుమంతుడికి రుణపడి ఉంటారు. అందుకే తీవ్రమైన ఈతి బాధలు వచ్చినప్పుడు హనుమాన్ చాలీసా చదువుకొమ్మని చెబుతారు. హనుమంతుడిని ప్రసన్నం చేసుకుంటే వీరిద్దరి అనుగ్రహం కూడా పొందవచ్చని భావిస్తారు.

- లఖనవూలో మే-జూన్ నెలల మధ్య- బడా మంగల్ - అనే ఉత్సవాన్ని జరుపుతారు. లక్నోను నవాబులు పరిపాలించే కాలంలో ఒక ప్రాంతంలో ఒక పెద్ద హనుమంతుడి విగ్రహం బయటపడింది. దీనిని శుభసూచకంగా భావించిన నవాబులు ఈ ఉత్సవాన్ని ప్రారంభించారు. ఈ రోజుకు ఈ ఉత్సవం జరుగుతుంది. వేల మంది ప్రజలు హనుమంతుడి విగ్రహాన్ని దర్శించుకోవటానికి వస్తారు. వారికి స్థానిక ముస్లిములు అవసరమైన ఏర్పాట్లు చేస్తారు.

ఆ దేవి దర్శనం ఏడాదికి ఒకసారే!

మంగళాదేవి కన్నగి ఆలయ సందర్శన ఆధ్యాత్మిక యాత్ర మాత్రమే కాదు, సాహస యాత్ర కూడా. చుట్టూ క్రూరమృగాల సంచారం ఉన్న దట్టమైన అడవుల మధ్య ఉన్న ఈ ఆలయంలోకి భక్తులను ఏడాదికి ఒకసారి మాత్రమే అనుమతిస్తారు. కేరళ, తమిళనాడు రాష్ట్రాల సరిహద్దుల్లో కొలువైన మంగళాదేవి కన్నగికి చారిత్రకంగానూ, సాహిత్యపరంగానూ కూడా ప్రాధాన్యం ఉంది.

పశ్చిమ కనుమల్లోని పెరియార్ పులుల అభయారణ్యం వృక్ష, జీవ వైవిధ్యానికి నెలవు. ఈ అరణ్యంలో... సముద్రమట్టానికి దాదాపు అయిదువేల అడుగుల ఎత్తున ఉన్న మంగళాదేవి కన్నగి ఆలయానికి ఎన్నో విశిష్టతలు ఉన్నాయి. దీని నిర్మాణం వెనుక ఆసక్తికరమైన కథ ఉంది.

ఎవరీ కన్నగి?

ప్రాచీన తమిళ సాహిత్యంలో గొప్ప ఇతిహాసాలుగా పరిగణించే అయిదింటిలో 'సిలప్పదికారం' ఒకటి. దీన్ని క్రీస్తుశకం అయిదు, ఆరు శతాబ్దాల మధ్య తమిళ సంగమ సాహిత్య యుగంలో రచించారనేది చరిత్రకారుల అభిప్రాయం. ఒక సామాన్య మహిళ ప్రధాన పాత్రగా రూపొందిన తొలి తమిళ కావ్యం కూడా ఇదే. 'సిలప్పదికారం' కథాంశానికి వస్తే... కోవలన్ అనే ధనికుడైన వ్యాపారితో కన్నగి వివాహం జరిగింది. తన సంపదనంతటినీ ఒక నర్తకి కోసం ఖర్చు చేసిన కోవలన్... పశ్చాత్తాపంతో తిరిగి భార్యను చేరుకున్నాడు. కొత్త జీవితాన్ని మొదలుపెట్టాలని నిర్ణయించుకున్న ఆ దంపతులు... మదురై నగరానికి వెళ్ళారు. అక్కడ కన్నగి కాలి అందెను అమ్మడానికి వెళ్ళాడు. మదురై రాణి కాలి అందె దొంగతనానికి గురి కావడంతో... దానికోసం వెతుకుతున్న భటులు కోవలన్‌ను అనుమానించి బంధించారు. ఎలాంటి విచారణ లేకుండానే రాజు ఆదేశం మేరకు కోవలన్‌కు మరణ శిక్ష అమలు చేశారు. ఈ సంగతి తెలిసిన కన్నగి రాజాస్థానానికి వెళ్ళి, చోరీకి గురైన అందె, కోవలన్ అమ్మబోయిన అందె ఒకటి కాదని నిరూపించింది. దాంతో... ఒక నిరపరాధిని శిక్షించాననే వేదనతో రాజు గుండె పగిలి మరణించాడు. కన్నగి కోపాగ్నికి మధురై నగరం దగ్ధమయింది. ఆ తరువాత పద్నాలుగు రోజుల పాటు కాలినడకన ప్రయాణించిన కన్నగి... ప్రస్తుతం ఆలయం ఉన్న ప్రదేశమైన వెంగైకనల్ నెడున్ కుంద్రం దగ్గరకు చేరుకుంది. అక్కడ దివ్య రూపంలో ఉన్న తన భర్తను ఆమె కలుసుకుందనీ, వారిద్దరూ ఆకాశంలోకి ఎగిరి అంతర్ధానమైపోయారనీ ఆ ఇతిహాసం చెబుతోంది. ఈ అపూర్వ ఘటనను ప్రత్యక్షంగా చూసిన వారు... చేర రాజు సెంగుట్టువన్‌కు వివరించగా... ఆయన ఆ ప్రదేశాన్ని సందర్శించాడనీ, హిమాలయాల నుంచి శిలలను తెప్పించి... కన్నగి ఆలయాన్ని నిర్మించాడనీ స్థల పురాణం వెల్లడిస్తోంది. సెంగుట్టవన్ క్రీస్తుశకం రెండో శతాబ్దానికి చెందినవాడు. కాబట్టి ఈ ఆలయం 1800 ఏళ్ళ నాటిదని స్థానికులు పేర్కొంటున్నారు.

ఎలా వెళ్ళాలి?
కేరళలోని ఇడుక్కి జిల్లాలోని కుమిలీ నుంచి సుమారు పది కిలోమీటర్లు, తమిళనాడులోని తేని జిల్లా పళియంకుడి నుంచి ఏడు కిలోమీటర్ల దూరంలో మంగళాదేవి కన్నగి ఆలయం ఉంది. ఇరువైపులా నుంచి ట్రెక్కింగ్ చేయవచ్చు. అయితే కుమిలీ నుంచి జీపుల్లో ప్రయాణించే అవకాశం ఉంది.

ఎన్నో ఆంక్షల మధ్య...

కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో కన్నగిని దేవతగా ఆరాధించే ఆలయాలు అనేక చోట్ల కనిపిస్తాయి. మంగళాదేవి కన్నగి ఆలయం అడవుల్లో ఉండడం వల్ల చేరుకోవడం కష్టం. దానికి తోడు ఈ ప్రాంతాన్ని అభయారణ్యంగా ప్రకటించడంతో అనేక ఆంక్షలు అమలవుతున్నాయి. ప్రతి సంవత్సరం చైత్ర పౌర్ణమినాడు జరిగే ఉత్సవాలకు మాత్రమే భక్తులను అనుమతిస్తారు. అటవీ, పోలీసు అధికారుల పర్యవేక్షణలో ఈ యాత్ర సాగుతుంది. ఈ ఉత్సవాలను కేరళ, తమిళనాడు ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తాయి. పర్యావరణ పరిరక్షణ కోసం, జంతువుల భద్రత కోసం ఈ ప్రాంతం మీద నిరంతరం నిఘా ఉంటుంది. మామూలు రోజుల్లో ఈ ప్రాంతాన్ని సందర్శించాలంటే... అటవీ అధికారుల అనుమతి తప్పనిసరి. చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఆలయం కావడంతో... దీన్ని యథాతథ స్థితిలో కేరళ పురావాస్తు శాఖ భద్రపరిచింది. ఈ కారణంగా... ఆలయం శిథిలావస్థలో దర్శనమిస్తుంది. దీర్ఘచతురస్రాకారంలోని గ్రానైట్ రాళ్ళను పేర్చినట్టుండే ఈ కట్టడంలో పాండ్య నిర్మాణ శైలి కనిపిస్తుంది. ఇక్కడ మంగళాదేవితో పాటు శివుడు, వినాయకుడు తదితర ఉపాలయాలు ఉన్నాయి. చైత్ర పౌర్ణమినాడు అమ్మవారికి విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు జరుగుతాయి. ఆమెను దర్శించుకోవడానికి వేల సంఖ్యలో భక్తులు తరలివస్తారు.





విద్యార్థి వీసా రద్దయితే ఇంటికేనా?

- 15 రోజుల్లోగా అమెరికా వీడాలని నిబంధన
- అయోమయంలో వేలాది భారత విద్యార్థులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: గ్రీన్‌కార్డులు రద్దవుతున్నాయి. తాత్కాలిక వర్క్ వీసాలపై కత్తి వేలాడుతోంది.. ఏఐ సాంకేతికతను వినియోగించి మరీ విద్యార్థులను దేశం నుంచి బహిష్కరిస్తున్నారు.. ప్రస్తుతం అమెరికాలో ఉంటున్న చాలామంది భారతీయుల పరిస్థితి ఇదే. దీనికితోడు ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడ్డారని.. డ్రైవింగ్ లైసెన్స్ లేదని ఇలా చిన్నచిన్న సాకులతోనూ భారత్ సహా పలువురు అంతర్జాతీయ విద్యార్థుల వీసాలను ట్రంప్ సర్కార్ రద్దు చేస్తోంది. వీరంతా వీసా రద్దయిన 15రోజుల్లోగా స్వీయ బహిష్కరణ కింద సీబీపీ యాప్‌లో తమ పేర్లు నమోదు చేసుకొని, స్వదేశాలకు తిరిగి వెళ్లిపోవాల్సి ఉంటుంది. ఈ విషయంలో అమెరికా చట్టాలు ఏం చెబుతున్నాయో బాధిత విద్యార్థులకు ఇమిగ్రేషన్ నిపుణులు సూచిస్తున్నారు.

అమెరికాలో మనోళ్లే అధికం

అమెరికాలోని అంతర్జాతీయ విద్యార్థుల్లో భారత్‌కు చెందినవారే అత్యధికం. 2023-24లో అమెరికాలో 11,26,690 మంది విదేశీ విద్యార్థులు ఉన్నారు. వీరిద్వారా ఆ దేశ ఆర్థిక వ్యవస్థకు 43.8 బిలియన్ డాలర్ల ఆదాయం లభించడంతో పాటు 3,78,000 ఉద్యోగాల కల్పన జరిగింది. 2024 నవంబరునాటికి అమెరికాలోని చైనా విద్యార్థుల సంఖ్యను భారత్ అధిగమించింది. అయితే 2023తో పోలిస్తే 2024లో భారత విద్యార్థులకు ఆమోదించిన వీసాల సంఖ్య 34శాతం తక్కువ. ఇప్పుడు కాలేజీల్లో చదివే విద్యార్థుల వీసాలను ట్రంప్ ప్రభుత్వం రద్దు చేస్తోంది. వలసదారుల విషయంలో ట్రంప్ ప్రభుత్వం అనుసరిస్తున్న కఠిన వైఖరితో విద్యార్థి వీసాలను అధికారులు రద్దు చేస్తున్నారు. దీంతో లక్షలాది మంది భారత విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పాలస్తీనాకు మద్దతుగా క్యాంపస్‌ల్లో చేపట్టిన ఆందోళనలకు మద్దతు పలికారన్న ఆరోపణలపై ఇటీవల కొందరు విదేశీ విద్యార్థులను దేశంనుంచి బహిష్కరించారు. ఇప్పుడీ నిరసనలతో ఏ సంబంధంలేకున్నా వీసాలు రద్దు చేస్తున్నారు. ఈ జాబితాలో హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్, మిచిగాన్, ఒహియో తదితర ప్రతిష్ఠాత్మక వర్సిటీలు, కాలేజీలున్నాయి.

ఇమిగ్రేషన్ లాయర్ల సంఘం నోట్

అకస్మాత్తుగా వీసా రద్దవడంతో పలువురు భారతీయ విద్యార్థులు స్వీయ బహిష్కరణకు గురవుతున్నారు. దీంతో బాధితులు న్యాయ సహాయం పొందాలని పలు విద్యాసంస్థలు సూచిస్తున్నాయి. 'అంతర్జాతీయ విద్యార్థులపై ఇమిగ్రేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు'అనే అంశంపై అమెరికన్ ఇమిగ్రేషన్ లాయర్ల సంఘం ఇటీవల ఓనోట్ విడుదల చేసింది. అందులో స్టూడెంట్ అండ్ ఎక్స్‌చేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (సెవిస్) రికార్డు తొలగింపు అంశంలో విదేశీ విద్యార్థులు ఎలాంటి చర్యలు తీసుకోవడానికి అవకాశాలున్నాయో వివరించింది. ఇక వీసా రద్దైన సమయంలో విద్యార్థులు ఏ ఉద్యోగం చేయడం, ఇంటర్న్‌షిప్‌లో, విద్యాసంబంధమైన ప్రాక్టికల్స్ శిక్షణలో పాల్గొనడం కుదరదు. ఎస్ఈవీఐఎస్ రికార్డును పునరుద్ధరణకు నిరాకరించిన సందర్భంలో దానిపై సమీక్షించే అధికారం ఇమిగ్రేషన్ న్యాయమూర్తులకు కూడా ఉండదు. విద్యార్థి వీసా రద్దయితే వారు స్వదేశానికి తిరిగి వెళ్లిపోవడానికి అవసరమైన ప్రక్రియను పూర్తి చేయడానికే అమెరికాలో ఉండటానికి అనుమతి లభిస్తుంది. అయితే తమపై ఉన్న కేసును సవాల్ చేసే హక్కు, సొంత ఖర్చులతో న్యాయ నిపుణులను నియమించుకొని కోర్టులో పోరాడే హక్కు వారికి ఉంటుంది. ఇక భారత విద్యార్థులు, దరఖాస్తుదారులకు ఇమిగ్రేషన్.కామ్ మేనేజింగ్ అటార్నీ రాజీవ్ ఖన్నా మార్గదర్శకాలు జారీ చేశారు. విద్యార్థులు తమ ఈమెయిల్‌ను తాజా అప్‌డేట్ల కోసం నిరంతరం పర్యవేక్షించాలని, విద్యాసంస్థలో వారి అడ్మిషన్, అకడమిక్ స్టేటస్ రికార్డులు వెంట ఉంచుకోవాలన్నారు. వర్సిటీలు, ఇమిగ్రేషన్ న్యాయవాదుల మద్దతు అమెరికాలోని చాలామంది భారత విద్యార్థులకు ఉపశమనం కలిగే అవకాశం ఉంది.

యూదు వ్యతిరేక పోస్టులు పెడితే వీసా రద్దు

- శాశ్వత నివాసానికి అనుమతులూ నిరాకరిస్తాం.. యూఎస్‌సీఐఎస్ ప్రకటన
- విద్యార్థి వీసా, గ్రీన్‌కార్డు దరఖాస్తుదారులకు హెచ్చరికలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: సామాజిక మాధ్యమాల్లో యూదు వ్యతిరేక పోస్టులు పెట్టేవారికి వీసాలు మంజూరు చేయబోమని అమెరికా స్పష్టం చేసింది. ఈ నిబంధన తక్షణమే అమలులోకి వస్తుందని అమెరికా పౌరసత్వ, వలసల విభాగం (యూఎస్‌సీఐఎస్) అధికారికంగా ప్రకటించింది. విద్యార్థి వీసాతోపాటు గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకొనే వారి సోషల్ మీడియా ఖాతాలను జల్లెడ పడతామని, యూదు వ్యతిరేక కంటెంట్ పోస్టు చేసేవారికి వీసా నిరాకరిస్తామని ఇమిగ్రేషన్ అధికారులు స్పష్టం చేశారు. ఇప్పటికే అమెరికాలో ఉంటున్నవారు ఇటువంటి చర్యలకు పాల్పడితే వారి శాశ్వత నివాస అనుమతులు రద్దు చేస్తామని హెచ్చరించారు. హమాస్, లెబనాన్ హెజ్‌బొల్లా, యెమెన్ హౌతీ తిరుగుబాటుదారులతో సహా ఉగ్రసంస్థలుగా అమెరికా వర్గీకరించిన మిలిటెంట్ గ్రూపులకు మద్దతుగా పోస్టులు పెట్టడాన్ని యూదు వ్యతిరేక చర్యలుగా పరిగణిస్తామని యూఎస్‌సీఐఎస్ తేల్చిచెప్పింది. యూదు వ్యతిరేక ఉగ్రవాదాన్ని, ఆ తీవ్రవాద సంస్థల కార్యకలాపాలను సమర్థించడం, ప్రోత్సహించడం, వాటికి మద్దతుగా సోషల్ మీడియాలో ప్రచారం చేయడాన్ని ప్రతికూల అంశాలుగా పరిగణిస్తామని, దీనికి తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించింది. గత కొన్ని వారాలుగా ట్రంప్ ప్రభుత్వం అమెరికాలోని వందలాది మంది విదేశీ విద్యార్థుల వీసాలను రద్దు చేసిన నేపథ్యంలో తాజా ప్రకటన వెలువడింది.

డీఎస్-160 ఫాం సమర్పిస్తేనే వీసా ఇంటర్వ్యూ

అమెరికా వీసా కోసం దరఖాస్తు చేసేవారు ఇకపై ఇంటర్వ్యూ స్లాట్ బుక్ చేసుకోవడానికి ముందే డీఎస్-160 ఫాం తప్పనిసరిగా సమర్పించాలి. ఈమేరకు ఆన్‌లైన్ ఫాం, షెడ్యూల్ ప్రక్రియలో అమెరికా విదేశాంగ శాఖ మార్పులు చేసింది. గతంలో దరఖాస్తుదారులు ఫాం సమర్పించడానికి ముందే స్లాట్ బుక్ చేసుకొనే అవకాశం ఉండేది. ఇది కొన్నిసార్లు దరఖాస్తు ప్రాసెసింగ్‌లో జాప్యానికి కారణమవుతోంది. దీంతో తాజా నిర్ణయంతీసుకున్నారు.


అణు కార్యక్రమం విరమించుకోకుంటే సైనిక చర్య : ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్: అణ్వస్త్రాలను సమకూర్చుకోవాలనే ఆలోచనను విరమించుకోకపోతే సైనిక చర్య తప్పదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌ను హెచ్చరించారు. సైనిక చర్యలో ఇజ్రాయెల్ కూడా పాల్గొంటుందన్నారు. శనివారం ఒమన్ వేదికగా అమెరికా-ఇరాన్ మధ్య చర్చలు జరగనున్న నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. ప్రత్యక్ష చర్చలకు ఒప్పుకోబోమని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ ఇప్పటికే తేల్చి చెప్పగా, జరగాల్సిందేనని ట్రంప్ పట్టుబడుతున్నారు.

చిత్రజ్యోతి

SINCE 1965

విశ్వంభర నుంచి రామ రామ



చిరంజీవి హీరోగా వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం'విశ్వంభర.' యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాపై అభిమానుల్లో అంచనాలు తారస్థాయికి చేరుకున్నాయి. ఈ చిత్రం నుంచి తొలి గీతం 'రామ రామ'ను ఈ శనివారం విడుదల చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా పోస్టర్ రిలీజ్ చేసింది. పోస్టర్‌లో చిరంజీవి చుట్టూ పిల్లలు హనుమంతుడి వేషధారణలో ఉన్నారు. అలాగే బ్యాక్‌డ్రాప్‌లో రాముడి విగ్రహం ఉంది. 'రామ రామ' పాటను రామజోగయ్య శాస్త్రి రాయగా, ఎం.ఎం.కీరవాణి స్వరపరిచారు. కాగా, ఈ చిత్రంలో త్రిష కృష్ణన్, ఆశికా రంగనాథ్ హీరోయిన్లు. కునాల్ కపూర్ కీలక పాత్రలో నటిస్తున్నారు.

మా బిడ్డ ఇంటికొచ్చేసాడు : చిరంజీవి

సింగపూర్‌లోని స్కూల్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కుమారుడు మార్క్ శంకర్ గాయపడిన విషయం తెలిసిన వెంటనే చిరంజీవి, ఆయన సతీమణి సురేఖతో కలసి అక్కడికి వెళ్లారు. మార్క్ శంకర్ ఆరోగ్య పరిస్థితిని వివరిస్తూ చిరంజీవి ట్వీట్ చేశారు. 'మా బిడ్డ ఇంటికొచ్చేసాడు. అయితే ఇంకా కోలుకోవాలి. మా కులదైవమైన ఆంజనేయ స్వామి కృపతో త్వరలోనే పూర్తి ఆరోగ్యంతో, మళ్లీ

వజ్రానికి స్వాగతం



తమిళ నటుడు విజయ్ సేతుపతితో దర్శకుడు పూరి జగన్నాథ్ ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్న విషయం విదితమే. తాజాగా ఈ సినిమాలో టబు భాగమయ్యారు. ఈ మేరకు చిత్రనిర్మాణ సంస్థ పూరి కనెక్ట్స్ ఆమెను ఆహ్వానిస్తూ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టింది. భారతీయ చలనచిత్ర రంగంలో వజ్రంలాంటి టబుకు స్వాగతం అని పూరి కనెక్ట్స్ పేర్కొంది. ఈ చిత్రంలో ఆమె కోసం ఓ అద్భుతమైన పాత్ర సిద్ధంగా ఉంది అని తెలిపింది. పాన్ ఇండియా ప్రాజెక్టుగా తెరకెక్కనున్న ఈ సినిమా షూటింగ్‌ను జూన్‌లో ప్రారంభించటానికి సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. ఇతర తారాగణం, సాంకేతిక బృందం వివరాలను త్వరలోనే ప్రకటించనున్నారు.

రామ్‌చరణ్ ప్రోత్సాహం మరువలేనిది

\- ప్రదీప్ మాచిరాజు



ప్రదీప్ మాచిరాజు, దీపికా పిల్లి జంటగా నటించిన చిత్రం 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'. దర్శక ద్వయం నితిన్, భరత్ దర్శకత్వంలో నిర్మాణ సంస్థ మాంక్స్ అండ్ మంకీస్ నిర్మించింది. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా మేకర్స్ ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రదీప్ మాచిరాజు మాట్లాడుతూ "అద్భుతమైన టీమ్ వర్క్‌కు నిదర్శనం ఈ సినిమా. రామ్‌చరణ్ 'పెద్ది ఫర్ ప్రదీప్' అని చెప్పడాన్ని నా అదృష్టంగా భావిస్తున్నాను. ఆయన మా సినిమా మొదటి టికెట్‌ను కొని ప్రోత్సహించడం ఎప్పటికీ మర్చిపోలేని విషయం. ఈ సమ్మర్‌లో కుటుంబమంతా హాయిగా థియేటర్లో కూర్చుని నవ్వుకునేలా చేసే సినిమా ఇది" అని చెప్పారు. "రామాయణంలో ఉడతని శ్రీరాముడు ఎలా ఎలివేట్ చేశారో తెలిసిందే. అలాగే, మా చిత్రాన్ని రామ్‌చరణ్ శ్రీరాముడిలా ఎలివేట్ చేశారు" అని దర్శకుడు భరత్ చెప్పారు. "మొదలైన క్షణం నుంచి ఎండ్ టైటిల్స్ పడేదాకా వినోదాన్ని అందిస్తుందీ సినిమా" అని దర్శకుడు నితిన్ తెలిపారు.

'హ్యాపీ డేస్'కు ముందు నేనూ అలా ఉండేవాణ్ణి

నిఖిల్



యువ కథానాయకుడు దేవన్ స్వీయ దర్శకత్వంలో రూపొందించిన సూపర్ నేచురల్ లవ్‌స్టోరీకి 'కృష్ణలీల' అని పేరు పెట్టారు. ధన్య బాలకృష్ణ హీరోయిన్. జి. జోత్స్న నిర్మిస్తున్నారు. గురువారం ఈ సినిమా టైటిల్‌ను, మోషన్ పోస్టర్‌ను లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో హీరో నిఖిల్ మాట్లాడుతూ 'దేవన్ చాలా ప్యాషన్ ఉన్న నటుడు, దర్శకుడు. 'హ్యాపీ డేస్' చిత్రానికి ముందు నేను కూడా ఓ మంచి అవకాశం కోసం తపించేవాడిని. దేవుడి దయ వల్ల 'హ్యాపీ డేస్' దొరికింది.' అని అన్నారు. దేవన్ మాట్లాడుతూ 'నాకు సినీ జీవితాన్ని ఇచ్చిన దర్శకనిర్మాతలకు కృతజ్ఞతలు. ఈ సినిమా అందరికీ నచ్చుతుంది' అని చెప్పారు.

ఐసే చడా హై నషా



ఇప్పటికే పలు చిత్రాల్లో హుషారైన ప్రత్యేక గీతాల్లో నర్తించి అభిమానులను అలరించారు తమన్నా భాటియా. ఇప్పుడు మరోసారి ఆమె బాలీవుడ్‌లో ప్రత్యేక గీతంతో మెరవబోతున్నారు. అజయ్ దేవ్‌గణ్ కథానాయకుడిగా నటించిన 'రైడ్ 2' చిత్రంలో ప్రత్యేకగీతం చేశారు తమన్నా. చిత్రబృందం గురువారం ఆ పాటకు సంబంధించిన ప్రోమోను సోషల్ మీడియాలో విడుదల చేయగా వైరల్ అయింది. పూర్తి పాటను నేడు విడుదల చేయనున్నారు. ఇందులో జాక్వెలిన్ ఫెర్నాండేజ్ సైతం నటించారు. జైలర్ చిత్రంలోని 'నువ్వే కావాలయ్యా' పాట తరహాలో నషా సాంగ్ కూడా అభిమానులను ఉర్రూతలూగించడం ఖాయం అనే అభిప్రాయం తమన్నా అభిమానుల నుంచి వినిపిస్తోంది. మే 1న విడుదలవుతున్న ఈ చిత్రంలో వాణీకపూర్ కథానాయిక. రితేశ్ దేశ్‌ముఖ్, సుప్రియా పాఠక్ కీలకపాత్రలు పోషించారు.

టాలీవుడ్

విలన్ల ప్రేమగీతం



అభ్యుదయ దర్శకుడు బాబ్జీ రూపొందించిన 'పోలీస్ వారి హెచ్చరిక' చిత్రం నుంచి ఓ వినూత్న ప్రేమగీతాన్ని సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్ విడుదల చేశారు. 'సాధారణంగా హీరోహీరోయిన్లు ప్రేమ గీతాలు పాడుకుంటారు. కానీ ఈ సినిమాలో విలన్లు డ్యూయెట్ పాడుకోవడం ఓ వెరైటీ కాన్సెప్ట్. ఇలాంటి సరికొత్త పాటను ఆవిష్కరించే అవకాశం రావడం ఆనందంగా ఉంది' అని ఆయన చెప్పారు. సెన్సార్ పనులు పూర్తి చేసి త్వరలో సినిమాను విడుదల చేస్తామని దర్శకుడు బాబ్జీ చెప్పారు. త్వరలోనే వీలైనన్ని ఎక్కువ థియేటర్లలో సినిమాను రిలీజ్ చేస్తామని నిర్మాత బెల్లి జనార్ధన్ చెప్పారు.

ఆ నమ్మకం ఉంది



రచిత మహాలక్ష్మి, సాత్విక్, సాహిత్య ప్రధాన పాత్రలు పోషించిన 'తల్లి మనసు' చిత్రం ఇప్పుడు ఓటీటీలో స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. వి.శ్రీనివాస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 14 నుంచి అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ కానుందని నిర్మాత ముత్యాల అనంతకిశోర్ చెప్పారు. ఈ చిత్ర సమర్పకుడు, సీనియర్ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య మాట్లాడుతూ 'చాలా కాలం తర్వాత ఓ మంచి చిత్రాన్ని చూశామని ప్రేక్షకులు చెప్పడం మాకు ఆనందం కలిగించింది. ఇప్పుడు ఓటీటీ వేదిక ద్వారా మిగిలిన ప్రేక్షకులకు దగ్గరైతే మేం ఏం ఆశించామో ఆ లక్ష్యం నెరవేరుతుందనే నమ్మకం ఉంది' అన్నారు.

ఆంధ్రజ్యోతి
స్పోర్ట్స్
వరంగల్ ● శుక్రవారం 11 ఏప్రిల్ 2025



ధోనీకి ‘చెన్నై’ పగ్గాలు

గాయంతో రుతురాజ్ దూరం

చెన్నై: మాజీ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్‌కు గట్టి ఝలక్ తగిలింది. ఇప్పటికే నాలుగు వరుస ఓటములతో డీలాపడిన ఈ జట్టుకు.. తాజాగా కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ కూడా దూరమయ్యాడు. అతడి మోచేయి ఫ్రాక్చర్ కావడంతో ఐపీఎల్‌కు అందుబాటులో ఉండడని, ఇక లీగ్‌లో మిగిలిన మ్యాచ్‌లకు ఎంఎస్ ధోనీ సారథిగా వ్యవహరిస్తాడని సీఎస్‌కే ప్రకటించింది. పంజాబ్‌తో జరిగిన మ్యాచ్‌కే రుతురాజ్ దూరమవుతాడని భావించినా.. ఆఖరి నిమిషంలో బరిలోకి దిగాడు. నేడు కేకేఆర్‌తో చెన్నై జట్టు అమీతుమీ తేల్చుకోనుంది. మరోవైపు తాజా సీజన్‌లో పేలవ ఫామ్‌లో ఉన్న రుతురాజ్ ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో కేవలం 122 పరుగులు మాత్రమే చేశాడు. అటు కెప్టెన్సీలోనూ ప్రభావం చూపలేకపోయాడు. ఇప్పుడతని స్థానంలో త్రిపాఠి, హుడాలలో ఒకరిని తీసుకునే అవకాశముంది. అయితే ఈ ఇద్దరూ ఇదివరకే ఆడి ఫామ్‌లేమితో చోటు కోల్పోవడం గమనార్హం. వీరిద్దరితోపాటు వేలంలో అన్‌సోల్డ్‌గా మిగిలిన పృథ్వీషాకూ అవకాశముంది.

ఐపీఎల్‌లో నేడు	వేదిక
	చెన్నై
చెన్నై x కోల్‌కతా	రా.7.30



భారత్‌ను ఫైనల్ చేర్చిన ధీరజ్

» **ఆర్చరీ వరల్డ్‌కప్ స్టేజ్-1**

ఆబన్‌డేల్ (అమెరికా): తెలుగు కుర్రాడు ధీరజ్ బొమ్మదేవర ఆర్చరీ వరల్డ్‌కప్ స్టేజ్-1లో తన అద్భుత ప్రదర్శనతో భారత రికర్వ్ జట్టును ఫైనల్‌కు చేర్చాడు. స్పెయిన్‌ను 6-2తో ఓడించిన టీమిండియా పతకం ఖరారు చేసుకుంది. వీసా సమస్యల కారణంగా పోటీల ఆరంభానికి కొద్ది గంటల ముందు మాత్రమే అమెరికా చేరుకున్న ధీరజ్..అతాను దాస్, తరుణ్‌దీప్ రాయ్‌లతో కలిసి జట్టును విజయపథంలో నడిపాడు. ఆదివారం జరిగే ఫైనల్లో భారత జట్టు చైనాతో తలపడుతుంది. అంతకుముందు జరిగిన మహిళల రికర్వ్ ఈవెంట్‌లో దీపిక కుమారి, అంకితా భకత్, అనుష్క కుమారి త్రయం 2-6 స్కోరుతో అమెరికా చేతిలో ఓటమిపాలైంది. కాగా కాంపౌండ్ పురుషుల విభాగంలో భారత్ ఇప్పటికే కాంస్యం దక్కించుకుంది.

రాహుల్.. జిగేల్

- ‘సొంత గడ్డ’పై చెలరేగిన కేఎల్
- ఢిల్లీకి వరుసగా నాలుగో విజయం
- నిరాశపర్చిన బెంగళూరు
- సత్తా చాటిన డీసీ బౌలర్లు

బెంగళూరు: తాజా ఐపీఎల్ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ అపజయం లేకుండా దూసుకెళుతోంది. అటు బౌలింగ్.. ఇటు బ్యాటింగ్ విభాగాల్లో అద్భుతంగా రాణిస్తున్న ఈ జట్టు ఖాతాలో వరుసగా నాలుగో విజయం చేరింది. క్లిష్ట పరిస్థితుల్లో కేఎల్ రాహుల్ (53 బంతుల్లో 7 ఫోర్లు, 6 సిక్సర్లతో 93 నాటౌట్) సమయోచిత ఆటతీరు కనబర్చగా.. గురువారం రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో డీసీ 6 వికెట్ల తేడాతో నెగ్గింది. అటు సొంత గడ్డపై ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఆర్‌సీబీకి ఓటములే ఎదురయ్యాయి. మరోవైపు కెరీర్‌లో ఓనమాలు దిద్దిన చిన్నస్వామి స్టేడియంలోనే రాహుల్ చెలరేగి స్థానిక జట్టుకు ఓటమి రుచి చూపించడం గమనార్హం. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆర్‌సీబీ 20 ఓవర్లలో 7 వికెట్లకు 163 పరుగులు చేసింది. సాల్ట్ (37), డేవిడ్ (37 నాటౌట్), పటీదార్ (25) మాత్రమే రాణించారు. కుల్దీప్, విప్రజ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ఢిల్లీ 17.5 ఓవర్లలో 4 వికెట్లకు 169 పరుగులు చేసి గెలిచింది. స్టబ్స్ (38 నాటౌట్) సహకరించాడు. భువనేశ్వర్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా రాహుల్ నిలిచాడు.

శతక భాగస్వామ్యంతో..

పిచ్ నుంచి సహకారం లభించడంతో ఆర్‌సీబీ బౌలర్లు ఆరంభంలో వణికించారు. పవర్‌ప్లేలో అతి కష్టమ్మీద 39 పరుగులు చేసిన డీసీ మూడు వికెట్లను కూడా కోల్పోయింది. అయితే స్టబ్స్‌తో కలిసి రాహుల్ ఐదో వికెట్‌కు 111 పరుగుల అజేయ భాగస్వామ్యంతో జట్టును గట్టెక్కించాడు. రెండో ఓవర్‌లోనే ఓపెనర్ డుప్లెసి (2)ను యష్ అవుట్ చేయగా, మరో ఓపెనర్ ఫ్రేజర్ (7), పోరెల్ (7)లను భువీ దెబ్బతీశాడు. రాహుల్ సైతం ఐదు పరుగుల వద్దే వెనుదిరగాల్సినా.. పటీదార్ డైవింగ్ క్యాచ్ అందుకోలేకపోయాడు. కెప్టెన్ అక్షర్ (15) కూడా నిరాశపరిచాడు. దీంతో 58/4 స్కోరుతో డీసీ ఇబ్బందుల్లో పడింది. కానీ ఈ దశలో రాహుల్ ఎదురుదాడికి దిగాడు. అతడికి స్టబ్స్ నుంచి సహకారం అందింది. 13వ ఓవర్‌లో రాహుల్ 4,6తో 14 పరుగులు రావడంతో డీసీ ఇన్నింగ్స్‌లో వేగం పెరిగింది. ఇక 15వ ఓవర్‌లో మరింతగా చెలరేగిన రాహుల్ 4,4,2,2,4,6తో 22 పరుగులు రాబట్టాడు. 18 బంతుల్లో 18 రన్స్ కావాల్సిన వేళ రాహుల్ 6,4,6తో 13 బంతులుండగానే డీసీ మ్యాచ్‌ను ముగించింది.



స్టబ్స్



రాహుల్ (53 బంతుల్లో 93 నాటౌట్)

ఆరంభం అదిరినా..

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్‌సీబీ ఇన్నింగ్స్ వామ్మో.. అనే రీతిలో ఆరంభమైంది. ఓపెనర్ సాల్ట్ వీర బాదుడుకు జట్టు తొలి 3.4 ఓవర్లలోనే 61 పరుగులతో నిలిచింది. ఆ సమయంలో 220కి పైనే స్కోరు చేస్తారనిపించింది. కానీ ఢిల్లీ బౌలర్ల ధాటికి గతి తప్పిన ఆర్‌సీబీ ఆ తర్వాత 86 బంతుల్లో 66 పరుగులే చేసి ఏడు వికెట్లు కోల్పోయింది. అయితే టిమ్ డేవిడ్ పుణ్యమా చివరి రెండు ఓవర్లలో 36 పరుగులతో సవాల్ విసిరే స్కోరందుకుంది. అంతకుముందు స్టార్క్ వేసిన ఇన్నింగ్స్ మూడో ఓవర్‌లోనే సాల్ట్ 6,4,4,4,6 బాది ఏకంగా 30 పరుగులు రాబట్టాడు. ఇంత జోరు మీదున్న వేళ.. లేని పరుగు కోసం వెళ్లి భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. నాలుగో ఓవర్‌లో కవర్స్ వైపు ఆడిన సాల్ట్ సింగిల్ కోసం ముందుకు కదిలాడు. కానీ కోహ్లీ వారించడంతో వెనక్కి మళ్లిన అతడు కింద పడి క్రీజులోకి చేరుకోలేకపోవడంతో, అటు విప్రజ్ త్రోను అందుకున్న కీపర్ రాహుల్ రనౌట్ చేశాడు. అంతే.. అక్కడి నుంచి ఆర్‌సీబీ ఆట ఒక్కసారిగా తేలిపోయింది. ఐదో ఓవర్‌లో విప్రజ్ రెండు పరుగులే ఇవ్వగా.. ముకేశ్ ఆరో ఓవర్‌ను మెయిడిన్‌గా వేసి మరీ పడిక్కళ్ (1) వికెట్ తీశాడు. ఇక వరుస విరామాల్లో విరాట్ (22), లివింగ్‌స్టోన్ (4), జితేశ్ (3)లను పెవిలియన్‌కు చేర్చిన ఢిల్లీ బౌలర్లు పైచేయి సాధించారు. వాస్తవానికి తొమ్మిది ఓవర్ల వరకు కూడా జట్టు పది పరుగుల రన్‌రేట్‌తోనే ఉంది. కానీ ఆ తర్వాత ఆర్‌సీబీ బ్యాటర్లు భారీ షాట్లు ఆడలేక వికెట్లు సైతం కోల్పోయారు. ఫామ్‌లో ఉన్న కెప్టెన్ పటీదార్ కూడా ఎక్కువసేపు నిలువలేకపోయాడు. అతడిని 15వ ఓవర్‌లో కుల్దీప్ అవుట్ చేశాడు. కానీ రన్స్ కోసం అష్టకష్టాలు పడుతున్న జట్టుకు చివరి రెండు ఓవర్లలో డేవిడ్ ఊపిరిలూదాడు. 19వ ఓవర్‌లో 6,4,6తో 17 రన్స్. ఆఖరి ఓవర్‌లో 6,6,4తో 19 రన్స్ రాబట్టడంతో ఆర్‌సీబీ 160+ స్కోరుతో ఫర్వాలేదనిపించింది.

స్కోరుబోర్డు

బెంగళూరు: సాల్ట్ (రనౌట్) 37; విరాట్ (సి) స్టార్క్ (బి) విప్రజ్ 22; దేవ్‌దత్ (సి) అక్షర్ (బి) ముకేశ్ 1; పటీదార్ (సి) రాహుల్ (బి) కుల్దీప్ 25; లివింగ్‌స్టోన్ (సి) అశుతోష్ (బి) మోహిత్ 4; జితేశ్ (సి) రాహుల్ (బి) కుల్దీప్ 3; క్రునాల్ (సి) అశుతోష్ (బి) విప్రజ్ 18; డేవిడ్ (నాటౌట్) 37; భువనేశ్వర్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 20 ఓవర్లలో 163/7; వికెట్ల పతనం:** 1-61, 2-64, 3-74, 4-91, 5-102, 6-117, 7-125; **బౌలింగ్:** స్టార్క్ 3-0-35-0; అక్షర్ 4-0-52-0; విప్రజ్ 4-0-18-2; ముకేశ్ 3-1-26-1; కుల్దీప్ 4-0-17-2; మోహిత్ 2-0-10-1.

ఢిల్లీ: డుప్లెసి (సి) పటీదార్ (బి) యశ్ దయాళ్ 2 ; మెక్‌గుర్క్ (సి) జితేశ్ (బి) భువనేశ్వర్ 7; అబిషేక్ (సి) జితేశ్ (బి) భువనేశ్వర్ 7; రాహుల్ (నాటౌట్) 93, అక్షర్ (సి) డేవిడ్ (బి) సుయాశ్ 15, స్టబ్స్ (నాటౌట్) 38, **ఎక్స్‌ట్రాలు 7, మొత్తం: 17.5 ఓవర్లలో 169/4; వికెట్లపతనం:** 1-9, 2-10, 3-30, 4-58; **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-26-2, యశ్ దయాళ్ 3.5-0-45-1, హాజిల్‌వుడ్ 3-0-40-0, సుయాశ్ 4-0-25-1, కృనాల్ 2-0-19-1, లివింగ్‌స్టోన్ 1-0-14-0.

1 ఐపీఎల్‌లో వెయ్యి బౌండరీలు బాదిన తొలి బ్యాటర్‌గా విరాట్.

ఒలింపిక్స్‌కు క్రికెట్ కిక్

- ఆరు జట్లు.. టీ20 ఫార్మాట్
- ఆతిథ్య అమెరికాకు బెర్త్ ఖరారు
- ఐసీసీ ర్యాంకుల ఆధారంగా మిగతా ఐదు?



న్యూఢిల్లీ: లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు చోటు ఖరారైంది. 2028లో జరిగే విశ్వక్రీడల్లో కొత్తగా ఐదు క్రీడలకు అవకాశం కల్పిస్తున్నట్టు నిర్వాహకులు ప్రకటించారు. దీంతో 128 ఏళ్ల తర్వాత ఒలింపిక్స్‌లో మళ్లీ క్రికెట్ సందడి చేయనుంది. 1900లో పారిస్‌లో జరిగిన మెగా క్రీడల్లో క్రికెట్‌కు తొలి.. చివరిసారి చోటు దక్కింది. లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్ ఈవెంట్‌ను టీ20 ఫార్మాట్‌లో నిర్వహించనున్నారు. పురుషుల, మహిళల విభాగాల్లో ఆరేసి జట్లు చొప్పున ఆడనున్నాయి. అయితే, అర్హత ప్రక్రియను త్వరలో ఖరారుచేస్తారు. ఆతిథ్య హోదాలో అమెరికాకు ఓ బెర్త్ ఖరారు కాగా.. విగతా ఐదు స్థానాల కోసం జట్లు పోటీ పడనున్నాయి. కటాఫ్ తేదీకి ముందు ఐసీసీ ర్యాంకింగ్స్‌లో టాప్-5లో నిలిచిన జట్లకు ఒలింపిక్ బెర్త్‌లు దక్కే చాన్సుంది. ఐసీసీ ఈవెంట్ల తరహాలోనే ప్రతి టీమ్‌లో 15 మంది ఉంటారు. ఈసారి రికార్డు స్థాయిలో 351 మెడల్ ఈవెంట్లు నిర్వహించాలని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ ఎగ్జిక్యూటివ్ బోర్డ్ నిర్ణయం తీసుకొంది. ఈ ఒలింపిక్స్‌లో క్రికెట్‌తోపాటు సాఫ్ట్‌బాల్, స్క్వాష్, ఫ్లాగ్ ఫుట్‌బాల్, లక్రాస్ (సిక్సెస్)కు చోటు దక్కింది.

క్వార్టర్స్‌లో అర్జున్ ఓటమి

పారిస్: ఫ్రీస్టైల్ చెస్ గ్రాండ్‌స్లామ్‌లో తెలుగు గ్రాండ్ మాస్టర్ అర్జున్ ఇరిగేసికి నాకౌట్‌లో చుక్కెదురైంది. క్వార్టర్ ఫైనల్స్‌లో హికరు నకమురా (అమెరికా) చేతిలో ఇరిగేసి 0.5-1.5తో ఓటమి పాలయ్యాడు. రెండో రౌండ్ గేమ్‌లో నల్లపావులతో ఆడిన అర్జున్.. 62 ఎత్తుల్లో ప్రత్యర్థికి తలవంచాడు. కాగా, తొలి రౌండ్ గేమ్ డ్రాగా ముగిసిన సంగతి తెలిసిందే. సెమీస్‌లో కార్ల్‌సన్‌తో కరువానా, నకమురాతో విన్సెంట్ కీమర్ తలపడనున్నారు.

సురుచి జంటకు కాంస్యం

బ్యూనస్ ఎయిర్స్: ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్‌లో సురుచి-సౌరభ్ చౌదరి జంట కంచు మోత మోగించింది. 10 మీ. ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ విభాగంలో సహచరుల మధ్య జరిగిన కాంస్య పోరులో సురుచి-సౌరభ్ 16-8తో మను భాకర్-రవీందర్ సింగ్‌పై గెలిచింది. చైనా జోడీలు స్వర్ణ, రజత పతకాలు దక్కించుకొన్నాయి. కాగా, టోర్నీలో సురుచికి ఇది రెండో పతకం. ఇప్పటి వరకు భారత్ 4 స్వర్ణాలు సహా 8 పతకాలతో రెండో స్థానంలో కొనసాగుతోంది.

పోరాడి ఓడిన సింధు

● ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్



నింగ్బో (చైనా): ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో స్టార్ షట్లర్ పీవీ సింధు పోరాటం ముగిసింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో జోడీ క్వార్టర్స్‌లోకి ప్రవేశించింది. గురువారం వరల్డ్ నెంబర్ 4 యమగూచి (జపాన్)తో గంటా ఆరు నిమిషాల పాటు జరిగిన సుదీర్ఘ పోరులో ప్రపంచ 17వ ర్యాంకర్ సింధు పోరాడి ఓడింది. సింగిల్స్ రెండో రౌండ్‌లో సింధు 12-21, 21-16, 16-21తో యమగూచి చేతిలో పరాజయం పాలైంది. యమగూచితో పోరులో సింధు ఓడడం ఇది పన్నెండో సారి. మిక్స్‌డ్ డబుల్స్ ప్రీక్వార్టర్స్‌లో ధ్రువ్-తనీషా జంట 12-21, 21-16, 21-18తో హాంగ్ వీ-నికోల్ చాన్ (చైనీస్ తైపీ) జోడీపై గెలిచి ముందంజ వేసింది. ఇదే విభాగంలో పోటీ పడిన మరో భారత జంట సూర్య-అమృత ఓటమి పాలైంది. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో ప్రియాన్షు రజావత్ 14-27, 17-21 స్కోరుతో కొడై నరోకా (జపాన్) చేతిలో వరుసగా రెండు గేమ్‌ల్లో ఓడాడు. ప్రియాన్షుతో పాటు కిరణ్ జార్జ్ కూడా రెండో రౌండ్‌లో ఓడి ఇంటిముఖం పట్టాడు. డబుల్స్‌లో హరిహరణ్-రుబాన్ కుమార్ జోడీ కూడా ఓటమి చవి చూసింది.

రష్మిక హ్యాట్రిక్ విజయం



పుణె: బిల్లీ జీన్ కింగ్ కప్‌లో హైదరాబాద్ అమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసింది. పుణెలో జరుగుతున్న ఈ కప్ గ్రూప్ దశ మూడో మ్యాచ్‌లో భారత్ 2-1తో హాంకాంగ్‌పై గెలిచింది. తొలి సింగిల్స్ పోరులో వైదేహి చౌధురి 7-6, 6-1తో హో చింగ్ వుపై, రెండో సింగిల్స్‌లో రష్మిక 7-6, 2-6, 6-3తో హాంగ్ వీ వాంగ్‌పై గెలిచారు. డబుల్స్‌లో అంకిత-ప్రార్థన జోడీ ఓటమిపాలైంది. కాగా ఇప్పటివరకు ఈ కప్‌లో మూడు మ్యాచ్‌లు ఆడిన భారత్ రెండింట్లో నెగ్గింది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
గుజరాత్	5	4	1	0	8	1.413
ఢిల్లీ	4	4	0	0	8	1.278
బెంగళూరు	5	3	2	0	6	0.539
పంజాబ్	4	3	1	0	6	0.289
లఖ్‌నవూ	5	3	2	0	6	0.078
కోల్‌కతా	5	2	3	0	4	-0.056
రాజస్థాన్	5	2	3	0	4	-0.733
ముంబై	5	1	4	0	2	-0.010
చెన్నై	5	1	4	0	2	-0.889
హైదరాబాద్	5	1	4	0	2	-1.629

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

బిజినెస్

టీసీఎస్.. ఛ్చ!

క్యూ4 లాభంలో 1.68% క్షీణత

» **రూ.12,224 కోట్లకు పరిమితం**

» **ఆదాయం రూ.64,479 కోట్లు**

ఒక్కో షేరుకు రూ.30 డివిడెండ్



టీసీఎస్ సీఈఓ కృతివాసన్

ముంబై: మార్చితో ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసిక (క్యూ4) ఆర్థిక ఫలితాల సీజన్ నిరాశాజనకంగా ప్రారంభమైంది. దేశంలో అతిపెద్ద ఐటీ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) పనితీరు మార్కెట్ అంచనాలను అందుకోలేకపోయింది. క్యూ4లో టీసీఎస్ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 1.68 శాతం తగ్గి రూ.12,224 కోట్లకు పరిమితమైంది. ఆదాయం మాత్రం 5.3 శాతం వృద్ధితో రూ.64,479 కోట్లుగా నమోదైంది. సమీక్షా కాలానికి స్థిర కరెన్సీ ఆధారిత ఆదాయం వార్షిక ప్రాతిపదికన 2.5 శాతం పెరిగింది. నిర్వహణ మార్జిన్ 24.2 శాతంగా, నికర మార్జిన్ 19 శాతంగా నమోదైంది. కాగా, ఈ ఆర్థిక సంవత్సరానికి గాను టీసీఎస్ తన వాటాదారులకు ఒక్కో షేరుపై రూ.30 తుది డివిడెండ్ ప్రకటించింది. డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలోనూ ఒక్కో షేరుకు రూ.10 మధ్యంతర డివిడెండ్‌తో పాటు రూ.66 ప్రత్యేక డివిడెండ్‌ను సైతం చెల్లించింది. క్యూ1, క్యూ2ల్లోనూ రూ.10 చొప్పున డివిడెండ్ పంచింది.

3,000 కోట్ల డాలర్లు దాటిన వార్షికాదాయం

పూర్తి ఆర్థిక సంవత్సరానికి మాత్రం కంపెనీ నికర లాభం 5.76 శాతం పెరుగుదలతో రూ.48,553 కోట్లకు, ఆదాయం 5.99 శాతం వృద్ధితో రూ.2,55,324 కోట్లకు (అమెరికా కరెన్సీలో 3,000 కోట్ల డాలర్ల పైమాటే) చేరుకుంది. కంపెనీ వార్షికాదాయం తొలిసారిగా 3,000 కోట్ల డాలర్ల స్థాయిని చేరుకోవడంతో పాటు వరుసగా రెండో త్రైమాసికంలో బలమైన ఆర్డర్ బుక్‌ను సాధించడం సంతోషంగా ఉందని టీసీఎస్ సీఈఓ కే కృతివాసన్ అన్నారు. కృత్రిమ మేధ (ఏఐ), డిజిటల్ ఆవిష్కరణల్లో అనుభవంతో పాటు కస్టమర్లతో సత్సంబంధాలు, అంతర్జాతీయ వ్యాప్తి ప్రస్తుత ఆర్థిక అనిశ్చితిలో క్లయింట్లకు కంపెనీని దన్నుగా నిలిపాయన్నారు. కస్టమర్ల కీలక ప్రాధాన్యాల సాధనలో తోడ్పడే విషయంలో తాము కట్టుబడి ఉన్నామన్నారు.

1,220 కోట్ల డాలర్ల కాంట్రాక్టులు

మార్చితో ముగిసిన త్రైమాసికంలో 1,220 కోట్ల విలువైన కాంట్రాక్టులను దక్కించుకున్నట్లు కంపెనీ వెల్లడించింది. ఆర్థిక సంవత్సరం మొత్తానికి లభించిన కాంట్రాక్టులు 3,940 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి.

సీఓఓగా ఆర్తి సుబ్రమణియన్

టీసీఎస్ రెండు కీలక నియామకాలను జరిపింది. ఆర్తి సుబ్రమణియన్‌ను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ప్రెసిడెంట్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీఓఓ)గా ఐదేళ్ల కాలానికి నియమించినట్లు కంపెనీ తెలిపింది. మే 1 నుంచి సుబ్రమణియన్ కొత్త బాధ్యతలను చేపట్టనున్నారు. ప్రస్తుతం ఆమె టాటా సన్స్‌లో గ్రూప్ చీఫ్ డిజిటల్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. టీసీఎస్‌లో డైరెక్టర్ కూడా. కాగా, మంగేశ్ సాథేను చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్‌గా నియమించినట్లు టీసీఎస్ ప్రకటించింది.

సుంకాలతో సవాళ్లే..

గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈసారి ఆదాయం మరింత మెరుగుపడనుందని టీసీఎస్ సారథి కృతివాసన్ ధీమా వ్యక్తం చేశారు. అయితే, ట్రంప్ సుంకాలతో ఐటీ సేవల రంగమూ సవాళ్లు ఎదుర్కోనుందన్నారు. సుంకాలతో ఆర్థిక అనిశ్చితి పెరిగి నేపథ్యంలో క్లయింట్లు ఐటీ వ్యయ నిర్ణయాలను జాప్యం చేస్తున్నారు. కొందరు ప్రాజెక్టులను నిలిపివేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అయినప్పటికీ, భారీ ప్రాజెక్టులు జాప్యం కాలేదన్నారు. మార్కెట్ సెంటిమెంట్ మెరుగుపడుతోందని, క్లయింట్ల ఐటీ వ్యయాలు క్రమంగా పుంజుకుంటున్నాయని మూడు నెలల క్రితం చెప్పాం. కానీ, సుంకాల కారణంగా పరిస్థితులు మళ్లీ మారాయన్నారు.

జీతాల పెంపు వాయిదా

ట్రంప్ సుంకాలతో అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో అనిశ్చితులు మరింత పెరిగిన నేపథ్యంలో ఉద్యోగులకు ఏప్రిల్ నుంచి అమలు చేయాల్సి ఉన్న జీతాల పెంపును వాయిదా వేసినట్లు టీసీఎస్ వెల్లడించింది. మార్కెట్లో ఆర్థిక అనిశ్చితులు తగ్గుముఖం పట్టి, భవిష్యత్‌పై కొంత స్పష్టత వచ్చాక సరైన సమయంలో వేతనాలను పెంచనున్నట్లు చీఫ్ హెచ్ఆర్ ఆఫీసర్ మిలింద్ లక్కడ్ తెలిపారు.

ఈసారి 42,000 ఫ్రెషర్ల నియామకాలు

గత ఆర్థిక సంవత్సరంలో ప్రాంగణ నియామకాల (క్యాంపస్ హైరింగ్) ద్వారా 42,000 మంది ఫ్రెషర్లను కంపెనీలో చేర్చుకున్నట్లు టీసీఎస్ చీఫ్ హెచ్ఆర్ ఆఫీసర్ మిలింద్ లక్కడ్ తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మరో 42,000 మంది ఫ్రెషర్లను నియమించుకోనున్నట్లు ఆయన చెప్పారు. 2024-25 క్యూ4లో టీసీఎస్ ఉద్యోగుల సంఖ్య నికరంగా 625 పెరిగి మొత్తం 6,07,979కి చేరింది. పూర్తి ఆర్థిక సంవత్సరంలో ఉద్యోగుల నికర పెరుగుదల 6,433గా నమోదైంది. కాగా, అంతక్రితం ఆర్థిక సంవత్సరం (2023-24)లో మాత్రం ఉద్యోగుల సంఖ్య 13,200కు పైగా తగ్గింది. కాగా, మార్చి త్రైమాసికంలో టీసీఎస్ ఉద్యోగుల వలసల (అట్రిషన్) రేటు 13.3 శాతానికి పెరిగింది. అంతక్రితం త్రైమాసికంలో ఇది 13 శాతంగా ఉంది.

ప్రపంచ టాప్ 100లో హైదరాబాద్ విమానాశ్రయం

56వ స్థానం కైవసం.. ఢిల్లీ, బెంగళూరు, ముంబైలకూ స్థానం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారత విమానయాన రంగం అద్భుతమైన పురోగతి సాధిస్తోంది. పచ్చగా కళకళలాడుతూ, పరిశుభ్రంగా కనిపించడంలో దేశంలోని విమానాశ్రయాలు అంతర్జాతీయ విమానాశ్రయాలతో పోటీ పడుతున్నాయి. ఫలితంగా ఈ ఏడాది ప్రపంచంలోని టాప్ 100 విమానాశ్రయాల జాబితాలో మన దేశంలోని నాలుగు విమానాశ్రయాలకు స్థానం దక్కింది. అంతర్జాతీయ ఎయిర్ ట్రావెల్ రేటింగ్ సంస్థ స్కైట్రాక్స్ ప్రకటించిన ర్యాంకుల ప్రకారం హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం 56వ స్థానంలో నిలిచింది. పరిశుభ్రత, స్నేహపూర్వకంగా వ్యవహరించే సిబ్బంది, ప్రయాణికుల అనుభూతిపరంగా ఈ ర్యాంకు దక్కించుకుంది. దేశంలోనే అత్యంత రద్దీ గల విమానాశ్రయంగా పేరొందిన ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ఆధునిక టెర్మినల్స్, కళాకృతుల ప్రదర్శన, సమర్థవంతమైన ఇమ్మిగ్రేషన్, మంచి కనెక్టివిటీతో 32వ స్థానంలో నిలిచింది. బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం 48, ముంబైలోని ఛత్రపతి శివాజీ మహరాజ్ అంతర్జాతీయ విమానాశ్రయం 73 స్థానాల్లో నిలిచాయి. టాప్ 100లో స్థానం సంపాదించడమే కాదు...గత ఏడాదితో పోల్చితే మన విమానాశ్రయాలు ర్యాంకింగ్‌ను కూడా గణనీయంగా పెంచుకున్నాయి. ఢిల్లీ విమానాశ్రయం గత ఏడాది 36వ స్థానంలో ఉండగా ఈ ఏడాది 32వ స్థానానికి ఎగబాకింది. అలాగే హైదరాబాద్ విమానాశ్రయం ర్యాంకింగ్ గత ఏడాదితో పోల్చితే 59వ స్థానం నుంచి 56వ స్థానానికి ఎదిగింది. అయితే ప్రపంచ టాప్ 20 విమానాశ్రయాల్లో మాత్రం మన దేశానికి చెందిన ఏ విమానాశ్రయానికి స్థానం దక్కలేదు. ఇదిలా ఉండగా ప్రపంచంలోనే అత్యుత్తమమైన విమానాశ్రయంగా సింగపూర్‌కి చెందిన చాంగి ఎయిర్‌పోర్ట్ నిలిచింది. విలాసవంతంగా కనిపిస్తూ సౌకర్యం, వినోదంలో కూడా తిరుగులేనిదిగా పేరొందిన ఈ విమానాశ్రయానికి ఈ స్థానం దక్కడం ఇది 13వ సారి.

అమెరికా మార్కెట్లు మళ్లీ డౌన్

బుధవారం అనూహ్యంగా దూసుకుపోయిన అమెరికా స్టాక్ మార్కెట్లు గురువారం మళ్లీ పతన బాట పట్టాయి. ఆరంభంలో లాభాలతో ప్రారంభమైనప్పటికీ చైనాపై సుంకాలను 145 శాతానికి పెంచుతున్నట్లు ట్రంప్ ప్రకటించటంతో సూచీలు మళ్లీ నష్టాల్లోకి జారుకున్నాయి. ఎస్ అండ్ పీ 500 సూచీ ఏకంగా 5 శాతానికి పైగా నష్టపోగా డౌజోన్స్ 4 శాతం, నాస్‌డాక్ 5.7 శాతానికి పైగా నష్టపోయాయి.

భగ్గుమన్న పసిడి ధర

ఔన్స్ 3,183 డాలర్లు

అంతర్జాతీయ మార్కెట్లో పసిడి ధర మరో రికార్డు స్థాయికి చేరింది. న్యూయార్క్ స్పాట్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) మేలిమి (24 కేరట్స్) బంగారం ధర భారత కాలమానం ప్రకారం గురువారం రాత్రి 10 గంటలకు రికార్డు స్థాయిలో 3,183 డాలర్లకు (సుమారు రూ.2,75,460) చేరింది. బుధవారం ముగింపు ధరతో పోలిస్తే ఇది 3.28 శాతం (103 డాలర్లు) ఎక్కువ. ప్రధాన కరెన్సీలతో అమెరికా డాలర్ బక్కచిక్కడం, అమెరికా-చైనా మధ్య ముదురుతున్న వాణిజ్య యుద్ధం, మార్కెట్ల పతనం ఇందుకు ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



11వ తేదీ			
హైదరాబాద్	390	విజయవాడ	420
వరంగల్	392	గోదావరి	415
చిత్తూరు	460	విశాఖపట్నం	435
		డజను గుడ్లు రూ. 60	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	93,380 ▲	85,600 ▲	1,07,000 ▲
విజయవాడ	93,500 ▲	86,500 ▼	94,000 ▲
విశాఖపట్నం	91,180 ▲	83,580 ▲	91,770 ▲
రాజమండ్రి	93,380 ▲	85,600 ▲	93,500 ▲
ప్రొద్దుటూరు	92,300 ▲	84,920 ▲	92,300 ▼
ముంబై	90,161 ▲	82,588 ▲	90,669 ▲

‘ఎఫ్‌డీ’లపైనా తగ్గుతున్న వడ్డీ రేటు

న్యూఢిల్లీ: ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ) పైనా బ్యాంకులు వడ్డీ రేట్లు తగ్గిస్తున్నాయి. వివిధ కాలపరిమితుల ఎఫ్‌డీలపై చెల్లించే వడ్డీ రేటును పావు శాత (0.25%) తగ్గించినట్టు కోటక్ మహీంద్రా బ్యాంక్, కెనరా బ్యాంక్ ప్రకటించాయి. బుధవారం నుంచే ఈ తగ్గింపు అమల్లోకి వచ్చినట్టు తెలిపాయి. ఆర్‌బీఐ రెపో రేటును 0.25 శాతం తగ్గించటంతో ఈ బ్యాంకులు ఆ మేరకు తగ్గిస్తున్నట్లు ప్రకటించాయి. కాగా సీనియర్ సిటిజన్ల ఎఫ్‌డీలపై మాత్రం ఎప్పటిలాగానే అర శాతం వడ్డీ అధికంగా లభిస్తుంది. మరోవైపు బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) కూడా తన ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ రుణాలపై వడ్డీ రేటును పావు శాతం తగ్గిస్తున్నట్టు ప్రకటించింది.

భారత వృద్ధి 6.1 శాతమే: మూడీస్

అమెరికా ప్రతీకార సుంకాల ప్రభావం వల్ల 2025 సంవత్సరంలో భారత వృద్ధిరేటును మూడీస్ 6.1 శాతానికి కుదించింది. గతంలో ఈ సంస్థ ప్రకటించిన అంచనా 6.4 శాతం. భారత వస్తు దిగుమతులపై 26% సుంకాలు పడినట్టయితే వాణిజ్య సమతుల్యత దెబ్బ తింటుందని పేర్కొంది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	110	విజయవాడ	125
వరంగల్	110	గుంటూరు	117
కరీంనగర్	110	ఒంగోలు	117
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	83
కర్నూలు	110	నెల్లూరు	88
విశాఖపట్నం	119	అనంతపురం	88
గోదావరి	125		

భారత్ నుంచి అమెరికాకు 600 టన్నుల ఐఫోన్ల తరలింపు

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల భారాన్ని తప్పించుకునేందుకు టెక్నాలజీ దిగ్గజం యాపిల్ హుటాహుటిన చర్యలు చేపట్టింది. సుంకాలు అమల్లోకి రాకముందే భారత్ నుంచి అమెరికాకు 6 కార్గో విమానాల ద్వారా 600 టన్నుల బరువున్న 15 లక్షల ఐఫోన్లను తరలించిందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఇందుకోసం భారత్‌లోని యాపిల్ థర్డ్ పార్టీ వెండార్ల ప్లాంట్లలో ఉత్పత్తిని అమాంతం పెంచింది. విమానాల ద్వారా సరుకు రావాణాకు కస్టమ్స్ అనుమతులు అవసరం. ఇందుకు సాధారణంగా పట్టే 30 గంటల సమయాన్ని 6 గంటలకు తగ్గించాలని భారత ఎయిర్‌పోర్ట్ అధికారులతోనూ యాపిల్ లాబీయింగ్ జరిపినట్లు తెలిసింది. చెన్నై ఎయిర్‌పోర్ట్ ద్వారా కంపెనీ ఐఫోన్లను అమెరికాకు తరలించింది.

‘లులు’ చేతికి మంజీరా మాల్

దివాలా పరిష్కార ప్రక్రియ ద్వారా రూ.318 కోట్లకు కొనుగోలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దివాలా పరిష్కార ప్రక్రియలో ఉన్న హైదరాబాద్, కూకట్‌పల్లిలోని మంజీరా మాల్ భవనం.. అంతర్జాతీయ రిటైల్ సంస్థ లులు ఇంటర్నేషనల్ షాపింగ్ మాల్స్ పరమైంది. మంజీరా మాల్ రుణదాతలకు రూ.318.42 కోట్లు చెల్లించేందుకు లులు ఇంటర్నేషనల్ చేసిన ప్రతిపాదనకు రుణదాతల కమిటీ (సీఓసీ), ఎన్‌సీఎల్‌టీ, హైదరాబాద్ బెంచ్ ఆమోదం తెలపడంతో ఇది సాధ్యమైంది. ప్రస్తుతం ఇదే భవనంలో లులు మాల్ అద్దె పద్ధతిలో తన భారీ రిటైల్ మాల్ నిర్వహిస్తోంది. ఇప్పుడు ఏకంగా ఈ భారీ మాల్ భవనానికి యజమాని కాబోతోంది.

2023లో దివాలా పిటిషన్ దాఖలు: మంజీరా మాల్‌ను ప్రముఖ పారిశ్రామికవేత్త జీ యోగానంద్ మంజీరా రిటైల్ హోల్డింగ్స్ పేరుతో ప్రమోట్ చేశారు. అయితే తమకు చెల్లించాల్సిన రూ.317.30 కోట్ల బకాయిలను చెల్లించలేక పోవడంతో రుణదాతలైన క్యాటలిస్ట్ ట్రస్టీషిప్ లిమిటెడ్, ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ 2023 జూలైలో మంజీరా రిటైల్ హోల్డింగ్స్‌పై జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ), హైదరాబాద్ బెంచ్‌లో దివాలా పిటిషన్ దాఖలు చేశాయి. మొత్తం 49 సంస్థలు ఈ మాల్‌పై ఆసక్తి చూపించినప్పటికీ చివరికి ఏడు సంస్థలు మాత్రమే పోటీలో నిలిచాయి. అందులో అత్యధికంగా కోట్ చేసిన లులు ఇంటర్నేషనల్ షాపింగ్ మాల్స్ బిడ్‌కు ఎన్‌సీఎల్‌టీ, సీఓసీ ఆమోదం తెలిపాయి.



పర్యావరణ, అటవీ శాఖల కేంద్ర సాధికార కమిటీకి నివేదికను సమర్పిస్తున్న బీజేపీ ఎంపీలు, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటెల, రఘునందన్

2,185 ఎకరాలు వర్సిటీకి రిజిస్టర్ చేయండి

సీఈసీకి వినతిపత్రం సమర్పించిన బీజేపీ ఎంపీలు

హైదరాబాద్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కంచ గచ్చిబౌలి 400 ఎకరాలు సహా మొత్తం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విస్తరించి ఉన్న భూములను వర్సిటీ పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని రాష్ట్ర బీజేపీ ఎంపీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించాలని డిమాండ్ చేస్తూ గురువారం వారు కేంద్ర సాధికార కమిటీ ప్రతినిధి బృందాన్ని కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. 2012లో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ రాసిన ఒక లేఖలో యూనివర్సిటీకి అందుబాటులో 2,185 ఎకరాల 7 గుంటల భూమి ఉందని పేర్కొన్న విషయాన్ని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రస్తావించారు. అందులో ఐఎంజీకి కేటాయించిన 400 ఎకరాలు కూడా ఉందని పేర్కొన్నారు. ఆ లేఖ ప్రకారం చూస్తే ప్రస్తుతం వేలం వేయడానికి ప్రయత్నిస్తున్న భూమి వర్సిటీదే అవుతుందని చెప్పారు. హెచ్‌సీయూ భూములను కాపాడాలని 2022లో బీఆర్ఎస్ ప్రభుత్వానికి అప్పటి కేంద్ర పర్యావరణ మంత్రి లేఖ రాశారని ఎంపీ రఘునందన్ గుర్తు చేశారు. అప్పుడు ముఖ్యమంత్రి కేసీఆర్ వర్సిటీ భూములను కాపాడేందుకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. వర్సిటీ పచ్చదనాన్ని, అందులోని వన్య ప్రాణులను బీజేపీ ప్రభుత్వం మాత్రమే కాపాడగలదని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు.

బీఆర్ఎస్ అధ్యక్షుడిగా బీసీని చేయండి: చామల

హైదరాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బీసీల పట్ల కేసీఆర్‌కు నిజంగా చిత్తశుద్ధి ఉంటే.. బీఆర్ఎస్ పార్టీ పాతికేళ్ల వేడుక సందర్భంగా ఆ పార్టీ అధ్యక్షుడిగా ఒక బీసీని నియమించాలంటూ కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. అధ్యక్ష పదవి అటుంచి.. కార్యనిర్వాహక అధ్యక్షుడిగానైనా బీసీని చేయగలరా అని నిలదీశారు. రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టి బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టిన కాళేశ్వరం కూలిందని, ఇక సాగు గురించి మాట్లాడే హక్కు వారికి లేదన్నారు. రాష్ట్రంలో బూతు పితామహుడు కేసీఆరేనని ఎద్దేవా చేశారు. కేసీఆర్ దృష్టిలో పడేందుకే సీఎం రేవంత్‌రెడ్డిపై హరీశ్‌రావు అనవసర విమర్శలు గుప్పిస్తున్నారని మండిపడ్డారు. ఎస్సీలకు న్యాయం.. కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు చోటు కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరినట్లు తెలిపారు. అసెంబ్లీలో పూలే విగ్రహం పెట్టాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత డిమాండ్‌పై టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కైలాశ్ నేత స్పందించారు. అధికారంలో ఉన్న పదేళ్లలో పూలే విగ్రహం పెట్టకుండా మరేం చేశారంటూ నిలదీశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు పూలే ఆశయాలను నెరవేరుస్తోందని చెప్పారు. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమి రాష్ట్ర ప్రభుత్వానికి చెందినదేనంటూ బీఆర్ఎస్ లిఖితపూర్వకంగా పేర్కొనడాన్ని తాము స్వాగతిస్తున్నామని టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామా రామ్మోహన్‌రెడ్డి అన్నారు.

ఎస్ఆర్‌బీఎస్ పథకం ఎత్తేస్తే సమ్మె తప్పదు

» యాజమాన్యానికి టీజీఎస్ ఆర్టీసీ జేఏసీ హెచ్చరిక

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అతి తక్కువ జీతాలు పొందే ఆర్టీసీ ఉద్యోగుల ప్రయోజనాల కోసం ఏర్పాటైన స్టాఫ్ రిటైర్మెంట్ బెనిఫిట్ స్కీం(ఎస్ఆర్‌బీఎస్)ను ఎత్తివేస్తే మెరుపు సమ్మెకు దిగుతామని టీజీఎస్ ఆర్టీసీ జేఏసీ తమ యాజమాన్యాన్ని హెచ్చరించింది. ఈ మేరకు జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, కోచైర్మన్ హన్మంతు ముదిరాజ్, వైస్‌చైర్మన్ థామస్ రెడ్డి గురువారం ఓ ప్రకటన చేశారు. ఎస్ఆర్‌బీఎస్‌ను ఎత్తివేసేందుకు ఆర్టీసీ యాజమాన్యం కుట్రం చేస్తోందని వారు ఆరోపించారు. ఆర్టీసీ యాజమాన్యం, ట్రేడ్ యూనియన్ల ఒప్పందంతో 1989లో ఎస్ఆర్‌బీఎస్ పథకాన్ని ప్రారంభించారని తెలిపారు. రూ.250 సభ్యత్వ రుసుము చెల్లించి పథకంలో చేరిన ఆర్టీసీ కార్మికుడికి పదవీ విరమణ తర్వాత ప్రతి నెలా రూ.4,020 చొప్పున నగదు చెల్లిస్తారని వివరించారు. ఈ పథకంలో ఎలాంటి మార్పులు చేర్పులు చేయాలన్నా యూనియన్లను సంప్రదించాలని స్పష్టం చేశారు.

రాజ్యాంగేతర శక్తిగా మీనాక్షి నటరాజన్:ఏలేటి

కాంగ్రెస్ రాష్ట్ర ఇంచార్జి మీనాక్షి నటరాజన్ రాజ్యాంగేతరశక్తిగా వ్యవహరిస్తున్నారని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. ముఖ్యమంత్రి లేకుండా సచివాలయంలో మంత్రులు, అధికారులతో సమీక్ష నిర్వహించడం చూస్తుంటే ఇదేనా రాజ్యాంగానికి మీరిచ్చే గౌరవం అని నిలదీశారు. మీనాక్షి నటరాజన్.. సచివాలయంలో సమీక్ష నిర్వహించిన రోజే సీఎం రేవంత్ డమ్మీగా మారిపోయారన్నారు. ఏఐసీసీ సమావేశాల్లో సీఎం రేవంత్ బాధ్యతారాహిత్యంగా మాట్లాడారని మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు.

వృద్ధ జంటలో ఒకరు మరణిస్తే మరొకరికి తక్షణ చేయూత

» పింఛన్ల విషయంలో అప్రమత్తంగా ఉండండి

» అధికారులకు సెర్ప్ సీఈవో దివ్యదేవరాజన్ సూచన

హైదరాబాద్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వృద్ధులకు అందించే చేయూత పింఛను విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ(సెర్ప్) ముఖ్య నిర్వహణాధికారి దివ్య దేవరాజన్ పేర్కొన్నారు. వృద్ధాప్య పింఛను పొందుతున్న భార్య లేదా భర్త చనిపోతే వారి జీవిత భాగస్వామికి తక్షణమే పింఛను అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. చేయూత పోర్టల్ నిర్వహణ, వృద్ధుల్లో పింఛన్ తీసుకోని వారిని గుర్తించడం, కారణాలు తెలుసుకోవడం వంటి అంశాలపై సెర్ప్ విభాగాల ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లకు అవగాహన కల్పిస్తున్నారు. అందులో భాగంగా నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో దివ్యదేవరాజన్ ప్రసంగించారు. చేయూత పింఛన్ పొందుతున్న వృద్ధులు చనిపోతే వారి భాగస్వామికి పింఛన్ మంజూరులో జాప్యం జరుగుతోందని ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. స్థానికంగా పంచాయతీ కార్యదర్శుల ద్వారా ఆయా గ్రామాల్లో చనిపోయినవారి వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని, దాని ఆధారంగా పోర్టల్‌లో చనిపోయిన పింఛనుదారు పేరు తొలగించి వారి జీవిత భాగస్వామి పేరును చేర్చాలన్నారు. వరుసగా మూడు నెలలపాటు వృద్ధులు పింఛను తీసుకోకపోయినా, బయోమెట్రిక్ పెట్టకపోయినా క్షేత్రస్థాయిలో పరిశీలించి కారణాలు తెలుసుకోవాలన్నారు.

గజల్ శ్రీనివాస్ సంగీతం, గాత్రంతో సంపూర్ణ శ్రీమద్ భగవద్గీత ఆడియో విడుదల

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ప్రముఖ గజల్స్ గాయకుడు కేశిరాజు శ్రీనివాస్ సంగీతం సమకూర్చి గానం చేసిన సంపూర్ణ శ్రీమద్ భగవద్గీత ఆడియో విడుదల కార్యక్రమం గురువారం పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు లయన్స్ క్లబ్‌లో జరిగింది. 'సేవ్ టెంపుల్స్ భారత్-శ్రీసూర్య నారాయణ స్వామి దేవస్థానం ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆడియోను శ్రీనివాస్ తండ్రి నరసింహారావు విడుదల చేసి లోకార్పణం గావించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర నాటక అకాడమి చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ హాజరై మాట్లాడుతూ భగవద్గీతను ఎంతో మధురంగా ఆలపించి ప్రజలకు అందించిన గజల్ శ్రీనివాస్ 'భగవద్గీతను కొనండి అనకుండా వినండి' అని చెబుతున్నారన్నారు. డాక్టర్ గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ నా సంకల్పం వెనుక మిత్రుల బలం ఎంతో ఉందన్నారు. స్నేహితులు తనకు ఇస్తున్న శక్తితో ఈ కార్యక్రమం పూర్తి చేయగలిగానని తెలిపారు.

రక్షిత అటవీ భూమి అనొచ్చా?

(మొదటిపేజీ తరువాయి)



కంచ గచ్చిబౌలి స్థలంలో సిద్ధంగా ఉండగా, సెంట్రల్ ఎంపవర్ కమిటీ ఛైర్మన్ సిద్ధాంత దాస్, మరో ఇద్దరు సభ్యులు అక్కడికి వచ్చారు. టీజీఐఐసీ, పంచాయతీరాజ్, రెవెన్యూ, అటవీ శాఖ, పోలీస్‌తోపాటు ఇతర విభాగాల కీలక అధికారులు జిల్లా కలెక్టర్ నుంచి పది అంశాలపై వివరాలు సేకరించింది. రక్షిత అటవీ ప్రాంతం అనేందుకు అర్హత ఉందా? లేదా? ఎన్ని చెట్లు ఉన్నాయి? ఎన్ని రకాలు ఉన్నాయి? ఎక్కువ సంఖ్యలో ఉన్న చెట్లు ఏమిటి? ఇటీవల చెట్ల తొలగింపు చేపట్టినపుడు ఏ పద్ధతిని ఉపయోగించారు. వన్యప్రాణుల పరిస్థితి ఏమిటి? పునరావాసం కోసం ఏం చర్యలు తీసుకుంటున్నారు? తదితర వివరాలు సేకరించారు. చెట్ల తొలగింపును అడ్డుకునేందుకు జరిగిన ఆందోళనల్లో నెలకొన్న శాంతి భద్రతల పరిస్థితులు, పోలీస్‌లు నమోదు చేసిన కేసుల వివరాలు అందజేయాలని సైబరాబాద్ కమిషనర్‌ను అడిగింది. వివాదానికి కారణమైన భూమి అటవీ శాఖకు సంబంధించినది కాదని, రెవెన్యూ అధికారులదేనని అటవీ శాఖ అధికారులు స్పష్టం చేశారు. ఈ మేరకు నివేదిక అందించారు. ఇక్కడ ఎక్కువగా సుబాబుల్ చెట్లు ఉన్నాయని, అతి కొద్ది మొత్తంలోనే వేప, ఇతర చెట్లు ఉన్నాయని పేర్కొన్నారు. వన్య ప్రాణుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలు కూడా పొందుపరిచారు. రెండు రోజుల పర్యటనకు బుధవారమే హైదరాబాద్ వచ్చిన కమిటీ తొలిరోజు సీఎస్, ఇతర ఉన్నతాధికారులతో సచివాలయంలో సమావేశమైంది. రెండో రోజు గురువారం కంచ గచ్చిబౌలి భూముల్లో పర్యటించి వాస్తవ పరిస్థితుల్ని నేరుగా తెలుసుకుంది. సేకరించిన సమాచారంపై ఒక అంచనాకు వచ్చిన తర్వాత ఈ నెల 16న సుప్రీంకోర్టుకు నివేదిక అందజేయనుంది.

అటవీ భూమి అనే ఆధారాలు ఎక్కడా లేవు

కంచ గచ్చిబౌలి సర్వే నంబరులో 25లోని 400 ఎకరాలు అటవీ భూమి కాదని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. రెవెన్యూ రికార్డుల ప్రకారం వివరాలను నివేదిక రూపంలో సాధికార కమిటీకి అందజేసింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం, కంచ గచ్చిబౌలి గ్రామం సర్వే నంబరు 25లో 2324.05 ఎకరాల భూమి పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానిదేనని పేర్కొంది. ఈ భూమిని 'కంచ అస్తంబల్ పోరంబోకు సర్కారీ' అని రెవెన్యూ రికార్డుల్లో పేర్కొన్నారని తెలిపింది. 1975లో అప్పటి ప్రభుత్వం సర్వే నంబరు 25లోని మొత్తం భూమిని విశ్వవిద్యాలయానికి కేటాయించిందని ప్రస్తావించింది. రెవెన్యూ, అటవీ రికార్డుల్లో ఎక్కడా దీన్ని అటవీ భూమిగా పేర్కొనలేదని తేల్చిచెప్పింది. 9-8-2003న అప్పటి ప్రభుత్వం ఐఎంజీ అకాడమీస్ భారత ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో అవగాహన ఒప్పందం చేసుకుందని, అందులో భాగంగా గచ్చిబౌలిలోని 400 ఎకరాలతో పాటు మామిడిపల్లి గ్రామంలోని మరో 450 ఎకరాలను ఆ సంస్థకు ఇవ్వడానికి సిద్ధపడిందని గుర్తు చేసింది. అందుకోసం విశ్వవిద్యాలయం పరిధిలోని 534.28 ఎకరాలు తీసుకుని, అందులో 400 ఎకరాలు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థకు, 134.28 ఎకరాలను ఎన్జీవోలకు అప్పగించిందని చెప్పింది. అప్పటి విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ 3-2-2004 తేదీన శేరిలింగంపల్లి రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచనామా ద్వారా భూమిని ప్రభుత్వానికి అప్పగించారని తెలిపింది. బదులుగా రాష్ట్ర ప్రభుత్వం సర్వే నంబరు 36లో(గోపనపల్లి గ్రామం) 191.36 ఎకరాలు, సర్వే నంబరు 37లో 205.20 ఎకరాలు కలిపి 397 ఎకరాలను ప్రత్యామ్నాయ భూమిగా విశ్వవిద్యాలయానికి కేటాయించినట్లు వెల్లడించింది. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ 3-2-2004 తేదీన పంచనామా ద్వారా 397 ఎకరాలను స్వాధీనం చేసుకున్నారని చెప్పింది. 400 ఎకరాలకు బదులుగా విశ్వవిద్యాలయం 397 ఎకరాలను తీసుకున్నందున 400 ఎకరాలపై హక్కును వదులుకున్నట్లు అయ్యిందని తెలిపింది. రాష్ట్ర విభజన జరిగి, తెలంగాణ ఏర్పడిన తర్వాత 2017లో అప్పటి ప్రభుత్వం టీజీ ఎన్జీవో కాలనీకి అవసరమైన రహదారి కోసం భూమిని సిద్ధం చేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఆదేశిస్తూ 2-1-2017న మెమో ఇచ్చిన విషయాన్ని ప్రభుత్వం ప్రస్తావించింది. రహదారి పనులపై అభ్యంతరం తెలుపుతూ వర్సిటీ అధికారులు హైకోర్టును ఆశ్రయించగా 400 ఎకరాలపై వర్సిటీకి ఎలాంటి హక్కు లేదని హైకోర్టు కొట్టేసిందని గుర్తు చేసింది. రెవెన్యూ రికార్డుల్లో పేర్కొన్న కంచా అంటే మేత.. లేదా వ్యర్థభూమి అని అర్థమని, ఏనాడూ అటవీ భూమిగా నోటిఫై చేయలేదని ప్రభుత్వం తెలిపింది. ఈ భూమితో అటవీ శాఖకు సంబంధం లేదని అటవీ శాఖ అధికారులు హైకోర్టులో కౌంటర్ దాఖలు చేయబోతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం సాధికార కమిటీ దృష్టికి తీసుకొచ్చింది.

పోరాటం కొనసాగిస్తాం

హైదరాబాద్ సిటీ/రాయదుర్గం/గచ్చిబౌలి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సాధికార కమిటీ ఉదయం 8.30 గంటలకే కంచ గచ్చిబౌలికి వచ్చింది. రెండు గంటల పాటు వివాదాస్పద భూములను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులంతా పక్కనే ఉన్నారు. శేరిలింగంపల్లి రెవెన్యూ యంత్రాంగం తెల్లవారుజామునే అక్కడికి వచ్చింది. కమిటీ వద్దకు వెళ్లేందుకు హెచ్‌సీయూ విద్యార్థి నేతలు ప్రయత్నించగా పోలీసులు అనుమతించలేదు. ఫోన్ ద్వారా పలుమార్లు అడగ్గా ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో సమావేశమయ్యేందుకు సీఈసీ అంగీకరించింది. విద్యార్థుల నుంచి ఉమేశ్ అంబేద్కర్, ఆకాశ్ కుమార్, సులేమాన్ సాధికార కమిటీతో భేటీకి హాజరయ్యారు. విద్యార్థుల తరఫున వీరు నివేదిక అందించారు. 400 ఎకరాల్లో జీవ వైవిధ్యాన్ని కాపాడటం కోసం తమ పోరాటం కొనసాగుతుందని, భూమిని వేలం వేయడాన్ని వ్యతిరేకిస్తామని ప్రకటించారు.



అభివృద్ధి అంటే భూములు చెరబట్టడం కాదు

» కాంగ్రెస్ అంటే కక్ష తీర్చుకోవడమేనా ?

» రాష్ట్ర ప్రభుత్వానికి కేటీఆర్ చురకలు

» 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రస్తావిస్తూ ఎక్స్‌లో పోస్టు

హైదరాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి అంటే భూములు చెరబట్టడం, బుల్డోజర్లను ఉసిగొల్పడం కాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అంటే కక్ష తీర్చుకోవడం ? కమీషన్లు దండుకోవడం ? కబ్జాలు చేసుకోవడమేనా ? అని ప్రశ్నించారు. ఎస్ఆర్ఎస్‌డీపీ పనులు, ఫలక్‌నుమా ఆర్వోబీ, శిల్పా లేఅవుట్ వద్ద అంతర్జాతీయ విమానాశ్రయానికి కలిపే రెండో లెవెల్ వంతెన నిర్మాణం తదితర పనులు నత్తనడకన సాగుతున్న తీరుపై 'ఎక్కడివక్కడే' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో గురువారం ప్రచురితమైన కథనానికి కేటీఆర్ స్పందించారు. 'ఆంధ్రజ్యోతి' కథనానికి సంబంధించిన చిత్రాలను ఎక్స్‌లో పోస్టు చేసి రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ప్రతిపక్షాలపై అక్రమ కేసులుపెట్టి చంచల్‌గూడ జైలుకు పంపడంపై ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ.. దాని ముందు ఉన్న ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తి చేయడంపై లేదని కేటీఆర్ విమర్శించారు. కాగా, తనకు వచ్చిన రెండు వేల రూపాయల పింఛనులో నుంచి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఇవ్వండని పార్టీ నేతలకు బోడబాజీ అనే వృద్ధురాలు రూ.వెయ్యి అందజేయడంపై కేటీఆర్ హర్షం వ్యక్తంచేశారు. తెలంగాణలో ఎంతో మంది కేసీఆర్‌ను తమ పెద్ద కొడుకులా భావిస్తారని ఈ సందర్భంగా పేర్కొన్నారు.


భూములు హెచ్‌సీయూవే!

2012 నాటి ఆర్డీవో నివేదిక అదే చెబుతోంది.. కంచ గచ్చిబౌలిలో పర్యావరణ విధ్వంసం

» సుబాబులే కాదు.. ఔషధ మొక్కలున్నాయి

» 3 జింకల చావుకు రేవంతే కారణం

» సల్మాన్‌లా ఈయన్నూ శిక్షించాలి: హరీశ్



హైదరాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం కంచ గచ్చిబౌలి భూముల్లో పర్యావరణ విధ్వంసం సృష్టించిందని, వేల చెట్లునరికి వన్యప్రాణి చట్టాన్ని, వాల్టా చట్టాన్ని ఉల్లంఘించిందని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ఆరోపించారు. సుప్రీంకోర్టు పరిధిలోని కేంద్ర సాధికార కమిటీ కంచె గచ్చిబౌలి భూముల సందర్శనకు రాగా, హరీశ్‌రావు నేతృత్వంలో బీఆర్ఎస్ నేతలు వారిని కలిసి తమ వాదన వినిపించారు. అనంతరం హరీశ్‌రావు తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. హెచ్‌సీయూ విద్యార్థులు, ప్రకృతి ప్రేమికులు, పర్యావరణ వేత్తలు లేవనెత్తుతున్న అంశాలపై 11 పేజీల వాస్తవ నివేదికను, 200 పేజీల అనుబంధ పత్రాలను వారికి అందజేశామని చెప్పారు. కంచ గచ్చిబౌలి భూములమ్మి ఖజానాకు రూ.40 వేల కోట్లు తెచ్చేందుకు రేవంత్‌రెడ్డి ప్రయత్నించారని ఆరోపించారు. చెట్లునరికి వన్యప్రాణుల గూడు చెదర గొట్టారని, అధికారుల నిర్లక్ష్యం వల్ల మూడు జింకలు చనిపోయాయన్నారు. అటవీ శాఖ అనుమతి ఉంటే తప్ప చెట్లను నరక కూడదన్న నిబంధన ఉన్నప్పటికీ ఇంతలా పర్యావరణ విధ్వంసం జరిగితే అటవీ అధికారులు నిద్ర పోతున్నారా? అని ప్రశ్నించారు. సుబాబుల్ చెట్లు మాత్రమే ఉన్నాయని అటవీ అధికారులు అబద్ధం చెబుతున్నారని, సుగంధ పరిమళాలిచ్చే చెట్లు, అనేక ఔషధ మొక్కలు కూడా ఉన్నాయని చెప్పారు. కంచ గచ్చిబౌలి భూముల్లో ప్రకృతి విధ్వంసంతో రేవంత్‌రెడ్డి ఏడు చట్టాలను ఉల్లంఘించారని ఆరోపించారు. సుప్రీం ఆదేశాలను కూడా లెక్క చేయకుండా ఈ భూములు టీజీఐఐసీ పరిధిలోనివని బుధవారం బోర్డులు ఏర్పాటు చేశారని అన్నారు.

సీఎంకో న్యాయం... పేదోడికో న్యాయమా?

పేద రైతు పొలంలో చింత చెట్టు, యాప చెట్టు కొట్టుకుంటే పోలీసులు, ఎమ్మార్వో లక్షల్లో జరిమానా వేస్తారని, కంచ గచ్చిబౌలిలో వేలచెట్లు నరుకుతుంటే ఫారెస్ట్, రెవెన్యూ అధికారులు ఏం చేస్తున్నారని హరీశ్ ప్రశ్నించారు. వాల్టా చట్టం కింద ముందు దరఖాస్తు చేసి, ఒక చెట్టు కొట్టేస్తే, బదులు రెండు చెట్లు పెట్టాలని చెప్పారు. కంచ గచ్చిబౌలి భూముల్లో 2011లో లక్షల మొక్కలు పెట్టారని, మన్మోహన్‌సింగ్ కూడా అక్కడ మొక్కలు నాటారని ప్రస్తావించారు. ఒక జింకను చంపిన సల్మాన్‌ఖాన్‌ను జైల్లో పెట్టారని, మూడు జింకల చావుకు కారణమైన రేవంత్‌రెడ్డికి కూడా కఠినశిక్ష విధించాలని డిమాండ్ చేశారు. కంచ గచ్చిబౌలి భూములు హెచ్‌సీయూ ఆధీనంలోనే ఉన్నాయని 2012లో సంబంధిత ఆర్డీఓ జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారని ప్రస్తావించారు. 400 ఎకరాలకు బదులుగా హెచ్‌సీయూకి ఇచ్చిన భూములను కూడా ప్రభుత్వం వెనక్కి తీసుకున్నందున ఈ భూములు హెచ్‌సీయూవే అవుతాయని చెప్పారు. చెట్లు కొట్టడానికి రక్షణ కోసం పోలీసు స్టేషన్‌లో టీజీఐఐసీ దరఖాస్తు చేసిందని, అసలు దరఖాస్తే నేరపూరితమని వ్యాఖ్యానించారు. చెట్లు నరకడానికి అటవీ శాఖ అనుమతి, వాల్టా అనుమతి ఉందా? అని అడిగిన తర్వాతే పోలీసులు రక్షణ కల్పించాల్సిందని అన్నారు. తమ ప్రభుత్వం ఉన్నపుడు సచివాలయం నిర్మించే క్రమంలో చెట్లు నరకొద్దని రేవంత్ సుప్రీంకోర్టుకు వెళ్లారని ప్రస్తావించారు. అక్కడ నరికింది20 చెట్లని వాటికి కూడా అన్ని అనుమతులు తీసుకున్నామని చెప్పారు. రేవంత్ సర్కారు 4 నెలల క్రితం కంచ గచ్చిబౌలి భూములను తాకట్టు పెట్టి పది వేల కోట్లను అప్పుగా తీసుకుందని హరీశ్ తెలిపారు. అప్పు ఇప్పించిన బ్రోకర్‌కు ఫీజు కింద దాదాపు 170 కోట్లు చెల్లించారని చెప్పారు. అదే బ్రోకర్ ద్వారా హెచ్ఎండీఏ భూములను తాకట్టు పెట్టి మరో 20 వేల కోట్ల అప్పు చేసేందుకు ప్రణాళికలు వేస్తోందన్నారు. అప్పు డెంత బ్రోకర్ ఫీజు చెల్లిస్తారో చూడాలని అన్నారు. ప్రభుత్వ గ్యారెంటీతో చేసే అప్పులకూ బ్రోకర్‌ను ఆశ్రయించడం కాంగ్రెస్‌కే చెల్లిందని వ్యాఖ్యానించారు.



గెవరా గనిలో బొగ్గును పరిశీలిస్తున్న కిషన్‌రెడ్డి

బొగ్గు గని కార్మికులే నిజమైన వారియర్లు

కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి

గెవరాగని కార్మికులతో సహపంక్తి భోజనం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఇంధన భద్రత కల్పనలో బొగ్గు గనులు కీలకపాత్ర పోషిస్తున్నాయని కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి జీ కిషన్‌రెడ్డి చెప్పారు. దేశీయ విద్యుత్ అవసరాలను 70 శాతానికి పైగా బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ ఉత్పత్తి తీరుస్తుందన్నారు. తమ ప్రభుత్వం మైనింగ్ కార్యకలాపాల్లో సుస్థిరతకు ప్రాధాన్యమిస్తూ.. ప్రణాళికాబద్ధంగా సరైన పద్ధతిలో గనులను మూసివేస్తున్నట్లు ఆయన తెలిపారు. దేశంలోనే అతి పెద్ద బొగ్గు గని గెవరా గనిని గురువారం సందర్శించారు. ఆ గనిలో కార్యకలాపాలపై అధికారులు కేంద్ర మంత్రికి ప్రజెంటేషన్ రూపంలో వివరించారు. అటుపై మంత్రి కిషన్‌రెడ్డి స్వయంగా గనిలోకి దిగి.. బ్లాస్ట్ ఫ్రీ సర్ఫేస్ మైనర్ సాంకేతికత యంత్రాలతో జరుగుతున్న బొగ్గు తవ్వకాలను వీక్షించారు. యంత్రాల ఆపరేటర్లను అడిగి వాటి పని తీరు తెలుసుకున్నారు. తర్వాత ఆయన కార్మికులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.

టాప్-10 వర్సిటీల్లో సగం 500 ఎకరాల్లోపే!

(మొదటిపేజీ తరువాయి)

ప్రస్తుతం ఆసక్తికరమైన అంశమే! హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం- కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం నేపథ్యంలో దేశంలోని సెంట్రల్ వర్సిటీలకు ఎన్ని భూములు ఉన్నాయన్న వివరాలతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రసిద్ధ యూనివర్సిటీలకు ఎంత స్థలం ఉందనే విషయాన్ని ఓసారి పరిశీలిస్తే.. ఆసక్తికరమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి. ప్రపంచవ్యాప్తంగా టాప్-10 యూనివర్సిటీల (క్యూఎస్ వరల్డ్ ర్యాంకింగ్ -2025)ను పరిశీలిస్తే వాటిలో దాదాపు సగం సంస్థలు 500 ఎకరాల్లోపే ఉన్నాయి! పైగా ఆయా వర్సిటీలన్నీ 16, 17, 18వ శతాబ్దాల్లోనే స్థాపించడం గమనార్హం. అప్పటికి ఆయా దేశాల్లో కావాల్సినంత భూమి అందుబాటులో ఉన్నా.. విశ్వవిద్యాలయాలు మాత్రం అవసరమైనంత మేరకు పరిమిత స్థలాల్లోనే ఉన్నాయి. పైగా ఇవేమీ చిన్నాచితకా వర్సిటీ లు కాదు. నోబెల్ పురస్కార గ్రహీతలను, ప్రపంచాన్ని ఏలుతున్న వ్యాపార దిగ్గజాలను, సినీ, క్రీడా ప్రముఖులను తీర్చిదిద్దినవి. న్యూటన్, స్టీఫెన్ హాకింగ్, బిల్‌గేట్స్, బ్రూస్‌లీలాంటి ప్రముఖులు చదివినవి. ప్రపంచంలోని టాప్-20 యూనివర్సిటీలే కాదు.. అమెరికాలోని ఐవీవై లీగ్ యూనివర్సిటీలు కూడా ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందినవే. ఈ వర్సిటీల్లో సీటు సాధించడం అంటే ఆషామాషీ కాదు. అలాంటి ఐవీవై లీగ్ విశ్వవిద్యాలయాలు అమెరికాలో 8 ఉండగా.. అందులో 5 వర్సిటీలు 500 ఎకరాల్లోపు విస్తీర్ణంలోనే ఉన్నాయి. మరోవైపు ప్రపంచవ్యాప్తంగా టాప్ యూనివర్సిటీల్లో ఒకటిగా ఉన్న యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్ కేవలం 370 ఎకరాల్లో ఉంది. టాప్-5లో ఉన్న మరో వర్సిటీ ఈటీహెచ్ జ్యూరిక్ (స్విట్జర్లాండ్) 79 ఎకరాల్లో ఉంది. ఆస్ట్రేలియాలోని ప్రముఖ వర్సిటీల్లో ఒకటిగా ఉన్న ది యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్‌వేల్స్ 94 ఎకరాల్లో ఉంది. చైనా రాజధాని బీజింగ్‌లో ఉన్న సింగువా యూనివర్సిటీని 980 ఎకరాల్లో స్థాపించారు.

విస్తీర్ణం చిన్నదైనా.. విద్యార్థులు 20 వేలపైనే!

ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఈ యూనివర్సిటీలు తక్కువ విస్తీర్ణంలోనే ఉన్నాయి కాబట్టి.. వాటిల్లో ఉండే విద్యార్థుల సంఖ్య కూడా అంతేనా? అంటే.. పప్పులో కాలేసినట్లే. ఈ వర్సిటీల్లో విద్యార్థుల సంఖ్య భారీగానే ఉంది. బిల్‌గేట్స్, బ్రూస్‌లీ వంటి వారు చదివిన యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్ సియాటెల్ క్యాంపస్ 703 ఎకరాల్లో ఉంది. కానీ, ఇందులో చదివే విద్యార్థుల సంఖ్య సుమారు 40,000! ఐవీవై లీగ్ వర్సిటీల్లో ఒకటిగా ఉన్న కార్నెల్ యూనివర్సిటీ 745 ఎకరాల్లో ఉంది. న్యూయార్క్‌లో ఉన్న ఈ యూనివర్సిటీలో చదివేది 26,793 మంది. అమెరికాలోని పశ్చిమ ఫిలడెల్ఫియాలో ఉన్న యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియా 299 ఎకరాల్లో ఉండగా.. ఇక్కడ విద్యార్థులు మాత్రం 28,711 మంది ఉన్నారు. సింగపూర్‌లోని టాప్ యూనివర్సిటీల్లో ఒకటిగా ఉన్న సింగపూర్ నేషనల్ యూనివర్సిటీ 370 ఎకరాల్లో ఉంది. ఇక్కడ విద్యార్థుల సంఖ్య సుమారు 40,000. ఇక టెక్నాలజీ రంగాల్లో ప్రసిద్ధి చెందిన అమెరికాలోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఐటీ) కేవలం 168 ఎకరాల్లో ఉండగా.. ఇందులో చదువుతున్న విద్యార్థులు 11,868 మంది. యూనివర్సిటీ ఆఫ్ కెనడా వాంకోవర్ క్యాంపస్ 993 ఎకరాల్లో ఉండగా.. అందులో ఏకంగా 71,201 మంది విద్యార్థులు చదువుతున్నారు.

అన్ని విభాగాలూ ఉంటాయ్..

విస్తీర్ణంలో తక్కువ ఉన్నప్పటికీ ఈ యూనివర్సిటీల్లో అన్ని విభాగాలూ ఉన్నాయి. ఐటీ, టెక్నాలజీ, ఆర్కిటెక్చర్, సైన్స్, సోషల్ సైన్సెస్ ఇలా అన్ని విభాగాలకు చెందిన కోర్సులూ ఉంటాయి. ఉదాహరణకు యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్‌లో సుమారు 473 కోర్సులను ఆఫర్ చేస్తున్నారు. అదేవిధంగా ఎంఐటీలో 58 మేజర్ కోర్సులు, 56 మైనర్ కోర్సులను అందుబాటులో ఉంచారు. మన హెచ్‌సీయూలో ఉన్న కోర్సులు 119. ఇక 32 ఎకరాల్లో ఉన్న ఐవీవై లీగ్ కొలంబియా వర్సిటీ 100కు పైగా డిగ్రీ కోర్సులను అందిస్తోంది.

ప్రపంచంలోని కొన్ని టాప్ వర్సిటీల విస్తీర్ణం, వాటిల్లోని విద్యార్థుల సంఖ్య

వర్సిటీ	విస్తీర్ణం (ఎకరాల్లో)	విద్యార్థుల సంఖ్య
ఆక్స్‌ఫర్డ్ (యూకే)	1327	26000
కేంబ్రిడ్జ్ (యూకే)	1520	20980
స్టాన్‌ఫర్డ్ (యూఎస్ఏ)	8180	18446
ఈటీహెచ్ (స్విట్జర్లాండ్)	79	27000
నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్	370	34388
యూనివర్సిటీ కాలేజ్ లండన్(యూకే)	34	51000
కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (యూఎస్ఏ)	124	2430
యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియా(యూఎస్ఏ)	299	29109
యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా(యూఎస్ఏ)	1232	299407
నాన్యంగ్ టెక్నాలజికల్ యూనివర్సిటీ(సింగపూర్)	490	31687

ఐవీవై లీగ్ యూనివర్సిటీల విస్తీర్ణం, విద్యార్థుల సంఖ్య

యూనివర్సిటీ	విస్తీర్ణం (ఎకరాల్లో)	వర్సిటీ ఉన్న ప్రదేశం	విద్యార్థుల సంఖ్య
1. కార్నెల్	745	ఇథాకా/ న్యూయార్క్	26793
2. కొలంబియా	32	బ్రాడ్ వే ఆమ్‌స్టర్‌డామ్	25914
3. బ్రౌన్	146	రోడ్ ఐలాండ్/యూఎస్ఏ	11005
4. డార్ట్ మౌత్ కాలేజ్	269	న్యూ హాంప్ షైర్	6746
5. యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియా	299	పశ్చిమ ఫిలడెల్ఫియా	28711
6. ప్రిన్స్‌టన్	500	ప్రిన్స్‌టన్, న్యూజెర్సీ	8896
7. ఏల్	1108	కనెక్టికట్ న్యూ హెవెన్	12093
8. హార్వర్డ్	5,667 (అన్ని క్యాంపస్‌లు కలిపి)	కేంబ్రిడ్జ్, మసాచుసెట్స్	25000



మంత్రి ఉత్తమ్‌ను కలిసి విజ్ఞాపన పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్, ఎమ్మెల్సీ కోదండరాం, నైనాల గోవర్ధన్ తదితరులు

తుమ్మిడిహెట్టి బ్యారేజీని నిర్మించాలి

» మంత్రి ఉత్తమ్‌ను కలిసిన కోదండరాం, పాల్వాయి హరీశ్, నైనాల గోవర్ధన్

హైదరాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతల పథకంలో భాగంగా తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణం చేపట్టాలని పలువురు ప్రజాప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని సిర్పూర్-కాగజ్‌నగర్ బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు, ఎమ్మెల్సీ కోదండరాం, తెలంగాణ జలసాధన సమితి కన్వీనర్ నైనాల గోవర్ధన్, ప్రాణహిత పరిరక్షణ వేదిక కన్వీనర్ కె.వి.ప్రతాప్ కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీని పునరుద్ధరించడం అసాధ్యమని, ఒకవేళ బ్యారేజీని పునరుద్ధరించినా.. మళ్లీ మన్నిక ఉంటుందనే గ్యారెంటీ లేదని పేర్కొన్నారు. మేడిగడ్డతో పాటు అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు కుంగే అవకాశాలు లేకపోలేదన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ చేసిన వాగ్దానానికి అనుగుణంగా తుమ్మిడిహెట్టి బ్యారేజీని నిర్మించాలని, ఇంకా అంశాలను ప్రస్తావిస్తూ వారు మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఇక తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణం కోసం అనుమతులు సాధించే బాధ్యత తనదేనని, రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళితే ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన కింద 60% నిధులు వచ్చేలా చొరవ తీసుకుంటానని బీజేపీ ఎమ్మెల్యే హరీశ్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. తుమ్మిడిహెట్టి పూర్తి చేయడానికి వీలుగా ప్రాణహిత-చేవెళ్ల కార్పొరేషన్ ఒకటి ఏర్పాటు చేయాల్సి ఉందని చెప్పారు.



టి-నెక్స్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

టీ ఫైబర్ ఇక టీనెక్స్:మంత్రి దుద్దిళ్ల

హైదరాబాద్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 33 జిల్లాల్లోని ప్రతి ఇల్లు, కార్యాలయానికి తెలంగాణ ఫైబర్ నెట్ ద్వారా ఇంటర్నెట్ సేవలు కల్పిస్తామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. టీ ఫైబర్ ఇకపై టి-నెక్స్ పేరుతో సేవలు అందిస్తుందని ప్రకటించారు. ఈ మేరకు హైదరాబాద్, బేగంపేటలో టీ నెక్స్ నూతన కార్యాలయాన్ని మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కేబుల్ ఆపరేటర్ల సహకారంతో ప్రతీ ఇంటికీ టీవీ చానెల్స్‌తోపాటు ఇంటర్నెట్ సదుపాయం కల్పిస్తామని తెలిపారు. ఇప్పటిదాకా రాష్ట్రంలోని 424 మండలాల్లోని 8,891 గ్రామ పంచాయతీల్లో టీ ఫైబర్ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. త్వరలో మరో 7,187 పంచాయతీల్లో ఫైబర్ సేవలు అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. రాష్ట్రంలో 30 వేల ప్రభుత్వ కార్యాలయాలకు టీఫైబర్ సేవలను అనుసంధానించారని, 2027 నాటికి ఈ సంఖ్యను 60 వేలు చేస్తామని ప్రకటించారు. టీ-నెక్స్ కొత్త లోగోను, టీఫైబర్‌కు సంబంధించిన నూతన విజన్ డాక్యుమెంట్‌ను మంత్రి ఈ సందర్భంగా ఆవిష్కరించారు. అలాగే, తెలంగాణ ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్ చైర్మన్‌గా మంత్రి శ్రీధర్ బాబు బాధ్యతలు స్వీకరించారు.

ప్రతి గ్రామానికీ జయశంకర్ వర్సిటీ విత్తనాలు

» 2,500-3,000 క్వింటాళ్ల పంపిణీకి ప్రణాళిక: తుమ్మల



రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించి, పంటల దిగుబడి పెంచడమే లక్ష్యంగా పని చేస్తున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఇందులో భాగంగానే "గ్రామగ్రామానికి జయశంకర్ వర్సిటీ నాణ్యమైన విత్తనం" పేరిట కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. జూన్‌లో సీఎం రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 12 వేల గ్రామాల్లో 40 వేల మంది రైతులకు 2,500-3,000 వేల క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేసేలా ప్రణాళికలు తయారుచేసినట్లు వెల్లడించారు. కొన్నేళ్లుగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు అనేక కొత్త వంగడాలను అభివృద్ధి చేశారని, వాటిలో ప్రాచుర్యం పొందిన వంగడాలను రైతులకు నేరుగా అందించడం ద్వారా పంటల దిగుబడి గణనీయంగా పెరుగుతుందన్నారు. కాగా, గత నెలలో అకాల వర్షాలు, వడగండ్ల వానతో 8,408 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు నివేదిక వచ్చిందని, ఆయా రైతులకు త్వరలోనే నష్ట పరిహారం చెల్లిస్తామని తుమ్మల తెలిపారు. ఈ నెల 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా కురిసిన చెదురుమదురు వర్షాలకు ప్రాథమికంగా 14,956 ఎకరాల్లో నష్టం జరిగినట్లు సమాచారం వచ్చిందని, రైతుల వారీగా సర్వే చేయాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు.

పర్యాటకంలో పెట్టుబడులకు ప్రోత్సాహకాలు

» ఇన్వెస్టర్లకు మెరుగైన రాయితీలు: జూపల్లి



హైదరాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేవారికి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తామని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఆతిథ్య రంగంలో తీసుకొచ్చిన నూతన పర్యాటక విధానంతో తెలంగాణలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఏర్పడిందని చెప్పారు. గురువారం ముంబై పోవై లేక్‌లో జరిగిన దక్షిణాసియా 20వ హోటల్స్ ఇన్వెస్ట్‌మెంట్ సదస్సులో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రఖ్యాత హోటల్స్, ట్రావెల్స్ సంస్థల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమై తెలంగాణ ఆతిథ్య రంగంలో పెట్టుబడులు పెట్టి పర్యాటక అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆహ్వానించారు.

పెండింగ్ బిల్లులను చెల్లించండి

» డిప్యూటీ సీఎం భట్టికి ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి విజ్ఞప్తి

హైదరాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను చెల్లించాలని ఎమ్మెల్సీ పి.శ్రీపాల్‌రెడ్డి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు విజ్ఞప్తి చేశారు. గురువారం భట్టిని శ్రీపాల్‌రెడ్డి.. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, పీఆర్‌టీయూ-టీఎస్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గుండు లక్ష్మణ్, పుల్గం దామోదర్‌రెడ్డి తదితరులతో కలిశారు. ఈ సందర్భంగా పెండింగ్ బిల్లుల గురించి వివరించారు. అయితే ఇక నుంచి ప్రతి నెలా బిల్లులను చెల్లిస్తామని, బకాయిలను ప్రతి నెలా వరుస క్రమంలో చెల్లిస్తామని ఈ సందర్భంగా భట్టి హామీనిచ్చినట్లు వారు ఓ ప్రకటనలో తెలిపారు.

కందిపప్పు కాంట్రాక్టులు రద్దు

టెండర్లు పిలవకుండా కట్టబెట్టడంపై 'ఆంధ్రజ్యోతి' కథనాలతో ప్రభుత్వం చర్యలు

అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా కోసం నామినేషన్ పద్ధతిలో ఇచ్చిన అధికారులు

ఈ వ్యవహారంపై మంత్రి సీతక్క ఆగ్రహం



హైదరాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా నిబంధనలకు విరుద్ధంగా కట్టబెట్టిన 'కందిపప్పు కాంట్రాక్టుల'ను ప్రభుత్వం రద్దు చేసింది. అంగన్‌వాడీ కేంద్రాలకు కందిపప్పు సరఫరాకు జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని కొనుగోలు కమిటీ ద్వారా మాత్రమే టెండర్లు పిలిచి కాంట్రాక్టులు ఖరారు చేయాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. అయినా కూడా టెండర్లు పిలవకుండా, నిబంధనలకు విరుద్ధంగా 15 జిల్లాల్లో కాంట్రాక్టులు కట్టబెట్టారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాలపై ఆ శాఖ అధికారులు స్పందించి... ఆ కాంట్రాక్టులను రద్దు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్టులు కట్టడంపై గురువారం జరిగిన సమీక్షా సమావేశంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అధికారులపై ఆగ్రహం చేశారు. సొంత నిర్ణయాలు ఎవరు తీసుకోమన్నారని ప్రశ్నించారు. అంగన్‌వాడీ కేంద్రాలు వంద శాతం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. రాష్ట్రంలో 313 కేంద్రాలు మూతపడ్డాయని, చిన్నారులు లేరనే సాకుతో మూసివేయడం సరికాదన్నారు. చిన్నారులు లేని కేంద్రాలను డిమాండ్ ఉన్న ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరంలో అన్ని కేంద్రాలు పిల్లలతో కళకళలాడాలని సూచించారు. ప్రతి కేంద్రంలో కనీసం 20 మంది ఉండాలని, బడిబాట తరహాలో గ్రామాల్లో చిన్నారులను గుర్తించి చేర్పించాలని ఆదేశించారు. 30 అంగన్‌వాడీ కేంద్రాల్లో అసలు పిల్లలు లేరని, 198 కేంద్రాల్లో 5లోపు, 586 కేంద్రాల్లో 10లోపే ఉన్నారన్నారు. చిన్నారులకు అందించే పోషకాహారంలో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి గ్రేడింగ్ ఇస్తామని చెప్పారు. మంచి గ్రేడింగ్ వచ్చిన కేంద్రాల సిబ్బందికి, ఎక్కువ కేంద్రాలు ఎంపికైన జిల్లా అధికారులకు అవార్డులు ప్రకటిస్తామని తెలిపారు.

నా బ్రాండ్.. యంగ్ ఇండియా

(మొదటిపేజీ తరువాయి)

వైఎస్సార్‌ను ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారని ఇవీ ఆ నాయకుల బ్రాండ్స్. ఈ రోజు నేను రూపొందించిన బ్రాండే యంగ్ ఇండియా. యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ.. ఇలా ఓ బ్రాండ్ క్రియేట్ చేస్తున్నాం" అని చెప్పారు. తెలంగాణలో ఏటా 1.10లక్షల మంది ఇంజనీరింగ్ పట్టాతో బయటకు వస్తున్నారని, వీరికి సరైన ఉద్యోగాలు దొరకని పరిస్థితి ఉందన్నారు. సాంకేతిక నైపుణ్యాలు లేకపోవడం వల్లే వీరు వెనుకబడుతున్నారని గుర్తించి, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని వివరించారు. స్కిల్స్ యూనివర్సిటీలో చేరిన ప్రతి ఒక్కరికీ ఉద్యోగం దొరికేలా కంపెనీలు శిక్షణ ఇస్తున్నాయని చెప్పారు. దీన్ని దేశంలోనే అత్యుత్తమ యూనివర్సిటీగా తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు. కోట్ల మంది జనాభా ఉన్నా.. ఒలింపిక్స్‌లో పతకాల వేటలో భారత్ వెనుకపడిపోతుందని, ఈ పరిస్థితిని అధిగమించేందుకే యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, అకాడమీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వచ్చే ఒలింపిక్స్ లక్ష్యంగా క్రీడాకారులను తీర్చిదిద్దడమే స్పోర్ట్స్ యూనివర్సిటీ లక్ష్యమని పేర్కొన్నారు.

ప్రీస్కూల్ విధానం లేకపోవడమే సమస్య

"రాష్ట్రంలోని 11,500 ప్రైవేటు స్కూళ్లలో 36 లక్షల మంది విద్యార్థులు చదువుతుంటే, 29,500 ప్రభుత్వ స్కూళ్లలో 18.50 లక్షల మంది విద్యార్థులు మాత్రమే చదువుకుంటున్నారు. ఇలా ఎందుకు జరుగుతుందని విద్యా రంగ మేధావులతో చర్చించినపుడు ఒక విషయం అర్థమైంది. ప్రభుత్వ బడుల్లో ఐదేళ్లు దాటిన పిల్లలకు అడ్మిషన్లు ఇస్తుంటే.. ప్రైవేట్ స్కూళ్లల్లో మూడో ఏడాది నుంచే ప్రీస్కూల్ విధానం ఉంది. ప్రైవేట్‌లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ చదివిన పిల్లలు.. ఒకటో తరగతికి ప్రభుత్వ స్కూళ్లకు రావడం లేదు. ఇదే పెద్ద సమస్యగా మారింది. ఈ అస్పష్టతను తొలగించడానికి ప్రభుత్వ బడుల్లోనూ అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రీస్కూళ్లను ఏర్పాటు చేయబోతున్నాం" అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రీస్కూళ్లలో చేరే విద్యార్థులకు ఉచిత రవాణా, టిఫిన్, మధ్యాహ్న భోజనం ఇస్తామని వివరించారు. పోలీసుల కష్టాలపైనా తనకు స్పష్టమైన అవగాహన ఉందని, విధి నిర్వహణలో 24గంటలు పని చేస్తూ కుటుంబం, పిల్లల భవిష్యత్తుపై దృష్టి పెట్టలేని పరిస్థితిలో వారున్నారని సీఎం చెప్పారు. "కార్పొరేట్ స్కూల్ పక్క నుంచి నడుచుకుంటూ వెళ్లే హోంగార్డు.. తన కుమార్తెను ఇలాంటి స్కూల్‌లో చేర్పించగలనా? అని ఆలోచిస్తాడు. అలాంటి వారి కలలను నిజం చేసేందుకే అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను ప్రారంభిస్తున్నాం" అని తెలిపారు. కార్పొరేట్, ఫార్మా కంపెనీల నుంచి వచ్చే సీఎస్ఆర్ నిధుల ద్వారా రూ.100కోట్లు సేకరించి.. యంగ్ ఇండియా పోలీసు స్కూల్‌కు కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయాలని, స్వయం సమృద్ధి కలిగిన పాఠశాలగా తీర్చిదిద్దాలన్నారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్యను ముందుకు తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ కమిషనర్ సీవీ ఆనంద్ మాట్లాడుతూ సీఎం రేవంత్ ఆలోచనలకు అనుగుణంగా వంద రోజుల్లోనే యంగ్ఇండియా పోలీస్ స్కూల్‌ను ప్రారంభించామని, వచ్చే రెండేళ్లలో 50 ఎకరాల్లోని క్యాంపస్‌లో పక్కా భవనాల నిర్మాణం సైతం పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, డీజీపీ జితేందర్, ఇతర సీనియర్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.



రంగారెడ్డి జిల్లా మంచిరేవులలో యంగ్ఇండియా పోలీసు స్కూళ్లను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి

పూలే స్ఫూర్తితో వినూత్న కార్యక్రమాలు

మహాత్మ జ్యోతిబా పూలే స్ఫూర్తితోనే తమ ప్రభుత్వం అనేక వినూత్న, ప్రజా ప్రయోజనకర కార్యక్రమాలను చేపడుతోందని సీఎం రేవంత్ పేర్కొన్నారు. శుక్రవారం పూలే జయంతి జరుపుకోనున్న నేపథ్యంలో ఆయన చేసిన త్యాగాలు, సేవలను సీఎం స్మరించుకున్నారు. సామాన్యుడిగా మొదలై ఒక సామాజిక ఉద్యమ కెరటంగా ఎదిగిన పూలే జీవితం అందరికీ ఆదర్శనీయమన్నారు. సమాజంలో వివక్షకు తావు లేదని, సమానత్వం ఉండాలని జీవితాంతం పోరాడిన మహనీయుడని కొనియడారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రగతి భవన్‌కు పూలే పేరు పెట్టి ప్రజా భవన్‌గా మార్చామని గుర్తు చేశారు.

అట్టడుగు వర్గాలపై జరుగుతున్న దాష్టీకాలకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని మంత్రి పొన్నం కొనియాడారు. విద్య ద్వారానే సామాజిక ఆర్థిక సమున్నతికి బాటలు పడతాయన్న పూలే ఆలోచన విధానానికి అనుగుణంగా ప్రజా ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు.

గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి సలహా కమిటీ

» చైర్మన్‌గా విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి వినోద్‌కుమార్

» సీఎం హామీ మేరకు కమిటీ ఏర్పాటు

హైదరాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. వారి సంక్షేమానికి సంబంధించిన అంశాలపై అధ్యయనం చేసి, సమగ్ర ప్రవాస భారతీయ (ఎన్ఆర్ఐ) విధానాన్ని రూపొందించడానికి సలహా కమిటీని ఏర్పాటు చేస్తూ సీఎస్ శాంతికుమారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రెండేళ్ల కాలపరిమితి గల ఈ కమిటీ చైర్మన్‌గా విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి బి.ఎం.వినోద్‌కుమార్‌ను, వైస్ చైర్మన్‌గా మంద భీంరెడ్డిని నియమించింది. సాధారణ పరిపాలనా శాఖ ప్రోటోకాల్ విభాగం సంయుక్త కార్యదర్శి స్థాయి (ఐఏఎస్) అధికారి కమిటీకి సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారు. కమిటీలో గౌరవ సభ్యులుగా మాజీ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, ఆర్.భూపతి రెడ్డి, ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్‌ను నియమించింది. గల్ఫ్ వలసలపై అవగాహన కలిగిన సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, లిజీ జోసెఫ్, చెన్నమనేని శ్రీనివాసరావు, కొట్టాల సత్యం నారాగౌడ్(దుబాయ్), గుగ్గిళ్ల రవీందర్, నంగి దేవేందర్, స్వదేశ్ పరికిపండ్లను సభ్యులుగా నియమించింది. సీఎం రేవంత్ గత ఏడాది ఏప్రిల్ 16న గల్ఫ్ సంఘాల ప్రతినిధులతో సమావేశమైన సందర్భంగా గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకే సలహా కమిటీని ఏర్పాటు చేశారు. గల్ఫ్ దేశాల్లో తెలంగాణ కార్మికులకు అందుతున్న సంక్షేమ కార్యక్రమాలను ఈ కమిటీ పరిశీలిస్తుంది. కేరళ, పంజాబ్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, బిహార్ తదితర రాష్ట్రాల్లో గల్ఫ్ కార్మికులకు అందుబాటులో ఉన్న సంక్షేమ పథకాలను అధ్యయనం చేస్తుంది. కార్మికుల సమస్యలకు పరిష్కారాలను కనుగొనడానికి ఈ కమిటీ గల్ఫ్ దేశాలను కూడా సందర్శిస్తుంది. కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా ప్రభుత్వం సమగ్ర ఎన్ఆర్ఐ విధానాన్ని రూపొందిస్తుంది.

కారుణ్య నియామకానికి వివాహమైన కుమార్తె అర్హురాలే

» దరఖాస్తును పరిశీలించండి: హైకోర్టు

హైదరాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వివాహమైన కుమార్తె సైతం కారుణ్య నియామకానికి అర్హురాలేనని హైకోర్టు పేర్కొంది. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అర్హతలు ఉంటే ఉద్యోగం ఇవ్వాలని తెలిపింది. రియాసత్‌నగర్‌కు చెందిన మొహమ్మద్ యూనస్ 1989లో కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరి, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ 2022లో చనిపోయారు. అనారోగ్యంతో ఉన్న ఆయన భార్య షహీన్ సుల్తానా బాగోగులను వివాహమైన కుమార్తె ఫాతిమా చూసుకుంటున్నారు. తల్లి పోషణ దృష్ట్యా అర్హతలున్న తనకు ఉద్యోగం ఇవ్వాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు దరఖాస్తు చేసుకున్నారు. దానిని తిరస్కరించడంతో హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ రాజేశ్వర్‌రావు ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. తన భర్తకు ఉద్యోగం ఉందో లేదో అన్న విషయాన్ని వెల్లడించలేదని తెలిపారు. మార్గదర్శకాల ప్రకారం వివాహమైన కుమార్తె కారుణ్య నియామకానికి అర్హురాలు కాదన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. వివిధ హైకోర్టులు, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుల ప్రకారం వివాహమైన కుమార్తె కారుణ్య నియామకానికి అర్హురాలే అని పేర్కొంది. నిబంధనల ప్రకారం ఆర్థికస్థితి, ఇతర ధ్రువపత్రాలతో మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. దీనిపై 8వారాల్లో నిర్ణయం తీసుకోవాలని అధికారులకు ఉత్తర్వులు జారీచేసింది.

బండ్ల దారి కూడా రోడ్డే

» యజమానులు కనీసం 5 అడుగుల స్థలం ఇవ్వాలి: హైకోర్టు

గ్రామాల్లో ఎడ్ల బండ్లు వెళ్లే దారి (కార్ట్ ట్రాక్) కూడా పబ్లిక్ రోడ్డు కిందికే వస్తుందని హైకోర్టు స్పష్టం చేసింది. దానిని ప్రభుత్వ ఆస్తిగా పరిగణించాలని పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ (తెలంగాణ ఏరియా) ల్యాండ్ రెవెన్యూ యాక్ట్ సెక్షన్ 24 ప్రకారం రహదారులు, లేన్లు, నడకదారులు, వంతెనలు, నదులు, చెరువులు, కుంటలు, కాల్వలు అన్నీ ప్రభుత్వ ఆస్తుల కిందకే వస్తాయని తెలిపింది. 'పాత్' అనే పదానికి చట్టంలో నిర్వచనం లేకపోయినప్పటికీ నిఘంటువు అర్థం ప్రకారం మార్గం లేదా తోవ అని పేర్కొనవచ్చని తెలిపింది. ఏపీ బౌండరీస్ యాక్ట్ పేర్కొన్న నిబంధనల ప్రకారం పాత రికార్డులు, డాక్యుమెంట్లలో బండ్లదారి అని ఉంటే పది ఫీట్లు లేదా 3.04 మీటర్లు దారి వదలాల్సి ఉంటుంది. బండ్లదారి ఒకే వ్యక్తికి చెందిన భూమినుంచి వెళ్తే 10 ఫీట్ల దారి ఆ యజమాని ఇవ్వాల్సి ఉంటుంది. ఇద్దరు యజమానుల భూముల్లో నుంచి వెళ్తే చెరి 5 అడుగుల చొప్పున దారికి వదలాల్సి ఉంటుంది. రెవెన్యూ అధికారులే బండ్ల దారుల్లో ఆక్రమణలు తొలగించాల్సి ఉంటుంది" అని జస్టిస్ మాధవీదేవి ధర్మాసనం తీర్పు వెలువరించింది. సంగారెడ్డి జిల్లా ఈసోజీపేట గ్రామం నుంచి కోదూరు మీదుగా మిన్‌పూర్‌కు ఉన్న బండి దారిని పునరుద్ధరించాలని రెవెన్యూ అధికారులకు జారీచేసింది. బండిదారిని ఆక్రమించారని కోదూరు గ్రామస్థులు దాఖలు చేసిన పిటిషన్‌పై ధర్మాసనం ఈ ఆదేశాలు ఇచ్చింది.

పేదలకు మూడు రంగుల కార్డులు

ఆపై వర్గాలకు ఆకుపచ్చ కార్డులు.. త్వరలోనే కొత్త రేషన్ కార్డులు ఇస్తాం: మంత్రి ఉత్తమ్ కుమార్

హైదరాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): దారిద్ర్య రేఖకు దిగువన ఉండే వర్గాల(బీపీఎల్)కు మూడు రంగుల కార్డులు, ఎగువన ఉండేవారి(ఏపీఎల్)కి ఆకుపచ్చ రంగు రేషన్ కార్డులు ఇస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. కార్డుల ముద్రణ కోసం టెండర్లు పిలిచామని, త్వరలోనే కొత్త కార్డులు ఇస్తామని తెలిపారు. రాష్ట్ర జనాభాలో 84 శాతం మందికి సన్న బియ్యం ఇవ్వడం దేశ చరిత్రలోనే గొప్ప కార్యక్రమమని అన్నారు. చేశారు. కేంద్రం మనిషికి 5 కిలోల దొడ్డు బియ్యం ఇస్తుండగా.. తాము 6 కిలోల సన్న బియ్యం ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో దొడ్డు బియ్యం ఇవ్వడానికి రూ.10,600 కోట్లు ఖర్చుకాగా.. 3.10 కోట్ల మందికి సన్న బియ్యం కోసం రూ.13 వేల కోట్లను వెచ్చించనున్నామని ప్రకటించారు. గురువారం జలసౌధ నుంచి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల చైర్మన్లతో ఉత్తమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మార్కెట్‌లో రూ.40కి కిలో సన్న బియ్యం కొనుగోలు చేసి, పేదలకు ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు. గతంలో ఇచ్చిన బియ్యం 80-90 శాతం దాకా పక్కదారి పట్టిందని.. ప్రస్తుతం ఇస్తున్న బియ్యం వంద శాతం సద్వినియోగం అవుతుందని చెప్పారు. ఇంత గొప్ప కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఇక ఏ రాష్ట్రంలో పండనంత వరి ప్రస్తుతం రాష్ట్రంలో పండుతోందని.. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో, ఉమ్మడి ఏపీలో కూడా ఈ స్థాయిలో ఉత్పత్తి రాలేదని ఉత్తమ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో వడ్ల సేకరణ కోసం 8,209 కేంద్రాలు పెట్టాలని నిర్ణయం తీసుకున్నామని, ఇప్పటిదాకా 2,573 కేంద్రాలు తెరిచామని వెల్లడించారు. ధాన్యంలో తేమ 17 శాతం పైన ఉంటే కొనుగోలు చేయబోమని చెప్పారు. రాష్ట్రంలో ఈ ఏడాది సన్నబియ్యం పంపిణీ కోసం 30 లక్షల టన్నుల ధాన్యం సిద్ధంగా ఉంచామని ఉత్తమ్ ప్రకటించారు. తెలంగాణ ఏర్పడే నాటికి 90 లక్షల మందికి తెల్లకార్డులు ఉండగా.. పదేళ్లలో కొన్ని రద్దు కాగా.. కొత్తగా ఇచ్చింది 49 వేల కార్డులేనని చెప్పారు. ప్రస్తుతం 2.81 కోట్ల మందికి సన్నం బియ్యం అందుతుండగా.. కొత్తగా రేషన్‌కార్డుల దరఖాస్తుల వెరిఫికేషన్ పూర్తయితే ఆ సంఖ్య 3.10 కోట్ల మందికి చేరే అవకాశం ఉందన్నారు. ఎన్నికల కమిషన్ అనుమతి ఇవ్వనందున హైదరాబాద్‌లో సన్న బియ్యం ఇవ్వడం లేదని, ఎన్నికలు పూర్తికాగానే ఇస్తామని తెలిపారు.

వాలంతరికి పూర్వ వైభవం తెస్తా: ఉత్తమ్

వాటర్ అండ్ ల్యాండ్ మేనేజ్‌మెంట్ అండ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(వాలంతరి)కి పూర్వ వైభవం తీసుకువస్తానని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్‌లోని వాలంతరిని గురువారం ఆయన సందర్శించారు. ఈ నెల 14న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా 199 మంది జూనియర్ టెక్నికల్ అధికారులు(జేటీవో), 224 మంది అసిస్టెంట్ ఇంజనీర్ల(ఏఈ)కు నియామక పత్రాలు అందించే కార్యక్రమం ఉంది. ఈ నేపథ్యంలో మంత్రి సీతక్క, ఎంపీ బలరాం నాయక్‌తో కలిసి ఉత్తమ్ ఏర్పాట్లను పరిశీలించారు.

అప్పుడు 3 గంటలు.. ఇప్పుడు అరగంటే!

» స్లాట్ విధానంతో సులభంగా రిజిస్ట్రేషన్లు

» ప్రయోగాత్మకంగా 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు..

» తొలి రోజు 626 రిజిస్ట్రేషన్లు



మేడ్చల్-మల్కాజ్‌గిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తొలి స్లాట్ బుక్ చేసుకున్న వారికి దస్తావేజులు అందజేస్తున్న డీఐజీ మధుసూధన్‌రెడ్డి, జిల్లా రిజిస్ట్రార్ అశోక్

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, చంపాపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వేగంగా, పారదర్శకంగా సేవలు అందించేందుకు రిజిస్ట్రేషన్ శాఖ తీసుకొచ్చిన స్లాట్ విధానానికి తొలి రోజు గురువారం మంచి స్పందన వచ్చింది. ప్రయోగాత్మకంగా 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ విధానాన్ని అమల్లోకి తీసుకురాగా మొదటిరోజు 626 రిజిస్ట్రేషన్లు జరిగాయి. కొత్త విధానంపై క్రయవిక్రయదారుల్లో సంతృప్తి వ్యక్తమవుతోంది. పది, పదిహేను నిమిషాల్లోనే ఆస్తుల రిజిస్ట్రేషన్ పూర్తయిందని వారు తెలిపారు. గతంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యాక దస్తావేజులు తీసుకునేందుకు రోజుల తరబడి వేచి ఉండాల్సి వచ్చేదని.. కొత్త విధానంతో రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే చేతికి ఇవ్వడం బాగుందని పేర్కొన్నారు. నూతన విధానం అమలు తొలిరోజు ఎటువంటి ఆటంకాలు ఎదురుగాకపోవడంతో రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు స్లాట్ బుకింగ్ విధానంలో వినియోగదారులే స్వయంగా డాక్యుమెంట్లు తయారు చేసుకునే వెసులుబాటు ఉండటంతో.. తమ ఉపాధికి దెబ్బపడుతోందంటూ కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద డాక్యుమెంట్ రైటర్లు ఆందోళన వ్యక్తం చేశారు. స్లాట్ బుకింగ్‌తోపాటు సమాంతరంగా పాత పద్ధతిని కూడా కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అవినీతి లేకుండా, పారదర్శకంగా: పొంగులేటి

స్లాట్ బుకింగ్ విధానంపై ప్రజల నుంచి వచ్చే స్పందన ఆధారంగా ముందుకు వెళతామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తొలిరోజు స్లాట్ బుకింగ్ జరిగిన తీరు, ఎదురైన ఇబ్బందులు, ప్రజల స్పందనపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. స్లాట్ బుకింగ్ విధానంపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. స్లాట్ బుకింగ్ విధానం వల్ల దళారులను ఆశ్రయించాల్సిన పనిలేదని, ఎవరి సిఫార్సు లేకుండా, పైసా అవినీతికి అవకాశం లేకుండా రిజిస్ట్రేషన్ పూర్తయిపోతుందని స్పష్టం చేశారు. ఎవరైనా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలనుకుంటే registration.telangana.gov.in ద్వారా ఏ రోజు, ఏ సమయంలో కావాలన్నా స్లాట్ బుక్ చేసుకోవచ్చని తెలిపారు.

స్లాట్ విధానం బాగుంది

రిజిస్ట్రేషన్‌కు స్లాట్ బుకింగ్ విధానం బాగుంది. అన్ని వివరాలను ముందే ఆన్‌లైన్‌లో నమోదు చేయడం వల్ల సమయం ఆదా అయింది. 20 నిమిషాల్లోనే మా రిజిస్ట్రేషన్ పూర్తయింది.

- గట్టు శ్రీనివాస్, మల్కాజ్‌గిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద

ఇలాగే కొనసాగించాలి

స్లాట్ బుకింగ్ విధానాన్ని ఇలాగే కొనసాగించాలి. రిజిస్ట్రేషన్ ప్రక్రియ సాఫీగా అయిపోయింది. నా స్లాట్ సమయంలో కొన్ని పత్రాలు ఇవ్వలేకపోవడంతో ఆ సమయాన్ని నా తర్వాతి వారికి ఇచ్చాను.. అధికారుల సాయంతో గంట తర్వాత నా రిజిస్ట్రేషన్ కూడా జరిగింది.

- ఘనశ్యామ్ పటేల్, శంషాబాద్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద

అరగంటలో వచ్చేశాం

మా తనఖా (మార్టిగేజ్) రిజిస్ట్రేషన్ సులువుగా అయింది. ఆస్తి తనఖా కోసం గతంలో 3, 4 గంటలు వేచి చూడాల్సి వచ్చింది. ఇప్పుడు కేటాయించిన సమయానికి వెళ్లాం. అరగంటలో పని పూర్తయింది.

- సి.స్వాతి, వల్లభనగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద

లారీ సీజ్ చేయొద్దంటే రూ.20 వేల లంచం

- ఏసీబీకి చిక్కిన భద్రాచలం సీఐ రమేష్
- సీఐ గన్‌మెన్, మధ్యవర్తి కూడా అరెస్ట్

భద్రాచలం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అనధికారికంగా గ్రావెల్ తరలిస్తూ పట్టుబడిన లారీని విడిపించడానికి రూ.20 వేలు లంచం తీసుకున్న భద్రాచలం సీఐ బరపాటి రమేష్‌ను గురువారం ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. సీఐ గన్‌మెన్ రామారావు, మరో ప్రైవేట్ వ్యక్తిని కూడా కస్టడీలోకి తీసుకున్నారు. ఏసీబీ డీఎస్పీ వై రమేష్ తెలిపిన వివరాల ప్రకారం గత నెల 19న భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా భద్రాచలం వద్ద పోలీసుల తనిఖీలో బూర్గంపాడ్ మండలం లక్ష్మీపురం నుంచి భద్రాచలానికి అనధికారికంగా గ్రావెల్ తరలిస్తున్న లారీ పట్టుబడింది. సదరు లారీ యజమానిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఇంటి నిర్మాణానికి గ్రావెల్ తరలిస్తున్నా ముందు అనుమతి తీసుకోనందుకు కేసు పెడతామని సీఐ బరపాటి రమేశ్ తెలిపారు. ఈ క్రమంలో సీఐ గన్‌మెన్ రామారావు రూ.30 వేలు చెల్లిస్తే లారీని వదిలేస్తారని మధ్యవర్తిత్వం వహించాడు. అంత సొమ్ము ఇవ్వలేనని కేసు పెట్టుకోండంటూ లారీ యజమాని చెప్పేశాడు. సీఐతో మాట్లాడి రూ.20 వేలు చెల్లించేందుకు లారీ ఓనర్‌ని ఒప్పించిన గన్‌మెన్ రామారావు.. కార్తీక్ అనే ప్రైవేట్ వ్యక్తికి ఫోన్‌పే చేయించి లారీని విడుదల చేశారు. దీనిపై లారీ యజమాని ఫిర్యాదుతో ఏసీబీ అధికారులు గురువారం భద్రాచలం టౌన్ పోలీస్‌స్టేషన్‌పై దాడి చేశారు. సీఐ రమేష్, రామారావు, కార్తీక్‌లనూ అరెస్టు చేశారు. ఏసీబీ డీఎస్పీ మాట్లాడుతూ బాధితుడి నుంచి రూ.20 వేల నగదు ఫోన్‌పే ద్వారా సీఐ పొందినట్లు ఆధారాలున్నాయన్నారు. సీఐ చెబితేనే తాను కార్తీక్‌కు రూ.20 వేలు ఫోన్ పే చేయించానని రామారావు అంగీకరించాడని చెప్పారు.

కరెంట్ బిల్లు కట్టినా బిల్లులో బకాయి
ఫిర్యాదుకు గూగుల్ వెతికితే 2.49లక్షల కాజేత

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కరెంట్ బిల్లు కట్టినా బిల్లులో బకాయి ఉన్నట్లు కనిపించడంతో ఫిర్యాదు చేసేందుకు గూగుల్‌లో వెతికిన ఓ రిటైర్డ్ ఉద్యోగిని సైబర్ కేటుగాళ్లు మోసగించారు. ఆయన ఖాతా నుంచి రూ.2.49 లక్షలు కాజేశారు. హైదరాబాద్‌కు చెందిన రిటైర్డ్ ఉద్యోగి (77) మార్చి నెలలో కరెంట్ బిల్లు చెల్లించారు. కానీ ఏప్రిల్ నెల బిల్లులో మార్చి బిల్లు బకాయి ఉన్నట్లు కనిపించింది. కరెంట్ కనెక్షన్ తీసేస్తారనే భయంతో రెండోసారి కూడా ఆయన బిల్లు చెల్లించారు. ఈ విషయం గురించి విద్యుత్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేసేందుకు గూగుల్‌లో విద్యుత్‌శాఖ ఫిర్యాదుల నంబర్ కోసం వెతికి అందులో కనిపించిన 07865057102 నెంబర్‌కు ఫోన్ చేశారు. ఎలాంటి సమాధానం రాకపోవడంతో మిన్న కుండిపోయారు. కొద్ది సేపటి తర్వాత 07865057102 నెంబర్ నుంచి వాట్సాప్ కాల్ వచ్చింది. విద్యుత్‌శాఖ అధికారిగా పరిచయం చేసుకున్న సైబర్ కేటుగాడు సమస్య గురించి అడిగి తెలుసుకున్నాడు. మీరు రెండో సారి చెల్లించిన మొత్తం తిరిగి మీ ఖాతాలో జమ చేస్తామంటూ బ్యాంక్ ఖాతా నంబర్, ఆధార్, కరెంట్ బిల్లు నంబర్ తదితర వివరాలు తీసుకున్నాడు. ఆన్‌లైన్‌లో చెల్లింపులకు సహాయం చేస్తానంటూ స్ర్కీన్ షేరింగ్ చేసేలా ఆయన్ను ఒప్పించాడు. నిమిషాల వ్యవధిలో ఓటీపీలతోపాటు రూ2.49 లక్షలు వేరే ఖాతాలకు బదిలీ అయినట్లు ఫోన్‌కు మెసేజ్‌లు వచ్చాయి. దాంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైం ఠాణాలో ఫిర్యాదు చేశారు.

నేటి నుంచి నల్లమలలో సలేశ్వరం జాతర

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణ అమర్‌నాథ్‌గా భక్తులు పిలుచుకునే సలేశ్వరం లింగమయ్య ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. నాగర్‌కర్నూలు జిల్లా పరిధిలో గల నల్లమల అడవిలోని లోతట్టు ప్రాంతంలో 3 రోజులపాటు జరిగే ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారు. చైత్రశుద్ధ పౌర్ణమి రోజు లింగమయ్యను దర్శించుకోవడానికి లక్షలాదిగా తరలివస్తారు.

జర్మనీ వర్సిటీతో జేఎన్‌టీయూ ఒప్పందం

- విద్య, ఆవిష్కరణల అభివృద్ధికి పరస్పర సహకారం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మోడల్ విద్యా విధానాన్ని అందించడంలో భాగంగా జేఎన్‌టీయూ మరో ముందడుగు వేసింది. ఇప్పటికే స్వీడన్, అమెరికా, బ్యాంకాక్ వంటి దేశాల యూనివర్సిటీలతో కలిసి ఇంటిగ్రేటెడ్ డిగ్రీ ప్రోగ్రామ్‌లను అందిస్తున్న జేఎన్‌టీయూ తాజాగా జర్మన్ యూనివర్సిటీ ఫర్ అడ్వాన్స్‌డ్ స్టడీస్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. విద్య, ఆవిష్కరణల అభివృద్ధి అంశాలకు సంబంధించి పరస్పరం సహకరించుకునేలా ఇరు వర్సిటీలు అంగీకారానికి వచ్చాయి. జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, జర్మన్ యూనివర్సిటీ ప్రతినిధి శ్రీరాజ్, వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ కిషన్ కుమార్‌రెడ్డి సమక్షంలో ఎంవోయూ పత్రాలపై సంతకాలు చేశారు. జర్మన్ యూనివర్సిటీ ఫర్ అడ్వాన్స్‌డ్ స్టడీస్‌తో కలిసి అంతర్జాతీయ మోడల్‌లో ట్విన్నింగ్ (ద్వైత) డిగ్రీ, పీజీ ప్రోగ్రామ్‌లను వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించాలని జేఎన్‌టీయూ అధికారులు నిర్ణయించారు.

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో
15నుంచి 8,9,10 ప్లాట్‌ఫాంల మూసివేత

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో పునరుద్ధరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈ నెల 15 నుంచి 8,9,10 ప్లాట్ ఫాంలను మూసివేయనున్నట్లు అధికారులు తెలియజేశారు. 8,9,10 ప్లాట్‌ఫాంల మరమత్తుల నేపథ్యంలో రైళ్లను 5,6,7 ప్లాట్‌ఫాంల మీదుగా దారి మళ్లిస్తున్నట్లు చెప్పారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో పనులు జరుగుతున్న కారణంగా ఇప్పటికే కొన్ని రైళ్లు కాచిగూడ రైల్వేస్టేషన్ నుంచి, మరికొన్ని రైళ్లు చర్లపల్లి రైల్వేస్టేషన్ నుంచి రాకపోకలు కొనసాగిస్తున్నాయి. రైళ్ల స్టేషన్ మార్పిడి విషయాన్ని రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులకు సమాచారం అందిస్తున్నట్లు అధికారులు తెలియజేశారు.

హరిద్వార్-రుషీకేశ్-వైష్ణోదేవి
యాత్రికులకు భారత్ గౌరవ్ టూరిస్టు రైలు

- తెలుగు రాష్ట్రాల యాత్రికుల కోసం 10 రోజుల ప్యాకేజీ

హైదరాబాద్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): తెలుగురాష్ట్రాల నుంచి హరిద్వార్-రుషీకేశ్-వైష్ణోదేవి-అమృత్‌సర్ తదితర పుణ్య క్షేత్రాలను దర్శించే యాత్రికుల సౌకర్యార్థం ఐఆర్‌సీటీసీ ప్రత్యేకంగా భారత్ గౌరవ్ టూరిస్టు రైలును ఏర్పాటు చేసింది. ఏప్రిల్ 23న విజయవాడలో బయలుదేరి సికింద్రాబాద్ స్టేషన్ మీదుగా ఉత్తరాదిలోని పలు ప్రధాన పుణ్యక్షేత్రాలను దర్శించి 10 రోజుల్లో మే 5న తిరిగి గమ్యస్థానానికి చేరుకుంటుంది. యాత్రికుల కోసం విజయవాడ, గుంటూరు, నల్లగొండ, సికింద్రాబాద్, కాజీపేట, పెద్దపల్లి, మంచిర్యాల్, సిర్పూర్ కాగజ్‌నగర్ తదితర స్టేషన్‌లలో స్టాప్‌లు ఏర్పాటు చేశారు. ప్యాకేజీలో నమోదు చేసుకుని వెళ్లే యాత్రికులకు వసతి సౌకర్యం, ఉదయం టీ, బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్నం, రాత్రి వేళల్లో భోజనం అందిస్తారు. భారత్ గౌరవ్ టూరిస్టు రైలులో వెళ్లే యాత్రికులకు ఒక్కొక్కరికి ఎకానమీ (స్లీపర్) రూ.18,510, (5-11 ఏళ్ల లోపు పిల్లలకు రూ.17,390, స్టాండర్డ్ (3ఏసీ)రూ.30,730, (పిల్లలకు రూ.29,420), కంఫోర్ట్ (2ఏసీ) రూ.40,685, (పిల్లలకు రూ.39,110) ఖరారు చేసినట్టు తెలియజేశారు. మరిన్ని వివరాలకు ఫోన్ 040-27702407, మొబైల్ 9701360701, 9281030750, 8287932229 నెంబర్లకు ఫోన్ చేయవచ్చని సూచించారు.

పోక్సో కేసులో నిందితుడికి జీవిత ఖైదు

కొత్తగూడెం లీగల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో నిందితుడు భూక్యా నగేశ్ అలియాస్ నాగేశ్వరరావుకు జీవితఖైదు విధిస్తూ భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయాధికారి పాటిల్ వసంత్ తీర్పు చెప్పారు. ఇల్లెందు మండల వాసి భూక్య నాగేశ్వరరావు అలియాస్ నగేష్ తన బంధువుకు చెందిన ఆరేళ్ల, నాలుగేళ్ల బాలికలకు గతేడాది జూలై నాలుగో తేదీన చాక్లెట్లు ఇస్తానని ఆశ చూపి ఇంట్లోకి తీసుకెళ్లి లైంగిక దాడి చేయడానికి ప్రయత్నించాడు. ఆ పిల్లలు భయంతో కేకలేయడంతో నాగేశ్వరరావు పరారయ్యాడు. దీనిపై 2024లో బాలికల తండ్రి.. ఇల్లందు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఇల్లందు ఇన్‌చార్జి డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, డీఎస్పీ చంద్రబాను పర్యవేక్షణలో సీఐ బత్తుల సత్యనారాయణ కేసు దర్యాప్తు చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత నిందితుడు నాగేశ్వరరావుపై నేరం రుజువు కావడంతో ఆయనకు యావజ్జీవ ఖైదుతో పాటు 1000 జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు.

కన్నీటి కష్టాలు!

ఆదిలాబాద్ జిల్లా గిరిజన గ్రామాల్లోని ఆదివాసీలు తాగునీటికి అల్లాడుతున్నారు. జిల్లాలోని తలమడుగు మండలం రత్నాపూర్ గ్రామస్థులు గుక్కెడు నీటి కోసం విలవిల్లాడుతున్నారు. 500మంది జనాభా గల ఈ గ్రామంలో వేసవి వచ్చిందంటే తాగునీటి కోసం పడే కష్టాలు అన్నీఇన్నీ కావు. గ్రామంలో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో.. ఉన్న ఒక్క బావి పూర్తిస్థాయిలో ఎండిపోయింది. దీంతో తెల్లవారుజాము 4గంటలకే తమ పిల్లాపాపలతో జనం వ్యవసాయ బావుల వద్దకు నీటి కోసం పరుగులు తీస్తున్నారు. నెత్తిన బిందెలతో కాలినడకన వ్యవసాయ బావుల వద్దకు వెళుతూ పానీపట్టు యుద్ధం చేస్తున్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఎన్నిసార్లు విన్నవించినా.. ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

-ఆంధ్రజ్యోతి,తలమడుగు





నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో పసుపు పంట తడవకుండా టార్పాలిన్లు కప్పిన దృశ్యం



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం బొల్లారంలో దెబ్బతిన్న వరి

గాలివాన బీభత్సం

(మొదటిపేజీ తరువాయి)

కూలిపోయాయి. హోర్డింగులు విరిగిపడ్డాయి. రాష్ట్రంలో మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం వరకు ఎండ మాడ్చేయగా.. సాయంత్రం అయ్యేసరికి వాతావరణం మారిపోయింది. గాలివాన మొదలై.. రైతులకు కడగండ్లు మిగిల్చింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని బాన్సువాడ, నవీపేట, మోస్రా, ఎడపల్లి, నిజామాబాద్ పట్టణం, రూరల్‌తో పాటు పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. కల్లాల్లో ఉన్న ధాన్యం, జొన్న, మొక్కజొన్నతోపాటు నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులోనూ పసుపు తడిసిపోయింది. పెంచికల్‌పాడ్ గ్రామంలో వడగళ్ల వాన కురవడంతో ధాన్యం తడిసి ముద్దయ్యింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు కుమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలో పలుచోట్ల వర్షం కురిసింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పలుచోట్ల వడగండ్ల వాన కురిసింది. కోనరావుపేట, మంగళ్లపల్లె, అనంతగిరి, బొల్లారంలో వరి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్రలో మార్కెట్ యార్డ్‌లో ధాన్యం తడిసింది. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మార్కెట్ యార్డులో ధాన్యం రాశులు తడిసిపోవడంతో నీటిని తొలగించేందుకు రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం అమలూరులో ఉరుములు, మెరుపులతో చెట్టు కిందకు వెళ్లిన గొర్రెల కాపరి మేకల చిన్న రాములు (60) పిడుగుపాటుకు మృతిచెందాడు. నల్లగొండ, దేవరకొండల్లో వర్షంతో ప్రధాన వీధులు జలమయమయ్యాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. వరి, ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోనూ గాలివాన బీభత్సం సృష్టించింది. కొన్ని ప్రాంతాల్లో వడగళ్ల వర్షం కురిసింది. సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్దలో రైతు వేదిక పైకప్పు ఎగిరి కింద పడింది. పిడుగుపాటుకు మెదక్ జిల్లా జగ్గంపేట గ్రామ పంచాయతీపై విద్యుత్ వైర్లు కాలిపోయాయి. మెదక్ పట్టణంలో చెట్ల కొమ్మలు తీగలపై పడి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సిద్దిపేట జిల్లాలో 10 వేల ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లింది. జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం నేలపోగుల గ్రామానికి చెందిన మండాడి రవీందర్ రెడ్డి (63) అనే రైతు పశువులను మేపేందుకు వెళ్లి పిడుగుపాటుకు ప్రాణాలు కోల్పోయాడు. హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీయడంతో భారీ వృక్షాలు, హోర్డింగులు నేలకూలాయి. మధురానగర్‌లో భారీ వృక్షం తీగలపై పడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గోల్కొండ చౌరస్తాలో హోర్డింగ్ విరిగిపోయింది. మల్కాజిగిరి, హఫీజ్‌పేట, హిమాయత్ నగర్, రామచంద్రాపురం, లింగంపల్లి ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలో మరో రెండు రోజుల పాటు ఇదే తరహా వాతావరణం కొనసాగుతుందని బేగంపేట వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.



సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలంలో కురిసిన వడగండ్లు

ఇద్దరు రైతుల ఆత్మహత్యాయత్నం

ములుగు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో పంట కోల్పోయిన ఓ రైతు, అప్పు కట్టాలని ఎరువుల వ్యాపారి ఒత్తిడి చేయడంతో మరో రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. ములుగు జిల్లా మంగపేట మండలం మల్లూరు మొట్లగూడెం గ్రామానికి చెందిన యాలం నర్సింహారావు గత ఏడాది 6 ఎకరాల్లో మిర్చి సాగు చేశాడు. దిగుబడి రాకపోవడంతో రూ.10 లక్షల అప్పుల పాలయ్యాడు. ఈసారి తనకున్న ఐదెకరాలతో పాటు మరో 15 ఎకరాలు కౌలుకు తీసుకున్నాడు. వరి, మొక్కజొన్న, మిర్చి సాగు చేశాడు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు కోత దశలో ఉన్న పంటంతా నాశనమైంది. దీంతో నర్సింహారావు గురువారం ఉదయం పురుగుల మందు తాగాడు. పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. వాజేడు మండలం ధర్మవరానికి చెందిన బొగట నర్సింహారావు మిర్చి పంట సాగు కోసం ఓ వ్యాపారి వద్ద అప్పుగా రూ.90 వేల విలువైన ఎరువులు, పురుగు మందులు తెచ్చుకున్నాడు. బుధవారం సాయంత్రం మిర్చిని మార్కెట్‌కు తరలిస్తుండగా తన డబ్బులు చెల్లించాలని ఒత్తిడి తెచ్చిన వ్యాపారి బస్తాలను బలవంతంగా తీసుకెళ్లిపోయాడు. దీంతో మనస్తాపానికి గురైన నర్సింహారావు పురుగుల మందు తాగాడు. ప్రస్తుతం ఆయన ఏటూరు నాగారం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.



తల్లి పార్థివ దేహాన్ని మోస్తున్న షకీల్. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

మాజీ ఎమ్మెల్యే షకీల్ అరెస్టు

- ఎయిర్‌పోర్టులో అరెస్టు చేసిన పోలీసులు
- తల్లి అంత్యక్రియలకు అనుమతి
- విచారణకు రాకుంటే.. అరెస్టు తప్పదని వెల్లడి

బోధన్ రూరల్, పంజాగుట్ట, శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పలు కేసుల్లో తప్పించుకునేందుకు దుబాయ్ పారిపోయిన నిజామాబాద్ జిల్లా బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అనారోగ్యంతో కొంతకాలంగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న షకీల్ తల్లి షగుప్తా అదీప్(80) గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. తల్లి మరణవార్త తెలుసుకున్న షకీల్.. దుబాయ్ నుంచి హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. ఆయనపై లుకౌట్ నోటీసు జారీ అవ్వడంతో.. పోలీసులు శంషాబాద్ విమానాశ్రయంలో అరెస్టు చేశారు. అతని పాస్‌పోర్టు స్వాధీనం చేసుకున్నారు. తల్లి అంత్యక్రియలు ఉన్నందున.. సొంత పూచీకత్తుపై విడుదల చేస్తూ.. విచారణకు పిలిచినప్పుడు రాకుంటే అరెస్టు తప్పదని హెచ్చరించారు. ఆ వెంటనే షకీల్ కుటుంబం బోధన్ చేరుకుంది. తన తల్లి పార్థివ దేహాన్ని చూసిన షకీల్.. కన్నీరుమున్నీరయ్యారు. ఆయనను పరామర్శించేందుకు మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు అక్కడికి చేరుకున్నారు. బోధన్‌లోని జావియా మసీదులో ప్రత్యేక ప్రార్థనల తర్వాత.. అదీప్ మృతదేహాన్ని అలీసానగర్ శ్మశానవాటికలో ఖననం చేశారు. కాగా.. రెండేళ్ల క్రితం హైదరాబాద్‌లోని ప్రగతిభవన్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో షకీల్ కుమారుడు రాహెల్ నిర్లక్ష్య డ్రైవింగ్ చేసి, ఒకరి మృతికి కారకుడయ్యారు. మరో రోడ్డు ప్రమాదంలోనూ ఆయనపై కేసులున్నాయి. ప్రగతిభవన్ కేసులో.. కుమారుడిని తప్పించేందుకు షకీల్ ప్రయత్నించారు. రాహెల్‌ను దుబాయ్‌కి పంపారు. దీంతో పంజాగుట్ట పోలీసులు నమోదు చేసిన ఈ కేసులో షకీల్ ఏ-3 అయ్యారు. ఇదే కేసులో పలువురు పోలీసులు కూడా సస్పెండ్ అయిన విషయం తెలిసిందే.! అసెంబ్లీ ఎన్నికల తర్వాత షకీల్ దుబాయ్‌కి పారిపోగా.. పోలీసులు తొలుత లుకౌట్ నోటీసు జారీ చేశారు.



కూల్చివేతకు గురైన ఇళ్లు

గడ్డిగానిపల్లిలో ఇళ్ల కూల్చివేత

- అర్ధరాత్రి వేళ నేలమట్టం చేసిన సింగరేణి అధికారులు!
- తమకు సంబంధం లేదన్న జీఎం

కృష్ణకాలనీ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి మునిసిపాలిటీలోని ఓపెన్ కాస్ట్- 2 ప్రభావిత గ్రామం గడ్డిగానిపల్లిలో గ్రామవాసులు నిర్మించుకున్న ఇళ్లను సింగరేణి అధికారులు కూల్చివేశారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా బుధవారం అర్ధరాత్రి పోలీసుల సహాయంతో యంత్రాలతో ఇళ్లను నేలమట్టం చేయడంతో వాటి యజమానులు గురువారం ఉదయం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓసీ-2 ప్రాజెక్టు కింద తమ గ్రామాన్ని సింగరేణి యాజమాన్యం స్వాధీనం చేసుకుందని, పరిహారం కూడా పూర్తిస్థాయిలో అందలేదని చెప్పారు. తమ గ్రామాన్ని వేరేచోటుకు తరలించే ఒప్పందం కూడా జరిగిందని తెలిపారు. గ్రామంలో తమకు ఉన్న పట్టా భూములను సింగరేణి తీసుకోలేదని, తమకు ఉన్న భూమిలోనే ఇళ్లను కట్టుకున్నామని చెప్పారు. దాంతో సింగరేణి ఎస్టేట్ విభాగం అధికారులు రాత్రి వేళ పోలీసుల బందోబస్తుతో వచ్చి యంత్రాల సహాయంతో ఇళ్లను నేలమట్టం చేశారని, తమకు నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణికి సంబంధం లేకున్నా, కనీసం ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఇళ్లను కూల్చివేయడం ఏమిటని మండిపడ్డారు. సింగరేణి యాజమాన్యం తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై సింగరేణి భూపాలపల్లి ఏరియా జీఎం రాజేశ్వర్‌రెడ్డిని వివరణ కోరగా.. గడ్డిగానిపల్లి వాసులు ఏర్పాటు చేసుకున్న ఇళ్లను కూల్చివేసిన విషయం తెలిసిందని, అయితే ఆ కూల్చివేతకు తమకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా నిర్మాణాలు చేపడుతుండటంతో మునిసిపాలిటీ ఆధ్వర్యంలో ఆ ఇళ్లను కూల్చివేసినట్లు తమకు సమాచారం అందిందన్నారు.

ఆహారంలో చిరుధాన్యాలు భాగం కావాలి

- అపోలో హాస్పిటల్స్ జాయింట్ ఎండీ డాక్టర్ సంగీత రెడ్డి
- మిల్లెట్ మార్వెల్స్‌తో కలిసి చిరుధాన్యాల వ్యాపారంలోకి తెనాలి డబుల్ హార్స్
- 18 రకాల ఉత్పత్తుల విడుదల



కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ సంగీత రెడ్డి, మోహన్ శ్యామ్, దిల్ రాజు, భరత్ రెడ్డి తదితరులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో ఇప్పుడు చిరు ధాన్యాల(మిల్లెట్స్) ఉద్యమం జరుగుతోందని, ప్రతి ఒక్కరూ రోజూ తినే ఆహారంలో చిరుధాన్యాలను భాగం చేసుకోవాలని అపోలో ఆస్పత్రుల జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతా రెడ్డి పిలుపునిచ్చారు. చిరు ధాన్యాల్లో పోషకాలు అధికంగా ఉంటాయని, జీర్ణ వ్యవస్థపై ప్రభావం చూపుతాయని తెలిపారు. తెనాలి డబుల్ హార్స్ గ్రూప్, మిల్లెట్ మార్వెల్స్ అనే సంస్థతో కలిసి చిరుధాన్యాల వ్యాపారంలోకి అడుగుపెట్టింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో నూడిల్స్, గ్రెయిన్స్, రెడీ టు కుక్, రెడీ టు సర్వ్ అంటూ నాలుగు విభాగాల్లో 18 రకాల ఉత్పత్తులను విడుదల చేసింది. ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన డాక్టర్ సంగీతా రెడ్డి మాట్లాడుతూ.. మన పూర్వీకులు చిరుధాన్యాలనే ఆహారంగా తీసుకునే వారని, ఇప్పుడు అదే అలవాటును మనం కొనసాగించాల్సిన అవసరం ఉందని చెప్పారు. అమెరికా నుంచి తాను తెప్పించిన క్వినోవాను చూసి తన అత్తగారు తైదలు, కొర్రలు లాగానే ఉన్నాయన్న విషయాన్ని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. చిరు ధాన్యాల స్వీకరణ సంస్కృతిని దేశానికి తిరిగి తీసుకురావడం అత్యవసరం అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ 2023ను మిల్లెట్స్ సంవత్సరంగా ప్రకటించారని, దానికి ఐదారేళ్ల ముందే డాక్టర్ భరత్ మిల్లెట్ మార్వెల్స్‌ను స్థాపించారని చెప్పారు. చిరు ధాన్యాల్లో ఫైబర్, సూక్ష్మ పోషకాలు అధికంగా ఉంటాయని, చిరుధాన్యాలను తీసుకోవడం అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. సంక్రమణేతర వ్యాధుల సునామీ రాబోతున్న వేళ ఇది తప్పనిసరన్నారు. తన తండ్రి, అపోలో ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ ప్రతాప్ రెడ్డి 92 ఏళ్ల వయస్సులో ఉన్నారని, నిత్యం ఆహారంలో ఏదో ఒక పూట చిరు ధాన్యాలను తీసుకుంటారని చెప్పారు. ప్రతి రోజూ ఒకే తరహా చిరు ధాన్యం కాకుండా మారుస్తూ తినడం వల్ల మెరుగైన ఫలితాలు చూడవచ్చని తెలిపారు. ఇక, తెనాలి డబుల్ హార్స్ గ్రూప్ సీఎండీ మోహన్ శ్యామ్ మాట్లాడుతూ.. మిల్లెట్ మార్వెల్స్‌తో కలిసి మిల్లెట్స్ వ్యాపారంలోకి 18 ఉత్పత్తులతో ప్రవేశించామని ప్రకటించారు. ఇందులో ఆరు రకాల నూడిల్స్, ఆరు రకాల గ్రెయిన్స్, రెడీ టు కుక్, రెడీ టు ఈట్ విభాగాలలో ఆరు రకాల ఉత్పత్తులను విడుదల చేశామని తెలిపారు. త్వరలో ఆర్గానిక్ ఉత్పత్తుల రంగంలో అడుగుపెడతామని చెప్పారు. ఈ-కామర్స్‌తో పాటు సూపర్ మార్కెట్లు, కిరాణా దుకాణాల్లో ఈ ఉత్పత్తులు రూ.85 ప్రారంభ ధరతో లభిస్తాయని చెప్పారు. మిల్లెట్ మార్వెల్స్ వ్యవస్థాపకులు డాక్టర్ భరత్ రెడ్డి మాట్లాడుతూ మిల్లెట్ మార్వెల్ కల ఈ రోజు నిజమైందని అన్నారు. చిరు ధాన్యాలు ప్రతి ఒక్కరికీ చేరువ కావాలనే లక్ష్యంతో మిల్లెట్ మార్వెల్స్ స్థాపించామని, కానీ దానిని ముందుకు తీసుకెళ్లేందుకు తమ శక్తి సరిపోలేదని చెప్పారు. కానీ దానిని మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు తెనాలి డబుల్ హార్స్ వచ్చిందని అన్నారు. ఈ విభాగంలో మరిన్ని ఆవిష్కరణలు చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అనందిత్ రెడ్డి, ఐఐఎంఆర్ డైరెక్టర్ దయాకర్, సినీ నిర్మాత దిల్ రాజు, తెనాలి డబుల్ హార్స్ సీఈవో యజుర్వేద్, సీఓఓ పుట్టా శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

స్టేట్ ఫస్ట్ ర్యాంకు వచ్చినా.. సీటు రాలే

- మరో 53 మంది విద్యార్థులదీ అలాంటి పరిస్థితే
- బీసీ గురుకుల ప్రవేశ పరీక్ష రాసిన పిల్లలకు నిరాశ
- జోక్యం చేసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డికి వినతి

హైదరాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పరీక్ష కోసం దరఖాస్తు చేసే సమయంలో జరిగిన పొరపాటు వల్ల.. మొదటి ర్యాంకు వచ్చినా ఓ విద్యార్థికి గురుకులంలో సీటు రాలేదు. అతనొక్కడే కాదు అలాంటి పొరపాటే చేసిన మరో 53 మంది పిల్లలు కూడా మంచి ర్యాంకులు వచ్చినా.. సీటు పొందలేకపోయారు. ఈ విషయంలో విద్యార్థులకు న్యాయం చేయాలని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభుత్వానికి లేఖ రాశారు. బీసీ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశం కోసం వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం శాఖాపూర్‌లోని ప్రగతి విద్యాలయం నుంచి 85 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. అందులో 54 మందికి 1,000లోపు ర్యాంకులు వచ్చాయి. ఇందులో ఇ.ఆకాశ్ అనే విద్యార్థికి రాష్ట్రంలోనే మొదటి ర్యాంకు వచ్చింది. అయితే, దరఖాస్తు చేసే సమయంలో జరిగిన చిన్న పొరపాటు వల్ల వీరెవరికీ సీటు రాలేదు. మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసే సమయంలో బీసీ జాబితాలో తాము ఏ కులమో వీరంతా స్పష్టం చేశారు. అయితే "మీ కులం ఎంబీసీ జాబితాలో ఉందా..?" అన్న ప్రశ్నకు ఎస్ అని పొరపాటున టిక్ చేశారు. దీంతో వీరంతా సీట్లకు దూరమయ్యారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు న్యాయం చేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బీసీ కమిషన్‌కు లేఖ రాశారు. విద్యార్థులు బీసీలైనా.. వారి కులం ఎంబీసీ జాబితాలో లేనందున అధికారులు సీటు ఇవ్వడానికి నిరాకరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయమై విద్యార్థుల తల్లిదండ్రులు సాంఘిక సంక్షేమ గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిణిని కలిసేందుకు ప్రయత్నించగా.. నిరాశ ఎదురైందని తెలిపారు. స్పందించిన బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ గురువారం సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. విద్యార్థులకు న్యాయం జరిగే విధంగా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

ఏ విద్యార్థికీ అన్యాయం జరగదు: సొసైటీ

గురుకులాల్లో ప్రవేశాల ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరుగుతుందని, ఎలాంటి అవకతవకలకు అవకాశమే లేదని గురుకులాల సొసైటీ తెలిపింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే ముందు విద్యార్థులు అన్ని వివరాలు సరిచూసుకోవాలని పేర్కొంది. ప్రతిభ గల ప్రతి విద్యార్థికీ న్యాయం జరుగుతుందని, ఇందులో అనుమానాలకు తావులేదని గురువారం ఒక ప్రకటనలో తెలిపింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.